www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మండుతున్న రాష్ట్రం

నెలాఖరు వరకూ వడగాడ్పులు

వచ్చేనెలలో మరింత తీవ్రంగా గాడ్పులు

భూమిలో తగ్గిన తేమ, నిశ్చలంగా గాలులు

పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: నిపుణులు

జనం విలవిల

45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఉత్తర కోస్తాలో తీవ్ర వడగాడ్పులు



3

గురువారం | 25-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 9 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ. 6.46 తదుపరి విదియ; నక్షత్రం: విశాఖ రా. 2.24; తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ. 6.41-8.23; దుర్ముహూర్తం: ఉ. 10.07-10.57, మ. 3.09-3.59; అమృతఘడియలు: సా.4.58-6.41; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.30 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







బుధవారం నెల్లిమర్లలో ప్రజాగళం సభకు హాజరైన జనం.. రోడ్ షోలో చంద్రబాబు, పవన్ అభివాదం

ధరలు తగ్గాలంటే..
జగన్ పోవాలి!

అప్పుడే పేదలకు మనుగడ.. 5 కోట్ల ప్రజల కోసమే కూటమిగా వస్తున్నాం: బాబు

ఉత్తరాంధ్ర గేట్‌వే భోగాపురం.. జగన్ నాడు ఎయిర్‌పోర్టును వ్యతిరేకించాడు

భూముల ధరలు పతనం చేశాడు.. ఆ వెంటనే ఆయన అనుచరులు తక్కువకు వందల ఎకరాలు కొన్నారు.. గద్దెనెక్కాక ప్రభుత్వ భూములు దోచాడు

మేమొచ్చాక ఏడాదికల్లా విమానాశ్రయ నిర్మాణం పూర్తి

అయోధ్యలో రామాలయం నిర్మిస్తే రామతీర్థంలో రాముడి తల తీసేశారు

160 దేవాలయాలపై దాడులు.. భక్తుల మనోభావాలపై దెబ్బకొట్టారు

నేను పోరాడితే కేసు పెట్టారు.. అర్చకులను కూడా వదలడం లేదు

తండ్రి, బాబాయి మరణాలపై శవరాజకీయాలు.. టీడీపీ అధినేత నిప్పులు

జగన్ అరెస్టు ఖాయం

ఇది మోదీ గ్యారంటీ..

వంచక ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

రాష్ట్ర భవిష్యత్ కోసమే మా పోరాటం: పవన్

విజయనగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్ ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను తగ్గించాలంటే.. ఏసీలు ఆపితే సరిపోదు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ స్విచాఫ్ చేయాలి. అప్పుడే 'పేద ప్రజలకు మనుగడ' అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు గేట్‌వే అవుతుందని.. కానీ జగన్ దానిని పూర్తిచేయలేదని ఆక్షేపించారు. తాము అధికారంలోకి వస్తే వచ్చే ఏడాదికల్లా నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలనూ వంచించిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని జనసేనాని పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోరాడుతున్నాయని తెలిపారు. ప్రజాగళం-వారాహి యాత్రలో భాగంగా

మిగతా 14వ పేజీలో...

బతికున్నా.. చచ్చినా 'పన్ను'

కాంగ్రెస్ వస్తే మధ్యతరగతి సంపదపై పంజా: మోదీ



బుధవారం భోపాల్ రోడ్‌షోలో ప్రధాని మోదీ

2

'యువరాజు' సలహాదారు చెబుతున్నదదే

'వారసత్వ పన్ను'పై మాట్లాడుతున్నారు

మీ పిల్లల కోసం సంపాదించుకున్న దాన్ని

సంపద పంపిణీ పేరుతో దోచుకుంటారు

పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఆగ్రహం



ఇదీ పిట్రోడా మాట

అమెరికాలో 10 కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తి చనిపోతే.. అతని వారసులకు 45% మాత్రమే వారసత్వంగా వస్తుంది. మిగతా 55 శాతం ప్రభుత్వ ఖజానాకు వెళ్తుంది. అది చాలా ఆసక్తికరమైన చట్టం.

- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా

మోదీ భయపడుతున్నారు

ఎన్నికలు తన చేతుల్లోంచి జారిపోతున్నాయని గుర్తించారు

అందుకే అడ్డగోలుగా అబద్ధాలు

అధికారంలోకి రాగానే కులగణన చేస్తాం

మోదీ ప్రజా నేత కాదు.. బిలియనీర్ల నేత

90 శాతం జనాభాకు న్యాయం చేయడమే నా జీవిత లక్ష్యం: రాహుల్‌గాంధీ

ప్రజల్ని లక్షాధికారుల్ని చేస్తామని వ్యాఖ్య

2

మోదీ 'ఆస్తుల పంపకం' వ్యాఖ్యలపై రాహుల్ కౌంటర్



వైఎస్‌ను తిట్టిన బొత్స..

నీకు తండ్రితో సమానమా?

ఆయన విజయమ్మనూ అవమానించారు

రాజశేఖరరెడ్డిని తిట్టినోళ్లకే వైసీపీలో పెద్దపీట

ఆయన కోసం పనిచేసినవాళ్లపై గొడ్డలి వేటు

రేపల్లెలో జగన్‌పై పీసీసీ చీఫ్ షర్మిల ఫైర్

3



రేపల్లె సభలో మాట్లాడుతూ హస్తం గుర్తు చూపిస్తున్న షర్మిల

అవినీతి వైసీపీ నేతలు
జైలుకే!

ఈసారి ఎన్డీయే ప్రభుత్వం రాగానే అదే చేస్తాం

జగన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది

కేంద్రం వద్ద పూర్తి సమాచారం ఉంది: రాజ్‌నాథ్



అనకాపల్లి ర్యాలీలో రాజ్‌నాథ్‌సింగ్, అభ్యర్థులు సీఎం రమేశ్, కొణతాల

డ్రగ్స్ మాఫియాకు అడ్డా విశాఖ

పథకాలకు ఇస్తున్న కేంద్రం నిధులు పక్కదారి

ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో త్వరలో వెల్లడిస్తాం

పైగా 13.5 లక్షల కోట్లు అప్పు చేశారు.. రక్షణ మంత్రి ఫైర్

విశాఖపట్నం/అనకాపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈసారి కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి రాగానే వైసీపీ అవినీతి నాయకులను జైలుకు పంపిస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించారు. జగన్ పాలనలో విశాఖపట్నం డ్రగ్స్, ల్యాండ్ మాఫియాకు

మిగతా 14వ పేజీలో...

గుంటూరులో వార్ వన్‌సైడే

లక్షన్నరకు పైగా మెజారిటీతో గెలుస్తా

మాకు 135-140 సీట్లు గ్యారంటీ

జన్మభూమి రుణం తీర్చుకొనేందుకే రాజకీయాల్లోకి

నాకు ఇక్కడేమీ లేవు.. నన్ను ఏమీ చేయలేరు

30 ఏళ్ల పాటు రాజకీయం చేయడానికే వచ్చా

నా కథ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

నన్ను కొడితే ఐదేళ్లకైనా వాడి చేయి తీసేస్తా

ఎన్నికల తరువాత జగన్‌రెడ్డికి షాక్ ట్రీట్‌మెంట్

'ఏబీఎన్' బిగ్ డిబేట్‌లో పెమ్మసాని



గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్.... తెలుగుదేశం పార్టీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి. అమెరికాలో వైద్యుడిగా, అంత్రప్రెన్యూర్‌గా స్థిరపడిన ఆయన ఏపీ రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. 2014, 2019లో సీటు కోసం

మిగతా 11వ పేజీలో...

నిఘా చీఫ్‌గా విశ్వజీత్

బెజవాడ సీపీగా పీహెచ్‌డీ రామకృష్ణ

ఈసీ ఆదేశాలతో నియమించిన సీఎస్

గతంలోనూ ఎన్నికల సమయంలోనే నిఘా బాధ్యతలు చూసిన విశ్వజీత్

రాజకీయ ఒత్తిళ్లకు లొంగని అధికారిగా రామకృష్ణకు శాఖలో మంచి పేరు

11

ఆదమరిస్తే అంతే!

టైటిల్ చట్టంతో భూములకు ముప్పు

రైతులు అప్రమత్తంగా ఉండాల్సిందే

సర్కారు మాట నమ్మితే గజమూ మిగలదు

ఎవరి భూమికి వారే కాపలాదారు

రీ సర్వే రికార్డులన్నీ తప్పుల మయం

జగన్ సర్కారు హడావుడితో చిక్కులు

11

దళితులపై దాష్టీకం

జగన్ పాలనలో దాడులు, హత్యలు

అక్కచెల్లెమ్మలకు అన్యాయం



12 13

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..



అబ్ కీ బార్?

ఆ వివరాలు బహిర్గతం చెయ్యలేం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల్లోని వివిధ పరికరాల తయారీ, సరఫరాదారుల సమాచారాన్ని బహిర్గతం చెయ్యలేమని ఈసీఐఎల్, బీఈఎల్ సంస్థలు స్పష్టం చేశాయి. సమాచార హక్కు చట్టం కింద తమకు అందిన దరఖాస్తులకు ఈ మేరకు వేర్వేరుగా ఒకే రకమైన సమాధానం ఇచ్చాయి. వెంకటేశ్ నాయక్ అనే ఆర్టీఐ కార్యకర్త ఈసీఐఎల్, బీఈఎల్‌కు వేర్వేరుగా దరఖాస్తులు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల్లోని వివిధ పరికరాలను ఎవరు తయారు చేస్తారు? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే వివరాలు అడిగారు. దీనికి ఈసీఐఎల్, బీఈఎల్.. ఆర్టీఐ సెక్షన్ 8(1)(డీ) కింద రహస్య వివరాలను వెల్లడించలేమని తెలిపాయి.

సంపద పంపిణీ అగ్గికి పిట్రోడా ఆజ్యం

» అమెరికాలో సంపన్నులు చనిపోతే వారి ఆస్తిలో 55% ప్రభుత్వానికి వెళ్తుందన్న కాంగ్రెస్ నేత.. మండిపడ్డ ప్రధాని



న్యూఢిల్లీ, ఏప్రిల్24: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను పంపిణీ చేసేస్తుందంటూ బీజేపీ పెద్దఎత్తున విరుచుకుపడుతున్న సమయంలో.. కాంగ్రెస్ సీనియర్ నేత శామ్‌పిట్రోడా వారసత్వ పన్ను ప్రస్తావనతో ఆ అగ్నికి ఆజ్యం పోశారు. "అమెరికాలో 10 కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తి చనిపోతే.. అతని వారసులకు 45%మాత్రమే వారసత్వంగా వస్తుంది. మిగతా 55% ప్రభుత్వ ఖజానాకు వెళ్తుంది. అది చాలా ఆసక్తికరమైన చట్టం".. అంటూ ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన యథాలాపంగా చేసిన వ్యాఖ్యలు బీజేపీకి అందివచ్చిన ఆయుధంలా మారాయి! సంపదను సృష్టించిన వారు అందులో సగం ప్రజలకు వదిలి వెళ్లిపోవడం తనకు న్యాయమేననిపిస్తోందని.. భారత్‌లో అలాంటిదిలేదని, సంపన్నుల ఆస్తి మొత్తం పిల్లలకే వెళ్తుందని పిట్రోడా ఆ ఇంటర్వ్యూలో అన్నారు. ప్రచారంలో కాంగ్రెస్‌పై దూకుడుగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ.. పిట్రోడా వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలువురు బీజేపీ నేతలూ పిట్రోడా వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆత్మరక్షణలో పడింది. పిట్రోడా వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం అని.. పార్టీకి వాటితో సంబంధంలేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని.. ఆ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి గానీ, పార్టీ మేనిఫెస్టోకిగానీ ఎలాంటి సంబంధం లేదని పిట్రోడా అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అమెరికాలో అలాంటి చట్టం ఉందా?

శామ్‌పిట్రోడా పేర్కొన్నట్టుగా సంపన్నులు చనిపోతే వారి ఆస్తిలో 55% ప్రభుత్వ ఖజానాకు చెందేలా ఫెడరల్ చట్టమేదీ లేదు. ఆ దేశంలో 50 రాష్ట్రాలుండగా 6 రాష్ట్రాల్లో మాత్రమే (అయోవా, కెంటకీ, మేరీలాండ్, నెబ్రాస్కా, న్యూజెర్సీ పెన్సిల్వేనియా) వారసత్వ పన్ను ఉంది. ఆ ఆస్తి విలువను బట్టి ఒక శాతంకన్నా తక్కువ నుంచి గరిష్ఠంగా 18%దాకా మాత్రమే ఉంది. ఆ పన్ను కూడా అందరికీ వర్తించదు. ఉదాహరణకు.. చనిపోయిన వ్యక్తి భార్యకే ఆస్తి మొత్తం వెళ్తే ఈ పన్ను వర్తించదు. ఇలా బోలెడన్ని షరతులు.. మినహాయింపులు ఉంటాయి. పిట్రోడా ఇవేవీ పట్టించుకోకుండా యథాలాపంగా 55%అంటూ వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్‌ను ఇబ్బంది పెడుతోంది.

రూ. 25 వేల కోట్ల స్కాంలో సునేత్రకు క్లీన్‌చిట్



ముంబై, ఏప్రిల్ 24: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి, బారామతి లోక్‌సభ స్థానం ఎన్డీయే అభ్యర్థి సునేత్ర పవార్‌కు రూ.25వేల కోట్ల కుంభకోణంలో ముంబై పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. మహారాష్ట్ర స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు (ఎంఎస్‌సీబీ)లో చోటుచేసుకున్న స్కాంకు సంబంధించిన కేసులో దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) ఈ ఏడాది జనవరిలోనే తుది నివేదికను సమర్పించింది. అందులోని వివరాలు తాజాగా బయటికొచ్చాయి. ఇందులో సునేత్ర పవార్, ఆమె భర్త అజిత్‌కు సంబంధించిన లావాదేవీల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎలాంటి క్రిమినల్ నేరం జరగలేదని.. అజిత్‌కు చెందిన జరందేశ్వర్ షుగర్ మిల్లుకు జారీ చేసిన రుణాల విషయంలో బ్యాంకుకు ఎలాంటి నష్టం జరగలేదని నివేదికలో తెలిపారు. ప్రస్తుతం ఎన్‌సీపీ చీఫ్‌గా ఉన్న అజిత్ పవార్.. గతేడాది తన వర్గంతో బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం) అధికార కూటమిలో చేరి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కాగా సార్వత్రిక ఎన్నికల వేళ సునేత్రకు క్లీన్‌చిట్ ఇస్తూ నివేదిక బయటికిరావడంతో మహారాష్ట్ర సర్కారు, బీజేపీపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. 'బీజేపీ వాషింగ్‌మెషీన్' అంటూ విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు సమంజసమేనని.. పోలీసుల చర్యే ఇందుకు నిదర్శమని శివసేన (యూబీటీ) నేత ఆనంద్ దూబే అన్నారు. 'రూ.25 వేల కోట్ల కుంభకోణం గురించి గతంలో ప్రధాని మాట్లాడుతూ పవార్ కుటుంబీకులందరూ అవినీతిపరులేనని ఊగిపోయారు. ఇప్పుడు వారు బీజేపీతో కలిసిపోగానే సునేత్రకు క్లీన్‌చిట్ ఇచ్చారు. ప్రతిపక్షాలు అంటున్నట్లు 'బీజేపీ వాషింగ్ పౌడర్' వ్యాఖ్యలు నిజమేనని రుజువైంది' అన్నారు.

ఎన్నికల ప్రచారంలో స్పృహ తప్పిన గడ్కరీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మహారాష్ట్రలోని యావత్మల్‌లో బుధవారం ఎన్నికల సభలో మాట్లాడుతూ స్పృహ తప్పారు. అనంతరం కొద్దిసేపటికే ఎక్స్‌లో ఈ విషయమై స్పందిస్తూ.. తీవ్రమైన ఎండవేడితో తాను స్పృహ తప్పానని, ప్రస్తుతం బాగానే ఉన్నానని ప్రకటించారు. పుసాద్‌లో ర్యాలీ సందర్భంగా ఈ ఘటన జరిగిందని తెలిపారు. నాగ్‌పూర్ సిటింగ్ ఎంపీ అయిన కేంద్ర మంత్రి గడ్కరీ యావత్మల్‌లోని పుసాద్‌లో ప్రసంగిస్తూ కుప్పకూలారు. పార్టీ కార్యకర్తలు వెంటనే వైద్యసేవలకు తరలించారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కాగా కేంద్రమంత్రి యావత్మల్-వాషిమ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేస్తున్న ఏక్‌నాథ్ షిండే శివసేనవర్గానికి చెందిన మహాయుతి కూటమి అభ్యర్థి రాజశ్రీపాటిల్‌కి మద్దతుగా ప్రచారం చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

బీజేపీ అభ్యర్థి రవికిషన్ నా తండ్రి

» జూనియర్ నటి షినోవా సోనీ సంచలన ఆరోపణ

లఖ్‌నవూ, ఏప్రిల్ 24: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, ప్రముఖ నటుడు రవికిషన్ తన తండ్రి అని, ఆయన్ను తన తండ్రిగా ప్రకటించాలని జూనియర్ నటి షినోవా సోనీ(25) ముంబైలోని దిండోషీ కోర్టును ఆశ్రయించారు. తన తల్లి అపర్ణా సోని అని పేర్కొన్నారు. "అపర్ణ, రవికిషన్ 1991లో పెళ్లి చేసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో వారు ఒకే ఇంట్లో కలిసి ఉండలేదు. 1998 అక్టోబరు 19న వారిద్దరికి నేను జన్మించాను. అయితే, రవికిషన్ ఆ తర్వాత మరో పెళ్లి చేసుకున్నారు" అని షినోవా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. షినోవా కొద్ది రోజుల క్రితమే బహిరంగంగా ఈ ప్రకటన చేశారు.

మోదీ భయపడుతున్నారు!

» అందుకే అడ్డగోలుగా అబద్ధాలు
» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికలు తనకు అనుకూలంగా లేవని ప్రధాని మోదీ గుర్తించారని, తీవ్ర భయాందోళనలో ఉన్న ఆయన అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, మోదీ ఈసారి తప్పించుకోలేరని.. దేశం ఆయనను క్షమించబోదని హెచ్చరించారు. దేశంలో 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రకుల పేదల వాస్తవ పరిస్థితుల గురించి తెలుసుకోవటానికి తాము అధికారంలోకి రాగానే కులగణన జరిపి తీరుతామని చెప్పారు. బుధవారం ఢిల్లీలో సమృద్ధ భారత్ ఫౌండేషన్ నిర్వహించిన 'సామాజిక న్యాయ సమ్మేళనం'లో, మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో, తన ఎక్స్ ఖాతాలో రాహుల్ పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దేశంలోని ప్రజల ఆస్తులను, మహిళల మెడలోని మంగళసూత్రాలతోపాటు ఇళ్లలోని బంగారాన్ని స్వాధీనం చేసుకొని అందరికీ పంచుతుందని ప్రధాని మోదీ ఇటీవల చేస్తున్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. 'నాకు కులం మీద నమ్మకం లేదు. కాకపోతే, దేశ జనాభాలోని 90 శాతంమందికి జరగాల్సిన న్యాయం మీదే నా దృష్టి అంతా ఉంది. దేశ జనాభాలో 15% దళితులు, 8% ఆదివాసీలు, 50% ఓబీసీలు, 15% మైనారిటీలు, 5% అగ్రవర్ణ పేదలు ఉన్నారు. ఈ 90% ప్రజల పరిస్థితి తెలుసుకోకుండా, వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోకుండా దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాం. దేశంలోని ఏ వర్గం ప్రజల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవటానికి కులగణన ద్వారా సమాజాన్ని ఎక్స్‌రే తీస్తామని మేం చెబుతుంటే.. దేశభక్తునిగా చెప్పుకొనే మోదీ ఎందుకు భయపడుతున్నారు' అని రాహుల్ నిలదీశారు. ఎవరు అడ్డుకున్నా ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన జరిపి తీరుతామని, తమ ప్రభుత్వం చేపట్టే మొట్టమొదటి కార్యక్రమం ఇదేనన్నారు. మోదీ ప్రజల నాయకుడు కాదని, శత కోటీశ్వరుల (బిలియనీర్ల) నేత అని రాహుల్ ఆరోపించారు. తన పదేళ్ల పాలనలో దేశంలోని 20-25 మంది శత కోటీశ్వరుల కోసమే మోదీ పని చేశారని, బకాయిలను రద్దు చేయడం ద్వారా వారికి ఏకంగా రూ.16 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చారని, ఈ నేరానికిగాను మోదీని దేశం క్షమించబోదన్నారు. 'మోదీ భయపడుతున్నారు. ఎన్నికలు ఆయన చేతుల్లోంచి జారిపోతున్నాయని ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల తర్వాత ఎలక్టోరల్ బాండ్ల దొంగతనం తనకు చుట్టుకుంటుందని ఆయనకు తెలుసు. అందుకనే నిరంతరాయంగా అబద్ధాలు చెబుతున్నారు. ఎన్ని చెప్పినప్పటికీ.. ఈసారి ఆయన తప్పించుకోలేరు' అని హెచ్చరించారు. 'రూ.16 లక్షల కోట్లతో 16 కోట్లమంది యువతకు నెలకు రూ.8,500 వేతనంతో ఏడాదిపాటు అప్రెంటిషిప్ కల్పించవచ్చు. సుమారు పది కోట్ల రైతు కుటుంబాల రుణాలు మాఫీ చేయవచ్చు. ఇరవై ఏళ్ల పాటు గ్యాస్ సిలిండరు రూ.400 చొప్పున అందించవచ్చు. దళితులు, ఆదివాసీలు, బడుగుల కుటుంబాల్లోని పిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్య అందించవచ్చు. కానీ, అదానీల సంపదలను పెంచడం కోసం ఇంత డబ్బును మోదీ వినియోగించారు' అని రాహుల్ తెలిపారు. తాము అధికారంలోకి రాగానే కోట్లాదిమందిని లక్షాధికారులను చేస్తామన్నారు.

రాజ్యాంగాన్ని ఏ శక్తీ మార్చ లేదు

దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బీసీలు, మహిళల గొంతుకగా రాజ్యాంగం మారిందని, వారి శక్తిసామర్థ్యాలను నలుదిశలా ప్రసరించిందని.. దీనిని సహించలేకనే దేశ రాజ్యాంగాన్ని మార్చివేయాలని బీజేపీ భావిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. అయితే, బీజేపీకే కాదు.. ఏ శక్తికీ అది సాధ్యం కాదన్నారు. తనను రాజకీయ ఆసక్తి లేని నేతగా మీడియాలో జరుగుతున్న ప్రచారంపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. దేశంలోని 90 శాతం జనాభా గురించి ఆలోచిస్తుంటే 'రాజకీయాల్లో ఆసక్తి' లేనట్టా అని ప్రశ్నించారు. యూపీఏ హయాంలో అమలైన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, భూసేకరణ చట్టం వంటి వాటి రూపకల్పనలో తన భాగస్వామ్యం ఉన్న విషయం మీడియా కావాలనే విస్మరిస్తోందని విమర్శించారు. దళితులు, ఆదివాసీలు, బీసీలలో ఒక్కరు కూడా మీడియా యజమానులుగా లేరని, 650 మంది హైకోర్టు జడ్జీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు కేవలం 100 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

బతికున్నా..చచ్చినా పన్ను

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. బుధవారం ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లా కేంద్రం అంబికాపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. అమెరికాలో వారసత్వ పన్నులాంటిది ఇక్కడ లేదని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యపై దుమారం రేగుతుండగా.. మోదీ కూడా ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. వ్యక్తులు బతికున్నప్పుడే కాకుండా.. చనిపోయాక కూడా వారి సొమ్మును దోచుకోవడం కాంగ్రెస్ సూత్రంలా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్ పార్టీ.. తమ పూర్వీకుల ఆస్తి అని వారు(గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి) భావిస్తుంటారు. దాన్ని వారి పిల్లలకు అందించారు. కానీ సగటు భారతీయులు మాత్రం తమ ఆస్తులను పిల్లలకు ఇవ్వడానికి మాత్రం వారు ఇష్టపడడం లేదు. పంజా(కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తును ఉద్దేశించి) మీ ఆస్తుల్ని దోచుకుని, ప్రత్యేక కేటగిరీ(ముస్లింలను ఉద్దేశించి)కి సమానంగా పంచుతుందట" అని దుయ్యబట్టారు. మన పూర్వీకులు వారసుల పెళ్లిళ్ల కోసం బంగారు ఆభరణాలను కూడబెట్టారని, కాంగ్రెస్ దాన్ని కూడా దోచుకుంటుందని, దీనికి మీరు అంగీకరిస్తారా? అని రోడ్ షోలో మోదీ ప్రశ్నించారు. "కాంగ్రెస్ కళ్లు మీ రిజర్వేషన్లపైనే కాదు..! మీ ఇళ్లపైన.. మీ సంపద పైన.. మీ ఇంట్లోని ప్రతి కప్‌బోర్డ్‌పైనా ఉన్నాయి. కానీ, నేను వారి చర్యలను అడ్డుకుంటాను" అని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు ఓబీసీలకు అన్యాయం చేస్తోందని మోదీ ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసం బీసీల కోటాను తగ్గిస్తున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని హార్దాలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. బీజేపీ మాత్రమే సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే.. ఇండియా కూటమి నుంచి ఏడాదికో ప్రధాని వస్తారని ఎద్దేవా చేశారు.



సుర్గుజాలో ఎన్నికల ప్రచారంలో మోదీ

కాంగ్రెస్‌కు ఓటేయకుంటే.. నా అంత్యక్రియలకు రండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణం ఉన్నంత వరకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడతానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన అల్లుడు దొడ్డమాని రాధాకృష్ణ ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 'ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతోందంటే.. ఇద్దరు అమ్మకందార్లు, ఇద్దరు కొనుగోలుదార్లు ఉన్నారు. అమ్మకందార్లు మోదీ, అమిత్‌షా, కొనుగోలుదార్లు అంబానీ, అదానీ. మాజీ ప్రధాని నెహ్రూ స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు మోదీ, అమిత్‌షా అమ్మేస్తున్నారు' అని ఖర్గే మండిపడ్డారు. అలాగే, కేరళ రాజధాని తిరువనంతపురంలో ఖర్గే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అనూహ్యంగా ఓటర్ల మద్దతు లభిస్తుండటంతో మోదీ నిరాశ చెందుతున్నారని, అందుకే ఓటర్లలో మతపరమైన చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. ప్రతిదానికీ మతంతో లింకుపెట్టి దేశాన్ని నాశనం చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, చిల్లర రాజకీయ నేతలా వ్యవహరిస్తున్నారన్నారు.

రాహుల్‌కు కనీస పరిజ్ఞానం లేదు

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కనీస పరిజ్ఞానం లేదని మాజీ ప్రధాని దేవెగౌడ విమర్శించారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రాలేమనే గ్యారెంటీల హామీలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం అసాధ్యమన్నారు. రాహుల్‌గాంధీ సంపదపై సమీక్ష జరిపి హామీలు ప్రకటించాల్సి ఉండేదన్నారు. 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు హామీ ఇచ్చారనీ, రాత్రికి రాత్రి అన్నింటిని ఎలా సృష్టిస్తారని, వారికి వేతనాలు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుండా ఎలా మాట్లాడతారన్నారు.

నేడు కన్నౌజ్ నుంచి అఖిలేష్‌యాదవ్ నామినేషన్

లఖ్‌నవూ, ఏప్రిల్ 24: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కన్నౌజ్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్నారని పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం లేదని, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అఖిలేష్ నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన బుధవారం వెల్లడించారు. ఈ స్థానం నుంచి అఖిలేష్ బంధువు తేజ్ ప్రతాప్‌యాదవ్ పోటీ చేస్తారని సోమవారం ఎస్పీ ప్రకటించింది. అయితే తేజ్ అభ్యర్థిత్వాన్ని పార్టీ కార్యకర్తలు వ్యతిరేకించారని, అందుకే అక్కడ అఖిలేష్ పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఏముంది? మోదీ చెబుతున్నదేమిటి?


కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్మును ముస్లింలకు పంచుతుందని రాజస్థాన్ ఎన్నికల ప్రచార సభలో చేసిన ఆరోపణలతో మొదలుపెట్టి దాదాపుగా అదే అంశంపై ప్రధాని మోదీ ప్రతిరోజూ ఏదో ఒక వ్యాఖ్య చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా యూపీలోని అలీగఢ్‌లో జరిగిన ఎన్నికల సభలో ఏకంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలోనే ఈ విషయం ఉందని చెప్పారు. 'మీరు కష్టపడి సంపాదించుకున్న సొమ్ము మీద, సంపద మీద వారి కన్ను పడింది. తమ ప్రభుత్వం వస్తే ఒక్కో వ్యక్తి ఎంత సంపాదిస్తున్నాడు? ఎంత ఆస్తి ఉంది? ఎన్ని వాహనాలున్నాయి? ఎన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి? అనేది దర్యాప్తు జరుపుతామని కాంగ్రెస్ యువరాజు (రాహుల్‌గాంధీ) చెబుతున్నారు. ఈ సంపదనంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తుంది. వారి ఎన్నికల మేనిఫెస్టోలోనే ఈ విషయం ఉంది' అని పేర్కొన్నారు. మహిళల వద్ద ఉన్న బంగారాన్ని, చివరికి మంగళసూత్రాలను కూడా కాంగ్రెస్ వాళ్లు వదిలిపెట్టరని, దాని గురించి కూడా సమాచారం సేకరించి పంచి పెడతారని, ఈ విషయం కూడా ఆ పార్టీ మేనిఫెస్టోలో ఉందని మోదీ చెప్పారు. ప్రధాని స్థాయి వ్యక్తి హిందూ-ముస్లిం అంటూ ప్రజల మధ్య విభజన తెచ్చే విధంగా మాటలు మాట్లాడటమేమిటన్న చర్చ దేశంలో పెద్ద ఎత్తున నడుస్తోంది. ఇదిలా ఉన్నప్పటికీ.. మోదీ చెప్పినట్లుగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రజల సంపదను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తామని ఉందా అన్నది అసలు ప్రశ్న.

వీటిని సహించకూడదు

'న్యాయ పత్రం' పేరుతో విడుదలైన కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సామాజిక న్యాయం' అనే అధ్యాయంలో తొలి పేరా ఇలా ఉంది. 'దేశంలో వివిధ కులాల, ఉప కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులను అంచనా వేయటానికి వీలుగా దేశవ్యాప్త సామాజిక ఆర్థిక కులగణన జరుపుతాం. ఆ సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా సంక్షేమ అజెండాను బలోపేతం చేస్తాం' అని స్పష్టం చేశారు. ఇదే అధ్యాయంలో ఇచ్చిన పలు హామీల్లో మరొకటి ఇలా ఉంది.. 'ప్రభుత్వ భూములు, మిగిలి ఉన్న అదనపు భూములను ల్యాండ్‌సీలింగ్ యాక్ట్ కింద నిరుపేదలకు పంచటానికి ఒక సాధికారిక సంస్థను నెలకొల్పుతాం' అని పేర్కొన్నారు. ఈ హామీలు ఇవ్వటానికి ముందు.. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితం

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి

ముస్లింలకు దేశ సంపదను పంచుతారని మోదీ అంతకుముందు చేసిన వ్యాఖ్యలో కూడా వాస్తవం ఎంతన్నది కూడా ముందుకు వస్తోంది. 2006లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన ఓ ప్రసంగాన్ని ఉదహరిస్తూ మోదీ ఈ కామెంట్ చేశారు. జాతీయ అభివృద్ధి మండలి' 52వ సమావేశంలో 'సమష్టి ప్రాధాన్యతలు' అనే అంశంపై మన్మోహన్ ప్రసంగిస్తూ.. 'బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు, పిల్లల అభ్యున్నతికి పథకాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. అభివృద్ధి ఫలాల్లో మైనారిటీలకు ముఖ్యంగా ముస్లింలకు తగిన వాటా లభించేలా చర్యలు చేపట్టాలి. వనరుల్లో వారికి తొలి ప్రాధాన్యం ఉండాలి' అని చెప్పారు. దీనిపై అప్పట్లోనే వివాదం చెలరేగటంతో అప్పుడే ప్రధాని కార్యాలయం వివరణ ఇచ్చింది. వనరులపై తొలి ప్రాధాన్యం ముస్లింలకు మాత్రమే కాదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, పిల్లలు, మైనారిటీలందరికీ ఉండాలని ప్రధాని ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ వివరణను పక్కనపెట్టి మోదీ తాజాగా స్పందిస్తూ.. కాంగ్రెస్ ముస్లింలకు దేశ ప్రజల సంపద పంచనుందని వ్యాఖ్యానించారని విమర్శలు వస్తున్నాయి.



కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఖర్గే(ఫైల్)

లను కాంగ్రెస్ మేనిఫెస్టో చర్చించింది.. 'థామస్ పికెటీ వంటి అంతర్జాతీయ ఆర్థికవేత్తలు విడుదల చేసిన 'భారత్‌లో ఆదాయం, సంపద అసమానతలు, 1922-2023: శతకోటీశ్వరుల శకం' నివేదికలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు బ్రిటీష్ కాలం నాటి కన్నా పెరిగిపోయాయని వెల్లడించింది. దేశంలో 80 కోట్ల మంది ప్రజలు ఉచిత రేషన్ (నెలకు ఒక వ్యక్తికి ఐదు కిలోల బియ్యం)పై ఆధారపడుతున్నారంటే దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. ప్రపంచ ఆకలి సూచీలో ఉన్న 125 దేశాల్లో భారత్ 111వ ర్యాంకులో ఉంది. యూపీఏ పదేళ్ల హయాంలో దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధిరేటు సగటున 6.7 శాతం కాగా, మోదీ పదేళ్ల పాలనలో సగటున 5.9 శాతానికి పడిపోయింది. మరోవైపు, దేశంలో కులవివక్ష ఇప్పటికీ కొనసాగుతోంది. దేశ జనాభాలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటా దాదాపు 70 శాతం ఉన్నా.. ఉన్నత ఉద్యోగాలు, సేవలు, వ్యాపారాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువ. ఇటువంటి అసమానతలు, పుట్టుకతో కూడిన వివక్ష, సమాన అవకాశాల నిరాకరణను ఏ ఆధునిక, ప్రగతిశీల సమాజం కూడా సహించకూడదు. ఈ అసమానతలను తొలగించటానికి కాంగ్రెస్ కృషి చేస్తుంది' అని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. దీంట్లో పేర్కొన్న పలు సామాజిక, ఆర్థిక సంక్షేమ చర్యల్లో ఒకటి.. సామాజిక ఆర్థిక కుల గణన. అయితే, దీంట్లో ఎక్కడా కూడా ప్రజల సంపదను లెక్కించి పునఃపంపిణీ చేస్తామని చెప్పలేదు. కానీ, ప్రధాని మోదీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో లేని విషయాన్ని ప్రజలకు చెప్పటం గమనార్హం. - సెంట్రల్ డెస్క్


ఈవీఎంలపై సందేహాలు లేవు

» అన్ని సందేహాలనూ ఈసీ నివృత్తి చేసింది
» అనుమానాలపై ఆదేశాలు జారీ చేయలేం
» ఎన్నికల ప్రక్రియను మేము నియంత్రించలేం
» మళ్లీ బ్యాలట్ పద్ధతికి వెళ్లే ప్రసక్తి లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలపై అన్ని సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేసినందువల్ల మళ్లీ బ్యాలట్ పేపర్ పద్ధతికి తిరిగి వెళ్లే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈవీఎంలలో పోలైన ఓట్లతో.. వీవీ ప్యాట్ స్లిప్పులను సరిపోల్చాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ఎన్నికలను నియంత్రించలేదని.. ఒక రాజ్యాంగ సంస్థ (ఎన్నికల సంఘం)పై పెత్తనం చలాయించే అథారిటీగా వ్యవహరించలేదని స్పష్టం చేసింది. ఈవీఎంల పనితీరుపై ఐదు ప్రధాన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ నుంచి వివరణలను రాబట్టి.. ఇరువర్గాల వాదోపవాదాలనూ విన్న అనంతరం కోర్టు ఈ అభిప్రాయానికి వచ్చింది. కేవలం అనుమానం ఆధారంగా ఆదేశాలు జారీ చేయలేమని.. హ్యాకింగ్ జరిగిన ఉదంతాలు లేవని పిటిషనర్ ఉటంకించిన నివేదికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించింది. 5 శాతం వీవీ ప్యాట్ స్లిప్పులను ఈవీఎంలతో పోల్చి చూడాలంటూ గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఎన్నికల కమిషన్ అమలు చేసిందని ధర్మాసనం గుర్తుచేసింది. ఇంకా ఏదైనా దుర్వినియోగం జరిగినట్లు ఏ అభ్యర్థి అయినా ఫిర్యాదు చేస్తే అప్పుడు చూద్దామని తెలిపింది. ఈవీఎంల వ్యవస్థనే పటిష్ఠం చేసేందుకు ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంటూ తీర్పును వాయిదా వేసింది.

ఏ సాఫ్ట్‌వేరూ ఉండదు..

ఈవీఎంలలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఈ రెండింటినీ అనుసంధానిస్తూ ఒక కేబుల్ ఉంటుంది. ఈ రెండూ వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్) యంత్రానికి అనుసంధానమై ఉంటాయి. మనం వేసిన గుర్తుకే ఓటు పడిందీ లేనిదీ ఈ వీవీప్యాట్ యంత్రం ద్వారా తెలుసుకోవచ్చు. బుధవారం విచారణ ప్రారంభం కాగానే.. ఈ మూడు యూనిట్లపై తమకున్న సందేహాలను ధర్మాసనం ఈసీ ముందు పెట్టింది. వాటిలోని మైక్రో కంట్రోలర్ల గురించి వివరణ కోరింది. వాటిని ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ చేయగలమా? లేక రీ-ప్రోగ్రామింగ్ చేసే వీలుందా? అని ప్రశ్నించింది. దీనికి ఈసీ.. మూడు యూనిట్లలోనూ వేర్వేరు మైక్రో కంట్రోలర్లు ఉంటాయని, వాటిని ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ చేసే వీలుంటుందని కోర్టుకు తెలిపింది. కానీ, ఆ వాదనను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తోసిపుచ్చారు. ఈవీఎంల మైక్రో కంట్రోల్ యూనిట్‌ల ఫ్లాష్ మెమొరీలను మళ్లీ ప్రోగ్రామింగ్ చేయవచ్చని వాదించారు. అయితే, ఆయన అభిప్రాయంతో కోర్టు ఏకీభవించలేదు. వీవీపాట్‌లలోని ఫ్లాష్ మెమొరీలో ఏ సాఫ్ట్‌వేరూ ఉండదని, కేవలం 1024 వరకూ ఎన్నికల గుర్తులనే లోడ్ చేయగలరని, దాని మెమొరీయే తక్కువ స్థాయిలో ఉంటుందని ఎన్నికల కమిషన్ ఇచ్చిన వివరణను గుర్తుచేసింది. ఈసీ ఇచ్చిన సాంకేతిక నివేదికను విశ్వసించాలని స్పష్టం చేసింది. "మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చి ఆలోచిస్తే దానికి మేమేం చేయలేం. మీ ఆలోచనా ధోరణిని మేం మార్చలేం" అని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.




కలకత్తా హైకోర్టు తీర్పు ఏకపక్షం

» ఉపాధ్యాయ నియామకాల కేసులో సుప్రీంకోర్టుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా, ఏప్రిల్ 24: పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏకపక్షంగా ఉందని తన పిటిషన్‌లో పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని మమత సర్కారు రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్ష (ఎస్ఎల్ఎస్‌టీ) ద్వారా 2016లో జరిపిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ తీర్పుతో 25,753 మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. అంతేకాక, నియామక ప్రక్రియ చెల్లదని, అక్రమంగా ఉద్యోగాలు పొందినవారంతా గత ఎనిమిదేళ్లుగా తాము తీసుకున్న జీతాలను వడ్డీతో సహా నాలుగు వారాల్లోగా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి తగినంత సమయం ఇవ్వకుండా ఉన్నపళంగా ఉద్యోగులను తొలగించమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల విద్యా వ్యవస్థ స్తంభించిపోయిందని బెంగాల్ సర్కారు సుప్రీం కోర్టుకు విన్నవించింది.

లోకం తీరు



మండుతున్న రాష్ట్రం

- నెలాఖరు వరకూ వడగాడ్పులు
- వచ్చేనెలలో మరింత తీవ్రంగా గాడ్పులు
- భూమిలో తగ్గిన తేమ శాతం, నిశ్చలంగా గాలులు
- పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: నిపుణులు



విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, వడగాడ్పులు, పొడి వాతావరణంతో రాష్ట్రం వేడెక్కింది. మధ్యభారతంలో మాదిరిగా కోస్తా, రాయలసీమ నిప్పులకుంపటిలా మారాయి. ప్రస్తుతం వీస్తున్న వడగాడ్పులు ఈనెల 27వ తేదీ నుంచి మరింత పెరిగి నెలాఖరు వరకూ కొనసాగే అవకాశం ఉంది. మే నెల తొలి వారంలో ఎండలు, వడగాడ్పుల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో గతేడాది రుతుపవనాల సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిశాయి. అనేక ప్రాంతాల్లో కరువు పరిస్థితులు కొనసాగాయి. తరువాత ఈశాన్య రుతుపవనాల సమయంలో కూడా అనుకున్న వర్షాలు కురవకపోవడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. చెరువులు, వాగులు ఎండిపోగా నదుల్లో ప్రవాహాలు తగ్గిపోయాయి. చివరికి రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో భూమిలో తేమ శాతం తగ్గిపోవడంతో భూమి వేడెక్కిపోయింది. గత నెల రెండో వారం నుంచి ప్రారంభమైన ఎండలు రోజు రోజుకూ పెరగడం, తేమ శాతం తగ్గడంతో ఎండ తీవ్రత పెరిగి గాడ్పులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గాలుల వేగం సగటున ఆరు కిలోమీటర్ల నుంచి 18 కి.మీ. వరకు ఉండడంతో వేడి వాతావరణం ఎక్కడికక్కడే స్థిరంగా ఉండిపోయింది. సాధారణంగా మే నెలలో గాలుల్లో నిశ్చలత్వం ఉంటుందిగానీ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ప్రారంభమైందని వాతావరణ నిపుణుడొకరు విశ్లేషించారు. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో ప్రస్తుతం వడగాడ్పులు కొనసాగుతున్నాయని వివరించారు. ఇదిలావుండగా ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న వడగాడ్పులు వచ్చే నెలలో మరింత తీవ్రంగా ఉంటాయని ఇస్రో నిపుణుడు హెచ్చరించారు. వరుసగా రెండు రోజులపాటు రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం కంటే 4.5 డిగ్రీల నుంచి 6.4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే అక్కడ వడగాడ్పులు వీచినట్టుగా, అదే 6.5 డిగ్రీలు అధికంగా లేదా 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటి నాలుగు రోజులు నమోదైతే అక్కడ తీవ్ర వడగాడ్పులు వీచినట్టుగా పరిగణించాలన్నారు. వడగాడ్పుల తీవ్రత బట్టి 'ఆరెంజ్', 'సివియర్'గా హెచ్చరికలు ఉంటాయన్నారు. కాగా, పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 30 డిగ్రీల వరకు నమోదవుతున్నందున అనేక ప్రాంతాల్లో రాత్రులు కూడా వాతావరణం వేడిగా ఉంటోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని, మంచినీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. ప్రభుత్వాలు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

వడగాడ్పులతో జనం విలవిల

- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఉత్తరకోస్తాలో తీవ్ర వడగాల్పులు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 40 నుంచి 45డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు వీస్తున్నాయి. కోస్తా జిల్లాల్లో వడగాల్పులకు జనం విలవిలలాడుతున్నారు. ఉత్తరాంధ్రలో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి పొద్దుపోయే దాకా సెగ తగ్గడం లేదు. బుధవారం విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా బలపనూరులో 44.9, ప్రకాశం జిల్లా దొనకొండలో 44.3, నంద్యాల జిల్లా మహానందిలో 44.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 44.1, ఎన్టీఆర్ జిల్లా కంభంపాడు, పల్నాడు జిల్లా రావిపాడులో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 105 మండలాల్లో వడగాడ్పులు వీచగా, 69 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. గురువారం శ్రీకాకుళం. విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని 54 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 154 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

జనానికి 'వేసవి' షాక్

- 108 కోట్ల వసూలుకు సిద్ధమైన డిస్కమ్‌లు
- ఏప్రిల్ 20-23మధ్య 151 మి.యూ. కొనుగోలు
- డిమాండ్ మేరకు స్వల్ప వ్యవధి ప్రాతిపదికన...
- ఆ ఖర్చు ఏప్రిల్ బిల్లులో కలిపి మేలో వసూలు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రతాపాన్ని విద్యుత్ చార్జీల మోత రూపంలోనూ వినియోగదారుడే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు, నాలుగు రోజుల్లో రూ.108.918 కోట్లతో 151.585 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. ఈ నెల 20న రూ.26.949 కోట్లతో 36.155 మిలియన్ యూనిట్లు, 21న రూ.23.396 కోట్లతో 36.954 మిలియన్ యూనిట్లు, 22న రూ.29.676 కోట్లతో 39.636 మిలియన్ యూనిట్లు, 23న రూ.28.892 కోట్లతో 38.894 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేసింది. ఈ ఖర్చును వినియోగదారులనుంచే వసూలు చేసుకోవాలని డిస్కమ్‌లను ఈఆర్‌సీ ఆదేశించింది. అంటే.. వేసవి విద్యుత్తు కొనుగోళ్ల భారమంతా వినియోగదారుల నుంచే డిస్కమ్‌లు వసూలు చేయనున్నాయి. ఏప్రిల్ విద్యుత్ బిల్లులను మే నెల మొదటివారంలోగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. స్వల్పవ్యవధి కింద బహిరంగ మార్కెట్లో యూనిట్ విద్యుత్తు పది రూపాయలకు లోబడే కొనాలని ఈఆర్‌సీ స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది. రాష్ట్రంలో మంగళవారం 245.756 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లో 42.152 మిలియన్ యూనిట్లను డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సంస్థలలో బొగ్గు నిల్వలు అడుగంటుతున్నాయి.

పేదల ఇళ్ల నిర్మాణంపై కేంద్రం అసంతృప్తి

- మంజూరైన ఇళ్లు 23 లక్షలు.. పూర్తి చేసింది 6.3 లక్షలే
- కేంద్రం నిధులు ఇస్తున్నా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే'
- జూలైలోపు పూర్తి చేయాలంటూ నెలవారీగా లక్ష్యాలు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా ఇల్లు లేని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తున్నామంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఊరూరా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కానీ, పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణం తీరుపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మొత్తం 23 లక్షల ఇళ్లు మంజూరు చేయగా.. సకాలంలో నిర్మాణం పూర్తిచేయలేదనే కారణంతో 5 లక్షలకుపైగా ఇళ్లను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 18లక్షల ఇళ్లను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే పరిస్థితులు కనిపించడం లేదంటూ కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే రాష్ట్ర గృహనిర్మాణశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎంఏవై పథకం కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై సమీక్షించారు. కేంద్రం నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఇళ్ల నిర్మాణం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉందంటూ ఆయన అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న పేదల ఇళ్ల నిర్మాణాలను వచ్చే జూలై లోపు పూర్తి చేయాలంటూ నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించారు. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ తీరుపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ కావడం ఇదే మొదటిసారి కాదు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ గతేడాది రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు.. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం గాజులపల్లిలోని జగనన్న లే-అవుట్‌ను సందర్శించారు. ఈ లే-అవుట్‌లో 1,402 ఇళ్లు మంజూరు చేయగా.. అప్పటికి 250 ఇళ్లు మాత్రమే పూర్తి చేయడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత కేంద్ర కమిటీ రాష్ట్రానికి వచ్చింది. వివిధ జిల్లాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద మంజూరు చేసిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సక్రమంగా కేటాయించలేదని, ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను కూడా సక్రమంగా ఖర్చు చేయడం లేదని తప్పుబట్టింది.

గత ఐదేళ్లలో రాష్ట్రానికి మంజూరు చేసిన 23 లక్షల ఇళ్లలో ఇప్పటికే 5 లక్షలకు పైగా ఇళ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 18 లక్షలకుపైగా ఇళ్లను రాష్ట్ర సర్కారు గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆ ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇలా ఉంది.

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో మిగిలినవి	18,01,840
ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేసిన ఇళ్లు	16,45,451
వాటిలో ఇప్పటి వరకు పూర్తయినవి	6,34,591
ఇంకా నిర్మాణం మొదలు పెట్టనివి	1,56,389
బీలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నవి	3,84,482
పీసీ, పీబీ స్థాయిలో ఉన్నవి	1,00,284
బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న ఇళ్లు	3,06,899
లింటల్ లెవెల్‌కు చేరుకున్నవి	50,459
రూఫ్ లెవెల్‌లో ఉన్నవి	85,622
రూఫ్ కాస్ట్ దశకు చేరుకున్నవి	83,114

తిరుమలపై ఎన్నికల ఎఫెక్ట్

- గంటలోనే గోవిందుని దర్శనం.. వేసవి సెలవుల్లోనూ కనిపించని రద్దీ

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులైనప్పటికీ తిరుమలేశుడి దర్శనం గంటలోనే పూర్తవుతోంది. సాధారణంగా వేసవి సెలవులు మొదలయ్యే మార్చి చివరి వారం నుంచి జూలై నెల చివరి వరకు తిరుమలలో రద్దీ అధికంగా ఉంటుంది. ప్రత్యేకించి పదో తరగతి పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత తిరుమల కిక్కిరిసి పోతుంటుంది. అయితే ఎన్నికల సీజన్ కావడంతో చాలామంది తిరుమల పర్యటన వాయిదా వేసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడంతో కొంత మంది, ఎన్నికల సమయంలో ప్రయాణాలు ఎందుకని కొంతమంది వాయిదా వేసుకుంటున్న క్రమంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య 20 రోజులుగా తగ్గింది. గతేడాది ఏప్రిల్ 1 నుంచి 23వ తేదీ వరకు పరిశీలిస్తే దాదాపు 16,51,341 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 23వ తేదీ వరకు 15 లక్షల మంది భక్తులే శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేకించి వేసవి సెలవుల్లో శ్రీవారిని సగటున రోజుకు 70 నుంచి 80 వేల మంది దర్శించుకుంటారు. వారాంతాల్లో అయితే 90 వేల వరకు ఆ సంఖ్య పెరుగుతుంది. కానీ పదిరోజులుగా సగటున 60 వేలమంది మాత్రమే దర్శించుకున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో 1.27 లక్షల మంది దర్శించుకోగా, గతేడాది 22, 23 తేదీల్లో 1.47 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం నుంచి శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లోని షెడ్లలో నిలబడే అవసరం లేకుండా డైరెక్ట్ లైన్ నడుస్తోంది. సోమవారం పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చినప్పటికీ రద్దీ కనిపించడం లేదు. గంట నుంచి రెండు గంటల వ్యవధిలోనే స్వామి దర్శనం పూర్తవుతోంది. పోలింగు సమీపిస్తున్న క్రమంలో తిరుమలలో రద్దీ ఇంకా తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

1.55 గంటల్లో 4.50 లక్షల టికెట్ల కోటా పూర్తి

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి జూలై నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా కేవలం గంటా యాభై ఐదు నిమిషాల్లో పూర్తయిపోయింది. బుధవారం ఉదయం 10 గంటలకు జూలై నెలకు సంబంధించిన 4.50 లక్షల రూ.300 దర్శన టికెట్ల కోటాను స్లాట్ల వారీగా విడుదల చేసింది. ఈ టికెట్లను భక్తులు 1.55 గంటల్లో తమకు కావాల్సిన తేదీలు, స్లాట్లలో బుక్ చేసుకున్నారు. ఇక, 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేసిన అంగప్రదక్షిణ టోకెన్లు 4 నిమిషాల్లో, మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేసిన వృద్ధులు, దివ్యాంగుల టోకెన్లు 20 నిమిషాల్లో పూర్తయ్యాయి. ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, ఒంటి గంటకు పరకామణి సేవలను కూడా టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

కడప కోర్టు ఉత్తర్వులపై.. విచారణ నుంచి వైదొలగిన జస్టిస్ ఏవీ శేషసాయి ధర్మాసనం

- వ్యాజ్యాలను మరో బెంచ్ ముందుంచేందుకు సీజే ఉత్తర్వులు తీసుకోవాలని రిజిస్ట్రీకి ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు/సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణ నుంచి జస్టిస్ ఏవీశేషసాయి, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం వైదొలగింది. బుధవారం సదరు పిటిషన్లు విచారణకు రాగా ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. వాటిని మరో బెంచ్ ముందు ఉంచేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి నుంచి ఉత్తర్వులు పొందాలని రిజిస్ట్రీని ఆదేశించింది. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతల పై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి వేర్వేరుగా పిటిషన్లు (సివిల్ మిసిలేనియస్ అప్లికేషన్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మీసం మెలేసి చెబుతున్నా.. నామినేషన్ దాఖలు చేస్తా

- అరాచకాలు సృష్టించేందుకు వైసీపీ ప్లాన్
- సీఎం నామినేషన్ వేస్తున్న రోజే నేనూ వేస్తా
- జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధం కావాలి: దస్తగిరి



పులివెందుల, ఏప్రిల్ 24: "కుల రాజకీయాలకు, అరాచక రాజకీయాలకు రాజుగా ఉన్న సీఎం జగన్‌ను గద్దె దించడమే మన లక్ష్యం.. మీసం మెలేసి చెబుతున్నా.. నేను నామినేషన్ దాఖలు చేస్తా" అని వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలో దస్తగిరి మీడియాతో మాట్లాడారు. తన నామినేషన్ సందర్భంగా వైసీపీ అరాచకాలు సృష్టించాలని చూస్తోందని ఆరోపించారు. "పులివెందుల అసెంబ్లీ స్థానానికి జై భీమ్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్నా. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా అడ్డంకులు సృష్టించాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని నా సహాయకులు తెలిపారు. నేను, బీటెక్ రవి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సమయంలో టీడీపీ కండువాలు కప్పుకొని వచ్చి మాపై రాళ్ల దాడులు చేసేందుకు ప్రయత్నిస్తారని తెలిసింది. అందుకే బుధవారం నామినేషన్ దాఖలు చేయకుండా తేదీ మార్చుకున్నా. సీఎం జగన్ నామినేషన్ వేస్తున్న రోజే (25వ తేదీ) నేను కూడా వేసేందుకు సిద్ధమయ్యా. నామినేషన్ వేసేందుకు నేను పిలుచుకున్న నాయకులను, అభిమానులను ఈ అరాచక శక్తులు అడ్డుకునేందుకు చూస్తున్నాయి. వలంటీర్లు వారి వద్దకెళ్లి పింఛన్లు, పథకాలు రాకుండా చేస్తారని, వెళ్లవద్దని చెబుతున్నారు. నాతో నడిచేవారికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏదైనా జరిగితే మర్యాదగా ఉండదు. పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్‌కుమార్ పులివెందుల వస్తున్నారు. ఆయనతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తా. భయాలను పక్కనపెట్టి సామాన్యుడికి అండగా నిలవండి. నన్ను ఆశీర్వదించండి. నా నామినేషన్‌కు రండి" అని దస్తగిరి కోరారు.

వైఎస్‌ను తిట్టిన బొత్స... నీకు తండ్రితో సమానమా?



రేపల్లెలో నిర్వహించిన న్యాయ యాత్రలో షర్మిల

- ఆయన విజయమ్మనూ అవమానించారు
- రాజశేఖరరెడ్డిని తిట్టినోళ్లకే వైసీపీలో పెద్దపీట
- ఆయన కోసం పనిచేసిన వాళ్లు గొడ్డలి వేటుకు బలి
- రేపల్లె న్యాయయాత్రలో పీసీసీ చీఫ్ షర్మిల

బాపట్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): "బొత్స సత్యనారాయణ అనే ఆయనను పక్కన నిలబెట్టుకుని.. 'నాకు తండ్రి లాంటి వాడు, ఓట్లెయండి' అని జగన్ అడుగుతున్నాడు. మీ సమక్షంలో అడుగుతున్నా... బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో నిండు వేదికగా వైఎస్ రాజశేఖరరెడ్డిని తిట్టిపోశారు. ఆ వ్యక్తి జగన్‌కు తండ్రి సమానుడయ్యాడట. ఇదే బొత్సగారు నా తండ్రిని తాగుబోతు అని తిట్టారు. జగన్‌కు ఉరిశిక్ష వేయాలన్నారు" అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన న్యాయయాత్ర బహిరంగ సభలో మాట్లాడారు. తన తండ్రి రాజశేఖరరెడ్డిని తిట్టిన వారందరికీ జగన్ పెద్దపీట వెయ్యడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పైగా వారినే పక్కన పెట్టుకుని తండ్రి లాంటి వారని సంబోధిస్తూ ఓట్లు అడగగాన్ని ఎద్దేవా చేశారు. 'చివరకు వైఎస్ సతీమణి, నా తల్లి విజయమ్మను కూడా అవమానించిన వ్యక్తి బొత్స సత్యనారాయణ. ఈ రోజు అలాంటి వ్యక్తి జగన్‌కు తండ్రిలాంటి వారు అయ్యారు' అంటూ షర్మిల మండిపడ్డారు.

వైసీపీలో వైఎస్సార్ లేరు

'వైసీపీలో అసలు వైఎస్సార్ లేరు. ఆయన ఎప్పుడో పోయారు. ఉన్నదల్లా వై అంటే వై.వీ.సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే. వీళ్లా ఆయన ఆశయాలను నెరవేర్చేది?' అంటూ షర్మిల నిలదీశారు.

రైతులను నాశనం చేసిన జగన్

'రాష్ట్రంలో అప్పులేని రైతు అంటూ లేడు. అన్నదాతలను ఈ సీఎం నాశనం చేశాడు. మద్దతు ధర లేదు. ధరల స్థిరీకరణ ఎక్కడ? పంట నష్ట పరిహారం మాటే మరిచారు. ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో 2 లక్షల 25 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని జగనే చెప్పారు. ఇప్పటికీ ఆ ఉద్యోగాలు భర్తీ చేయలేదు. సంక్రాంతులు వచ్చాయి. పోయాయి. కానీ జాబ్ కేలెండర్ మాత్రం రాలేదు' అంటూ షర్మిల విమర్శించారు.

అందరూ తిట్టినవాళ్లే...

'ఈ రోజు జగన్ కేబినెట్‌లో ఉన్న మంత్రులంతా వైఎస్ రాజశేఖరరెడ్డిని తిట్టినవారే. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలు విడదల రజనీ, రోజా... అందరూ వారే. వీరందరూ జగన్‌కు కావాల్సినవాళ్లయ్యారు. వీళ్లంతా జగన్‌కు తండ్రులు, అక్కలు, చెల్లెళ్లంట. మరి నిజంగా వైఎస్ కోసం నిలబడిన వాళ్లని జగన్ ఏం చేశారు? ఆయన కోసం పాదయాత్రలు చేసిన వారు ఏమయ్యారు? వైఎస్ కోసం పనిచేసిన వాళ్లు గొడ్డలి వేటుకు బలైపోయారు' అని షర్మిల అన్నారు.

ఏపీలో కాంగ్రెస్ తుది జాబితా

3 ఎంపీ, 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన.. 5 సీట్లలో అభ్యర్థుల మార్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల తుది జాబితాను కాంగ్రెస్ ప్రకటించింది. 3 ఎంపీ, 11 అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ఖరారుచేసింది. నరసాపురం లోక్‌సభ బరిలో కొర్లపాటి బ్రహ్మానందరావు నాయుడు(కేబీఆర్ నాయుడు), రాజంపేట-ఎస్‌కే బషీద్, చిత్తూరు (ఎస్సీ)లో ఎం.జగపతి పోటీచేస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. గతంలో ప్రకటించిన 5 సీట్లకు అభ్యర్థులను మార్చారు. విజయవాడ తూర్పులో సుంకర పద్మశ్రీ స్థానంలో పొంగుపాటి నాంచారయ్య.. తెనాలి-ఎస్‌కే బషీద్ బదులు చందు సాంబశివుడు, కొండపి(ఎస్సీ)- శ్రీపతి సతీశ్ గాకుండా పసుమర్తి సుధాకర్, మార్కాపురం-షేక్ సైదా స్థానంలో జావీద్ అన్వర్, చీపురుపల్లిలో తుమ్మగంటి సూరినాయుడు బదులు ఆదినారాయణ పేర్లు ప్రకటించింది.

ముగ్గురి ప్రాణాలు బలిగొన్న అతివేగం

- ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కావలి రూరల్, ఏప్రిల్ 24: అతివేగం ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. బుధవారం తెల్లవారుజామున నెల్లూరు జిల్లా ముసునూరు వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని అతి వేగంగా కారు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు, ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని అశోక్‌నగర్‌కు చెందిన తిరునాతి సుబ్రహ్మణ్యం కుమార్తె కళ్యాణికి అదే ప్రాంతానికి చెందిన గోవిందరాజుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ తరువాత రెండు నెలలకు భర్త నుంచి విడిపోయిన ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. అదే సమయంలో ఎర్రాబత్తిన సిరి అలియాస్ రాజ్‌కుమార్ అనే ట్రాన్స్‌జెండర్‌తో కళ్యాణికి పరిచయం ఏర్పడింది. కాగా కొయ్యలగూడెంలో కళ్యాణికి ఫ్యాన్సీ షాపు ఉంది. అందులో విక్రయించేందుకు వన్‌గ్రామ్ గోల్డు ఆభరణాలు తెచ్చుకోవచ్చని రాజ్‌కుమార్‌తో పాటు వంగల కుమార్, అతని భార్య కుమారితో కలిసి కళ్యాణి కారులో సోమవారం రాత్రి చెన్నై వెళ్లారు. మంగళవారం రాత్రి చెన్నై నుంచి తిరిగి వస్తుండగా ముసునూరు టోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో వారి కారు రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనర్ లారీని అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ కిందకు కారు దూసుకుపోయి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కళ్యాణి (21), రాజ్‌కుమార్ (30), వంగల కుమార్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలిసిన వెంటనే కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకుని తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్ షేక్ జిలానిని, కుమారిని క్రేన్ సాయంతో బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరుకి తరలించారు. మృతదేహాలను కావలి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చిపోయిన వైసీపీ మూకలు

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- గృహాలపైనా రాళ్లు.. గ్రామంలో పోలీసు బందోబస్తు
- దాచేపల్లిలో పోలీసు స్టేషన్ ఆవరణలోనే టీడీపీ కార్యకర్తపై దాడి
- తెనాలిలో కానిస్టేబుల్‌పై దౌర్జన్యం.. తిట్ల దండకం
- వైసీపీ మూకల తీరుపై జనం నుంచి ఛీత్కారాలు



చలమయ్య



తీవ్రంగా గాయపడిన సీతారామాంజనేయులు

ఈపూరు, తెనాలి, దాచేపల్లి, ఏప్రిల్ 24: ఎన్నికల ప్రచారంలో వైసీపీ వర్గాలు రెచ్చిపోతున్నాయి. జగన్ పాలనపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న ప్రజలు టీడీపీ కూటమి వైపు మొగ్గు చూపుతుండడాన్ని సహించలేక దాడులకు దిగుతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వైసీపీ వర్గాలవారు టీడీపీ కార్యకర్తలతోపాటు పోలీసు కానిస్టేబుల్‌పైనా దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలం ఇనుమెళ్ల గ్రామంలో టీడీపీ సానుభూతిపరుల ఇళ్లపై వైసీపీ అల్లరి మూకలు రాళ్లతో దాడిచేసి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల కథనం మేరకు.. వినుకొండలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జీవీ ఆంజనేయులు బుధవారం నామినేషన్ వేస్తుండడంతో గ్రామం నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, నాయకులు ర్యాలీగా బయలుదేరారు. ఆ సమయంలో టీడీపీ వారి కారుకు వైసీపీ వాళ్లు మోటార్ బైక్‌ను అడ్డుపెట్టడంతో కొద్దిపాటి ఘర్షణ జరిగింది. కొంతమంది పెద్దలు ఇరువర్గాలకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి ఇంటికి వచ్చిన తిరువెంగల చలమయ్య అనే టీడీపీ కార్యకర్త.. పొలానికి వెళుతుండగా అతనిపై వైసీపీకి చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు, తిరుపతి లక్ష్మీనారాయణ, బండారి కోటయ్య, తమ్మిశెట్టి రంగయ్య, బండారి వెంకటస్వామి, హనుమయ్య, తమ్మిశెట్టి ఏడుకొండలు మరికొందరు దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన చింతల సీతారామాంజనేయులు, చింతల కుమారిపై కూడా వైసీపీ వర్గీయులు దాడి చేశారు. సీతారామాంజనేయులు తలకు తీవ్రగాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చలమయ్య తలకు, ఎడమ చెవికి తీవ్ర గాయమైంది. ఇరువురికీ ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. అంతటితో ఆగకుండా గ్రామంలోని వైసీపీ మండల నాయకుడి ఆదేశాల మేరకు వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయుల గృహాలపై రాళ్లతో దాడి తెగబడ్డారు.

పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ వర్గీయులపై దాడి

కానిస్టేబుల్‌పై దౌర్జన్యం



కానిస్టేబుల్‌ను.. వేలు చూపిస్తూ బెదిరిస్తున్న వైసీపీ నాయకుడు శ్రీనివాస్

గుంటూరు జిల్లా తెనాలి శాసనసభ వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి వచ్చారు. అభ్యర్థితోపాటు పరిమిత సంఖ్యలో వ్యక్తులు మాత్రమే కార్యాలయంలోకి వెళ్లాలి. నామినేషన్ కేంద్రం దగ్గర నిశ్శబ్దంగా ఉండాల్సి ఉన్నా వైసీపీ జెండా రంగులున్న కాగితాలను చిమ్ముతూ వీరంగం చేశారు. బారికేడ్లు అమర్చిన చోట పోలీసులు జనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పట్టణ వైసీపీ నాయకుడు దేసు శ్రీనివాస్, మరికొందరు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కానిస్టేబుల్‌పై శ్రీనివాస్ వేలు చూపిస్తూ తిట్ల దండకం అందుకున్నారు. అయితే కానిస్టేబుల్ కూడా ధీటుగానే సమాధానం ఇవ్వటం, లోపలకు ఎవరినీ వెళ్లనివ్వకుండా ఆపేయటంతో నాయకుల తీరుపై విమర్శలు వినిపించాయి.

ఫిర్యాదివ్వడానికి వెళ్లిన టీడీపీ కార్యకర్తపై దాడి

పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో పొందుగుల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తండా యూసఫ్‌పై వైసీపీ మూకలు దాడి చేసి కొట్టడంతో ఆయ న స్పృహ తప్పిపడిపోయాడు. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తండా ఆటో జానీ బుధవారం ఉదయం వైసీపీ అభ్యర్థి కాసు మహేష్ రెడ్డి నామినేషన్‌కు గురజాల వెళ్లి వచ్చాడు. తప్పతాగి తండా యూసఫ్ ఇంటి ముందు గొడవ చేస్తున్నాడు. దీంతో అతడిపై ఫిర్యాదు చేసేందుకు యూసఫ్, అతని సమీప బంధువులు దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. మహిళా కానిస్టేబుల్ సంధ్యారాణి జరిగిన సంఘటనపై రెండు వర్గాలను విచారిస్తున్నారు. అదే సమయంలో గ్రామ సర్పంచ్, అతని సమీప బంధువులు వచ్చి స్టేషన్ ఆవరణలో ఉన్న యూసఫ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మమతకు ఎదురుదెబ్బ

పశ్చిమబెంగాల్‌లో ఎనిమిదేళ్ళక్రితం జరిగిన స్కూలు పోస్టుల నియామకాలన్నీ రద్దుచేస్తూ కోల్‌కతా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల కాలంలో, అదీ ఇదీ అని కాకుండా ప్రతీదీ రాజకీయం కాగలిగిన వాతావరణంలో కోర్టు అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలతో, ఎనిమిదేళ్ళు ఆర్జించిందంతా కొంతమంది నెలరోజుల్లోనే వెనక్కు ఇచ్చేయాలనేటువంటి తీవ్ర చర్యలతో వెలువరించిన ఈ తీర్పు మమతా బెనర్జీకి పెద్ద ఎదురుదెబ్బ. హైకోర్టు తీర్పు సమంజసంగా లేదని, అది ఏకపక్షంగా, హడావుడిగా ఇచ్చిన తీర్పు అని సుప్రీంకోర్టుకు చేసుకున్న అప్పీలులో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. బియ్యాన్నీ రాళ్ళనీ వేరుచేయకుండా, మొత్తం నియామకప్రక్రియనే తప్పుబట్టి, నియమితులైనవారందరూ దొంగలేనని నిర్ధారించడం అత్యంత అమానుషం, అన్యాయం అంటూ మమత ప్రభుత్వం సుప్రీంకోర్టును శరణువేడుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్కూళ్ళలో పనిచేస్తున్న 23,123 మంది మీద ఇలా ఒక్కసారిగా వేటువేస్తే, పాఠశాలల పనితీరు దెబ్బతింటుంది, విద్యావ్యవస్థమీద తీవ్ర ప్రభావం పడుతుంది కనుక కోల్‌కతా హైకోర్టు తీర్పు అమలును నిలిపివేయాలంటూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించుకుంది.

సీబీఐ నివేదిక, స్కూల్ సర్వీస్ కమిషన్ నిర్ధారణలను బట్టి చూసినప్పుడు, మొత్తం నియామక ప్రక్రియనే తప్పుబట్టడం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. ఈ తీర్పు సీబీఐ దర్యాప్తు నివేదికను కాలదన్నుతున్నదని, మొత్తం నియామకాల్లో 4,327 పోస్టులు మాత్రమే అక్రమంగా భర్తీ అయ్యాయన్న నిర్ధారణలన్నింటినీ కొట్టిపారేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. 9, 10 తరగతుల టీచర్ పోస్టుల భర్తీలో 8.5శాతం, 11, 12 తరగతుల టీచర్ పోస్టుల భర్తీలో 14శాతం అపాయింట్‌మెంట్లు అక్రమంగా జరిగాయని వివిధ దర్యాప్తులు, విచారణలు తేల్చిన తరువాత హైకోర్టు ఆ గణాంకాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని రాష్ట్రం ప్రశ్నిస్తోంది. ఇలా, గ్రూప్ సీ, డీ, నాన్ టీచింగ్‌స్టాఫ్ పోస్టుల భర్తీలో ఎన్ని అక్రమం, ఎన్ని సక్రమం అన్నది ఇప్పటికే నిర్ధారణ అయిన విషయాన్ని గుర్తుచేస్తూ, సక్రమంగా ఉన్నవాటినీ న్యాయస్థానం రద్దుచేయడం సముచితం కాదని వాదిస్తోంది.

రద్దుచేసిన ఈ పోస్టులన్నింటినీ వెంటనే భర్తీచేయడం ఏ ప్రభుత్వానికైనా కష్టమే. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు తమ ప్రభుత్వాన్ని తప్పుబడుతున్న ఈ తీర్పుపై ఉన్నతన్యాయస్థానంలో నిలిచిపోరాడటం రాజకీయంగా మరింత ముఖ్యం. ఎనిమిదేళ్ళుగా మమతను వెంటాడి వేధిస్తున్న వ్యవహారం ఇది. గతనెల బీజేపీలో చేరి, తామ్లుక్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అభిజిత్ గంగోపాధ్యాయ ప్రస్తుత రాజకీయ అవతారానికి ముందు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఈ కుంభకోణం మీద ఎంత శ్రద్ధచూపారో అందరికీ తెలుసు. ఆయన ఆదేశాల మేరకు వరుస ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులతో తృణమూల్ తీవ్రంగా అప్రదిష్టపాలైంది. ఈ వ్యవహారంలో పద్నాలుగు కేసులను సీబీఐ విచారణకు అప్పగించి సామాన్యుల్లో మంచిపేరు తెచ్చుకున్నారు ఆయన. తీర్పులు చెప్పడానికే పరిమితం కాకుండా ఈ కేసులకు సంబంధించి విలేఖరులతో మాట్లాడుతూ, చానెళ్ళకు ఇంటర్వ్యూలు ఇస్తూ తృణమూల్ నాయకుల మీద విమర్శలు చేసేవారు ఆయన. మమతాబెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యాలుగా ఆయన వ్యాఖ్యలు ఉండేవి. అవినీతివ్యతిరేక పోరాటంలో ఎంతో చొరవచూపిన ఒక సిట్టింగ్ జడ్జి హఠాత్తుగా రాజకీయనాయకుడిగా మారిపోవడం, తృణమూల్ ఎంతోకాలంగా ఆరోపిస్తున్న పార్టీలోనే ఆయన చేరడం చాలామందిని విస్మయంలో పడవేసింది. ఆయన ఇచ్చిన అన్ని తీర్పులనూ సమీక్షించాలని అప్పట్లో డిమాండ్ చేసిన తృణమూల్, లక్షన్నరమంది జీవితాలను ప్రభావితం చేస్తున్న ఇప్పటి తీర్పు వెనుక కూడా ఆయన, ఆయన పార్టీ ఉన్నారన్న రీతిలో వ్యాఖ్యానిస్తున్నది. సోమవారం ఓ భారీ రాజకీయ పేలుడు సంభవిస్తుందని, అది మేనత్త–మేనల్లుళ్ళ పార్టీని కుదిపేస్తుందని రాష్ట్ర బీజేపీ నేత సువేందు అధికారి ఓ వారం క్రితమే చెప్పిన వైనాన్ని కూడా అది గుర్తుచేస్తున్నది. కోల్‌కత్తా హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేస్తుందా లేదా అన్నది అటుంచితే, ఎన్నికల సమయంలో వెలువడిన ఈ తీర్పు ప్రభావం ప్రజలమీద ఎంతమేరకు ఉంటుందన్నది చూడాలి.

ఏది యథాతథం? ఏది మార్పు?



రాజాసింగ్ అట్లా మాట్లాడితే, సరే, అది ఆయన స్థాయి అనుకోవచ్చు. మరి పెద్దాయన కూడా అంతకు మించి మాట్లాడితే ఎవరికి చెప్పుకోగలం, ఏం చేయగలం? అని ఓ కాంగ్రెస్ నాయకుడు నిస్సహాయంగా వ్యాఖ్యానించాడు. ఉన్నది లాగేసుకుంటారని, అందరిదీ తీసుకుని కొందరికి దోచిపెడతారని మోదీ చేస్తున్న ప్రచారం ఓటింగ్‌పై ఏమి ప్రభావం వేస్తుందో, దానికి విరుగుడు ఏమిటో కాంగ్రెస్ నేతలకు బోధపడడం లేదు. ఇప్పుడు అదనంగా కొత్తగా వారసత్వ పన్ను రగడ. నీతీ న్యాయం లేవా, నియమావళి లేదా, ఇంత అధర్మయుద్ధమా? అని కాంగ్రెస్ ఆక్రోశపడుతోంది. ఎన్నికల సంఘం కల్పించుకుని, నరేంద్రమోదీ మీద అనర్హత వేటు వేస్తుందని దానికేమీ ఆశలు లేవు. న్యాయస్థానాలు జోక్యం చేసుకుని మంచీ చెడ్డా చెప్పి, పరిస్థితిని చక్కదిద్దుతాయన్న నమ్మకమూ లేదు. నిరసనలు, ఖండనలు వినిపిస్తున్నా, మోదీ, షాలు రోజుకు రోజు డోసు పెంచుతున్నారే తప్ప తగ్గడం లేదు.

ఈ దాడి వెనుక ఉన్నది భయమే తప్ప, విజయోత్సాహమేమీ కాదని కొందరు చేస్తున్న విశ్లేషణలు కాంగ్రెస్‌కు కొంత ఉపశమనం ఇవ్వవచ్చును కానీ, ప్రతి వ్యూహాన్ని ఇవ్వలేవు. మోదీ, షాలు చేస్తున్న విమర్శలలోని తీవ్రతకు, బేఖాతరుతనానికి దిగ్భ్రాంతి చెందడం ఆపివేసి, ఏమి చేయాలో ఆలోచిస్తే కొంత ప్రయోజనం ఉండవచ్చు. ఇదేదో అనూహ్యమైన విషయమైనట్టు, కనీవినీ ఎరుగని ఉల్లంఘన అయినట్టు బాధపడితే ఉపయోగం లేదు. ఎన్నికలనేవి అన్ని పక్షాలూ న్యాయబద్ధంగా పోరాటం చేసే వేదికలుగా ఉండాలని అనుకోవడం ఆదర్శమే తప్ప, వాస్తవం వేరు అనేది అందరికీ తెలుసు. ప్రభుత్వంలో ఉన్న పక్షాలు అధికార బలం నుంచి అతిక్రమణలు చేస్తాయి. అబద్ధాలు చెబుతాయి. వక్రీకరిస్తాయి. పైగా, కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న పక్షం, గమ్యమూ, దాన్ని సాధించే సాధనాలూ ఏవీ పవిత్రంగా ఉండాలని విశ్వసించే రకం కాదు. ఎన్నికలు న్యాయంగా జరిపించాలని, తానూ న్యాయంగా ఉండాలని అనుకునే పక్షంలో, ఎన్నికల కమిషనర్ల నియామకంలో తటస్థతకు ఉన్న అవకాశాన్ని బీజేపీ ప్రభుత్వం ఎందుకు తొలగిస్తుంది? అంపైర్ తమవాడైతేనే కదా, ఆట అనుకూలమయ్యేది? కాబట్టి, నియమావళి భయం లేని, ప్రపంచం ఏమనుకుంటుందో అన్న సంకోచమూ లేని బలశాలి పక్షం ఏమేమి చేయగలదో బీజేపీ అది చేస్తుంది. ప్రతిపక్షం ముందే ఆ విషయం ఊహించగలగాలి.

పదేళ్ల కిందట భారతీయ జనతాపార్టీ ఎన్నికల ప్రచారం, ప్రధానంగా అచ్ఛేదిన్ మీద కేంద్రీకృతమైంది. యూపీఏ పదేళ్ల కాలం చెడ్డరోజులన్న అభిప్రాయం జనంలో అప్పటికే ఏర్పడి ఉంది. 2019లో లాగా, ఇప్పటి లాగా, బీజేపీ ఉద్వేగ పూరిత అంశాల మీద, విభజన కారక అంశాల మీద ఆధారపడి ఆనాడు ప్రచారం చేయలేదు. ఆ పార్టీ అమ్ములపొదిలోని అనేక అస్త్రాలు అప్పుడు అవసరమే పడలేదు. కానీ, ఈ పదేళ్ల కాలంలో, బీజేపీ తన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ లక్ష్యాలను సాధించడానికి ప్రాతిపదికగా, దేశంలో ఉన్న భావవాతావరణాన్ని మార్చడానికి గట్టి ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ దారుణంగా బలహీనపడినా, ప్రాంతీయపార్టీలు దాదాపుగా సాగిలపడినా లేక సర్దుకుపోయినా, బీజేపీ దూకుడు మాత్రం తగ్గలేదు. అభివృద్ధి గురించి, అసమానతల గురించి, రాజ్యాంగ హక్కుల గురించి, పర్యావరణం వంటి అంశాల గురించి, హేతుబద్ధ వైజ్ఞానికత గురించి మాట్లాడే గొంతులను నియంత్రించడానికి, రాజకీయ ప్రత్యర్థులను అదుపు చేయడానికి తీవ్ర చర్యలు తీసుకున్నది, నిర్బంధంతో సరిపెట్టుకోవడం కాదు, తన ప్రచార యంత్రాంగం ద్వారా సమ్మతిని కూడా రూపొందించుకుంది. అన్ని రకాల మీడియాను దారికి తెచ్చుకుని, విద్యాసాంస్కృతిక రంగాల మీద ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలలో చరిత్ర, వర్తమానం గురించిన అభిప్రాయాలలోనే మార్పు తేగలిగింది. 2014 దాకా ఒక ఘట్టం, ఆ తరువాత జరుగుతున్నది మరో ఘట్టం అన్నరీతిలో కొత్త చరిత్ర ఉనికిలోకి వచ్చింది. ఈ మొత్తం క్రమాన్ని ఉదారవాద, వామపక్ష ఆలోచనాపరులు కొంతలో కొంత గుర్తించి, ప్రశ్నించి, ప్రతిఘటించే ప్రయత్నం చేశారు కానీ, పదేళ్ల కాలంలో బాధితులుగా ఉన్న ప్రధాన రాజకీయపక్షాలు మాత్రం నిష్క్రియలోనే కూరుకుపోయి ఉన్నాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

కోటి నిఘానేత్రాలతో, లక్షల చేతులతో, వేలగొంతులతో పనిచేసే యంత్రాంగం అండతో, సాంకేతిక నిపుణత జోడించిన మేధలతో పనిచేస్తున్న బీజేపీని, కాంగ్రెస్ కానీ, దానితో వదులు వదులుగా చేతులు కలిపిన ఇతర ఇండియా కూటమి సభ్య పక్షాలు కానీ సాంప్రదాయ పద్ధతులతోనే ఎదిరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉద్వేగ అంశాల మీద స్వారీ చేస్తున్న అధికార పక్షాన్ని, సామాజికార్థిక సమస్యల ప్రాతిపదికగా ఎదుర్కొనాలన్న ప్రయత్నం ఎంతవరకు సఫలం అవుతుందో ఈ ఎన్నికల ఫలితాలు చెబుతాయి. ప్రజాశిబిరం నుంచి కూడా సృజనాత్మక ఉపాయాలతో అభిప్రాయ సమీకరణ చేసిన, చేస్తున్న ఉదాహరణలు చాలానే ఉన్నాయి. అయితే, ఎన్నికల ప్రచార పర్వంలో అధికారపక్షం చేసే ఒక్కొక్క వ్యూహాత్మక ప్రకటనా, అనేక మాధ్యమాలలో వందలరెట్ల తీవ్రతతో ప్రతిధ్వనించినప్పుడు, ఎదుర్కొనడం సాధ్యం కాదన్న నిరాశ కలగడం సహజం.

స్థూలంగా చూస్తే, ప్రభుత్వాల తీరు మీద ప్రజల అంచనాలు స్థిర వ్యవస్థలకు, యథాతథస్థితికి వ్యతిరేకంగా, మార్పుకు అనుకూలంగా ఉంటాయి. ఎన్నికలలో ఆ అంచనాల ప్రభావం ఉంటుంది. యోగ్యత కలిగిన ప్రత్యామ్నాయం కనిపించినప్పుడు, అటువైపు మొగ్గు ఉంటుంది. ఈ క్రమం అంతా అనేక సామాజిక, స్థానిక సమీకరణాలకు, ప్రాబల్యాలకు లోబడి మాత్రమే జరుగుతుంది. యథాతథ స్థితిని కొనసాగిస్తూనే అన్ని పక్షాలూ, అన్ని ప్రభుత్వాలూ యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ధోరణిని అభినయిస్తూ, ఏవో మార్పులు కోరుకుంటున్నట్టు, సాధించినట్టు ప్రజలను మభ్యపెడతాయి కూడా. ఒక పార్టీని దించి మరొకదాన్ని ఎక్కించడమే మార్పు అనుకుని ప్రజలు కూడా మోసపోతూ ఉంటారు. స్వాతంత్ర్యానంతరం ఈ ఏడున్నర దశాబ్దాలూ ఈ రంగులరాట్నం తిరుగుతూనే ఉన్నది. గడచిన దశాబ్దంలో మాత్రం ఈ యథాతథస్థితి, మార్పు అన్న ద్వంద్వంలో ఒక చిత్రమైన విన్యాసం జరుగుతోంది. భారతీయ జనతాపార్టీకి ఓటువేస్తున్న పాత, కొత్త తరం ఓటర్లు, ఆ పార్టీని మార్పుకు ప్రతినిధిగా, ఒక రాడికల్ రాజకీయ శక్తిగా చూస్తున్నారు. కాంగ్రెస్‌తో సహా తక్కిన పార్టీలన్నిటిని యథాతథవాదానికి, కాలంచెల్లిన పాతదనానికి ప్రతినిధులుగా పరిగణిస్తున్నారు.

వాళ్లు అట్లా అనుకోవడమే కాదు, ఎంతో కాలంగా స్థిరపడిన అనేక అభిప్రాయాలను మార్చడంలోను, అనేక ప్రభుత్వ వ్యవస్థలలో మార్పు తేవడంలోను బీజేపీ క్రియాశీలంగా ఉంటోంది. దాని రాజకీయ వాదన ప్రకారం, సమాజంలోని సకల రుగ్మతలకు కారణం, 2014 కంటె ముందున్న పాలన, ముఖ్యంగా కాంగ్రెస్ పాలన. వాళ్లు కుటుంబ రాజకీయాలు చేశారు, అవినీతికి పాల్పడ్డారు, విదేశాలకు భూములు వదులుకున్నారు, పొరుగుదేశాలతో మెతకగా ఉన్నారు, మైనారిటీలకు సంపద దోచిపెట్టారు, చరిత్ర పుస్తకాలలో ఆక్రమణదారులకు ఎక్కువ అధ్యాయాలు కేటాయించారు, విద్యాలయాల్లో హేతువాదం చెప్పారు, ఇట్లా చెప్పుకుంటూ పోతే నెహ్రూ, అతని వారసులు దేశాన్ని ఎంతో భ్రష్టుపట్టించారు, బీజేపీ దాన్నంతా చక్కదిద్దుతోంది, గాయపడ్డ హిందూ హృదయానికి మందు పూస్తోంది. రామాలయం కట్టింది. హనుమాన్ చాలీసా పారాయణానికి గ్యారంటీ ఇస్తోంది. అవినీతిని అంతం చేసి, కుటుంబపాలనను రద్దుచేసింది. సంపదను మైనారిటీలు మినహా తక్కిన అణగారిన వర్గాలకు పంచబోతోంది. అల్పసంఖ్యాకులను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతోంది. కానీ, కాంగ్రెస్ అభిమానులూ ఓటర్లూ మాత్రం ఆ రోజులే బాగున్నాయంటున్నారు, తిరిగి ఆ రోజుల్లోకి తీసుకెళ్తామంటున్నారు. మార్పు ఎవరిది? యథాతథం ఎవరిది?

అత్యవసర పరిస్థితి కాలంలో కూడా ఇందిరాగాంధీ తాను నల్లధనం మీద, అమెరికా మీద, భూస్వాముల మీద పోరాడుతున్నానని ప్రచారం చేసుకునేవారు. జనం దాన్ని ఎక్కువ కాలం నమ్మలేదనుకోండి. ఉన్న స్థితిలోని చెడు మీద యుద్ధం చేస్తున్న పక్షంగా బీజేపీ తనను తాను నిరంతరం ప్రదర్శించుకుంటున్నది. అనేక

> ఉత్తర తెలంగాణలో ఒకప్పుడు ఉద్యమాలకు నెలవుగా ఉన్న ప్రాంతాలలో యువత ఇప్పుడు మోదీ ఆరాధకులుగా మారడం వెనుక ఈ మార్పు భావన ఉన్నది. అది కేవలం బూటకపు భావన మాత్రమేనని, వాస్తవానికి ఇప్పుడు కనిపిస్తున్నది మార్పే కాదని విమర్శకులు అనవచ్చు. మనోభావాల కాలంలో వాదనలు చెల్లవు.

ఉద్వేగాలలో సేదతీరుతున్న సాధారణ ప్రజల దృష్టిలో, మార్పు భావన కూడా ఒక ఉద్వేగంగా మారిపోయింది. పాతను నిరాకరించడంలో ఉండే ఆకర్షణ వేరు. జాతీయోద్యమ చరిత్రను, స్వాతంత్ర్యానంతర అర్థశతాబ్ద కాలాన్ని నిరాకరించి, కొత్త ప్రతీకలను వరించడంలో ఉండే మిలిటెంట్ సంతృప్తి వేరు. ఉత్తర తెలంగాణలో ఒకప్పుడు ఉద్యమాలకు నెలవుగా ఉన్న ప్రాంతాలలో యువత ఇప్పుడు మోదీ ఆరాధకులుగా మారడం వెనుక ఈ మార్పు భావన ఉన్నది. అది కేవలం బూటకపు భావన మాత్రమేనని, వాస్తవానికి ఇప్పుడు కనిపిస్తున్నది మార్పే కాదని విమర్శకులు అనవచ్చు. మనోభావాల కాలంలో వాదనలు చెల్లవు.

సంపదను, అవకాశాలను అనర్హులకు దోచిపెట్టే ఆలోచనలున్న పార్టీ అని, కమ్యూనిస్టుల్లాగా ఉన్న ఆస్తులను లాక్కుని పంచిపెట్టే పథకాలు వేస్తున్న పార్టీ అని కాంగ్రెస్ మీద చేస్తున్న విమర్శలు ఆశ్చర్యకరమైనవి. అట్టడుగువర్గాలకు తొలి అవకాశాలు ఇవ్వాలనీ, అదనపు సంపదలు అందరి మధ్యా పంపిణీ కావాలనీ ఎవరైనా మాట్లాడితే, వాటిని ఆదర్శాలుగా గుర్తించేవారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికూడా అందుకు అనుగుణమైనదే. ఆ ఆలోచనలను ప్రతికూలమైనవిగా చిత్రించి, ప్రచారానికి ఉపయోగించుకోగలగడం ఆశ్చర్యకరం. అవును, మేం పంచి పెడతాం, సమానత్వం కోసం పనిచేస్తాం అని ప్రకటించి, రాజకీయ లాభం పొందగలిగే ధైర్యం కానీ, సంసిద్ధత కానీ కాంగ్రెస్ పార్టీకి లేకపోయింది. తానే మార్పును కోరుకుంటున్న శక్తిని అని చెప్పలేకపోతోంది. భారతీయుల భావప్రపంచం మీద బీజేపీ సాధించిన పట్టును ఇది సూచిస్తుంది.

> సంపదను, అవకాశాలను అనర్హులకు దోచిపెట్టే ఆలోచనలున్న పార్టీ అని, కమ్యూనిస్టుల్లాగా ఉన్న ఆస్తులను లాక్కుని పంచిపెట్టే పథకాలు వేస్తున్న పార్టీ అని కాంగ్రెస్ మీద చేస్తున్న విమర్శలు ఆశ్చర్యకరమైనవి. అట్టడుగువర్గాలకు తొలిఅవకాశాలు ఇవ్వాలనీ, అదనపు సంపదలు అందరిమధ్యా పంపిణీ కావాలనీ ఎవరైనా మాట్లాడితే, వాటిని ఆదర్శాలుగా గుర్తించేవారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికూడా అందుకు అనుగుణమైనదే. ఆ ఆలోచనలను ప్రతికూలమైనవిగా చిత్రించి, ప్రచారానికి ఉపయోగించుకోగలగడం ఆశ్చర్యకరం. అవును, మేం పంచి పెడతాం, సమానత్వం కోసం పనిచేస్తాం అని ప్రకటించి, రాజకీయ లాభం పొందగలిగే ధైర్యం కానీ, సంసిద్ధత కానీ కాంగ్రెస్ పార్టీకి లేకపోయింది. తానే మార్పును కోరుకుంటున్న శక్తిని అని చెప్పలేకపోతోంది. భారతీయుల భావప్రపంచం మీద బీజేపీ సాధించిన పట్టును ఇది సూచిస్తుంది.

వైద్యంపై ప్రభుత్వాలు శ్రద్ధపెట్టాలి

మనదేశంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జీడీపీలో 1.1 నుంచి 1.6 శాతం మాత్రమే ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువ. ఇందులోనే తాగునీటికి, పారిశుద్ధ్యానికి కేటాయింపులు జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్య రంగానికి జీడీపీలో 2.5శాతం నిధులు ప్రస్తుతం కేటాయించి, క్రమంగా దానిని 5.5 శాతానికి పెంచవలసిన అవసరం ఉంది. అంతేకాక తాగునీటికి, పారిశుద్ధ్యానికి విడిగా నిధులు కేటాయించాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య వసతులు క్రమేణా పెంచుతున్నప్పటికీ, ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రజల ఆరోగ్య అవసరాల కోసం దేశంలో వెచ్చిస్తున్న వ్యయంలో 63శాతం ప్రజలు తమ సొంత నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు. దాంతో ప్రతి ఏటా 5.5 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు చేరుతున్నారు. ప్రజల జేబుల నుంచి వైద్యానికి వ్యయం చేస్తున్న దానిలో ఎక్కువ శాతం మందులకే ఖర్చవుతోంది. మందులపై ప్రస్తుతం 5 నుంచి 18 శాతం ఉన్న జీఎస్టీని తొలగిస్తే ప్రజలకు కొంత భారం తగ్గుతుంది. ప్రజలందరికీ ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి తగిన కనీస వైద్య మౌలిక వసతులు, మానవ వనరులను ప్రభుత్వాలు కల్పించాలి. సరైన వైద్య సదుపాయాలతో పాటు రక్షిత త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

సాంక్రమిత వ్యాధులతో పాటు, సాంక్రమితేతర జబ్బులు అంటే మధుమేహం, రక్తపోటు వంటివి కూడా ఆధునిక జీవన విధానంలో అధికమవుతున్నాయి. ధూమపానం వంటి దురలవాట్లు, సరైన వ్యాయామం లేకపోవడం, ఆహార నియంత్రణ పాటించకపోవడం తద్వారా స్థూలకాయానికి దారి తీసి మధుమేహం, రక్తపోటు, కాలేయం, మూత్రపిండాల జబ్బులు మధ్య వయస్కులలో కూడా పెరుగుతున్నాయి. ప్రజలు కూడా తమ ఆరోగ్య రక్షణ కోసం వ్యక్తిగత జీవితాన్ని క్రమశిక్షణతో గడపాలి. దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ప్రజలు అనేక రకాల రుగ్మతల బారిన పడకుండా ఉండడానికి ఆస్కారం ఉంది.



వైద్యంలో సరైన శిక్షణ, అర్హత లేనటువంటి నకిలీ వైద్యులు యాంటీబయాటిక్‌లను నిర్హేతుకంగా, అతిగా వినియోగించడం వలన ఆయా మందులకు వ్యాధి నిరోధక ప్రభావం తగ్గిపోతున్నది. యాంటీ బయాటిక్స్ బాధ్యతాయుతంగా వినియోగించేలా చూడడం, అందుకోసం జాతీయస్థాయిలో ఈ–ప్రిస్క్రిప్షన్ విధానాన్ని రూపొందించి అమలు చేయడం అవసరం.

వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రులపై భౌతిక దాడులు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ఇవి అత్యవసర చికిత్స అందించడానికి వైద్యులు వెనకడుగు వేసే పరిస్థితులకు దారి తీస్తాయి. గత సంవత్సరం కేరళలో యువ వైద్యురాలు డాక్టర్ వందనాదాస్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ఖైదీకి చికిత్స చేస్తుండగా, ఆ ఖైదీ చేతిలో ఆమె హత్యకు గురి కావడం దేశ వ్యాప్తంగా వైద్యులను ఆందోళనకు గురిచేసింది. వైద్యులు నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో ప్రజలకు అత్యవసర వైద్యం అందించడానికి ప్రస్తుతం 23 రాష్ట్రాలలో ఉన్న రాష్ట్రస్థాయి వైద్యుల రక్షణ చట్టాలను కఠినతరం చేస్తూ మార్పులు తీసుకురావాలి. డాక్టర్ వందనాదాస్ సంఘటన తర్వాత కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్ర చట్టాన్ని కఠినతరం చేస్తూ సవరించింది. కేంద్ర స్థాయిలో కూడా ప్రత్యేకంగా వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రుల రక్షణ చట్టాన్ని తీసుకురావడం అత్యవసరం.

అలాగే వైద్యుల నిర్లక్ష్యం ఫిర్యాదులపై కేసులు నమోదు చేసేటప్పుడు సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా పోలీస్ శాఖకు నిర్దిష్ట నిబంధనావళి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో రూపొందించి అన్ని పోలీస్ స్టేషన్లకు జారీ చేయాలి. లేదంటే అవగాహన లేమితో పోలీసులు వైద్యులపై కొన్నిచోట్ల హత్యారోపణ, హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం చూస్తున్నాం. కొన్ని సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లో ప్రసవ సమయంలో ఒక మహిళ అధిక రక్తస్రావంతో మరణిస్తే వైద్యురాలిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన సంఘటనలో, సీనియర్ వైద్యురాలు తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ఈ విధమైన వేధింపులు వైద్యులు ఎదుర్కోవాల్సి వస్తే అత్యవసర చికిత్సలు అందించడానికి వారు తటపటాయించే అవకాశం ఉంది.

ఆధునిక వైద్యాన్ని అందిస్తున్న 4లక్షల మంది వైద్యులు సభ్యులుగా కలిగి, దేశంలో 1764 శాఖలు ఉన్న భారతీయ వైద్య సంఘం దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. ఐఎంఏ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తి నిపుణుల సంస్థ. దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించే సమయంలో ఐఎంఏను భాగస్వామిని చేయాలి.

గత సంవత్సరం డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన 95వ ఐఎంఏ జాతీయ మహాసభల సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, విభిన్న రంగాలకు చెందిన మేధావులు వరుస సమావేశాలు నిర్వహించి రానున్న 50 సంవత్సరాల కాలానికి దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ మేనిఫెస్టో రూపొందించారు. ఇందులో అన్ని కోణాల నుంచి వైద్య ఆరోగ్య రంగాలలో తీసుకోవాల్సిన చర్యల్ని కూలంకషంగా వివరించారు. ఈ హెల్త్ మేనిఫెస్టోను సాధారణ ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అందజేయనున్నది. ఆయా రాజకీయ పక్షాలు ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టోని అధ్యయనం చేసి, ఇందులోని అంశాలను తమ పార్టీ మ్యానిఫెస్టోలలో పొందుపరచడానికి గల అవకాశాలను పరిశీలించాలి.

పేదవానికీ ధనికునికి ఒకే రకమైన వైద్యం అందుబాటులోకి వచ్చిన నాడు సార్వజనీన వైద్యం సాధించినట్లు అవుతుంది. ఆ దిశలో ప్రభుత్వాలు పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ప్రజలకు ఆరోగ్య హక్కు అందించినట్లు అవుతుంది.

• డాక్టర్ గుర్రాల రవికృష్ణ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్

బోధనేతర పనులతో ఒత్తిడి!

ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువగా ఉంటున్నాయి. ఆన్‌లైన్ హాజరు, మరుగుదొడ్లు ఫోటోలు తీయడం, మధ్యాహ్న భోజనం, రాగి జావ, చిక్కీలు, కోడిగుడ్ల లెక్కలు వంటి పనులను ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు. ఇవికాక ప్రాథమిక విద్యనభ్యసించే మూడో తరగతి విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు కలపడం, ప్రోగ్రెస్ రిపోర్టులు, ఏకరూప దుస్తులు, నాడు–నేడు, అమ్మ ఒడి వంటి పనులు చెబుతున్నారు. సకాలంలో పుస్తకాలు రాకపోవడం, తల్లిదండ్రులతో సమావేశాలు, మండల, జిల్లా అధికారులతో తరచూ చర్చలు వంటి ఇతర పనులతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురౌతున్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తొలగిస్తే, వారు బోధనపై దృష్టి సారించి పాఠశాలల్లో అధిక ఉత్తీర్ణత సాధించి సత్తా చూపుతారు.

– యర్రమోతు ధర్మరాజు

అభివృద్ధిలో చేతులు కలపని జగన్!


ఈ పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన ఆర్థిక సహాయాన్ని, వైసీపీ పాలనలో ఎదురయిన సహాయనిరాకరణను లోతుగా తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది. విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడానికి అవసరమైన నిధులను, ప్రాజెక్టులను, సంస్థలను కేంద్రప్రభుత్వం ఇతోధికంగానే కేటాయించింది. రాజధాని అమరావతి నుంచి ఇతర ప్రాంతాలకు రహదారులు, రైల్వేలైన్లు, ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, జెట్టీలు, ఇండస్ట్రియల్ కారిడార్లు, డెవలప్‌మెంట్ నోడ్లు, పేదలకు ఇళ్లు, మౌలికసదుపాయాలు, తగిన మొత్తంలో ఆహారధాన్యాలు, వైద్యం, విద్యారంగాల్లో కీలకవ్యవస్థలూ ఇలా ఎన్నిటినో కేటాయించింది. స్థానికసంస్థల అభివృద్ధికి నిధులు మంజూరుచేసింది. జగన్ ప్రభుత్వం వీటిని ఏ మాత్రం అందిపుచ్చుకోలేదు. పైపెచ్చు ఉద్దేశ్య పూర్వకంగా రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టి తమ నవరత్న పథకాల అమలుకు మాత్రమే ప్రాధాన్యమిచ్చింది. కేంద్రనిధులను దారి మళ్లించి తమ పథకాల కోసం ఉపయోగించుకుంది. విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రంపై అమితమైన ఆర్థికభారం మోపింది.

రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.2,500 కోట్ల నిధులను కేటాయించగా వైసీపీ సర్కార్ 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు చేయనేలేదు. రాజధాని వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులంటూ చెప్పి దేనినీ అభివృద్ధి చేయలేదు. అమరావతిలో అప్పటికే వెచ్చించిన మొత్తాల్ని నిరుపయోగం చేసేసింది. రాజధానికి సరైన రహదారులను నిర్మించలేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కోసం నిర్మించిన భవనాలను పాడుబెట్టింది. వాటిలో ఎవరూ నివాసం ఉండకపోయినా ఉంటున్నట్లు పేర్కొని ఇటీవల వాటి అద్దె అంటూ బ్యాంకులకు జరిపిన చెల్లింపులపై విమర్శలొచ్చాయి. ఇక అమరావతి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టి అప్పులు తీసుకువచ్చిన ఆరోపణలపై సరైన వివరణ ఇవ్వకపోవడంతో అది నిజమేనని ప్రజలు నమ్ముతున్నారు. అమరావతిలో కేంద్రప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు.

కేంద్రప్రభుత్వం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి దాని నిర్మాణ బాధ్యతను తలకెత్తుకుంది. ఆ ప్రాజెక్టును పూర్తి చేసేది తామేనని ప్రకటించిన జగన్ అధికారంలోకి రాగానే దాన్ని పూర్తిగా అశ్రద్ధ చేశారు. 2019కి ముందు 72 శాతం మేర పోలవరం పనులు పూర్తికాగా ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా రెండుమూడు శాతం పనులే జరిగాయంటున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం పూర్తయితే ప్రత్యేకించి రాయలసీమ, ఉత్తరాంధ్ర రైతులందరూ బాగుపడేవారు. నగరాలకు తాగునీటి సమస్య, విద్యుత్ సమస్య ఉండేవి కావు.

రాష్ట్రంలో మౌలికసదుపాయాల అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసింది. గత పదేళ్లలో 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేటాయించి నిర్మిస్తోంది. జగన్ ప్రభుత్వం దీనికి భిన్నంగా జిల్లాలు, గ్రామాల స్థాయిలోనూ కొత్తరోడ్ల నిర్మాణం మాట అటుంచితే ధ్వంసమైన రోడ్లనే పునర్నిర్మించలేదు. రాష్ట్రంలోని రహదారులను చూస్తేచాలు జరిగిన అభివృద్ధి ఏపాటిదో ఎవరికైనా అర్థమైపోతుంది. నడికుడి–శ్రీకాళహస్తి, కోటిపల్లి–నర్సాపురం, రాయదుర్గం–తుముకూరు కొత్త రైల్వేలైన్లు వంటి కీలక ప్రాజెక్టులను కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. అవి నిర్మాణమైతే ఆయా మార్గాల్లో ఉన్న గనుల నుంచి ఖనిజాల రవాణా ద్వారా రాష్ట్రానికి ఎంతో ఆదాయం లభించేది. ఉమ్మడి భాగస్వామ్యంలో నిర్మించే ఈ ప్రాజెక్టుల కోసం కేంద్రం ముందుకువచ్చి నిధులు కేటాయించినా రాష్ట్రప్రభుత్వం మాత్రం ముందుకు రాలేదు. ఈ పనులకు సంబంధించి రాష్ట్రవాటా చెల్లించలేమని రైల్వేబోర్డుకు లేఖలు రాసింది. కావాలంటే భూసేకరణ భరిస్తామని, అందుకు అనుమతించాలని కోరింది. దాంతో ఈ ప్రాజెక్టులు ఆగిపోయాయి. కడప, తిరుపతి, కర్నూలు, రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నాలలో విమానాశ్రయాలను కేంద్రం అభివృద్ధి చేసినా కర్నూలు, కడపలలో వాటిని నడపలేని పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం ఉంది.

విద్యుత్ కంపెనీల ఒప్పందాల పీపీఏలను రద్దుచేయడం, అమరావతిని నిర్వీర్యం చేయడం వంటి చర్యలతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రంవైపు తొంగిచూడడమేలేదు. కేంద్రం ప్రకాశం జిల్లా కనిగిరి, చిత్తూరు జిల్లా ఏర్పేడులలో వస్తుతయారీ పరిశ్రమల కోసం నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్) ఏర్పాటుకు అనుమతి ఇస్తే వాటికి అవసరమైన 25 వేల ఎకరాల భూమిని అందించలేదు. మనతో పాటు రాజస్థాన్‌లో కూడ నిమ్జ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా అక్కడ దాన్ని పూర్తిచేసి 65 వేలకోట్ల పెట్టుబడులతో నాలుగులక్షల మందికి ఉపాధి కల్పించారు. జగన్ ప్రభుత్వం అలక్ష్యం కారణంగా కనీసం లక్షకోట్ల పెట్టుబడులు వెనక్కి పోయాయి. సుమారు 6 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. అలాగే చెన్నై, బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ కింద 12,944 ఎకరాల్లో కృష్ణపట్నం నోడ్‌కు, బెంగుళూరు – హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ కింద 9,350 ఎకరాల్లో ఓర్వకల్లు నోడ్‌కు, 3 వేల ఎకరాల్లో హిందూపూర్ నోడ్, 3 వేల ఎకరాల్లో అనంతపురం నోడ్‌లకు అనుమతులు ఇచ్చినా రాష్ట్రప్రభుత్వంలో చలనం లేదు. వీటిని సకాలంలో పూర్తిచేసి ఉంటే ఉత్తరాంధ్ర, రాయలసీమలలో పారిశ్రామికాభివృద్ధి జరిగి యువతకు ఉపాధి లభించేది. పరిశ్రమలకు పెట్టుబడి అలవెన్స్, ఆదాయపన్ను చట్టం కింద వెసులుబాటు దక్కేవి. ఇప్పటికే కియా వంటి పరిశ్రమలు ఈ రాయితీలు పొందుతున్నాయి. వేయి కోట్ల రూపాయలతో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినా రాష్ట్రప్రభుత్వం వేగంగా స్పందించడంలో విఫలమవుతోంది.



> ప్రకాశం జిల్లా కనిగిరి, చిత్తూరు జిల్లా ఏర్పేడులలో వస్తుతయారీ పరిశ్రమల కోసం నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్) ఏర్పాటుకు కేంద్రం అనుమతి ఇస్తే వాటికి అవసరమైన 25 వేల ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం అందించలేదు. మనతో పాటు రాజస్థాన్‌లో కూడ నిమ్జ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా అక్కడ దాన్ని పూర్తి చేసి 65 వేలకోట్ల పెట్టుబడులతో నాలుగులక్షల మందికి ఉపాధి కల్పించారు. జగన్ ప్రభుత్వం అలక్ష్యం కారణంగా కనీసం లక్షకోట్ల పెట్టుబడులు వెనక్కి పోయాయి. సుమారు 6 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. అలాగే చెన్నై, బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ కింద 12,944 ఎకరాల్లో కృష్ణపట్నం నోడ్‌కు, బెంగుళూరు – హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ కింద 9,350 ఎకరాల్లో ఓర్వకల్లు నోడ్‌కు, 3 వేల ఎకరాల్లో హిందూపూర్ నోడ్, 3 వేల ఎకరాల్లో అనంతపురం నోడ్‌లకు అనుమతులు ఇచ్చినా రాష్ట్రప్రభుత్వంలో చలనం లేదు. వీటిని సకాలంలో పూర్తిచేసి ఉంటే ఉత్తరాంధ్ర, రాయలసీమలలో పారిశ్రామికాభివృద్ధి జరిగి యువతకు ఉపాధి లభించేది.

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికిగాను కేంద్రప్రభుత్వం పలు పథకాల ద్వారా చేయూతనిచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ కింద 2019–22 మధ్య రూ.3412 కోట్లు ఖర్చు చేసింది. కొత్తగా ఏడు ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి, మూడు ఆస్పత్రుల పునర్నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. జాతీయ అర్బన్ మిషన్ కింద, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో దాదాపు 6వేల పోస్టులు భర్తీ చేసింది. ఈ మిషన్ కింద 110 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద అనంతపురం వైద్యకళాశాల అభివృద్ధికి రూ.240 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్యకళాశాలలకు, మూడు నర్సింగ్ కళాశాలలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో 6830 గ్రామాలు బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా మారాయి. 7489 గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థ ఏర్పాటైంది. జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటివరకు 35.88 లక్షల గ్రామీణగృహాలకు మంచి నీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. కేంద్ర సహకారం ఎంతగా ఉన్నా వైసీపీప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ముఖ్యంగా పంచాయతీలను నిర్వీర్యం చేసింది. వాటి అభివృద్ధికి నిధుల కేటాయింపును అటుంచి కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులనూ దారి మళ్లించింది. అయిదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వభవనాలకు పార్టీ పతాకపు రంగులు వేయించారు. దానికీ పంచాయతీ రాజ్ శాఖనే వాడుకున్నారు. ఆ పంజాయతీరాజ్ శాఖ నుంచే ప్రచార బుక్‌లెట్ల కోసం రూ.40 కోట్ల నిధులు మళ్లించారు. పంచాయతీ పాలనకు సమాంతరంగా జగన్ ప్రభుత్వం వాలంటరీ, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటుచేసి స్థానికసంస్థలకు ప్రాధాన్యం లేకుండా చేసింది. ప్రజలు నేరుగా ఎన్నుకున్న సర్పంచ్‌కు కనీస గౌరవం లేకుండా పోయింది. ఆర్థికసంఘం నిధులను దారి మళ్లించడంతో కనీస సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదు. కొందరు సర్పంచులు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేసినా బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. నిధుల కోసం పోరాడుతున్న సర్పంచ్‌లు రాష్ట్రపతిని కలసి వైసీపీసర్కారు తీరుపై ఫిర్యాదు కూడా చేశారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వని విధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలోని పట్టణ ప్రాంత పేదలకు 21,32,343, గ్రామీణప్రాంత పేదలకు 2,48,682 ఇళ్లు మంజూరు చేసింది. పట్టణప్రాంతంలో గృహాల నిర్మాణం కోసం ఇప్పటివరకు రూ.18,645 కోట్లు అందజేసింది అయినా రాష్ట్రప్రభుత్వం వీటిలో పదోవంతు కూడా నిర్మించలేదు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను కూడా పేదలకు పంపిణీ చేయకుండా పాడుపెట్టేసింది. పైగా పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ పేరుతో నాలుగువేల కోట్ల మేరకు అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన బోధనాసుపత్రులు ఇంకా పునాదుల స్థాయిని దాటలేదు. ఎన్నికల సందర్భంగా ఈ వాస్తవాలన్నిటినీ రాష్ట్రప్రజలు దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలి.

■ వల్లూరు జయప్రకాశ్ నారాయణ
బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వైసీపీ అభ్యర్థి ర్యాలీలో చిన్నారులు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24: ఎన్నికల ర్యాలీలకు విద్యార్థులను తరలిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో వైసీపీ అభ్యర్థి తాడిపర్తి చంద్రశేఖర్ నామినేషన్ ర్యాలీ దృశ్యం ఇది. బుధవారం నిర్వహించిన ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో చిన్నారులను తరలించారు. వీరందరికీ వైసీపీ జెండాలు ఇచ్చి, వైసీపీ టీషర్టులు ధరింపజేసి ర్యాలీలో నడిపించారు. ఎర్రగొండపాలెం మండలం, అయ్యంబొట్లపల్లి, గోళ్లవీడపి, త్రిపురాంకతంలోని కొన్ని గ్రామాల నుంచి విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



అంబులెన్స్‌కూ దారివ్వలేదు

- వైసీపీ ర్యాలీలో 40 నిమిషాలు చిక్కుకుపోయిన వాహనం
- విజయనగరం జిల్లా రాజాం అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో దారుణం

రాజాం రూరల్, ఏప్రిల్ 24: ప్రాణాపాయంలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించే అంబులెన్స్.. వైసీపీ శ్రేణుల అత్యుత్సాహం కారణంగా సుమారు 40 నిమిషాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలో బుధవారం జరిగిందీ దారుణం. రాజాం వైసీపీ అభ్యర్థి డాక్టర్ రాజేశ్ బుధవారం నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతూ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేశారు. అక్కడికి భారీగా చేరుకున్న ఆ పార్టీ శ్రేణులతో రోడ్డంతా జనంతో నిండిపోయింది. ఉదయం 11.15 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న రాజేశ్.. పూజల అనంతరం 11.55 గంటలకు బయటకు వచ్చారు. ఆ సమయంలో బొబ్బిలి వైపు నుంచి శ్రీకాకుళం వైపు పేషెంట్‌తో వెళ్తున్న అంబులెన్స్ ఆ జనంలో చిక్కుకుపోయింది. డ్రైవర్ సైరన్ మోగించినా ఎవరూ దారివ్వలేదు. డ్రైవర్‌తోపాటు అంబులెన్స్‌లో ఉన్నవారు కూడా బతిమాలినా ఎవరూ పట్టించుకోలేదు. అంబులెన్స్‌కు దారివ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

విశాఖలో 50 ఎకరాలు
కబ్జాకు వైవీ యత్నం

- 'గీతం' సమీపంలోని మరో 50 ఎకరాలు కూడా...
- ఉద్యమ నేత మాదిగాని గురునాథం ఆరోపణ

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మూడు రాజధానుల పేరుతో ఉద్యమం చేసిన వారి పేరుతో వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి విశాఖలో 50ఎకరాలు కొట్టేయాలని చూశారని ఈ ఉద్యమంలో పాల్గొన్న దళిత నేత మాదిగాని గురునాథం ఆరోపించారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'బహుజనులను ముందుపెట్టి అమరావతిలో రోజూ దీక్షలు చేయించి వారి పేరుతో వైసీపీ నేతలు అనేక దందాలు చేశారు. ఆ పార్టీలోని పెద్దలు వీలైనంత దండుకొన్నారు. విశాఖ సమీపంలోని ఆనందపురం మండలంలో రాజన్న ఆటోనగర్ పేరుతో 150 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు తయారయ్యాయి. అమరావతిలో మూడు రాజధానుల పేరుతో వైసీపీకి అనుకూలంగా ఉద్యమం చేసిన వారికి ఇందులో ఒకో మనిషికి 40 సెంట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకొన్నారు. పైకి విశాఖలో ఉంటున్న వారి కోసం ఆటోనగర్ అని చెప్పారు. రాజన్న ఆటోనగర్ శంఖుస్థాపన కార్యక్రమాన్ని సీఎం పర్యటనలో పెట్టాలని ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి ఎండార్స్‌మెంట్ కూడా చేసి పంపారు. ఈ ప్రతిపాదనకు వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి అడ్డుపడ్డారు. ఈ 150 ఎకరాల్లో 50ఎకరాలు తనకు కావాలని కోరారు. అవికాకుండా విశాఖ నగరంలో గీతం వర్సిటీని ఆనుకొని ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా మా పేరుతో కాజేయాలని ప్రయత్నించారు. ఆ భూమి కోసం ఎకరానికి రూ.3కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఆ డబ్బు కూడా మా పేరుతో ప్రభుత్వానికి చెల్లించడానికి ఆయన సిద్ధపడ్డారు. మేం ఒప్పుకోకపోయేసరికి ఈ ప్రతిపాదన అమలుకాలేదు' అని గురునాథం చెప్పారు. విశాఖలో భూములు కొట్టేసే ప్రతిపాదనకు అంగీకారం తెలపడం లేదని మూడు రాజధానుల ఉద్యమ నేత ఒకరిని ఏకంగా తాడేపల్లిలోని సీఎం నివాసం వద్ద రౌడీలతో కొట్టించారని ఆరోపించారు. దీనిగురించి మాట్లాడటానికి మేం అందరం కలిసి ఒకసారి సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లాం. ఆ సమయంలో బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ మనుషులు వచ్చి గొడవ పెట్టుకొన్నారు. మేం సుబ్బారెడ్డి నివాసం నుంచి బయటకు రాగానే సురేశ్‌కు చెందిన రౌడీలు సరిగ్గా వైసీపీ వార్ రూం ముందు పెరికవర ప్రసాదరావు అనే ఉద్యమ నేతను ప్లాస్టిక్ పైపులతో తీవ్రంగా కొట్టారు. మేం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో దీనిపై ఫిర్యాదు కూడా చేశాం. ఈ విషయం తెలిసి జగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తే నందిగం మాకు క్షమాపణ చెప్పి కేసు తీసివేయించుకొన్నాడు. సీఎం ఇటీవల విశాఖ పర్యటనకు వెళ్లినప్పుడు ఆటోనగర్‌లో స్థలాలు వస్తాయని ఆశపడి, భంగపడిన వారు ఆయన బస్సు వెంట పరుగులు తీశారు. 8కిలోమీటర్లు వాళ్లు పరిగెత్తినా బస్సు ఆపలేదు. బస్సు ఆపవద్దని సుబ్బారెడ్డి చెప్పాడు. సమస్య చెబుదామని వాళ్లు పరిగెత్తితే సీఎంని చూడటానికి పరుగులు తీశారని జగన్ టీవీలో చెప్పారు. వాళ్లెవరూ సీఎంకు జిందాబాద్‌లు కొట్టలేదు' అని గురునాథం స్పష్టం చేశారు. రాష్ట్రం అంతా తిరిగి ఈ మోసాలు చెబుతామని, దీనికి జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తన ప్రాణం తీస్తామని బదిరిస్తున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు మరో ఉద్యమ నేత ఆబిద్ కూడా ఉన్నారు.

ఎన్ఆర్ఐలు గుంటనక్కలు కాదు

- సేవకు బ్రాండ్ అంబాసిడర్లు.. సోషల్ మీడియాలో అవమానిస్తారా?
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు... క్షమాపణలు చెప్పండి
- వైసీపీ నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- టీడీపీ ఎన్ఆర్ఐల ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న ఎన్ఆర్ఐలను వైసీపీ సోషల్ మీడియా ద్వారా కించపరుస్తారా? అంటూ టీడీపీ ఎన్ఆర్ఐలు మండిపడ్డారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఎన్ఆర్ఐలు సాయి, సతీశ్, నాగమల్లేశ్వరరావులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా సాయి మాట్లాడుతూ... 'గత రెండు రోజులుగా వైసీపీ నేతలు ఎన్ఆర్ఐలను అవమానాలకు గురిచేస్తున్నారు. గుంటనక్కల్లా గ్రామాల్లోకి వచ్చారని వైసీపీ నేతలు ఎన్ఆర్ఐలను అవమానించడం దిగజారుడుతనానికి నిదర్శనం. సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్ఆర్ఐల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం. ఎన్ఆర్ఐలు సేవా కార్యక్రమాలు విరివిగా చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేసిన సేవా పనుల కంటే ఎన్ఆర్ఐలు చేసిన సేవా కార్యక్రమాలు ఐదు రెట్లు ఉన్నాయి. మాతృభూమికి సేవ చేయాలని ప్రతి ఎన్ఆర్ఐకి ఉంటుంది. కష్టాలు పడుతున్న వారిని ఆదుకోవడానికి ఎన్ఆర్ఐలు ముందుంటారు. వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. వెంటనే ఎన్ఆర్ఐ కమిటీకి క్షమాపణ చెప్పాలి. రాష్ట్రంలో పరిశ్రమలను పెట్టడానికి వైసీపీ అడ్డుపడుతోంది. వైసీపీ చేసే ఇలాంటి కామెంట్లతో ఎన్ఆర్ఐలు వెనక్కి తగ్గే ప్రమాదముంది' అని అన్నారు. సతీశ్ మాట్లాడుతూ, 'ఎన్ఆర్ఐలు గుంటనక్కలు కాదు. దేశ సేవకులు. మేమంతా రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాం. ఎన్ఆర్ఐలు ఒక కులానికి, ఒక మతానికి సంబంధించిన వారు కాదు. వివిధ పార్టీలకు ఎన్ఆర్ఐలు సానుభూతిపరులు ఉంటారు. మనోభావాలు దెబ్బతిన్నందున మీడియా ముందుకు వచ్చి మాట్లాడాల్సి వచ్చింది. వైసీపీ నేతలు కనీసం వైసీపీ ఎన్ఆర్ఐలకైనా గౌరవమివ్వాలి. టీడీపీ ఎన్ఆర్ఐలను కించపరిచి మాట్లాడటాన్ని వైసీపీ ఎన్ఆర్ఐలు ఖండించాలి' అని అన్నారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ... 'జగన్ పత్రికలో ఎన్ఆర్ఐలను గుంటనక్కలనడం భావ్యం కాదు. వైసీపీ నాయకులు వారి భాషను మార్చుకోవాలి. ఎన్ఆర్ఐలను గుంటనక్కల మంద అనడం బాలేదు. రాష్ట్ర ప్రజలు బాగుండాలని తపనపడ్డాం. వైసీపీ నాయకులకు ధైర్యముంటే గ్రామాల్లోకి వస్తే ఎవరు గుంటనక్కలో తేల్చుకుందాం' అని సవాల్ విసిరారు.

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు నియామకం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి సంబంధించి పలువురు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఎన్నికల కో ఆర్డినేటర్లను నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడుగా కలమట వెంకటరమణ, అనంతపురం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులుగా గొంది వెంకటశివుడు యాదవ్‌ను నియమించారు. అదే విధంగా పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పడాల భూదేవిని, విశాఖ సౌత్‌జోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సీతంరాజు సుధాకర్‌ను, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గండి బాబ్జిని నియమించారు. ఎన్నికల కో ఆర్డినేటర్లుగా సానా సతీష్(ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా), డాక్టర్ దోనేపూడి పవన్(ఉమ్మడి కృష్ణా జిల్లా), బాచిన చెంచుగరటయ్య (బాపట్ల పార్లమెంట్), కొండపల్లి అప్పలనాయుడు (విజయనగరం పార్లమెంట్), జంగా కృష్ణమూర్తి (నరసారావుపేట పార్లమెంట్), తోట నవీన్ (కాకినాడ పార్లమెంట్), తమ్మిశెట్టి జానకీదేవి (గుంటూరు పార్లమెంట్), ఎస్‌వీఎస్ అప్పలరాజు (జగ్గంపేట నియోజకవర్గం), వీఎస్ఎన్ రాజు (సూరిబాబురాజు) (పెద్దాపురం నియోజకవర్గం), వి.సూర్యనారాయణ (ప్రత్తిపాడు నియోజకవర్గం), నులుకుర్తి వెంకటేశ్వరరావు (కాకినాడ రూరల్ నియోజకవర్గం), సుర్ల లోవరాజు (తుని నియోజకవర్గం), కె.వి.వి.సత్యనారాయణ (విజయబాబు)(జగ్గయ్యపేట నియోజకవర్గం), జంపాల సీతారామయ్య (నందిగామ నియోజకవర్గం), గన్నే వెంకటనారాయణ ప్రసాద్ (పెనమలూరు నియోజకవర్గం), గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్(పామర్రు నియోజకవర్గం), మహమ్మద్ నజీర్ (విశాఖ నార్త్ నియోజకవర్గం), బొప్పన భవ కుమార్ (విజయవాడ తూర్పు నియోజకవర్గం), చెన్నుపాటి శ్రీనివాస్(విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం), కోనేరు శ్రీధర్ (విజయవాడ పశ్చిమ నియోజకవర్గం)లను నియమిస్తూ వేరొక ప్రకటన విడుదల చేశారు.

ఎంవీవీ ఆస్తులు 421 కోట్లు

- విశాఖ తూర్పు అభ్యర్థిగా సత్యనారాయణ
- సీఎం రమేశ్ ఆస్తులు రూ.395 కోట్లు
- అప్పులు రూ.101 కోట్లు.. కేసులు ఏడు
- జనసేన అభ్యర్థి శ్రీనివాస్ ఆస్తి 16 కోట్లు
- మంత్రి ధర్మానపై 3 సీబీఐ కేసులు
- వైసీపీ అభ్యర్థిపై ఇసుక దొంగతనం కేసు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ ఆస్తుల విలువ రూ.421.30 కోట్లుగా ఉంది. ఈ మేరకు ఆయన అఫిడవిట్‌లో వివరించారు. ఎంవీవీ దంపతులకు చరాస్తులు రూ.340.44 కోట్లు ఉన్నట్టు తెలిపారు. తన వద్ద బంగారు ఆభరణాలు లేవని, తన భార్యపేరుతో 1.2 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నట్టు వివరించారు. ఆదేవిధంగా ఇరువురి పేరిట రూ.80.86 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. తనకు రూ.18.72 కోట్లు, తన భార్య పేరుతో రూ.6.6 కోట్ల అప్పు ఉందని, తనపై ఒక కేసు ఉందని ఎంవీవీ వివరించారు.

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఆయన భార్య శ్రీదేవిలకు రూ.395.98 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల సంఘానికి బుధవారం సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు వెల్లడించారు. సీఎం రమేశ్ పేరిట ఉన్న స్థిరాస్తి విలువ రూ.252.66 కోట్లు కాగా, చరాస్తి విలువ రూ.39.39 కోట్లుగా ఉంది. రూ.71.71 కోట్లు అప్పు ఉండగా, నికర ఆస్తి రూ.220.33 కోట్లుగా పేర్కొన్నారు. తన భార్య శ్రీదేవి పేరిట స్థిర, చరాస్తులు రూ.205.54 కోట్లు ఉన్నాయని, అప్పు రూ.29.89 కోట్లు పోగా నికర ఆస్తి రూ.175.64 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. సీఎం రమేశ్ పేరిట రెండు వాహనాలు ఉన్నాయి. ఏడు కేసులు ఉన్నాయి.
- కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు స్థిర, చరాస్తులు కలిపి రూ.16.62 కోట్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య బకుల్ పేరిట రూ.11.39 కోట్లు ఉన్నాయన్నారు. 'దేశీ టీ టైమ్ లిమిటెడ్' ద్వారా 25 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. తనపైన కేసులు లేవని వెల్లడించారు.
- శ్రీకాకుళం అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మాన ప్రసాదరావుపై మూడు సీబీఐ కేసులు సహా 3 కోడ్ ఉల్లంఘన కేసులు ఉన్నాయి. మంత్రిగా ఉన్న ధర్మాన చదివింది ఇంటర్మీడియట్ మాత్రమే. ఈ మేరకు ఆయన తన అఫిడవిట్‌లో వివరించారు. ఆస్తుల విషయానికి వస్తే.. ధర్మాన వద్ద ప్రస్తుతం రూ.18.40 లక్షలు, సతీమణి గజలక్ష్మి వద్ద రూ.4.70 లక్షలు ఉన్నాయి. అలాగే 20.68 ఎకరాల వ్యవసాయ భూమి ధర్మాన పేరుతో ఉంది. తెలంగాణలో భర్త, భార్యల పేరిట ప్లాట్లు ఉన్నాయి. మొత్తం చరాస్తి ధర్మాన పేరిట రూ. 6.06 కోట్లు, భార్య పేరిట రూ. 5.87 కోట్లు, స్థిరాస్తులు ధర్మాన పేరిట రూ. 9.58 కోట్లు, భార్య పేరిట రూ.3.43 కోట్లు ఉన్నాయి.
- అనంతపురం జిల్లా శింగనమల వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై 2021లో చీటింగ్ కేసు నమోదైంది. ఆయనపై ఐపీసీ 420, 406, రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదైందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బుక్కరాయసముద్రం వద్ద ఉన్న ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ నుంచి వీరాంజనేయులు అనుమతి లేకుండా ఇసుకను టిప్పర్‌లో తరలించారు. దీనిపై జిల్లా మైన్స్ అధికారి ఏడీ కొండారెడ్డి ఫిర్యాదు మేరకు ఇసుక దొంగ తనం కేసు నమోదు చేశారు.


ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్లలో జయనాగేశ్వరరెడ్డి

ప్రత్యర్థి కోటలోకి టీడీపీ అభ్యర్థి!

- 40 ఏళ్లలో తొలిసారి అడుగు
- ఎమ్మిగనూరులోని కడిమెట్లలో జయనాగేశ్వరరెడ్డికి ఘన స్వాగతం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 24: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్ల. ఈ పంచాయతీలో సిరాలదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల, రాళ్లదొడ్డి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలపై చెన్నకేశవరెడ్డిదే ఆధిపత్యం. ఆయన చెప్పిందే వేదం. ఆయన చేసిందే చట్టం అన్నట్టుగా ఇక్కడ చలామణీ అవుతుంది. ఏ పార్టీకి ఓటు వేయమన్నా ఆ పార్టీకి ఇక్కడివారు ఓట్లు వేస్తారు. అంతేగాక ఈ గ్రామాల్లో దాదాపు 40 ఏళ్లగా ఇప్పటి వరకు ప్రత్యర్థి పార్టీల నేతలు అడుగు పెట్టిన దాఖలాలు లేవు. అయితే, తాజాగా ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కడిమెట్లలోకి బుధవారం అడుగుపెట్టారు. స్థానికుల నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. తొలుత గ్రామంలోని చెన్నకేశవస్వామిని, మారెమ్మవ్వను దర్శించుకున్నారు. దారి పొడవున గ్రామస్థులను పలుకరిస్తూ బీవీ ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని చెప్పారు.


మాడుగులలో ఆర్‌వోకు నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న బూడి రవి

మొదటి భార్య కొడుకు వర్సెస్ రెండో భార్య కూతురు!

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడికి ఇంటిపోరు
- 'మాడుగుల' ఇండిపెండెంట్‌గా రవి
- వైసీపీ తరఫున అనూరాధ పోటీ



మాడుగుల, ఏప్రిల్ 24: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పెళ్లాల పేరిట విమర్శించే వైసీపీ అధినేత జగన్‌కు భారీ షాక్ తగిలింది. సొంత పార్టీ కీలక నాయకుడు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడి ఇద్దరు భార్యల పిల్లలు ఇప్పుడు ఎన్నికల్లో పోటీకి దిగారు. అది కూడా ఒకే నియోజకవర్గం మాడుగల నుంచే కావడం విశేషం. బూడి మొదటి భార్య కుమారుడు రవి, రెండో భార్య కుమార్తె అనూరాధ ఇక్కడ ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో ముత్యాల నాయుడు అనకాపల్లి నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. దీంతో 2019లో తాను గెలిచిన మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయన.. తన రెండో భార్య కుమార్తె అనూరాధకు టికెట్ ఇప్పించుకున్నారు. ప్రస్తుతం కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న అనూరాధ నామినేషన్ కూడా వేశారు. ఇంతలో తెరమీదకు వచ్చిన మొదటి భార్య కుమారుడు రవి ముత్యాలనాయుడి వారసుడినైన తనకు టికెట్ ఇవ్వకుండా అనూరాధకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తూ.. బుధవారం మాడుగులలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం, రవి మాట్లాడుతూ.. గతంలో తాను జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని పరిస్థితుల కారణంగా దూరంగా ఉన్నానన్నారు. ఇప్పుడు సమయం వచ్చిందని, అందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. నాయకులు పథకాల ఆశ చూపుతారని, ఓటర్లు మోసపోవద్దని ఆయన సూచించారు. తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు ఏం కావాలో అది చేసి తన సత్తా ఏమిటో చూపిస్తానని స్పష్టం చేశారు.

ఉక్కు.. పోర్టు వివాదం కోర్టుకు

- హైకోర్టులో కేసు వేసిన విశాఖ స్టీల్ అధికారులు
- నేడు ప్రభుత్వ ప్లీడర్ హాజరు కావాలన్న ధర్మాసనం
- లేదంటే కలెక్టర్‌కు సమన్లు జారీచేస్తామని హెచ్చరిక
- 'ఫోర్స్ మెజ్యూర్' అంటూ అదానీ పోర్టు అడ్డగోలు వాదన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు, అదానీ గంగవరం పోర్టుల మధ్య ఏర్పడిన వివాదం హైకోర్టుకు చేరింది. విశాఖ స్టీల్ అధికారుల సంఘం కేసు వేయగా కోర్టు విచారణకు స్వీకరించింది. అదానీ పోర్టు యాజమాన్యం, జిల్లా కలెక్టర్, విశాఖ సిటీ పోలీస్ కమిషనర్లను ప్రతివాదులుగా పేర్కొంటూ దాఖలైన కేసు బుధవారం విచారణకు వచ్చింది. అదానీ పోర్టు తరఫున లాయర్లు హాజరు కాగా, ఏపీ ప్రభుత్వం తరఫున జూనియర్ లాయర్లు వెళ్లారు. దీనిపై న్యాయమూర్తి అభ్యంతరం తెలుపుతూ ప్రభుత్వ ప్లీడర్ గురువారం హాజరై వాదనలు వినిపించాలని, లేదంటే స్టీల్‌ప్లాంటుకు అనుకూలంగా కలెక్టర్‌కు సమన్లు జారీ చేస్తామని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో తెలిసిపోతుందని స్టీల్‌ప్లాంటు వర్గాలు ఎదురుచూస్తున్నాయి.


బోసిపోయిన అదానీ గంగవరం పోర్టు బెర్తులు

రెండు వారాలుగా నిలిచిన సరఫరా

అదానీ పోర్టులో కార్గో హ్యాండ్లింగ్ చేసే నిర్వాసిత కార్మికులు రెండు వారాల క్రితం ఆకస్మికంగా మెరుపు సమ్మెకు దిగారు. దీనివల్ల పోర్టులో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. సరకు రవాణా స్తంభించింది. ముఖ్యంగా స్టీల్‌ప్లాంటుకు ప్రతిరోజూ పంపాల్సిన ముడి ఇనుము, కోకింగ్ కోల్, లైమ్ స్టోన్ ఆగిపోయాయి. ముడి పదార్థాలు అందక స్టీల్ ప్లాంటులో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. మెరుపు సమ్మెకు దిగిన నిర్వాసిత కార్మికులతో కలెక్టర్ మల్లికార్జున మొదటి రెండు రోజులు చర్చించారు. పోర్టు ప్రతినిధులను కూడా పిలిపించి మాట్లాడారు. గత సమావేశంలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని వారిని ప్రశ్నించారు. ఆ తీర్మానంపై తాము సంతకం చేయలేదని, అందువల్ల వాటిని అమలు చేయాల్సిన బాధ్యత లేదని నిర్లక్ష్య ధోరణితో సమాధానం ఇచ్చినట్టు సమాచారం. దానిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేసి తానూ ఏమీ చేయలేనని మౌనం దాల్చారు. సమ్మె శాంతి భద్రతల సమస్యకు దారితీయడంతో సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ కార్మికులతో చర్చలు జరిపారు. మనిషికి రూ.50 లక్షలిస్తే అంతా వీఆర్ఎస్ తీసుకొని వెళ్లిపోతామని చెప్పారు. దానిపై ఇరువర్గాల మధ్య వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయి.

ఫోర్స్ మెజ్యూర్ అంటూ నాటకం

ఎటువంటి పరిస్థితులు ఎదురైనా నిరంతరం ముడి పదార్థాలు సరఫరా చేస్తామని ఎంఓయూ చేసుకున్న అదానీ యాజమాన్యం కార్మికుల సమ్మెను 'ఫోర్స్ మెజ్యూర్'గా పేర్కొంటూ తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేమని చేతులెత్తేసింది. ఊహించని విధంగా ఏర్పడే తుఫాన్, భూకంపం వంటి విపత్తులను ఫోర్స్ మెజ్యూర్‌గా పరిగణిస్తారు. కార్మికులకు హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చకుండా మోసం చేసి, దాని ఫలితంగా వారు సమ్మె చేస్తే దాన్ని ఈ విధంగా 'ఫోర్స్ మెజ్యూర్'గా పరిగణించారు. అదానీ యాజమాన్యం ఇదే మాటను పదేపదే చెబుతూ స్టీల్‌ప్లాంటుకు 14 రోజులుగా ముడి పదార్థాలు సరఫరా చేయకుండా నిలిపివేసింది. దీని కారణంగా ప్లాంటు సంక్షోభంలో చిక్కుకుంది. మార్చి నెల జీతాలు కూడా ఉద్యోగులకు చెల్లించలేదు. దీంతో కదుపుమండిన స్టీల్ ప్లాంటు అధికారుల సంఘం అదానీ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిదంటూ కోర్టును ఆశ్రయించింది.



రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లు

ఏపీ పేపరు మిల్లు ఆకస్మిక లాకౌట్

- నోటీసు బోర్డులో ప్రకటించిన యాజమాన్యం
- అగమ్యగోచరంగా 2800 మంది కార్మికుల భవితవ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24: లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తున్న రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కంపెనీ పరిశ్రమ నిర్వాహకులు ఆకస్మికంగా లాకౌట్ ప్రకటించారు. దీనిపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఈ పేపరు మిల్లుకు 60 ఏళ్ల చరిత్ర ఉంది. ఇందులో కార్మికులుగా, ఉద్యోగులుగా పనిచేసి జీవనోపాధి పొందిన వాళ్లు అప్పటి నుంచి ఇప్పటికి లక్షల్లో ఉంటారు. ప్రస్తుతం ఈ మిల్లులో 2,800 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అగ్రిమెంట్ చేసి మూడేళ్లు పూర్తయ్యింది. నిబంధనల ప్రకారం మళ్లీ అగ్రిమెంట్ పునరుద్ధరించాలి. దానికోసం కార్మికులు ఆరు నెలల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మిల్లు యాజమాన్యం మాత్రం న్యాయస్థానానికి వెళ్లి యూనియన్లకు గుర్తింపులేదని తేల్చే ప్రయత్నం చేసింది. మరోవైపు.. ఇప్పటికే జరగాల్సిన వేతన సవరణ కోసం 20 రోజుల క్రితం 11 యూనియన్ల కార్మికులు జేఏసీగా ఏర్పడి సమ్మెకు దిగారు. లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆఖరికి బస్సు యాత్ర చేసిన సీఎం జగన్‌కు కూడా సమస్యను విన్నవించారు. కానీ ఎవరూ న్యాయం చేయలేదు. మరో పక్క మిల్లు యాజమాన్యం మూడురోజులుగా కార్మికుల డిమాండ్లను పట్టించుకోకుండా పనిలోకి రావాలని వారిపై ఒత్తిడి తెచ్చింది. కానీ సమస్యలు పరిష్కరించే వరకు విధులకు హాజరుకాబోమని కార్మికులు స్పష్టం చేయడంతో బుధవారం రాత్రి యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. లాకౌట్ నోటీసును మిల్లు గేటు వద్ద నోటీస్ బోర్డులో పెట్టింది. తమ హక్కులను కాలరాస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మికులు తీవ్రంగా ఖండిస్తున్నారు. విషయం తెలుసుకున్న పార్టీల నాయకులు, అభ్యర్థులు మిల్లు వద్దకు చేరుకుని కార్మికులకు అండగా ఉంటామని మద్దతు ప్రకటిస్తున్నారు.

పిటిషనర్లకు రక్షణ కల్పించండి

- పల్నాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఎం.యేసుదానం మరో 49 మంది, అలాగే జంగమేశ్వరపాడుకు చెందిన గుమ్మ పెదరాజయ్య మరో 24మంది హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలపై వైసీపీ నాయకులు దాడి చేసి గ్రామాల నుంచి వెళ్లగొట్టారన్నారు. ప్రాణభయంతో పిటిషనర్లు ఇతర గ్రామాలకు వెళ్లి తలదాచుకున్నారన్నారు. సొంతగ్రామాలకు వెళ్లి సాధారణ జీవనం సాగించేందుకు రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ...పిటిషనర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లి సాధారణ జీవితం గడిపేందుకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. వ్యాజ్యాలను పరిష్కరించారు.

చాలా సర్వీసు ఉంది జాగ్రత్త


- వైపాలెం ఆర్వో కార్యాలయంలో రెచ్చిపోయిన చెవిరెడ్డి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24: ఎర్రగొండపాలెం వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్ సందర్భంగా ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెచ్చిపోయారు. రిటర్నింగ్ అధికారి, ఏఎస్పీ ఎదుటే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. చాలా సర్వీసు ఉంది.. జరభద్రం అంటూ వైపాలెం తహసీల్దార్ సోముల నాయక్‌పై విరుచుకుపడ్డారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే ఓటు వేయించే విషయంలో తమ పార్టీకి అనుకూలంగా పనిచేయడం లేదని అందరి ముందే ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ముందే అలా చెవిరెడ్డి హెచ్చరికలకు దిగడంతో సదరు అధికారి ఖంగుతిన్నారు. కాగా ఎర్రగొండపాలెంలో అసెంబ్లీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్ వేసే సందర్భంలోనూ చెవిరెడ్డి నిబంధనలు పాటించలేదు. కార్యాలయంలోని ప్రవేశించే సమయంలో రిజిస్టర్‌లో సంతకం చేయలేదు. సెల్‌ఫోన్‌తోనే లోపలికి వెళ్లారు. అయినా పోలీసులు ఆయనను అడ్డుకోలేదు.

మాజీ సీఎం కిరణ్ నామినేషన్

- రాజంపేట బీజేపీ అభ్యర్థిగా బరిలోకి.. సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


నామినేషన్ వేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి

రాజంపేట లోక్‌సభకు కూటమి అభ్యర్థిగా బీజేపీ నేత, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. రాయచోటిలో జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్‌కు 3 సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి సుగవాసి బాలసుబ్రమణ్యం, పీలేరుకు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె నుంచి జయచంద్రారెడ్డి, రైల్వేకోడూరు నుంచి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, నామినేషన్లు దాఖలు చేశారు. జమ్మలమడుగులో బీజేపీ తరఫున ఆదినారాయణరెడ్డి, పులివెందులలో టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి, కడపలో టీడీపీ అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డి, వైసీపీ నుంచి అంజద్‌బాషా నామినేషన్లు వేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరిలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరులో మేకపాటి విక్రమ్‌రెడ్డిలు నామినేషన్లు వేశారు. కాగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.11 కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సోమిరెడ్డిపై మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి కుటుంబ ఆస్తుల విలువ రూ.123 కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈయనపై ఐదు కేసులు ఉన్నాయి. వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-5గా ఉన్న అవినాశ్ రెడ్డి సన్నిహితుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కడప పార్లమెంటు స్థానానికి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఆయన తరఫున విద్యానందరెడ్డి నామినేషన్ వేశారు.

బదిలీ వేటు... ఏకపక్ష అధికారులకు హెచ్చరిక

- ఓటు కోసం మైనార్టీలను వాడుకుంటున్న తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు: యామినీ శర్మ

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 'అధికారులు ప్రభుత్వ సేవకులుగా ఉండాలి. రాజకీయ పార్టీలకు కొమ్ము కాస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం' అని బీజేపీ అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ అన్నారు. అధికార వైసీపీకి కొమ్ము కాసిన ఐపీఎస్‌లపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయడం ఏకపక్ష అధికారులకు హెచ్చరిక లాంటిదన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'ఓటు బ్యాంకు కోసమే తల్లి, పిల్ల కాంగ్రెస్‌లు మైనార్టీలను వాడుకొంటున్నాయి. బీజేపీని మతతత్వ పార్టీ అంటోన్న వ్యక్తులు గత పదేళ్లలో జన్‌ధన్ అకౌంట్లలో కానీ, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లలో కానీ ముస్లిం మహిళలకు ఇవ్వలేదని చెప్పగలరా? ట్రిపుల్ తలాక్ రద్దు వల్ల తమకు ఎంతో మేలు జరిగిందని ముస్లిం మహిళలు నరేంద్ర మోదీని ఆశీర్వదిస్తుంటే కొన్ని రాజకీయ పార్టీలు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉంది. ఒకర్ని దోచి ఇంకొకరికి పెడతాం... మీపై అప్పులు రుద్ది ఇంకొకర్ని ఓటు బ్యాంకుగా చేసుకుంటాం... అనే పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. డబులింజన్ సర్కార్‌తోనే దేశ, రాష్ట్ర ప్రగతి సాధ్యం. ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలి' అని యామినీ శర్మ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X బెంగళూరు

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
379 (8 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)




టీ20 వరల్డ్‌కప్ అంబాసిడర్
బోల్ట్



దుబాయ్: టీ20 వరల్డ్ కప్‌నకు స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం ప్రకటించింది. జూన్ ఒకటి నుంచి జరిగే పొట్టి కప్‌ను అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బోల్ట్‌కున్న క్రేజ్.. టోర్నీ పాపులారిటీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్టు ఐసీసీ తెలిపింది. ఉసేన్‌కు కూడా క్రికెట్ అంటే ప్రత్యేకమైన అభిమానం. వెస్టిండీస్ ఆటగాళ్లతో అతడికి మంచి సంబంధాలున్నాయి. వ్యక్తిగతంగా ఎంతో సరదాగా ఉండే బోల్ట్.. మరి ప్రచారకర్తగా అభిమానుల్లో ఎంతటి జోష్ నింపుతాడో చూడాలి.

సెహ్వాగ్ లెవెన్‌లో..
పాండ్యాకు దక్కని చోటు!



న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తన టీ20 వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాడు. అయితే, ఇందులో హార్దిక్ పాండ్యాకు చోటు దక్కక పోవడం ఆశ్చర్యం కలిగించింది. ఐపీఎల్ కామెంట్రీ సందర్భంగా.. సెహ్వాగ్ అయితే ఎవరికి జట్టులో చోటు కల్పిస్తాడని సహచర వ్యాఖ్యాతలు గిల్ క్రిస్ట్, మైకేల్ వాన్ అడిగారు. దీంతో 'జైస్వాల్, రోహిత్, కోహ్లి, సూర్యకుమార్, పంత్, రింకూ లేదా దూబే, బుమ్రా, సిరాజ్, సందీప్ శర్మ, కుల్దీప్ యాదవ్, జడేజా' అంటూ తన జట్టును చెప్పుకొచ్చాడు. వీరిలో పాండ్యా లేకపోవడంతో వారు అవాక్కయ్యారు. అయితే, హాస్య చతురత కలిగిన సెహ్వాగ్.. 15 మందిలో పాండ్యా ఉంటాడని నవ్వులు పూయించాడు.

పంత్ పటాకా

4 పరుగులతో ఢిల్లీ విజయం
రిషభ్, అక్షర్ అర్ధసెంచరీలు
పోరాడి ఓడిన గుజరాత్



పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్)

1 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులిచ్చిన (0/73) బౌలర్‌గా మోహిత్ శర్మ

2 చివరి ఐదు ఓవర్లలో ఎక్కువ పరుగులు (97) సాధించిన రెండో జట్టుగా ఢిల్లీ. బెంగళూరు (112) ముందుంది.

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ప్రతీ మ్యాచ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగుతూ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. 225 పరుగుల భారీ ఛేదనలోనూ గుజరాత్ టైటాన్స్ పట్టు వదలకుండా పోరాడి.. ఆఖరి బంతి వరకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వణుకు పుట్టించింది. కానీ సిక్సర్ బాదితేనే విజయం దక్కే పరిస్థితిలో టైటాన్స్ తడబడడంతో ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగు పరుగుల తేడాతో ఊపిరిపీల్చుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రిషబ్ పంత్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 88 నాటౌట్) విధ్వంసంతో ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 66), స్టబ్స్ (7 బంతుల్లో 26 నాటౌట్) వేగంగా ఆడారు. సందీప్ వారియర్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసి ఓడింది. సుదర్శన్ (23 బంతుల్లో 65), మిల్లర్ (23 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) అర్ధసెంచరీలు చేయగా.. రషీద్ (21 నాటౌట్) ఆఖర్లో పోరాడాడు. రసిక్ సలామ్‌కు 3, కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పంత్ నిలిచాడు.

పోరాటం సరిపోలేదు..: భారీ ఛేదనలో గుజరాత్ అసమాన పోరాటాన్ని ప్రదర్శించింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గిల్ (6) వెనుదిరిగినా.. సాహా, సుదర్శన్, మిల్లర్, రషీద్‌ల బ్యాటింగ్ తీరుతో మ్యాచ్ ఇరువైపులా దోబూచులాడింది. కానీ చివర్లో అదృష్టం ఢిల్లీనే వరించింది. వన్‌డౌన్ బ్యాటర్ సాయిసుదర్శన్, ఓపెనర్ సాహా ఆరంభంలో వేగంగా ఆడేస్తూ 49 బంతుల్లోనే రెండో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో జట్టు 67/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. పదో ఓవర్‌లో సాహాను కుల్దీప్ అవుట్ చేయగా.. 29 బంతుల్లోనే సుదర్శన్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఈ దశలో స్వల్ప వ్యవధిలోనే టైటాన్స్ వికెట్లను కోల్పోయింది. ఒమర్జాయ్ (1)ను అక్షర్ అవుట్ చేయగా.. పేసర్ రసిక్ వరుస ఓవర్లలో సుదర్శన్, షారుక్ (8)లను అవుట్‌చేసి షాకిచ్చాడు. దీనికి తోడు 16వ ఓవర్‌లో హిట్టర్ తెవాటియా (4)ను కుల్దీప్ పెవిలియన్‌కు చేర్చడంతో 152/6తో గుజరాత్ ఓటమి దిశగా పయనించింది. కానీ ఓవైపు క్రీజులో మిల్లర్ ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. దీనికి తగ్గట్టుగానే అతడు నోకియా (17వ) ఓవర్‌లో 4,6,6,6తో 24 రన్స్ రాబట్టడంతో ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అలాగే 21 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. ఈ స్థితిలో పేసర్ ముకేశ్ జట్టుకు రిలీఫ్‌నిస్తూ మిల్లర్‌ను సాగనంపాడు. చివరి 12 బంతుల్లో 37 పరుగులు రావాల్సి ఉండడంతో సాయికిశోర్ (13) రెండు సిక్సర్లతో వణికించినా.. రసిక్ అతడిని బౌల్డ్ చేశాడు. సమీకరణం ఆరు బంతుల్లో 19 రన్స్‌కి మారడంతో రషీద్ 4,4,6తో గుబులు రేపాడు. అయినా ఆఖరి బంతికి సిక్సర్ రాకపోవడంతో ఢిల్లీ సంబరాల్లో మునిగిపోయింది.

పంత్-పటేల్ శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పవర్‌ప్లేలోనే ఫ్రేజర్ (23), పృథ్వీ షా (11), హోప్ (5)ల వికెట్లను కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన అక్షర్ పటేల్ దుమ్మురేపారు. అలాగే డెత్ ఓవర్లలో పంత్ ధాటికి టైటాన్స్ బౌలర్లు పూర్తిగా గతి తప్పారు. వార్నర్‌ను బెంచీకే పరిమితం చేయడంతో షాకు జతగా ఫ్రేజర్ ఓపెనర్‌గా వచ్చాడు. స్కోరు 3 ఓవర్లలోనే 34కి చేరింది. కానీ పేసర్ సందీప్ వారియర్ గట్టి షాక్‌నిస్తూ నాలుగో ఓవర్‌లో ఫ్రేజర్, షాలను అవుట్ చేసి, తన తర్వాతి ఓవర్‌లోనే హోప్‌ను సైతం వెనక్కి పంపాడు. అయితే టైటాన్స్ సంతోషాన్ని ఆవిరి చేస్తూ పంత్-పటేల్ జోడీ మరో 11 ఓవర్లపాటు నిలకడగా క్రీజులో నిలిచింది. 12వ ఓవర్‌లోనే స్కోరు వంద దాటింది. 16వ ఓవర్‌లో పంత్ రెండు సిక్సర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో అక్షర్ సైతం రెండు వరుస సిక్సర్లతో విరుచుకుపడినా స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు చిక్కాడు. దీంతో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. పంత్ 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన సమయంలో డీసీ స్కోరు 180 ఖాయంలా కనిపించింది. కానీ 19వ ఓవర్ స్పిన్నర్ సాయికిశోర్‌కు ఇవ్వడంతో స్టబ్స్ చెలరేగి 22 పరుగులు రాబట్టాడు. ఇక ఆఖరి ఓవర్‌లోనైతే పంత్ వీరంగం సృష్టిస్తూ.. 6,4,6,6,6తో ఏకంగా 31 పరుగులు రాబట్టడంతో ఢిల్లీ స్కోరు అవలీలగా 220 దాటేసింది. దీంతో టైటాన్స్ చివరి 12 బంతుల్లోనే 53 పరుగులిచ్చుకున్నట్టయ్యింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) నూర్ (బి) వారియర్ 11, ఫ్రేజర్ (సి) నూర్ (బి) వారియర్ 23, అక్షర్ (సి) కిషోర్ (బి) నూర్ 66, హోప్ (సి) రషీద్ (బి) వారియర్ 5, పంత్ (నాటౌట్) 88, స్టబ్స్ (నాటౌట్) 26, ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం: 20 ఓవర్లలో 224/4; వికెట్లపతనం** : 1-35, 2-36, 3-44, 4-157; **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-33-0, సందీప్ వారియర్ 3-0-15-3, రషీద్ ఖాన్ 4-0-35-0, నూర్ అహ్మద్ 3-0-36-1, మోహిత్ 4-0-73-0, షారుఖ్ 1-0-8-0, సాయి కిషోర్ 1-0-22-0.

లఖ్‌నవూ: సాహా (సి) అక్షర్ (బి) కుల్దీప్ 39, గిల్ (సి) అక్షర్ (బి) నోకియా 6, సాయి సుదర్శన్ (సి) అక్షర్ (బి) రసిక్ 65, ఒమర్జాయ్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 1, మిల్లర్ (సి) రసిక్ (బి) ముకేష్ 55, షారుక్ (సి) పంత్ (బి) రసిక్ 8, తెవాటియా (సి) పంత్ (బి) కుల్దీప్ 4, రషీద్ ఖాన్ (నాటౌట్) 21, సాయి కిషోర్ (బి) రసిక్ 13, మోహిత్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం: 20 ఓవర్లలో 220/8; వికెట్లపతనం:** 1-13, 2-95, 3-98, 4-121, 5-139, 6-152, 7-181, 8-206; **బౌలింగ్:** ఖలీల్ 2-0-26-0, నోకియా 3-0-48-1, రసిక్ సలామ్ 4-0-44-3, ముకేష్ 4-0-41-1, అక్షర్ 3-0-28-1, కుల్దీప్ 4-0-29-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
ముంబై	8	3	5	0	6	-0.227
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

కళ్లన్నీ ఆ ఇద్దరి పైనే!

- విరాట్, హెడ్ కట్టడికి వ్యూహాలు
- ఫేవరెట్ సన్‌రైజర్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సొంతగడ్డపై మరోసారి పరుగుల సునామీని సృష్టించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు సిద్ధమవుతున్నారు. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడేందుకు కమిన్స్ సేన తన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంది. కొద్ది రోజుల కిందట ఆర్‌సీబీని వారి హోంగ్రౌండ్‌లో ఓడించిన ఎస్ఆర్‌హెచ్, అదే ఊపుతో మరోసారి ఆధిపత్యం చెలాయించాలని తహతహలాడుతోంది. హెడ్, క్లాసెన్, మార్క్రమ్, అభిషేక్, సమద్, నితీశ్ రెడ్డితో ప్రత్యర్థులను హడలెత్తిస్తున్న సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డుప్లెసి నాయకత్వంలోని ఆర్‌సీబీ బ్యాటింగ్ ఆర్డర్ విరాట్, గ్రీన్, రజత్, దినేశ్ కార్తీక్‌తో బాగానే ఉన్నా, పేలవమైన బౌలింగ్ యూనిట్ వల్ల వరుస పరాజయాలను ఎదుర్కొంటోంది. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో టాప్‌లో ఉన్న విరాట్ కోహ్లి, భీకర ఫామ్‌లో ఉన్న ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ బ్యాటింగ్‌పైనే అందరి దృష్టి నెలకొంది. విరాట్ ఉప్పల్‌లో ఆడిన 7 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 139.73 స్ట్రయిక్ రేట్‌తో 313 పరుగులు చేశాడు.

థ్యాంక్ గాడ్..బతికిపోయా!



కరాచీ: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఆ జట్టు నమ్మశక్యంగాని రీతిలో ఆడుతోందని చెప్పాడు. 'ముందుగా నేనీ తరంలో క్రికెట్ ఆడనందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 20 ఓవర్లలో 270 పరుగులు సాధించడమా? వన్డేల్లో అయితే ఇది 450-500తో సమానం. ఒకసారి కాకుండా ఇప్పటికి 3-4 సార్లు ఇలాగే బాదేశారు. మరీ 5 ఓవర్లలో వంద పరుగులు చేయడమైతే అన్యాయం. ఎంత ఫుల్‌టాస్‌లో బంతులు వేసినా ఇన్ని రన్స్ సాధించడం కష్టం. పాపం ఈ ఫార్మాట్‌లో బౌలర్లను చూస్తేనే జాలేస్తోంది' అని వసీం చెప్పుకొచ్చాడు.

27 నుంచి ఆసియా యూత్ బాక్సింగ్ పోటీలు

న్యూఢిల్లీ: ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బాక్సర్ల బృందాన్ని జాతీయ సమాఖ్య బుధవారం ప్రకటించింది. కజికిస్థాన్‌లోని అస్తానాలో ఈనెల 27 నుంచి జరగనున్న ఈ పోటీల్లో 25 మంది భారత బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు. పారిస్ ఒలింపిక్ బెర్త్ సాధించిన ప్రీతి పవార్ ఈ పోటీల్లో భారత బృందాన్ని నడిపించనుంది. ప్రీతి 54 కిలోల విభాగంలో తలపడనుండగా, అల్ఫియా పఠాన్ (81 కి.), ప్రస్తుత యూత్ వరల్డ్ చాంపియన్స్ దేవిక (52 కి.), విశ్వాంత్ సురేష్ (48 కి.), జాతీయ సీనియర్ చాంపియన్ ప్రాచి (63 కి.) తదితరులు బరిలోకి దిగుతున్నారు.

ఫైనల్లో జ్యోతి సురేఖ జట్టు

● పురుషుల టీమ్ కూడా.. ● ఆర్చరీ వరల్డ్‌కప్



షాంఘై: వరల్డ్‌కప్ కాంపౌండ్ ఆర్చరీలో జ్యోతి సురేఖ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. పురుషుల టీమ్ కూడా తుది పోరుకు చేరుకొంది. మరోవైపు రికర్వ్ విభాగం క్వాలిఫికేషన్ రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర జాతీయ రికార్డుతో మెయిన్ కాంపిటీషన్‌కు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన కాంపౌండ్ సెమీస్‌లో సురేఖ, అదితి గోపీచంద్, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 235-230తో ఎస్తోనియా టీమ్‌పై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో ఇటలీతో వరల్డ్ చాంప్ భారత్ తలపడనుంది. కాగా, అభిషేక్ వర్మ, ప్రియాన్ష్, ప్రథమేష్‌లతో కూడిన పురుషుల జట్టు 235-233తో కొరియా జట్టుపై నెగ్గింది. స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్‌తో టీమిండియా తలపడనుంది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం అర్హత రౌండ్‌లో ధీరజ్ 693 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి.. ప్రధాన పోటీకి అర్హత సాధించాడు. ఈ క్రమంలో తరుణ్‌దీప్ రాయ్ (689 పాయింట్లు) జాతీయ రికార్డును ధీరజ్ అధిగమించాడు.

కోటక్ మహీంద్రా బ్యాంక్‌పై
ఆర్‌బీఐ కొరడా



కొత్త క్రెడిట్ కార్డుల జారీపై నిషేధం.. కొత్త కస్టమర్ల చేరికలపైనా వేటు
ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ లేకపోవటంతో చర్యలు

ముంబై: ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోతే ఎంతటి పెద్ద బ్యాంకునైనా ఉపేక్షించేది లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేస్తోంది. ఈ రెండు కారణాలతో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం కోటక్ మహీంద్రా బ్యాంక్ (కేఎంబీ) కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా నిషేధం విధించింది. అంతేకాకుండా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చానల్స్ ద్వారా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోకుండా వేటు వేసింది. బ్యాంక్ ఐటీ మౌలిక వ్యవస్థలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, బ్యాంక్ వృద్ధి రేటుకు అనుగుణంగా నియంత్రణలు లేకపోవడంతో ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది. గత రెండేళ్లుగా (2022, 2023) తాము జరిపిన పరిశీలనలో ఈ విషయం తేలినట్టు తెలిపింది. ఈ నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించింది.

అయితే ఈ నిషేధం బ్యాంక్ ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం చూపదని తెలిపింది. బ్యాంకు వారికి యథావిధిగా తన సేవలు అందించవచ్చని స్పష్టం చేసింది. కాగా 2020 డిసెంబరులో ఇదే తరహా కారణాలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా, కొత్త డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురాకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. అనంతరం నిబంధనలకు అనుగుణంగా బ్యాంక్ చర్యలు తీసుకోవటంతో 2022 మార్చిలో ఆర్‌బీఐ ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.

బ్యాంకుపై ప్రభావం

ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం లేకపోయినా.. ఆన్‌లైన్ లేదా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కోటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోవడంపై ఆర్‌బీఐ నిషేధం తీవ్ర ప్రభావం చూపనుంది. కొత్త క్రెడిట్ కార్డుల జారీనీ ఆర్‌బీఐ నిషేధించడంతో ఆ ప్రభావమూ బ్యాంక్‌పై తీవ్రంగానే ఉంటుందని నిపుణుల అంచనా. వ్యాపార విస్తరణలో భాగంగా బ్యాంక్ ఇటీవల ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానల్స్ ద్వారా పెద్దఎత్తున కొత్త ఖాతాదారులను చేర్చుకుంటోంది. క్రెడిట్ కార్డుల మార్కెట్లోనూ బ్యాంక్ ఇటీవల ఎస్‌బీఐ కార్డ్స్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రధాన బ్యాంకులతో పోటీపడుతోంది. ఆర్‌బీఐ తాజా నిషేధంతో ఈ ప్రయత్నాలకు బ్రేక్ పడనుంది.

దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం

మరోవైపు బ్యాంక్ ఐటీ సిస్టమ్స్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన కొత్త టెక్నాలజీలను తీసుకువచ్చేందుకు అన్నిరకాలైన చర్యలు తీసుకుంటున్నట్టు కోటక్ మహీంద్రా బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్‌బీఐతో కలిసి పనిచేయనున్నట్టు తెలిపింది.

లోపాలు ఇవే..

కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఐటీ రిస్క్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నెన్స్ విధానాలు తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని ఆర్‌బీఐ తెలిపింది. దీంతో బ్యాంక్ ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, ప్యాచ్ అండ్ చేంజ్ నిర్వహణ, యూజర్ యాక్సెస్ నిర్వహణ, వెండర్ రిస్క్ నిర్వహణ, డేటా సెక్యూరిటీ, డేటా లీక్ ప్రివెన్షన్ స్ట్రాటజీ, బిజినెస్ కంటిన్యుటీ, డిజాస్టర్ రికవరీ విధానాలు కూడా లోపభూయిష్టంగా ఉన్నట్టు తమ పరిశీలనలో తేలినట్టు ప్రకటించింది. ఈ లోపాల కట్టడి కోసం బ్యాంక్ తీసుకున్న చర్యలు కూడా లోపభూయిష్టంగా ఉండడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చినట్టు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగానే కోటక్ మహీంద్రా బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ (సీబీఎస్), ఆన్‌లైన్, డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ గత రెండేళ్లుగా తరచూ సమస్యలకు లోనవుతున్నట్టు తెలిపింది. ఈ నెల 15న బ్యాంక్ సేవల అంతరాయానికీ ఇదే కారణమని పేర్కొంది. బ్యాంక్ తమకు సంతృప్తి కలిగించేలా ఈ లోపాలను సరిదిద్దుకున్న వెంటనే ఈ నిషేధం ఎత్తివేస్తామని తెలిపింది.

ఫార్మా ఎగుమతులు..
రూ.2.32 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24) భారత్ నుంచి 2,790 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.32 లక్షల కోట్లు) విలువైన ఔషధాలు, ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది 9.67 శాతం ఎక్కువ. గత ఆర్థిక సంవత్సరం మన మొత్తం ఎగుమతులు 3 శాతం పడిపోయినా ఫార్మా ఎగుమతులు 9.67 శాతం పెరగడం విశేషం. ఈ ఏడాది మార్చిలో అయితే ఫార్మా ఎగుమతులు 12.73 శాతం పెరిగి 280 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం మన ఫార్మా ఎగుమతుల్లో ఎక్కువ భాగం అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతయ్యాయి. మన మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 31 శాతం అమెరికానే దిగుమతి చేసుకుంది. భారత ఫార్మా కంపెనీలు 60 రకాల అనారోగ్య సమస్యల చికిత్సకు అవసరమైన 60,000 రకాల జెనరిక్ ఔషధాలు ఉత్పత్తి చేస్తూ విదేశీ మార్కెట్లలోనూ తమ సత్తా చాటుతున్నాయి.

హైదరాబాద్‌లో మూడో డేటా సెంటర్: కంట్రోల్‌ఎస్

హైదరాబాద్: డేటా సెంటర్స్ సంస్థ కంట్రోల్‌ఎస్ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మరో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. భూకంపాలను తట్టుకునేలా 1.34 లక్షల ఎస్ఎఫ్‌టీలో కంపెనీ ఐదు అంతస్తులతో ఈ డేటా సెంటర్ భవనాన్ని నిర్మిస్తోంది. 2-3 నెలల్లో ఈ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపింది. సీస్మిక్ జోన్-2లో ఉండడంతో హైదరాబాద్ డిజాస్టర్ రికవరీ సేవల కంపెనీలకు ప్రధాన కేంద్రంగా మారుతోందని కంట్రోల్‌ఎస్ పేర్కొంది.

బిజినెస్

ఐటీ ఉద్యోగులే రిటైల్ రంగానికి చోదక శక్తి

- ఆర్ఏఐ సీఈఓ రాజగోపాలన్

హైదరాబాద్‌లో రిటైల్ రంగ అభివృద్ధికి ఐటీ ఉద్యోగులు ప్రధాన చోదక శక్తిగా మారారని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) సీఈఓ కుమార్ రాజగోపాలన్ అన్నారు. ఆర్ఏఐ నిర్వహించిన హైదరాబాద్ రిటైల్ సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోయిందన్నారు. ప్రస్తుతం ఖాతాదారులు 24 గంటల ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో పాటు విశ్వసనీయమైన ఆఫ్‌లైన్ అనుభూతిని ఆశిస్తున్నట్టు రాజగోపాలన్ తెలిపారు. రిటైల్ కంపెనీలు కొత్త విషయాలు నేర్చుకోవడంపై ఆసక్తి చూపకపోతే రిటైల్ పరిశ్రమ వృద్ధి రేటుకు గండిపడుతుందని సదస్సుకు ప్రధాన అతిథిగా హాజరైన తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. హైదరాబాద్ మంచి నివాసయోగ్యమైన నగరంగా మారడానికి రిటైల్ సంస్థలూ ఒక కారణమన్నారు.

ఉద్యోగులు అందరికీ ఈసాప్స్

క్రిటికల్‌రివర్

హైదరాబాద్: తమ సంస్థలో పని చేస్తున్న 1,000 మంది ఉద్యోగులు అందరికీ ఈసాప్స్ (ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్) కింద కంపెనీ షేర్లు కేటాయించినట్టు టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ ఇంక్ ప్రకటించింది. దీనికి తోడు ఉద్యోగుల సర్వీసు ఆధారంగా ప్రతి ఏడాది సర్వీసుకు 100 షేర్ల చొప్పున కేటాయిస్తామని తెలిపింది. దీనివల్ల ఉద్యోగుల్లోనూ కంపెనీ మనది అనే భావన ఏర్పడుతుందని పేర్కొంది. ప్రపంచంలోని తొమ్మిది ప్రాంతాల్లో తమ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులు అందరికీ ఈ ఈసాప్స్ లభిస్తాయని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	86,400 ▼
ముంబై	71,826 ▲	65,793 ▲	80,687 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ	
హైదరాబాద్	350
వరంగల్	352
చిత్తూరు	453
విజయవాడ	380
గోదావరి	380
విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120
వరంగల్	120
కరీంనగర్	120
మహబూబ్‌నగర్	120
కర్నూలు	120
విశాఖపట్నం	118
గోదావరి	126
విజయవాడ	126
గుంటూరు	130
ఒంగోలు	130
చిత్తూరు	120

యాక్సిస్ బ్యాంక్ లాభం రూ. 7,129 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ రూ.7129.67 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.5,728.42 కోట్ల నష్టం నమోదు చేసింది. బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.28,758 కోట్ల నుంచి రూ.35,990 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1 డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

హెచ్‌యూఎల్ లాభం డౌన్

ముంబై: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) కన్సాలిడేటెడ్ నికరలాభం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో 1.53% క్షీణించి రూ.2,561 కోట్లకు దిగజారింది. త్రైమాసికంలో కంపెనీ నికర అమ్మకాలు రూ.15,013 కోట్లు ఉంది. బుధవారం జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.24 తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

ఇన్వెస్టర్ల సంపద రూ.8.5 లక్షల కోట్లు అప్

మార్కెట్లో నాలుగో రోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ బుధవారం వరుసగా నాలుగో రోజున కూడా లాభాలతో ముగిసింది. మెటల్, కమోడిటీ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగినప్పటికీ టెలికాం, ఐటీ, టెక్ కౌంటర్లలో చివరి గంటలో సాగిన అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలకు కళ్లెం వేసింది. ఫలితంగా ఇంట్రాడేలో 383.16 పాయింట్ల లాభంతో 74,852.94 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి లాభాలను 114.49 పాయింట్లకే పరిమితం చేసుకుని 73,852.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 34.40 పాయింట్ల లాభంతో 22,402.40 వద్ద క్లోజైంది. ఈ నాలుగు రోజుల ర్యాలీలో సెన్సెక్స్ 1,363.95 పాయింట్లు పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.8,48,328.90 కోట్లు పెరిగి రూ.4,01,37,377.21 కోట్లకు చేరింది.

తగ్గిన ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం

ముంబై: ఐటీ రంగంలోని ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసిక లాభంలో 1.2 శాతం క్షీణతను నమోదు చేసింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం రూ.1,114.1 కోట్ల నుంచి రూ.1,100.7 కోట్లకు తగ్గింది. ఆదాయం మాత్రం 2.32 శాతం వృద్ధితో రూ.8,691 కోట్ల నుంచి రూ.8,892.9 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ.35,537 కోట్లు కాగా లాభం రూ.4,584.6 కోట్లుగా నమోదైంది.

ఎల్ఐసీ పేరుతో నకిలీ ప్రకటనలు... తస్మాత్ జాగ్రత్త

న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) పేరు, లోగోలను, కొందరు సీనియర్ అధికారుల పేర్లను అనధికారికంగా ఉపయోగించుకుంటూ మోసపూరిత శక్తులు సామాజిక మాధ్యమ వేదికగా జారీ చేస్తున్న నకిలీ ప్రకటనలకు మోసపోవద్దని పాలసీదారులు, ప్రజలను ఎల్ఐసీ హెచ్చరించింది. ఎక్స్ వేదికగా ఎల్ఐసీ ఈ హెచ్చరిక చేస్తూ అలాంటి ప్రకటనలు వెలువడినప్పుడు అవి అధికారికమైనవేనా అని ధ్రువీకరించుకోవాలని సూచించింది. "కొందరు వ్యక్తులు/కొన్ని సంస్థలు ఎల్ఐసీ అధికారులు, మాజీ అధికారుల పేర్లను, సంస్థ బ్రాండ్ లోగోను, పేరును ఉపయోగించుకుని మోసపూరిత ప్రకటనలు సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. అలాంటి మోసపూరిత ప్రకటనల బారిన పడవద్దని ఈ వేదిక ద్వారా మా కస్టమర్లను హెచ్చరిస్తున్నాం" అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అలాంటి మోసపూరిత వ్యక్తులు, సంస్థలు ఇచ్చే యుఆర్ఎల్‌పై క్లిక్ చేసి వారి వలలో పడవద్దని తెలిపింది.


ఏపీ, తెలంగాణ రైతులకు బేయర్ సేవలు

న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు బేయర్ క్రాప్ సైన్సెస్ ముందుకొచ్చింది. ఇందుకోసం కామన్ సర్వీసెస్ సెంటర్, గ్రామ ఉన్నతి అనే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా చిన్నసన్నకారు రైతులకు పంటల సంరక్షణకు అవసరమైన సలహాలతో పాటు తన అధునాతన ఉత్పత్తులను అందిస్తుంది. అలాగే రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడంలో సాయపడుతుంది.

మే 31లోగా ఎలాంటి అదనపు భారం ఉండదు

సీబీడీటీ

న్యూఢిల్లీ: అసెసీలు మే 31 లోగా పాన్-ఆధార్ అనుసంధానత పొందే పక్షంలో వారిపై ఎలాంటి అదనపు పన్ను భారం ఉండదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ఎవరైనా పాన్, ఆధార్ అనుసంధానం చేసుకోకపోయినట్టయితే వారికి వర్తించే పన్ను రేటుపై రెండింతలు పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ అంశంపై పన్ను చెల్లింపుదారుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించిన అనంతరం మార్చి 31లోగా పాన్, ఆధార్ అనుసంధానానికి దరఖాస్తు చేసుకుని ఉండి మే 31లోగా వారికి అనుమతి లభించే పక్షంలోవారిపై ఎలాంటి అదనపు పన్ను భారం వేయవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సీబీడీటీ తెలిపింది.





ర్యాలీలో విక్టరీ సంకేతం చూపుతున్న మచిలీపట్నం అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర, పక్కన ఎంపీ అభ్యర్థి బాలశౌరి



గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ సందర్భంగా ర్యాలీ, (ఇన్‌సెట్లో) గజమాలతో యార్లగడ్డ

అట్టహాసంగా..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల నామినేషన్ల ఘట్టం బుధవారం కోలాహలంగా జరిగింది. బందరు పార్లమెంటు స్థానం కూటమి అభ్యర్థి బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర నామినేషన్లకు భారీ ప్రదర్శన జరిగింది. అడుగడుగునా పూలవర్షం కురిసింది. బందరు జన జాతరను తలపించింది. వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. టీడీపీ, జనసేన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. గన్నవరంలో కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో వెంకట్రావును టీడీపీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం వరకు భారీ ప్రదర్శన జరిగింది.



కొల్లు, బాలశౌరి ర్యాలీలో అభిమానులు, కార్యకర్తలు

ఇంకనూ పక్షపాతమే!

సీపీపై వేటు పడినా మారని పోలీసులు





విజయవాడ తూర్పు రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ భవానీశంకర్ కార్యాలయం వద్ద 16 మందితో వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్ ఫొటో సెషన్ (ఇన్‌సెట్‌లో) మైలవరంలో వసంత కృష్ణ ప్రసాద్ నామినేషన్ సమయంలో ఆయన కుమారుడు ధీమంత్ సాయిని కార్యాలయం గేటు బయటే నిలిపివేసిన పోలీసులు

అధికార పార్టీ నేతలు ప్రచారం చేస్తే అన్ని అనుమతలూ ఇచ్చేస్తారు. అవసరమైతే సెక్యూరిటీ కల్పిస్తారు.

కానీ.. ప్రతిపక్ష నేతలు ప్రచారం చేయాలంటే సవాలక్ష నిబంధలు చెబుతారు. అడ్డమైన ఆంక్షలు పెడతారు.

అధికార పార్టీ నేతల కార్యక్రమాలకు విద్యాసంస్థల బస్సులు వాడినా అడ్డుచెప్పరు.

కానీ.. ప్రతిపక్ష నేతలకు పరిమితులున్నాయంటారు.

నామినేషన్ దాఖలుకు వైసీపీ నేతల వెంట ఎంత మంది వచ్చినా కాదనరు.

కానీ ప్రతిపక్ష నేతల వెంట నలుగురుకు మించి వస్తే ఆపేస్తారు.

ఇదీ మన పోలీసుల తీరు. దీన్ని పక్షపాతం కాక మరేమంటారు? ఇది ఏపక్షం కాక మరేమవుతుంది? ఇలా వ్యవహరించినందుకు విజయవాడ సీపీపై వేటు ఈసీ వేటు వేసింది. అయినా పోలీసులు పక్షపాతంగానే వ్యవహరిస్తుండటం గమనార్హం.



అవినాశ్ నామినేషన్‌కు నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల బస్సుల్లో జనం తరలింపు ఇలా..

- వైసీపీకి జీహుజూర్ అంటున్న పోలీసులు
- విజయవాడ తూర్పు వైసీపీ అభ్యర్థి సేవలో పోలీసులు
- రిటర్నింగ్ కార్యాలయంలోకి అభ్యర్థితోపాటు 16 మందికి అనుమతి
- గద్దె నామినేషన్‌కు నలుగురినే అనుమతి
- మైలవరంలో టీడీపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్ కుమారుడిని అనుమతించని పోలీసులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో కొందరు పోలీసు అధికారులు వైసీపీ సేవలో తరిస్తున్నారు. వైసీపీకి కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలపై సీపీ కాంతిరాణాపై వేటు పడినా కొందరు పోలీసులు మాత్రం వైసీపీ నాయకుల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం నుంచే కాకుండా విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల నుంచీ పెద్దఎత్తున జనసమీకరణ చేశారు. కార్యక్రమానికి వచ్చిన పురుషులకు క్వార్టర్ బాటిల్, రూ.300 ఇవ్వగా మహిళలకు రూ.500 చొప్పున అందజేశారు. శారదా కాలేజీ, కేఎల్ యూనివర్సిటీకి చెందిన బస్సుల్లో జనాలను తరలించారు. నిబంధనల ప్రకారం పాఠశాలల, కళాశాలల బస్సులను రాజకీయ నాయకుల కార్యక్రమాలకు ఉపయోగించకూడదు. కానీ యథేచ్ఛగా వాటిని జనాలను తరలించడానికి ఉపయోగించారు. పడవల రేవు వంతెన నుంచి మొదలైన నామినేషన్ ర్యాలీ రామలింగేశ్వర కట్ట మీదుగా బందరు రోడ్డులోని రిటర్నింగ్ అధికారి అయిన సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. అవినాశ్ ర్యాలీ కారణంగా దారిపొడవునా ట్రాఫిక్ 2 గంటలపాటు ఆగిపోయింది. దీంతో మండుటెండలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● ఇది ఏకపక్షం కదా..?

నామినేషన్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థితోపాటు కేవలం నలుగురిని మాత్రమే లోపలికి అనుమతించాలన్నది నిబంధన. కానీ వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్‌తోపాటు 16 మంది లోపలికి వెళ్లిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న విజయవాడ సౌత్ జోన్ ఏసీపీ రత్నరాజు, కృష్ణలంక పోలీసుస్టేషన్ సిబ్బంది కానీ ఎవ్వరూ వీరికి అభ్యంతరం తెలపలేదు. కానీ సోమవారం నామినేషన్ దాఖలు చేసిన విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ విషయంలో మాత్రం పోలీసులు నిబంధనలు తూచ తప్పకుండా పాటించారు. గద్దె రామ్మోహన్‌తోపాటు కేవలం నలుగురిని మాత్రమే లోపలికి అనుమతించారు. మైలవరంలో టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ కుమారుడు ధీమంత్ సాయిని సైతం బయటే నిలబెట్టేశారు. కేవలం నలుగురినే అనుమతిస్తామంటూ కృష్ణ ప్రసాద్ కుమారుడిని లోపలికి అనుమతించలేదు.

'ఎన్టీఆర్'కు కొత్త బాస్ పీహెచ్‌డీ

- పీహెచ్‌డీ రామకృష్ణను సీపీగా నియమించిన ఈసీ
- నేడు బాధ్యతల స్వీకరణ



విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు కొత్త బాస్‌గా పీహెచ్‌డీ రామకృష్ణ నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆయన పేరును పోలీసు కమిషనర్ పోస్టుకు టిక్ పెట్టింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు బుధవారం రాత్రి వెలువడ్డాయి. బుధవారం ఉదయం 9 గంటలకు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం బాధ్యతలు చేపడతారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 30 మంది పోలీసు కమిషనర్లుగా పనిచేశారు. ఇప్పుడు 31వ సీపీగా పీహెచ్‌డీ రామకృష్ణ రాబోతున్నారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ ఎన్టీఆర్ కమిషనరేట్‌గా రూపాంతరం చెందిన తర్వాత బాధ్యతలు చేపడుతున్న రెండో కమిషనర్ రామకృష్ణ. ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన రామకృష్ణ 2001లో డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. నల్లగొండ జిల్లా దేవరకొండ, తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి డీఎస్పీగా పనిచేశారు. రంపచోడవరం ఓఎస్డీగా పనిచేశారు. 2006లో ఆయనకు ఐపీఎస్ హోదా వచ్చింది. గుంటూరు అర్బన్, రూరల్, కడప, నెల్లూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. గుంటూరు రూరల్ ఎస్పీగా పనిచేసినప్పుడు బెట్టింగ్ రాయుళ్ల తోకలు కత్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో కౌంటర్ ఇంటిలిజెన్స్, ఇంటిలిజెన్స్ విభాగాల ఎస్పీగా వ్యవహరించారు. 2020లో డీఐజీగా పదోన్నతి పొందారు. ఐజీ పదోన్నతి వచ్చిన తర్వాత ఎస్ఈబీ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఏసీబీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. పీహెచ్‌డీ అత్యంత సౌమ్యుడు అన్న పేరు పోలీసు వర్గాల్లో ఉంది. ఈయన ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ చేశారు.

ఎమ్మెల్యే పదవి వెంట్రుకతో సమానం

- నీవు అనవసరంగా కామెంట్లు చేయడం మానేయ్
- సొంత పార్టీ నాయకుడిపై సామినేని ఉదయభాను బూతుపురాణం



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి అసహనం కనిపిస్తోంది. గెలుపు అసాధ్యమని అర్థం కావడంతో తన మన అని చూడకుండా సొంత పార్టీ నాయకులపైనా బూతులతో దాడులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం జగ్గయ్య పేటకు చెందిన ఓ వైసీపీ నాయకుడు పార్టీ కార్యకర్తల వద్ద ఐదేళ్లలో ఒక్క పని చేయలేకపోయామని, ఇప్పుడు పరిస్థితి అంత అనుకూలించడం లేదని, గెలుపు కష్టమేనని వ్యాఖ్యానించారు. ఈ విషయం జగ్గయ్యపేట వైసీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగ్రహోదగ్రుడయ్యారు. ఆ దళిత నాయకుడికి ఫోన్ చేసి బూతులతో విరుచుకుపడ్డారు. 'నాకు ఎమ్మెల్యే పదవి వెంట్రుక ముక్కతో సమానం. నీవు అనవసరంగా కామెంట్లు చేయడం మానెయ్. అదృష్టం ఉంటే గెలుస్తాం.. లేకుంటే ఓడిపోతాం. ఎలా అవ్వాలో అలా అవ్వుద్ది.. బొచ్చులో మంత్రి.. అది.......తో సమానం. గెలిచినా ఓడినా నాకు బొచ్చుతో సమానం' అంటూ రెచ్చిపోయారు. ప్రస్తుతం ఈ ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దళితులపై ఉదయభాను నోరుపారేసుకోవడం ఇది రెండోసారి. గతంలో సొంత పార్టీకి చెందిన గిరిజన వికలాంగుడిని బండబూతులు తిట్టిన ఉదంతంలో ఉదయ భానుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. తాజాగా సొంత పార్టీకే చెందిన దళిత నాయకుడిపై నోరుపారేసుకోవడంతో వైసీపీ శ్రేణులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మొండిగోడల కాలనీలు!

అపహాస్యంగా జగనన్న కాలనీలు

నున్న లే అవుట్‌లో జగనన్న ఇళ్ల దుస్థితిదీ..



జగనన్న కాలనీలు మొండిగోడలు దాటలేదు. సెంటు స్థలాల చొప్పున ఇళ్ల పట్టాల పేరుతో, ఇళ్ల నిర్మాణం పేరుతో నగరంలో గూడులేని పేదలను వైసీపీ ప్రభుత్వం వంచించింది. విజయవాడలో లక్ష మంది పేదలకు ఆవాసం కల్పిస్తామని నమ్మబలికి ఊరికి దూరంగా.. నిర్మానుష్య ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేనిచోట కొండలు, గుట్టల నడుమ ఇళ్ల పట్టాలిచ్చి.. ఇళ్ల నిర్మాణాలు చేస్తామంటూ మోసం చేసింది. ఐదేళ్ల కాలం తిరిగితే ఏమున్నదయ్యా అంటే.. మౌలిక సదుపాయాలు లేని లే అవుట్లలో.. మొండిగోడలతో కూడిన ఇళ్లు ఉన్నాయి. ఇళ్లు అడుగు ముందుక పడక, మొండిగోడలను చూసి లబ్దిదారులు లబోదిబోమంటున్నారు.

- ఊరికి దూరంగా 15 - 20 కిలోమీటర్లలో ఇళ్ల ప్లాట్లు
- 75 వేలమందికి నున్న, కొండపావులూరు, వణుకూరులలో ప్లాట్లు
- 25 వేల మందికి అమరావతిలో.. ప్లాట్లను చూపి మభ్యపెట్టారు
- పట్టుమని ఐదువేల ఇళ్లు కూడా పూర్తి కాలేదు
- అన్నీ మొండిగోడల దశలోనే.. అధికారపార్టీ నేతలే కాంట్రాక్టర్లు
- పేదల దగ్గర నుంచి అదనంగా డబ్బులు కట్టించుకుని పరారీ
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 20 వేల ఇళ్లు కూడా నిర్మించలేని దౌర్భాగ్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడకు చెందిన వారికి నున్న, కొండపావులూరు, వణుకూరు గ్రామాల్లో లే అవుట్లు వేసి 75 వేల మందికి ఇళ్లు కల్పించారు. మరో 25 వేల మందికి అమరావతి రాజధాని నగరంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. విజయవాడకు చెందిన 75 వేల మందికి సెంటు పట్టా చొప్పున ఇచ్చిన లే అవుట్లు అసౌకర్యాల నిలయంగా ఉన్నాయి. విజయవాడలో పనిచేసుకునే వారికి పదిహేను నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. నున్న ప్రాంతాన్ని మోడల్ లే అవుట్‌గా ప్రకటించారు. కొండపావులూరులో ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంల దగ్గర కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన భూముల్లో ఇళ్ల పట్టాలు కల్పించారు. వణుకూరులో పంట పొలాలను కొనుగోలు చేసి లే అవుట్ వేశారు.

నున్న లే అవుట్‌లో మొండిగోలతో 9వేల ఇళ్లు

నున్న మోడల్ లే అవుట్‌లో మొత్తం 120 ఎకరాల విస్తీర్ణంలో.. 10 వేల మందికి ఇళ్లు కల్పించారు. ఇక్కడ పది వేల ఇళ్లలో వెయ్యి ఇళ్లు మాత్రమే లబ్ధిదారులు కాస్తో, కూస్తో ఆర్థికంగా అవకాశం కలిగినవారు బయట అప్పులు తెచ్చుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన 9 వేల ఇళ్లు మొండిగోడలుగా ఉన్నాయి. రాప్తాడు ఎమ్మెల్యేకు చెందిన కాంట్రాక్టు సంస్థకు ఇళ్ల నిర్మాణ పనులు అప్పగించారు. కాంట్రాక్టు సంస్థ ఇంటిని కట్టిస్తానన్న ధర, కేంద్రం ప్రభుత్వం ఇస్తామన్న రూ.1.80 లక్షలను దాటిపోతుండటంతో.. ఆ ఎక్కువ మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించే పద్ధతిన పనులు చేపట్టేందుకు ఇచ్చారు. తీరా చూస్తే కాంట్రాక్టు సంస్థ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి వెళ్లిపోయింది. పనులైతే మొండిగోడలుగా ఉన్నాయి.


● కొండపావులూరులో 10 శాతం ఇళ్లు కూడా పూర్తి చేయలేదు.

● వణుకూరులో కొంతమేర పెనమలూరు నియోజకవర్గ పేదలు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. విజయవాడలోని మరో 25 వేల మందికి అమరావతి రాజధానిలో ఆర్ 5 జోన్‌లో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అక్కడ పట్టాలు చూపించి షో చేశారు. ఇళ్ల పనులే మొదలు కాలేదు. నగరంలోని పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీల్లో రోడ్లు లేవు. డ్రెయినేజీ పారుదల లేదు. వీధి లైట్లు లేవు.

అట్టహాసంగా ప్రారంభించి అభాసుపాలై..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇళ్ల పట్టాల కోసం 3,09,588 మంది లబ్ధిదారులను గుర్తించారు. మరో 30 వేల వరకు పొజిషన్ సర్టిఫికెట్స్, టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలు, రెగ్యులైజేషన్ పట్టాలు కూడా కలిపి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఈ 30 వేల పత్రాలను పక్కన పెడితే మొత్తం 3,09,588 ఇళ్ల పట్టాల లబ్ధిదారులకుగాను మొదటి విడతలో 1,65,400 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి నిర్ణయించారు. ఆ తర్వాత దశలో 1,44,188 ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు గృహనిర్మాణ శాఖకు బదలాయించారు. గృహనిర్మాణ శాఖ ఇళ్ల నిర్మాణాలకు నిర్ణయించిన లబ్ధిదారుల ఇళ్ల ప్లాట్లను జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. దీని కంటే ముందు లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇంటి పట్టాల ఆధారంగా ఆయా లే అవుట్లలో రెవెన్యూ యంత్రాంగం లబ్ధిదారులకు ప్లాట్లను చూపించాల్సి ఉంటుంది. రెవెన్యూ యంత్రాంగం ఇళ్ల ప్లాట్లను క్షేత్ర స్థాయిలో చూపించి ఫొటో తీసిన తర్వాతే.. గృహ నిర్మాణ శాఖ జియోట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ఇళ్ల నిర్మాణాలకు నిర్ణయించిన జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. జియో ట్యాగింగ్ పూర్తయి రెండున్నరేళ్లు గడిచినా ఇప్పటి వరకు కూడా కేవలం 20 వేల ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. దాదాపుగా 3 లక్షల ఇళ్ల నిర్మాణాల్లో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ దశలోనే మొండిగోడలతో ఉన్నాయి.

రూ.5 కోట్ల పంట బుగ్గిపాలు



మంటల్లో కాలిపోతున్న సుబాబుల్ తోటలు

వీరులపాడు, ఏప్రిల్ 24 : గోకరాజుపల్లి, వెల్లంకి గ్రామాల్లో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటల్లో 250 ఎకరాల సుబాబుల్ తోటలు బుధవారం అగ్నికి ఆహుతయ్యాయి. వీటి విలువ సుమారు రూ. 5 కోట్లు ఉంటుందని అంచనా. అగ్నిమాపక అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదని రైతులు వాపోయారు. టన్ను సుబాబుల్ రూ.4,000 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోంది. ఈ క్రమంలో జరిగిన అగ్ని ప్రమాదం తమను నిండా ముంచిందని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

» ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి వసంత



జి.కొండూరు/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలందరూ మహారాణులు కావడంతో పాటు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని కూటమి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను మహిళలందరూ విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. జికొండూరు మండలం ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల్లోను, కొండపల్లిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వసంత మాట్లాడుతూ, అమరావతి నాశనం చేయడంతో ఈప్రాంతానికి అన్యాయం జరిగిందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఆపేయడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పరిశ్రమలు రాక రాష్ట్ర ప్రగతి ఆగిపోయిందన్నారు. గ్రామాల అభివృద్ధిని వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మహా కూటమి మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సక్షేమం చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమతుందన్నారు. వలంటీర్లు అందరూ తన సొంత మనుషులని.. ఎన్డీఏ కూటమి విజయం కోసం వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ కూటవి ు అధికారంలోకి రాగానే కొండపల్లి మున్సిపాలిటీలో ఇంటింటికీ కుళాయి పథకం పూర్తి చేస్తామని చెప్పారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న వెనిగండ్ల రాము

కాలనీల్లో అభివృద్ధి పనులు చేయిస్తా.. : వెనిగండ్ల

గుడివాడ రూరల్, ఏప్రిల్ 24 : మల్లాయిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీనగర్ కాలనీ, పాత మల్లాయిపాలెం, కొత్త మల్లాయిపాలెంను అభివృద్ధి పనులు చేయిస్తానని గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తదితరులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, మల్లాయిపాలెం, లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని, ఆ ప్రాంతాన్ని పట్టణానికి దీటుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి కుటుంబం ఆర్థికంగా ఎదగటానికి కృషి చేస్తానన్నారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా కొడాలి నాని తన అభివృద్ధే చూసుకున్నారని, గుడివాడ అభివృద్ధిని గాలికొదిలేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వాసే మురళీ, శొంఠి నాగేశ్వరరావు, లక్ష్మీనగర్ కాలనీ నాయకులు గంగాధర్, పామర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ చట్టం పేరుతో పక్కా దోపిడీ : దేవినేని ఉమా



గొల్లపూడి, ఏప్రిల్ 24 : భూ చట్టం పథకంలో జగన్ సామాన్యుడ్ని దోచుకుంటున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఆయన గొల్లపూడి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, రైతుల భూములపై 'జగన్' కత్తి వేలాడుతోందన్నారు. రెవెన్యూ రికార్డులు సైతం తప్పుల తడకగా ఉన్నాయని, న్యాయస్థానాలను సైతం ఆశ్రయించే హక్కు కూడా లేకుండా చేశారని మండి పడ్డారు. ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా నల్ల చట్టాన్ని తీసుకొచ్చారని మండి పడ్డారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి జగన్ చెద పట్టించాడని రివర్స్ టెండరింగ్ డ్రామాతో ప్రాజెక్టులను అటకెక్కించారని విమర్శించారు. నిధులు ఇవ్వకుండా పనులు ఆపేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి సాగర్ జలాల్లో గోదావరి జలాలు పారిస్తామన్నారు.

డీసెట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 : కంప్యూటర్ ఆధారిత డీసెట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మే 8లోగా రూ. 750 గేట్‌వే ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 30వ తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించాలన్నారు. మూడు అంతకంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125 ప్రధానోపాధ్యాయుల ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. సీఎఫ్ఎంఎస్ బ్యాంకు చలానాలా ద్వారా జమ చేసిన ఫీజు డబ్బు చెల్లదన్నారు.

మే 4-7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

» ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 14 వేల పైచిలుకు ఉద్యోగులు వినియోగం

» విజయవాడలో ఐజీఎంసీలో ప్రధాన పోస్టల్ బ్యాలెట్

» రద్దీని నివారించేందుకు వీలుగా ఎక్కువ కౌంటర్లు, బ్యారికేడింగ్ క్యూ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోస్టల్ బ్యాలెట్‌కు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా మే 4, 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహించాలని ఎన్నికల యంత్రాంగం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించే 23 వేలమంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం ఉంది. 2019 ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ప్రణాళికా లోపం కారణంగా గందరగోళంగా మారాయి. కేంద్రంలో తోపులాటలు, గొడవలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగుల ఆగ్రహానికి కారణమైంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ జిల్లాలో ఈసారి ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం భావిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహిస్తారు. విజయవాడలో ఉన్న మూడు నియోజకవర్గాలకు కామన్‌గా ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియంలో ప్రధాన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో స్థానికంగా ఎక్కడి వారు అక్కడే పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే విధంగా చూడాలని భావిస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలో ఏడు వేలమందిని పంపి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయించగలిగితే.. మిగిలిన ఏడు వేలమందిని ఐజీఎంసీలో ఓటు వేయించేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌లో ఎక్కువ కౌంటర్లు, రద్దీ లేకుండా ఉండటానికి పటిష్ఠ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఏ జిల్లాకు చెందిన ఉద్యోగులైనా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా జిల్లాల బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేస్తారు.

పోస్టల్ బ్యాలెట్ పరిధిలోకి వచ్చేవారు..

ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి, అధికారి పోస్టల్ బ్యాలెట్ పరిధిలోకి వస్తారు. వీరంతా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 23 వేలమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పోలింగ్ సమయంలో విధులు నిర్వహించే వారు 13వేల పైచిలుకు ఉంటారు. వీరిలో ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, విద్య, వైద్యం, మునిసిపల్, పోలీసు తదితర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఉంటారు. ఈసారి ఆర్టీసీ ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉండే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు.

ఎన్నికల సంఘం ఇచ్చే ధ్రువీకరణ పత్రం చూపాలి

ఎనికల విధుల్లో ఉండే ఉద్యోగులు ఫామ్-12 డీ సమర్పించేందుకు ఈ నెల 26 వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం గడువు ఇచ్చింది. ఫామ్-12 డీ సమర్పించిన వారికి ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేక గుర్తింపు పత్రాన్ని ఇస్తుంది. దీనితో పాటు ఓటరు ఐడీ, ఆధార్ కార్డు తమ వెంట తీసుకుని పోస్టల్ బ్యాలెట్ కేంద్రానికి వెళితే.. అక్కడ వివరాలు నమోదు చేసుకుని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన సీల్డ్ కవర్‌తో కూడిన పోస్టల్ బ్యాలెట్‌లను ఇస్తారు. వాటిని తీసుకుని రహస్య ప్రదేశంలో ఓటు వేసిన తర్వాత తిరిగి వాటిని కవరులో పెట్టి సీల్ వేసి పోస్టల్ బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. అది ముగిసిన తర్వాత పోలీసు బందోబస్తు మధ్య సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల రిసెప్షన్ సెంటర్లలో స్ట్రాంగ్ రూమ్‌ల్లో వాటిని భద్రపరుస్తారు.



మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న బాలశౌరి, టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థులుగా నామినేషన్లు వేస్తున్న కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా

అట్టహాసంగా..

మచిలీపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బందరు నగరం జన సంద్రాన్ని తలపించింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి పార్టీశ్రేణులు, అభిమానులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కొల్లు రవీంద్ర బుధవారం తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. ముందుగా సుల్తానగరం అభయాంజనేయస్వామి ఆలయంలో ఇరువురూ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 10.30 గంటలకు

» కూటమి అభ్యర్థుల నామినేషన్లు

» పుర వీధులన్నీ పసుపుమయం

» భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

నుంచి ర్యాలీగా బయలుదేరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండిరామకృష్ణ పెడన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, అవనిగడ్డ జనసేన అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ వేదవ్యాస్‌లు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మూడు స్తంభాలసెంటరు, కోనేరుసెంటరు, రేవతీసెంటరు, బస్టాండ్, లక్ష్మీటాకీస్ సెంటర్‌మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. తొలుత కొల్లు రవీంద్ర గృహంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

జనంతో పోటెత్తిన వీధులు..

వల్లభనేనిబాలశౌరి, కొల్లురవీంద్ర నామినేషన్ల కార్యక్రమానికి పెద్దఎత్తున మహిళలు, కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో బందరు వీధులన్నీ జనంతో నిండిపోయాయి. కార్యకర్తల నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. డప్పు కళాకారుల విన్యాసాలు, యువత కేరింతల నడుమ ర్యాలీ ఆద్యంతం ఉత్సాహవాతావరణంలో సాగింది. మూడుస్తంభాలసెంటరులో క్రేన్‌ద్వారా పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నాలుగు గంటల సమయం పట్టగా.. దారిపొడవునా మహిళలు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. అభిమానులకు శీతల పానీయాలు, మజ్జిగ ప్యాకెట్లు భోజన వసతిని కల్పించారు. ఉదయం 11 గంటలకు కొల్లు రవీంద్ర తరఫున నామినేషన్ పత్రాలను ఆయన భార్య నీలిమ ఒక్కసెట్, వల్లభనేని బాలశౌరి రెండుసెట్‌ల నామినేషన్‌లను కలెక్టర్ డీకే బాలాజీకి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



ర్యాలీలో వల్లభనేని బాలశౌరి, కొల్లురవీంద్రలను కూరగాయల భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



జనసంద్రమైన పామర్రు-విజయవాడ రహదారి

యార్లగడ్డ నామినేషన్..

» రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు భారీ ప్రదర్శన

గన్నవరం : బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గన్నవరంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు బుధవారం తన రెండో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. తొలుత అట్టహాసంగా నిర్వహించిన ర్యాలీ కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. విజయవాడ గాయత్రినగర్‌లోని తన నివాసంలో ప్రత్యేక పూజల అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విజయవాడ-కోల్‌కతా జాతీయ రహదారిపై రెండు వైపులా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. యార్లగడ్డకు అడుగడుగునా ప్రజలు భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు.

హైవేపై స్తంభించిన ట్రాఫిక్

టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ ర్యాలీలో పోలీసులు అతిగా ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు జాతీయ రహదారిపై వెంకట్రావు ఎడమవైపున ర్యాలీ నిర్వహించగా, గన్నవరం-విజయవాడ మార్గంలో పోలీసులు ట్రాఫిక్‌ను నిలుపుదల చేయడం విమర్శలకు తావిస్తోంది. పోలీసుల అతి కారణంగా జాతీయ రహదారిపై అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంది. మరోవైపు విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న భారీ వాహనాలను ముందస్తు సమాచారం లేకుండానే పోలీసులు చిన ఆవుటపల్లి వద్ద నుంచి వెనక్కి మళ్లించి తిరిగి హనుమాన్‌జంక్షన్ వైపు పంపించారు. దీంతో వాహనాదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. యార్లగడ్డ నామినేషన్ ర్యాలీకి జనం తరలిరావడంతో పోలీసులు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లేమార్గాన్ని బారికేడ్‌లతో మూసేశారు. దీనికితోడు జాతీయ రహదారిపై గాంధీ బొమ్మ సెంటర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు ముళ్ల కంచెను ఏర్పాటు చేయడం గమనార్హం.

ప్రజలు క్షమించాలి..

» ట్రాఫిక్ ఇబ్బందులపై యార్లగడ్డ

విజయవాడ-గన్నవరం మార్గంలో బుధవారం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలందరినీ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుకుంటున్నా.. అని యార్లగడ్డ వెంకట్రావు ఓ ప్రకటనలో తెలిపారు. తన నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయరహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయి మండుటెండలో ప్రజల ఇబ్బంది తెలుసుకుని బాధపడ్డానని, అనివార్యంగా తలెత్తిన ఈ పరిస్థితికి చింతిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మున్ముందు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

పోలీసు ఆంక్షల మధ్య వర్లకుమార్‌రాజా నామినేషన్

పామర్రు : ఎస్సీ రిజర్వుడు పామర్రు అసెంబ్లీ స్థానానికి ఎన్డీయే బలపరచిన టీడీపీ అభ్యర్థిగా వర్ల కుమార్‌రాజా బుధవారం నామినేషన్ వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవికి నామినేషన్ పత్రాలను అందజేశారు. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీగా తరలిరాగా.. కుమార్‌రాజా సతీమణి విశ్రమ కుటుంబసభ్యులతో ఇంటి నుంచి బయలుదేరి యేసు మందిరంలో ప్రార్థనలు చేసి అనంతరం పెద్దల ఆశీస్సులు తీసుకుని అంకమ్మతల్లి దేవస్థానం సమీపంలోకి చేరుకోగా పోలీసులు ఆంక్షలు విధించడంతో బస్టాండ్ వెనుక నుంచి కోటిరెడ్డిపేటమీదగా నాలుగురోడ్ల కూడలికి వచ్చారు. అక్కడ పోలిసులు అడ్డగించడంతో కుమార్‌రాజా, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్‌లతో నడుచుకుంటూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని గోట్టిపాటి రామకృష్ణతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సామాన్య కుటుంబనుంచి వచ్చిన తనకు టిక్కెట్ ఇచ్చిన చంద్రబాబుకు విజయం బహూమతిగా ఇస్తానన్నారు. అఖండ మెజారిటీతో గెలుపొంది ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా డీవై దాస్ నామినేషన్

పామర్రు నియోజకవర్గ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డీవై దాసు బుధవారం నామినేషన్ పత్రాన్ని ఆర్వో శ్రీదేవికి అందజేశారు. తొలుత ఆయన ఇంటి నుంచి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు, కార్యకర్తలతో నేతలతోకలిసి ర్యాలీగా తరలివచ్చారు. జై భీమ్‌రావ్ భారత్‌పార్టీ అభ్యర్థిగా కొడాలి సునీల, వైసీపీ నుంచి కైలే జ్ఞానమణి రెండోసెట్ నామినేషన్లు అంద జేసినట్టు ఆర్వో తెలిపారు.

నేడు నామినేషన్లకు చివరి రోజు

» ఎన్టీఆర్ జిల్లాలో 176 దాఖలు

» పార్లమెంట్‌కు 21, అసెంబ్లీకి 155

» ఆరో రోజున రికార్డు స్థాయిలో 58

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నామినేషన్లకు నేడే చివరి రోజు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం నాటికి మొత్తం 176 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 21, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 155 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం మరో 24 నామినేషన్లు దాఖలైతే రెండొందలు దాటుతుంది. ఆరోరోజు రికార్డు స్థాయిలో 58 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో పార్లమెంట్ పరిధిలో 11, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 47 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం మినహాయిస్తే వరుసగా ఐదు రోజుల పాటు నామినేషన్ల జోష్ కనపడింది.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 11

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆరో రోజు మొత్తం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తరఫున కేశినేని శివనాథ్, కేశినేని జానకి లక్ష్మీలు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ తరపున కేశినేని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వల్లూరు భార్గవ్, నవతరం పార్టీ అభ్యర్థిగా వై.కృష్ణకిషోర్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఎం.వెంకటేశ్వరరావు, జై భీమ్‌రావు పార్టీ అభ్యర్థిగా దాట్ల లూర్దు మేరీ, జనరాజ్యం అభ్యర్థిగా డి.కుమారి, ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థిగా డి.రవీంద్రబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎం.వెంకటకనకారావు, పి.వెంకట అశోక్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకరవర్గ పరిధిలో మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి బీజేపీ అభ్యర్థిగా యలమంచిలి సత్యనారాయణ చౌదరి(సుజనాచౌదరి) రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా షేక్ కాజావలి, సీపీఐ అభ్యర్థిగా జి.కోటేశ్వరరావు, వైసీపీ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్, ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ అభ్యర్థిగా నాగెండ్ల దేవసహాయం, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోతిన వెంకటరామారావు, స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్ అభ్యర్థిగా కాకాని వెంకటేశ్వరరావు, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా రమణ ప్రసాద్ కొత్తమాసు, స్వతంత్ర అభ్యర్థులుగా వినోద్‌కుమార్ ఎర్రబత్తుల, లొల్ల చంద్రశేఖర్‌లు ఒక్కో సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు.

● సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున వెలంపల్లి శ్రీనివాసరావు, వెలంపల్లి శ్రీవాణిలు, టీడీపీ తరఫున బొండా ఉమామహేశ్వరరావు, బీఎస్‌పీ అభ్యర్థిగా ఐ.రాజేంద్రప్రసాద్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థిగా గొల్లపల్లి ఫణిరాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, వి.జయపూర్ణచంద్రరావు, కొణిజేటి ఆదినారాయణ, చంద్రశేఖర్ పెదపాటి దాసరి నాగరాజులు ఒక్కోసెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 7 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా గద్దె రామమోహన్, గద్దె క్రాంతి కుమారిలు, వైసీపీ తరపున దేవినేని అవినాశ్ నాలుగు సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి.నాంచారయ్య రెండు సెట్లు. జైభీమ్‌రావు పార్టీ భారత్ పార్టీ అభ్యర్థిగా ఎం.విజయశేఖర్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా జత్తి వసుంధర, స్వతంత్ర అభ్యర్థిగా సిద్దెల అవినాశ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

● ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో మొత్తం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా వసంత కృష్ణ ప్రసాద్ ఒక సెట్టు, బీసీవైపీ అభ్యర్థిగా ముప్పసాని భూ లక్ష్మి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా పి.ప్రకాష్‌బాబు, భూక్యా కోటేశ్వరరావు, పి.దాశరథిలు నామినేషన్లు వేశారు.

● తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా కొలికలపూడి శ్రీనివాస్, కోట పుల్లమ్మలు, బీసీవైపీ అభ్యర్థులుగా సీహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లాం తాంతియా కుమారి, స్వతంత్ర అభ్యర్థులుగా వి.మెహర్‌బాబా, కొర్లపాటి రవీంద్రబాబు, కొలికపోగు వెంకట్రావు, కె.కృష్ణయ్యలు ఒక్కోసెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం (టీడీపీ) అభ్యర్థిగా శ్రీరాం రాజగోపాల్ ఒక సెట్టు, వైసీపీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను మూడుసెట్లు, వైసీపీ తరపున సామినేని విమల నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా జిల్లేపల్లి సుధీర్‌బాబు ఒక సెట్టు నామినేషన్ వేశారు.

● నందిగామ అసెంబ్లీ నియెజకవర్గం పరిధిలో కేవలం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. వైసీపీ తరపున మొండితోక జగన్మోహనరావు రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు.

వైసీపీ ర్యాలీలో వలంటీర్

ఘంటసాల: తెలుగురావుపాలెం గ్రామ వలంటీర్ బుధవారం నిర్వహించిన వైసీపీ ర్యాలీలో పాల్గొన్నాడు. అవనిగడ్డలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి స్థానిక నేతలతో కలిసి వలంటీర్ తోడేటి వినయ్ వెళ్లాడు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా వలంటీర్ ర్యాలీలో పాల్గొనడం విశేషం. మండలంలో వలంటీర్లు ఎవరూ రాజీనామా చేయలేదని అధికారులు పేర్కొనడం గమనార్హం.



వైసీపీ ర్యాలీలో వలంటీర్ వినయ్ (సర్కిల్‌లో)

కృష్ణా జిల్లాలో 57 నామినేషన్లు

మచిలీపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలో ఆరోరోజైన బుధవారం 57నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు జనసేన పార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి రెండుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జైబీమ్‌రావు భారత్‌పార్టీ అభ్యర్థిగా పరిటాల వెంకటఫణిబాబు, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా గొల్లు కృష్ణ, సంతంత్ర అభ్యర్థులుగా సైకం భాస్కరరావు, దనేకుల గాంధీ ఒక్కోసెట్ నామినేషన్లను దాఖలు చేశారు.

● గన్నవరం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్, స్వతంత్ర అభ్యర్థులుగా గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, వల్లభనేని వంశీకృష్ణ, నర్నాల విజయదుర్గ, కొనగల శివదుర్గవరప్రసాద్, పొట్లూరి శ్రీదేవి నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావ్, రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే)అభ్యర్థిగా పొట్లూరి రవీంద్రకుమార్, తెలుగు రాజాధికార సమితి అభ్యర్థిగా తాడంకి జగదీశ్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

● పెడన నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరీష ఒక్కోసెట్ నామినేషన్లను దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా ఉప్పాలరాము, రెండు సెట్లు, ఉప్పాల హారిక మూడుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

● మచిలీపట్నం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కొల్లురవీంద్ర, కొల్లునీలిమ మూడుసెట్ల చొప్పున, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సౌదాడ బాలాజీ, కాంగ్రెస్‌పార్టీ తరపున అబ్దుల్ మతీన్ ఒకసెట్ నామినేషన్లను దాఖలు చేశారు.

● అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అందె శ్రీరామమూర్తి, రెండుసెట్లు, అందె శ్రీవాణి ఒకసెట్ చొప్పున నామినేషన్లను దాఖలు చేశారు. అంబెడ్కర్ జైబీమ్‌రావు భారత్‌పార్టీ అభ్యర్థిగా సముద్రాల అంబెడ్కర్, వైసీపీ అభ్యర్థులుగా సింహాద్రి రమేష్‌బాబు రెండుసెట్లు, సింహాద్రి వికాష్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మండలి వెంకట్రావ్ ఒక నామినేషన్‌ను దాఖలు చేశారు

● పెనమలూరు నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా జొన్నలగడ్డ సతీష్, మహాభారత్‌పార్టీ అభ్యర్థిగా మరదాని విజ్ఞయ్య నామినేషన్లను దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా జోగిరమేష్ నాలుగుసెట్‌లు, జోగి రాజీవ్ రెండుసెట్‌లు, టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ ఒక సెట్ నామినేషన్లను దాఖలు చేశారు.

● పామర్రు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా వర్ల కుమార్‌రాజా, వైసీపీ అభ్యర్థిగా కైలే జ్ఞానమణి, జైబీమ్‌రావ్ భారత్‌పార్టీ అభ్యర్థిగా కొడాలి సునీల, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డీవైదాస్, దోవారి అమర్నాథ్ ఒక్కో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు

● గుడివాడ నియోజకవర్గం జైబీమ్‌రావ్ భారత్‌పార్టీ అభ్యర్థిగా సింగవరపు జోసెఫ్, నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పంది నాగార్జున, స్వతంత్ర అభ్యర్థులుగా గుండాబత్తిన అంబెడ్కర్, ఏచూరి వేణుగోపాలరావు, మీడగ రాము ఒక్కోసెట్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

కస్టడీకి 'రాయి' కేసు నిందితుడు

» న్యాయవాది, తండ్రి సమక్షంలో విచారించాలని న్యాయమూర్తి ఆదేశం

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై రాయి దాడి కేసులో నిందితుడిగా ఉన్న వేముల సతీష్‌కుమార్‌ను న్యాయస్థానం మూడు రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చింది. దీనికి సంబంధించిన తీర్పును బుధవారం వెలువరించింది. గురువారం నుంచి శనివారం వరకు సతీష్‌కుమార్‌ను విచారించడానికి పోలీసులకు అనుమతించింది. న్యాయవాది, తండ్రి సమక్షంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించాలని షరతులు విధించింది.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

గుడివాడ : మంగళవారం టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము నామినేషన్ ర్యాలీలో బారికేడ్లను తొలగించి, అధికారుల ఆదేశాలను ధిక్కరించారనే కారణంతో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, నాయకులు తులసీబాబు, రమేష్‌లతో పాటు మరికొందరిపై సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ పి.గౌతమ్‌కుమార్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

రూ.6.50 లక్షలు తెలంగాణా మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 24 : తెలంగాణా రాష్ట్రం నుంచి ఆటోలో తరలిస్తున్న రూ.6.50 లక్షలు 100 మద్యం కేసులను (4800 బాటిల్స్) సెబ్ అధికారులు తక్కెళ్లపాడు వద్ద స్వాధీనం చేసుకున్నట్టు అసిస్టెంట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ సి.భార్గవ్ తెలిపారు. జగ్గయ్యపేట కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇబ్రహింపట్నం వరకు ఖమ్మం జిల్లా రఘునాథపల్లికి చెందిన ఆటో డ్రైవర్ బాణావత్ రవి(30)ని రూ.6వేలు కిరాయికి మాట్లాడుకుని ఇద్దరు వ్యక్తులు మద్యం తరలిస్తున్నారన్నారు. ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఆ ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ మణికంఠారెడ్డితో పాటు, ఎస్ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దాములూరు వద్ద 306 బాటిళ్లు..

నందిగామ : తెలంగాణా రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఇద్దరి నుంచి 306 మద్యం బాటిళ్లను నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మద్యం అక్రమ రవాణా సమాచారంతో సీఐ హనీఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దాములూరు వద్ద ఎస్ఐ దుర్గామహేశ్వరరావు సిబ్బంది కలిసి ఇద్దరు వక్తులు వాహనంలో మద్యం తెస్తుండగా పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.80

పశ్చిమలో 11 నామినేషన్‌లు

వన్‌టౌన్, ఏప్రిల్ 24: పశ్చిమ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఆరవరోజైన బుధవారం 11 మంది అభ్యర్థులు భవానీపురంలోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి తరఫున కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, అడ్డూరి శ్రీరామ్, వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తరఫున పి.శ్రీనివాసరావు నామినేషన్‌లు చేయగా సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ తరఫున షేక్ ఖాజావలీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఎన్. దేవసహాయం, జైభారత్ నేషనల్ పార్టీ తరఫున పోతిన రామారావు, ఇండిపెండెంట్‌గా వై.వినోద్‌కుమార్, స్టూడెంట్ యునైటెడ్ నేషన్ పార్టీ తరఫున కొణికి వెంకటేశ్వరరావు, సమాజ్ వాది పార్టీ తరఫున కె.రమణప్రసాద్, ఇండిపెండెంట్‌లుగా లొల్ల చంద్రశేఖర్, మరొకరు నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్‌లను పశ్చిమ రిటర్నింగ్ అధికారి కిరణ్మయి స్వీకరించారు.

బీజేపీ కార్యకర్తలు పెద్దన్న పాత్ర పోషించాలి

పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 24: బీజేపీ కార్యకర్తలు పెద్దన్న పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ కార్యకర్తలకు కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి సూచించారు. బుధవారం భవానీపురం బీజేపీ కార్యాలయంలో జరిగిన బూత్‌స్థాయి సమావేశంలో సుజనాచౌదరి మాట్లాడారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీ-జనసేన కార్యకర్తలను కలుపుకుంటూ పనిచేయాలని సూచించారు. పార్టీ పరంగా ఎవరికేమి చేయాలో తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ సింగ్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు శేఖర్, పైలా సోమినాయుడు, యామిని, టీడీపీ సీనియర్ నాయకులు ఎంఎస్ బేగ్, జనసేన నాయకురాలు రజని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుజనా చౌదరి

అన్న విజయం కోసం సోదరి విస్తృత ప్రచారం

భవానీపురం: పశ్చిమ బీజేపీ అభ్యర్థి వై.సుజనా చౌదరీ సోదరి ధనలక్ష్మి అన్న విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం భవానీపురంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. 41వ డివిజన్‌లోని మసీదు వీధి, ఆశ్రమం వీధి, రంగూన్ సాహెబ్ వీధి, కరకట్ట వీధి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన సోదరుడిని భారీ మెజార్టీతో గెలిపిస్తే అన్ని సమస్యలను సత్వరం పరిష్కరిస్తారని ధనలక్ష్మి వివరించారు. ఎలువురు మాజీ కార్పొరేటర్లు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల మద్దతు

విద్యాధరపురం: పశ్చిమ కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ద్వారానే తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్ముతున్నట్లు అందుకే ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. బీజేపీ ఎన్నికల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సమావేశంలో సంఘం అధ్యక్షుడు కే.వీ రామారావు మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం, తమ డిమాండ్లు రాబోయే టీడీపీ ప్రభుత్వంలో నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముప్పిడి రాము, కే.శ్రీను, పి.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ ఓటమిని తూర్పు ప్రజలు తేల్చేశారు

గద్దె ఎన్నికల ప్రచారంలో అమ్మిశెట్టి వాసు

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 24: గద్దె రామ్మోహన్ నామినేషన్‌లో ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా ఉండి, ఎదురొచ్చి హారతులు ఇచ్చి, ర్యాలీ 4గంటలు సాగితే, అవినాష్ నామినేషన్‌లో జనం లేక గంటలో నామినేషన్ ర్యాలీ ముగిసిందని, నామినేషన్‌లోనే అవినాష్ ఓటమిని తూర్పు ప్రజలు తేల్చేశారని జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు పేర్కొన్నారు. గద్దె రామ్మోహన్ బుధవారం సాయంత్రం 16వ డివిజన్‌లో అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకుడు నాగేశ్వరరావులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని అన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు ప్రజలు గమనిసున్నారని, ఆయనకు సరైన సమాధానం చేప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గద్దె రామ్మోహన్, అమ్మిశెట్టి వాసు తదితరులు

భారతీనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ లూర్దు నగర్‌లో బుధవారం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పునియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, బండి కోమలి, పూలదాసు మారుతీ మోహన్, శ్రీను నాయుడు, గద్దె రమేష్, ఈశ్వర్ పేరేపి పాల్గొన్నారు. **మాచవరం:** 6వ డివిజన్‌లోని రావిచెట్టు సెంటర్ ప్రాంతంలో బుధవారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, గద్దె క్రాంతిలు టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలంతా సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పడాల గంగాధర్, శ్రీను, అప్పలరాజు, గోవింద్, కరుణకుమారి, వసంతరాయులు, బ్రహ్మం, ప్రసాద్, సోమినాయుడు, దుర్గారావు, వాసు, సాయి పాల్గొన్నారు.

దోపిడీ జగన్‌ను ఇంటికి పంపాలి

● మధురానగర్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

మధురానగర్, ఏప్రిల్ 24: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే దోపిడియే లక్ష్యంగా పాలన చేస్తున్న జగన్‌కు ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటేసి గుణపాఠం చెప్పాలని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) భార్య కేశినేని జానకీ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 29వ డివిజన్ మధురానగర్ సాయిబాబా కాలనీ, గద్దె బాబురావు రోడ్డు, రాగం మస్తాన్‌రావు రోడ్డులో ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించి సూపర్ సిక్స్ పేరిట ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. డివిజన్ చిరంజీవి యువత నాయకుడు శ్యాంప్రసాద్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, కార్యదర్శి నూరి, సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు, మనిముక్కు శ్రీనివాస్, అరవింద్, ప్రసాద్, నారాయణమూర్తి, ఝాన్సీ, మాధవి, నోవా, రత్తయ్య, జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, భవానీ, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

రాష్ట్ర ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి

పాయకాపురం: మద్యపాన నిషేధ హామీని విస్మరించిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేశినేని జానకీ లక్ష్మి డిమాండ్ చేశారు. 60వ డివిజన్ వాంబేకాలనీలో బుధవారం మహిళా చైతన్య యాత్రను ఆ పార్టీ నేతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె కాలనీలోని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్ బ్లాక్‌లలో పర్యటించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు మోసపోయిన విధానాన్ని స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ తమను నమ్మించి మోసం చేసిన జగన్‌కు త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బొండా ఉమా, బొండా సుజాత, స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు అమల్‌రెడ్డి



విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 24: హరియాణలోని గురుగ్రామ్‌లో ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించే జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలకు నగరంలోని ఐజీఎంసీలో బాస్కెట్‌బాల్ కోచ్ ఎస్.సంతోష్ కుమార్ వద్ద శిక్షణ పొందుతున్న ఎ.అమల్‌రెడ్డి ఎంపికయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో ఇటీవల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన అమల్‌రెడ్డి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో డీఎస్‌డీవో ఎస్ఏ.అజీజ్, కోచ్ సంతోష్‌లు బుధవారం అమల్‌రెడ్డిని అభినందించారు.

సెంట్రల్ అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యం: బాబూరావు

పాయకాపురం, ఏప్రిల్ 24 : సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యమని సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు అన్నారు. 64వ డివిజన్ బర్మాకాలనీలో సీపీఎం నేతలు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో కంకి, కొడవలి గుర్తుపై ఓటు వేసి సీపీఎంను గెలిపించాలని కోరారు. కేవీ భాస్కరరావు, కె. శ్రీదేవి, కె. దుర్గారావు, ఝాన్సీ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలి

పాత రాజరాజేశ్వరిపేట, ఏప్రిల్ 24 : 55వ డివిజన్‌లో ఎన్డీయే కూటమి నేతలు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేశినేని శ్రీదేవి డివిజన్‌లోని కంసాలిపేట, నైజం గేట్, రెల్లీస్ టెంపుల్, అబ్దుల్ సత్తార్ వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలపై మాట తప్పిన విధానాన్ని స్థానికులకు వివరించారు. అనంతరం కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులైన సుజనా చౌదరికి కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వైసీపీ, బీజేపీ దొందూ దొందే

● పశ్చిమ జై భారత్ పార్టీ అభ్యర్థి పోతిన వెంకట రామారావు

వన్‌టౌన్, ఏప్రిల్ 24: వైసీపీ, బీజేపీ దొందూ దొందేనని ఈ రెండు పార్టీలలో ఎవరికి ఓటేసినా ఒకటేనని పశ్చిమ నుంచి జైభారత్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతిన వెంకట రామారావు(రాము)అన్నారు. ఎన్నికల ప్రచారం క్రమంలో బుధవారం దూది ఫ్యాక్టరీ సందు, బూరాడవారి వీధి, చేపల మార్కెట్, కొత్తపేట ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ప్రజ లకు బ్యాలెట్ పేపర్లు, తన పేరు ఎదురుగా ఉండే గుర్తును తెలియజేయడం కోసం టార్చిలైట్‌ను ఓటర్లకు చూపించి ఈ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పశ్చిమ సమస్యలను తాను అధ్యయనం చేశానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాము హామీ ఇచ్చారు.

కరపత్రాల పంపిణీపై కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 24 : వారం రోజుల క్రితం పాయకాపురం 62వ డివిజన్‌లో నవమోసాలు పేరుతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేసిన విషయమై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వైసీపీ పాలనలో జరిగిన మోసాలను వివరిస్తూ కరపత్రాలను ప్రచురించి స్థానికంగా పంపిణీ చేశారు. ఈ విషయమై ఎన్నికల అధికారులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కరపత్రాలు ముద్రించిన ఏపీ ప్రింటర్స్, ప్రచురణ కర్త సీహెచ్ శ్రావణ్‌కుమార్‌లపై కేసు నమోదు చేశారు.

శనైశ్చరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ

వన్‌టౌన్, ఏప్రిల్ 24: కృష్ణానదీ తీరాన సీతమ్మ పాదాల వద్ద ప్రత్యేక శనైశ్చరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. తుని తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు తూటుపల్లి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విగ్రహాల పునః ప్రతిష్ఠతోపాటు ధ్వజస్తంభ ఆవిష్కరణ, అన్నదానం చేశారు. దేవస్థానం ఈవో వి.వెంకటకృష్ణారావు, దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఆర్‌జేసీ ఎం.వి జయరాజు, ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శాంతి, విజయవాడ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కేవీ అనురాధ, దేవదాయశాఖ ఎస్ఈ జీవీఆర్ శేఖర్, ఈఈ టి.దుర్గేశ్‌కుమార్, డీఈ డి.గోపాలకృష్ణంరాజు, ఏఈ డి.నాగేంద్ర కుమార్, దాత తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 24 : సెంట్రల్ నియోజకవర్గ నగర సాధికారిక సమితి కన్వీనర్‌గా నియమితుడైన ఎన్. నరసింహంకు బొండా ఉమా నియామక పత్రాన్ని అందించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే నగర కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి నగరుల ఆర్థికాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు.

ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై ముగిసిన సమావేశం

భారతీనగర్, ఏప్రిల్ 24: లయోల కళాశాలలో ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో జీవితం, సామాజిక అంశాలకు సంబంధించి రెండు రోజులు నిర్వహించిన ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై జాతీయ సమావేశం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కేఆర్‌యూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయకుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఫాదర్ సగయరాజ్, వైస్ ప్రిన్సిపాల్ కె.ఎం. ప్రభుదాస్, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

41, 42, 45 పోలింగ్‌బూత్‌ల పరిధిలో టీడీపీ నేతల ప్రచారం

విద్యాధరపురం, ఏప్రిల్ 24: పశ్చిమలోని భవానీపురం ప్రాంతంలో 40వ డివిజన్ పరిధిలోని 41. 42, 45 పోలింగ్ బూత్‌లలో బుధవారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్న వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో 45వ బూత్ ఇన్‌చార్జ్ గాడు గణేష్ బాలభాస్కర్‌నగర్‌లోని 70 కుటుంబాలను కలిసి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనా చౌదరికి కమలం గుర్తు పైన, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని)కు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా 150 మంది ఓటర్లను వెరిఫికేషన్ చేశారు. 41వ బూత్ ఇన్‌చార్జ్ కందికంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలభాస్కర్ నగర్‌లోని 70 కుటుంబాలను కలిసి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కూటమి అభ్యర్థులు కేశినేని శివనాథ్; సుజనా చౌదరిలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. 180 మంది ఓటర్లను కలిసి ఓటర్ వెరిఫికేషన్ నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జ్ గంగవరపు సురేష్, డివిజన్ ప్రెసిడెంట్ చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. 42వ బూత్ ఇన్‌చార్జ్ చీద నాగరాజు ఆధ్వర్యంలో అల్లుడుపేటలోని 70 కుటుంబాలను కలిసి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 175 మంది ఓటర్లను వెరిఫికేషన్ చేశారు.



బూత్ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో ప్రచారం

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

● ఓటుపై అవగాహన ర్యాలీలో డాక్టర్ జి.సమరం



ర్యాలీలో కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, ప్రముఖ వైద్యుడు సమరం తదితరులు

వన్‌టౌన్, ఏప్రిల్ 24: ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతొందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు అవగాహన ర్యాలీని బుధవారం కొత్తపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవు తుందన్నారు. యువజన సర్వీసు శాఖ జిల్లా అధికారి, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ పవిత్రమైన ఓటుహక్కును ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. తొలుత ర్యాలీని కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. పశ్చిమ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్ఎన్ రెడ్డి, నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కీర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్‌సాంబశివరావు, కల్మబేగం పాల్గొన్నారు.

తూర్పు కాంగ్రెస్ అభ్యర్థిగా పొనుగుపాటి నాంచారయ్య నామినేషన్

వన్‌టౌన్, ఏప్రిల్ 24: విజయవాడ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పొనుగుపాటి నాంచారయ్య నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఆయన మారుతీనగర్‌లోని ఆయన నివాసం నుంచి ర్యాలీగా వెళ్లి బందర్‌రోడ్డులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న తూర్పు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆయన వెంట ప్రముఖ న్యాయవాది మనోజ్‌కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావులు ఉన్నారు.



ఆర్‌వోకు నామినేషన్ సమర్పిస్తున్న పొనుగుపాటి నాంచారయ్య

పద్యనాటక వైభవాన్ని చాటిన శ్రీనివాస కల్యాణం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 24: హనుమంత రాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన శ్రీనివాస కల్యాణం పద్యనాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. సుబ్బరాజు కళాపరిషత్తు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. నంది అవార్డు గ్రహీత కోనేటి సుబ్బరాజు దీన్ని రచించారు. వేంకటేశ్వరస్వామి చరిత్రను తెలుపుతూ నటీనటులు పాత్రోచితంగా నటించి మెప్పించారు. భృగు మహర్షిగా కోనేటి సుబ్బరాజు, బ్రహ్మగా జింకా నారాయణస్వామి, శివునిగా శ్రావణి, మహావిష్ణువుగా ఆమూరి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసుడిగా ఓలేటి చంద్రబాబు నాయుడు, పద్మావతిగా సురభి హారిక, ధరణిదేవిగా శశికళ, సరస్వతిగా సురభి పూజిత, వకుళామాతగా శోభారాణి నటించారు.

ఫ్లాగ్‌మార్చ్

చిట్టినగర్: రాబోయే ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ పోలీసులు బుధవారం వైఎస్సార్ కాలనీలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఏసీపీ పడాల మురళీకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ తిప్పా గణేష్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, శాంతిభద్రతల పోలీసులు ఈ కవాతు నిర్వహించారు.

నీళ్లు ఇవ్వండి...

దేవనబోయిన వెంకటేశ్వరరావు గ్రామస్థుడు, రామకృష్ణాపురం



ఐదేళ్లుగా కోడూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని ఇరాలి, ఊటగుండం, రామకృష్ణాపురం, బసవవానిపాలెం గ్రామాల ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఎన్ని వినతులిచ్చినా సమస్య తీరటం లేదు. మా సమ స్యకు శాశ్వత పరిష్కారం చూపే వారికే ఈ ఎన్నికల్లో మా ఓటు. - **కోడూరు**

..రోడ్డు వేయండి

కుంపటి రమేష్, గ్రామస్థుడు, మల్లాయిచిట్టూరు .



ఐదేళ్లుగా సరైన రహదారి లేదు.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఘంటసాల నుంచి మల్లాయి చిట్టూరు వెళ్లే 5 కిలోమీటర్ల రహదారి అధ్వాన్నంగా తయారైంది. గత ఎన్నికల ముందు రహదారిపై మెటీరియల్ పర్చగా, ఎన్నికల కోడ్ రావటంతో ఆగిపోయింది. ఐదేళ్లుగా నరకం అనుభవిస్తున్నాం. వెంటనే రహదారి నిర్మించాలి.- **ఘంటసాల**

ఓటరు నాడి



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆగిన ఉదయభానుకు చెందిన వాహనం

ఉల్లంఘనులు

- నందిగామ రోడ్డు పొడవునా ర్యాలీ, డీజేలతో మోత మోగించిన కార్యకర్తలు
- జగ్గయ్యపేటలో తహసీల్దార్ కార్యాలయం వరకు వైసీపీ నేతల కార్ల ర్యాలీ

నందిగామ/జగ్గయ్యపేట: నామినేషన్ల సందర్భంగా నందిగామ, జగ్గయ్యపేట పోలీసులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 22న ఎన్డీఏ అభ్యర్థి తంగిరాల సౌమ్య నామినేషన్ సందర్భంగా కట్టుదిట్టమైన ట్రాఫిక్ నిబంధనలు విధించిన పోలీసులు బుధవారం జగ్గయ్యపేట, నందిగామలో వైసీపీ అభ్యర్థులు సామినేని ఉదయభాను, డాక్టర్ మొండితోక జగన్మోహనరావు నామినేషన్ సందర్భంగా ఈ నిబంధనలన్నీ గాలికొదిలేశారు. అయా పట్టణాల్లో ఎక్కడా ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు లేవు. నందిగామలో రెండు రోజుల క్రితం సౌమ్య నామినేషన్ సందర్భంగా వెబ్‌కెమెరా వాహనాలతో పాటు సెల్ కెమెరాలతో ర్యాలీని చిత్రీకరిస్తూ ఎన్డీఏ కార్యకర్తలు ఒకింత భయాందోళలకు గురయ్యేలా ప్రవర్తించిన పోలీసులు వైసీపీ ర్యాలీలో ఏ కెమెరాకూ పని చెప్పలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ పట్టణం డీజే సౌండ్‌తో హోరెత్తింది. కానీ ఏ స్థాయి పోలీసు అధికారీ నిలువరించలేదు. రోడ్డు పొడవునా బాణాసంచా కాలుస్తూ కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు. పేలుతున్న బాణాసంచా చూస్తూ నిలబడిన పోలీసులు ఎవరినీ వారించలేకపోయారు. చివరకు గాంధీ సెంటర్‌లోని మహాత్ముడి విగ్రహంపైకి ఎక్కి పార్టీ జెండాలతో నినాదాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అంతా పూర్తయ్యాక సాయంత్రం తాపీగా 7 డీజేలు, 2 జనరేటర్లు, ఒక ఆటో సీజ్ చేశారు. పొట్టకూటి కోసం డీజేలు, ఆటోలు తిప్పుకొనే వారిపై తమ ప్రతాపం చూపించారు. బతుకుదెరువు కోసం పాకులాడేవారిపై కేసులు నమోదు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. అలాగే జగ్గయ్యపేటలో తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన జరిగింది. బుధవారం ఉదయం వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను, ఆయన బంధువుల కార్లను నామినేషన్లు స్వీకరించే తహసీల్దార్ కార్యాలయం గేటు వరకు అనుమతించారు. గతంలో ఎవరు నామినేషన్లు వేసిన ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు, ఇటు బాలుర హైస్కూల్ వరకు 100 మీటర్ల వరకు ఆపేసేవారు. అధికార పార్టీ నేతలకు మాత్రం పోలీసులు, అధికారులు నిబంధనలు సడలించి పంపటం విమర్శకులకు దారి తీసింది. -



మహాత్ముడి విగ్రహం పైకి ఎక్కిన వైసీపీ కార్యకర్తలు

జిల్లా రాజకీయాలకు ఒకప్పుడు తిరువూరు నియోజకవర్గం కేంద్ర బిందువుగా ఉండేది. జిల్లాకు చెందిన రాజకీయ దురంధరులు కాకాని వెంకటరత్నం, మండలి వెంకట కృష్ణారావు, చనమోలు వెంకట్రావు, తిమ్మారెడ్డి, కొత్త రాఘవయ్య వంటి నేతలు పట్టణంలోని మండల పరిషత్ అతిథిగృహంలో బస చేసి జిల్లాకు సంబంధించిన రాజకీయ మంతనాలు సాగించేవారు. అటువంటి చరిత్ర ఉన్న తిరువూరు నియోజకవర్గం నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పోటీదారులుగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థిగా నల్లగట్ల స్వామిదాసు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఉపముఖ్యమంత్రి కోనేరు రంగారావు కుమార్తె లాంతాంతియాకుమారి, బీఎస్పీ తరుపున లక్కిపోగు వందనకుమార్ పోటీలో ఉన్నారు. 1994 నుంచి 2019 వరకు వరుసగా తెలుగుదేశం పార్టీ నుంచి ఆరుసార్లు పోటీ చేసిన నల్లగట్ల స్వామిదాసు కేవలం 1994, 1999లో మాత్రమే గెలుపొందారు. అప్పటి నంచి 4సార్లు పోటీ చేసి ఓటమి పాలవడంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో స్వామిదాసు అభ్యర్థిత్వానికి చంద్రబాబు సుముఖం చూపలేదు. దీంతో ఆయన పార్టీని ధిక్కరించి వైసీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు. దీంతో అప్పటి వరకు రెండుసార్లు వైసీపీ నుంచి గెలిచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కొక్కిలిగడ్డ రక్షణనిధి కనుమరుగైపోయారు. ఇక అమరావతి ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి అందరి మన్ననలను అందుకున్న కొలికిపూడి శ్రీనివాసరావును టీడీపీ అభ్యర్థిగా అధినేత ప్రకటించారు. వీరిద్దరి మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. - తిరువూరు


- టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా కొలికిపూడి శ్రీనివాస్
- వైసీపీ తరపున నల్లగట్ల స్వామిదాస్, కాంగ్రెస్ అభ్యర్థిగా తాంతియాకుమారి

తిరువూరు ఎవరిదో..?









పేట రామారావు



కోనేరు రంగారావు

1952లో తిరువూరు నియోజకవర్గంగా ఏర్పడిన తొలి ఎన్నికల్లో తండ్రీ, కొడుకుల మధ్యే ప్రధానంగా పోటీ ఉండేది. కాంగ్రెస్ అభ్యర్థిగా పేట బాపయ్య పోటీలో ఉండగా కమ్యూనిస్టు పార్టీ నుంచి బాపయ్య కుమారుడు పేట రామారావు పోటీ పడ్డాడు, హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో తండ్రిపై కుమారుడు రామారావు 21,673 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేను కమ్యూనిస్టుల ఖాతాలో వేయడంతోపాటు ఇప్పటి వరకు ఏ పార్టీ అభ్యర్థి సాధించలేని భారీ మెజార్టీని ఆయన సాధించారు. 1955లో జరిగిన ఉప ఎన్నికల్లో తిరిగి తండ్రీ కొడుకులు పోటీ చేయగా, కొడుకుపై తండ్రి పేట బాపయ్య గెలుపొందారు. 1962 వరకు జనరల్ సీటుగా ఉన్న తిరువూరు 1967 నుంచి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మార్పు చెందింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి ఒక్కసారి కమ్యూనిస్టులు, కాంగ్రెస్ అభ్యర్థులు 8సార్లు, టీడీపీ అభ్యర్థులు 4 సార్లు, వైసీపీ అభ్యర్థులు 2 సార్లు ప్రాతినిధ్యం వహించారు. 1952లో నియోజకవర్గం ఏర్పడిన తరువాత జరిగిన ఎన్నికల్లో పేట రామారావు (సీపీఐ) 1955 మధ్యంతర ఎన్నికలు, 1962లో జరిగిన స్వార్వత్రిక ఎన్నికల్లో పేట బాపయ్య(కాంగ్రెస్) గెలుపొందారు. 1967 నుంచి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మార్పు చెందిన తరువాత వేముల కూర్మయ్య గెలుపొందగా, 1972లో కోట రామయ్య (కాంగ్రెస్) 1978లో వక్కలగడ్డ ఆదాం (కాంగ్రెస్) 1983లో మిరియాల పూర్ణానందం (టీడీపీ) 1985లో పిట్టా వెంకటరత్నం (టీడీపీ) గెలుపొందారు. 1989, 2004లో జరిగిన ఎన్నికల్లో కోనేరు రంగారావు గెలుపొంది మొదటి విడత సాంఘిక సంక్షేమం, దేవదాయశాఖ మంత్రిగా తదుపరి 2004లో హోంశాఖ, ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1994, 1999లో నల్లగట్ల స్వామిదాసు (టీడీపీ), 2009లో దిరిశం పద్మజ్యోతి (కాంగ్రెస్), 2014 కొక్కిలిగడ్డ రక్షణనిధి (వైసీపీ), 2019 కొక్కిలిగడ్డ రక్షణనిధి (వైసీపీ) గెలుపొందారు.

4 మండలాల పరిధిలో నియోజకవర్గం



తిరువూరు నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలో విస్తరించింది. గతంలో ఈ నియోజకవర్గం పరిధిలో చాట్రాయితో పాటుగా, రెడ్డిగూడెం మండలానికి చెందిన కొన్ని గ్రామాలుండేవి, నియోజకవర్గం పునర్విభజన నేపథ్యంలో చాట్రాయి నూజివీడు పరిధిలోకి వెళ్లగా, తిరువూరు, విస్సన్నపేట. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాలతో ఈ నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గంలో 205476 మంది ఓటర్లున్నారు. ఇక్కడ పురుష ఓట్ల కంటే మహిళా ఓట్లు 2815 ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 22న ప్రకటించిన జాబితాలో మొత్తం 205476 ఓట్లు నమోదు అయినట్టు అధికారులు ప్రకటించారు.

వ్యవసాయమే జీవనాధారం

మెట్టప్రాంతమైన ఈ నియోజకవర్గంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తుంటారు. తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో వరి సాగు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో పత్తి, మర్చి సాగు అధికంగా ఉంటుంది. మిర్చి తోటల కోతల సమయంలో తిరువూరు సమీపంలోని ఖమ్మం జిల్లా ప్రాంతానికి చెందిన కూలీలు పనులకు వస్తుంటారు. ఈ నియోజకవర్గంలో సాగునీటి వనరులు లేక పంటల దిగుబడి తగ్గిపోతుండటంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరక్క భవన నిర్మాణ పనులకు వెళుతుంటారు. ప్రస్తుతం ఇసుక కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఇటు వ్యవసాయ కూలీలు, అటు భవన నిర్మాణ కార్మికులు పనులు దొరక్క వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో గెలిచినవారైనా తమ

ప్రత్యేక రాష్ట్రంగా గానుగపాడు..?

ప్రస్తుతం తిరువూరు మండలంలో ఉన్న గానుగపాడు గ్రామం గతంలో తెలంగాణకు చెందిన మధిర తాలుకాలో ఉండేది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి గానుగపాడుతో పాటుగా సమీప గ్రామాలైన పల్లెర్లమూడి, చౌటపల్లి, టేకులపల్లి, జి.కొత్తూరు, చిక్కుళ్లగూడెం గ్రామాలు నిజాం నవాబుల పాలనలో ఉండేవి. ఆయన తమ ప్రభుత్వాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి నిరాకరించడంతో కొందరు సమరయోధులు ఈ ఆరు గ్రామాలకు చెందిన ప్రజల్లో చైతన్యం నింపి గానుగపాడు రిపబ్లిక్ పార్టీ స్థాపించి గానుగపాడు కేంద్రంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యమంత్రి, గవర్నర్ మరికొందరు మంత్రులుగా వ్యవహరిస్తూ నిజం నవాబులపై తిరుగుబాటు ప్రకటించారు. అప్పట్లో తమ స్వయరక్షణకు ఆయుధాలు తయారు చేసుకునేవారని చెబుతుంటారు. ఈ గ్రామం మీదుగా ఆంధ్రలోకి వచ్చే వివిధ రకాల సరుకులు రవాణ సందర్భంగా పన్నులు వసూళ్లు చేసేందుకు నిజాం నవాబులు నిర్మించిన సరిహద్దు తనిఖీ కేంద్రం (చెక్‌పోస్టు) ఇప్పటి ఉంది. ప్రస్తుతం ఈ భవనాన్ని రెవెన్యూ శాఖ వినియోగిస్తోంది. నైజం నవాబులకు సంబంధించిన కొన్ని భవనాలు శిథిలమవడంతో వాటిని తొలగించారు. అత్యధికంగా స్వాతంత్ర్య సమరయోదులున్న గ్రామంగా గానుగపాడుకు పేరుంది.



గానుగపాడులో నిర్మించిన టానా (చెక్‌పోస్టు)

రూ.5వేలన్నాడు.. మళ్లీ కనిపిస్తే ఒట్టు..!

అధికారంలోకి రాగానే సుబాబుల్ సమస్య తక్షణమే పరిష్కరిస్తామని, టన్ను కర్రకు రూ. 5వేలకు తగ్గకుండా ధర ఇస్తామని నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ రైతులకు భరోసా ఇచ్చారు. దీంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. గిట్టుబాటు ధర లభిస్తుందని, తమ కష్టాలు తొలగిపోతాయని ఆశపడ్డారు. తీరా ఆయన అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానం నీటిపై బుడగలా తయారైంది. రైతుల ఆశలు అడియాశలయ్యాయి. సుబాబుల్ గురించి అణుమాత్రం కూడా సీఎం జగన్ పట్టించుకోలేదు. కనీసం ఈ విషయం గుర్తులేదు. -కంచికచర్ల



ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాల్లో సుబాబుల్ తోటలున్నాయి. కాగితం తయారీకి ముడి పదార్థంగా వినియోగించే సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధర లభించటం లేదు. మార్కెట్లో పేపరు మిల్లులు ఇచ్చిందే ధర అన్నట్టుగా తయారైంది. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ నందిగామ వచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే సుబాబుల్‌కు రూ.5వేలు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని బిగ్గర స్వరంతో వాగ్దానం చేశారు. తీరా అధికారంలోకి రాగానే సుబాబుల్ రైతులకు పంగనామాలు పెట్టారు. రూ.5వేలు కాదు కదా, కనీసం రూ.2వేలు కూడా ఇవ్వలేదు. గిట్టుబాటు ధర లభించక రైతులు నిలువుదోపిడీకి గురైనప్పటికీ పట్టించుకోలేదు. దీంతో రైతులు రోడ్డెక్కి పలుమార్లు ఆందోళన చేసినా స్పందన శూన్యం. గత్యంతరం లేక అయినకాడికి తెగనమ్ముకోవటంతో ఎకరానికి రూ.75వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. నాలుగేళ్లలో సుబాబుల్ రైతులు రూ.4000 కోట్లకు పైగా నష్టపోయారు. వాస్తవానికి మార్కెట్లో ధర ఇంకా దిగజారింది తప్పితే రైతులకు ఏలాంటి ప్రయోజనం కలగలేదు. టన్ను కర్రకు మద్దతు ధర రూ.4,400, ఖర్చులు పోగా రైతుకు నికరంగా రూ.3,600 అందాలి. అలాంటిది 2019 నుంచి 2023 మార్చి వరకు రూ. 2వేలు కూడా అందలేదు. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా పాలకులు స్పందించలేదు. సుబాబుల్‌ను గాలికొదిలేయటంతో పలువురు రైతులు నిస్సహాయ స్థితిలో టన్ను రూ.1500కే తెగనమ్ముకున్నారు. తీవ్రంగా నష్టపోయిన కొందరు రైతులు ఏకంగా తోటలను తొలగించారు. అయినప్పటికీ సీఎం జగన్‌లో ఏమాత్రం చలనం లేదు. తనకేం తెలియదన్నట్టుగా ఆయన మౌనం దాల్చారు. 2019 ఎన్నికల్లో తప్పితే మరోసారి సుబాబుల్ గురించి నోరు విప్పలేదు. గిట్టుబాటు ధర గురించి మాట్లాడలేదు. సీఎం జగన్‌కు తోడన్నట్టుగా స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు వ్యవహరించారు. ఎన్నికలకు ముందు మొండితోక సుబాబుల్ రైతుల కోసం పాదయాత్ర చేశారు. తర్వాత ఆయన కూడా సీఎం జగన్‌కు పోటీగా మౌనం దాల్చారు.



వందల కోట్లు నష్టం

సాధారణంగా రెండున్నరేళ్ల నుంచి మూడేళ్ల లోపులో సుబాబుల్ తోట నరుకుతారు. ఎకరానికి 25 నుంచి 30 టన్నుల లోపు కర్ర దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 50 వేల ఎకరాలకు తగ్గకుండ సుబాబుల్ తోటలున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ప్రతి తోట నరికారు. జగన్ వాగ్దానం మేరకు ధర రూ.5వేలు దక్కాల్సి ఉండగా, రూ.2వేల లోపు మాత్రమే వచ్చింది.


తగ్గిన సరఫరా.. పెరిగిన ధర

ఈ నేపథ్యంలో రైతుల అదృష్టం కొద్దీ పాలకుల ప్రమేయం లేకుండానే గత ఏడాది మార్చి నుంచి సుబాబుల్ ధరలో కదలిక ప్రారంభమైంది.

పేపరు మిల్లులకు సరఫరా తగ్గటంతో కర్రకు డిమాండ్ ఏర్పడింది. ఇక మార్చి నెల నుంచి మార్కెట్లో ధర పెరుగుతూ వచ్చింది. గత అక్టోబరు నుంచి రైతులకు టన్నుకు రూ. 5వేలు వంతున .ధర అందుతోంది.

తీవ్రంగా నష్టపోయాం

గుదే వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల



తక్కువ ధరకు అమ్ముకోవటం వల్ల ఎక్కువ మంది రైతులు ఎకరానికి రూ.75వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోయారు. టన్ను కర్రకు రూ.2వేలు కూడా అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఖర్చులు కూడా దక్కని దుస్థితి నెలకొంది. దీంతో కొంత మంది రైతులు ఏకంగా తోటలనే తొలగించారు.

బూటకపు వాగ్దానం

వాసిరెడ్డి ప్రసాద్, కోనాయపాలెం



రూ.5వేల ధర ఇస్తామంటూ జగన్ బూటకపు వాగ్దానం చేశాడు. ఎన్నికల్లో గెలవగానే సుబాబుల్ రైతుల ప్రస్తావనే లేదు. గిట్టుబాటు ధర ఇప్పించటంలో స్థానిక ఎమ్మెల్యే సైతం విఫలమయ్యారు. తోటలు తొలగించటంతో కర్ర ఉత్పత్తి తగ్గటం వల్ల ధర పెరిగిందేకానీ పాలకులు చేసింది శూన్యం.

మా వర్గం మద్దతు మీకే...

మాకు ఏం ఇస్తారు..?

- సామాజికవర్గ నేతల డిమాండ్లతో అభ్యర్థుల బేజారు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నికల్లో విజయం సాధించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సామాజికవర్గ సమీకరణాల ఆధారంగా హామీలిస్తుంటారు. ఇక్కడ వరకూ బాగానే ఉం ది. ఆయా సామాజికవర్గాలకు చెందిన కొందరు నేతలు తమ వర్గం ఓట్లు వే యించాలంటే మాకెంత ఇస్తారంటూ భేరసారాలు మొదలుపెట్టడంతో ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి రూ.5 నుంచి రూ.10 లక్షలతోపాటు అన్ని ఖర్చు లు పెట్టుకోవాలంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఒప్పుకోకుంటే మాకు గౌరవం ఇవ్వట్లేద ని బురద జల్లడం ఆనవాయితీగా మారింది. వీరి కి డబ్బులిస్తే ఓట్లు వేయించగలరా లేదా అని అభ్య ర్థులు ఎంక్వరీ చేయించుకుని ఓట్లు రాలతాయనుకుం టే మొదట కొంత మొత్తం ఇచ్చేందుకు సిద్ధమౌతున్నట్టు వినికిడి.



విచిత్ర ప్రచారం

జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు. గన్నవరం నియోజవకర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ సందర్భంగా ఆయా పార్టీల కార్యకర్తలు తమ ఒంటిపై పెయింటింగ్‌తో చిత్రాలు గీసుకుని వచ్చారు. ర్యాలీలో వీరే ప్రధాన ఆకర్షణ.

ఉద్యోగానికి గుల్జార్ అన్‌ఫిట్

అధికార విభజనను అపహాస్యం చేశారు

- కారుణ్య నియామకంలో కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారు
- ఉద్యోగం నుంచి తొలగించాలని ఎందుకు ఆదేశాలు ఇవ్వకూడదో వివరణ ఇవ్వాలి
- ఐఏఎస్ గుల్జార్‌పై హైకోర్టు మండిపాటు.. విచారణ 1కి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి ఎన్ గుల్జార్‌పై ఏపీ హైకోర్టు మండిపడింది. హైకోర్టు తీర్పునకు భిన్నంగా కారుణ్య నియామకం విషయంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి (కమర్షియల్ ట్యాక్స్) హోదాలో ఆయన తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. రాజ్యాంగ బద్ధమైన పాలన పట్ల గౌరవంలేని గుల్జార్ ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగేందుకు అసమర్థుడని (అన్‌ఫిట్) తీవ్ర వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఉత్తర్వులిచ్చి ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని నిర్ధారించింది. న్యాయపాలన, అధికార విభజనను ఉన్నతాధికారి అపహాస్యం చేశారని, కార్యనిర్వహణ వ్యవస్థకున్న లక్ష్మణరేఖను గుల్జార్ దాటారని పేర్కొంది. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఏ వ్యక్తి అయినా కోర్టుధిక్కరణ బాధ్యులవుతారని తెలిపింది. కోర్టు ముందు ఉన్న ప్రాథమిక ఆధారాలను పరిశీలిస్తే, ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగేందుకు గుల్జార్ అసమర్థుడని తేల్చింది. ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వానికి ఎందుకు ఆదేశాలు ఇవ్వకూడదో, అలాగే కోర్టుధిక్కరణ కింద ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదో వివరణ ఇవ్వాలని గుల్జార్‌ను ఆదేశిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమాధానం చెప్పాలంది. గుల్జార్‌పై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణను మే 1వ తేదీకి వాయిదా వేసింది. పిటిషనర్ బసవ శ్రీనివాస్‌కు కారుణ్య నియామకం కింది ఉద్యోగమిచ్చేందుకు నిరాకరిస్తూ గుల్జార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. ఉద్యోగం కోసం 2022లో పిటిషనర్ పెట్టుకున్న దరఖాస్తును తిరిగి పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఇటీవల తీర్పు ఇచ్చారు. బి.సరస్వతిదేవి అనే ఉద్యోగిని వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ మరణించారు. ఆమె చిన్నకుమారుడు బసవ శ్రీనివాస్ కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన తండ్రి అప్పటికే సర్వీస్ పెన్షన్ పొందుతున్నారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందేందుకు శ్రీనివాస్ వయస్సు దాటి పోయారనే కారణాలతో దరఖాస్తును తిరస్కరిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ బసవ శ్రీనివాస్ 2021లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన సింగిల్ జడ్జి అధికారులు జారీచేసిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ కారుణ్య నియామకం కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్‌ను ఆదేశించారు. ఆ దరఖాస్తుపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణలో ఉండగానే శ్రీనివాస్ పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరిస్తూ ఆర్థిక శాఖ అప్పటి ముఖ్యకార్యదర్శి (కమర్షియల్ ట్యాక్స్) గుల్జార్ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ఆదేశాలు అమలుచేయడంతో న్యాయస్థానం కోర్టుధిక్కరణ పిటిషన్‌పై విచారణను మూసివేసింది. దీంతో గుల్జార్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పిటిషనర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి కారుణ్య నియామక దరఖాస్తును తిరస్కరిస్తూ గుల్జార్ ఇచ్చిన ఉత్తర్వులను తీవ్రంగా తప్పుపట్టారు. గతంలో ఏ అంశాలను అయితే హైకోర్టు తప్పుపట్టిందో ఆ కారణాలతో పిటిషనర్ దరఖాస్తును గుల్జార్ మరోసారి తిరస్కరించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉత్తర్వులిచ్చి గుల్జార్ ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని నిర్ధారించారు. రాజ్యాంగబద్ధమైన పాలన పట్ల గౌరవంలేని గుల్జార్ ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగేందుకు అసమర్థుడని పేర్కొన్నారు. ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వానికి ఎందుకు ఆదేశాలివ్వకూడదో, అలాగే కోర్టు ధిక్కరణ కింద ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

జన్మభూమి రుణం తీర్చుకొనేందుకే రాజకీయాల్లోకి

గుంటూరులో వార్ వన్ సైడే

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించి విఫలమైనా ఈసారి పట్టుబట్టి గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు టీడీపీ టికెట్ సాధించారు. అంతకుముందే ఆయన పెమ్మసాని ట్రస్టు ద్వారా జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్ననలు పొందారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తూ దూసుకుపోతున్నారు. అమెరికా నుంచి టూరిస్టు వీసాతో వచ్చారని ఎగతాళి చేసిన ప్రత్యర్థులకు దీటుగా సమాధానం ఇస్తూ 30ఏళ్ల పాటు రాజకీయం చేయడానికే రాష్ట్రానికి వచ్చానని స్పష్టం చేస్తున్నారు. నానాటికీ తీసికట్టుగా మారుతున్న ప్రస్తుత రాజకీయాల్లో ఎన్ఆర్ఐ డాక్టర్ ఎలా నెగ్గుకొస్తారో, నెగ్గితే ప్రజలకు ఏమి చేస్తారో 'ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ బిగ్ డిబేట్‌లో పెమ్మసాని చంద్రశేఖర్ మనస్సు విప్పి మాట్లాడారు.



ఆర్‌కే: ప్రస్తుత రాజకీయాల్లో అడుగులు వేస్తున్న కొద్దీ చిరాకేస్తోందా? మజా వస్తోందా? బురదలోకి దిగాను అనుకొంటున్నారా?

పెమ్మసాని: నాకు ముందుగానే ఇవన్నీ తెలుసు బురద అనుకోవడం లేదు. ఇష్టపడి వచ్చా కాబట్టి ఆస్వాదిస్తున్నాను.

రాజకీయాలు అంటే ఎందుకు ఇష్టం?

వ్యక్తిగతంగా ఈ రాష్ట్ర ప్రజలు రూ.15వేలు పన్ను కట్టి నన్ను మెడిసిన్ చదివించారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో ఫ్రీ సీటు పొంది చదువుకొన్నాను. జన్మభూమికి రుణం తీర్చుకోవడం అనేది ప్రాథమిక కారణం. దీనికి తోడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూసిన తర్వాత బలంగా నిర్ణయించుకొన్నాను. జయదేవ్‌ని పంపించడం, అరాచకం సృష్టించడం. టీడీపీ, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొన్నా. నాకు ఇక్కడ ఏమీ లేవు. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. ఆ ధైర్యం ఉంది. చేసే తెగువ, చేయాలన్న ఆశయం ఉన్నాయి. వీటన్నింటి దృష్ట్యా నేను సరైన వ్యక్తినని నిర్ణయించుకొని వచ్చాను.

గల్లా జయదేవ్ అంత దృఢమైన వ్యక్తి తట్టుకోలేక రాజకీయం వదిలేశాడు. మళ్లీ జగన్ వస్తే ఏ కేసులో అయినా పెట్టొచ్చుగా?

ఏ కేసులో పెడతారు? ఎన్ని రోజులు జైలులో పెడతారు. ఆరు నెలలు, ఏడాది.. నన్ను జైలులో పెట్టారనుకోండి. జైలులో చదువుకోవడానికి, రాసుకోవడానికి పుస్తకం, పెన్ను, పేపర్ ఇస్తారు. నేను చిన్నప్పటి నుంచి ఏసీల్లో పెరగలేదు. నేను తినే తిండి కూడా తక్కువ. ఇంతకంటే ఏమి ఇబ్బంది పెడతారు. నాకు జ్ఞానం ఉంది. అది ఉన్నంత వరకు ఏమీ చేయలేరు.

రఘురామకృష్ణరాజు వలె మిమ్మల్ని కూడా కొట్టొచ్చు కదా?

కొట్టడమంటే మైండ్‌కు సంబంధించినది. అది చట్టవ్యతిరేకం. పొరపాటున ఎవరైనా చేస్తే ఏదో ఒకరోజు నాకూ సమయం వస్తుంది. కొట్టినోడి చేయి తీసేస్తా. వెనక్కు తగ్గను. నాకు ఐదేళ్లకో, పదేళ్లకో సమయం వస్తుంది. ఆ రోజు అంతకు అంత బదులు తీర్చుకొంటా. రఘురామరాజు ఇంకా బతికే ఉన్నారు. కొట్టిన వాళ్లు ఇంకా ఉన్నారు. జగన్‌కు చాలా జీవితం ఉంది. ఇప్పుడైంది ఐదేళ్లే కదా. ప్రతీ ఒక్కరికి వాళ్ల గ్రహాలు వస్తాయి. కర్మ సిద్ధాంతాన్ని బాగా నమ్ముతాను. మంచి ఇస్తే మంచి జరుగుతుంది. చెడు చేస్తే అదే జరుగుతుంది. థర్డ్ డిగ్రీ అనేది ఎవరి పైనా చేయకూడదు.

మీలో ఎందుకు వచ్చింది ఇదంతా?

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మొదట్లో వ్యవసాయం.. ఆ తర్వాత చిన్న హోటల్. రాజకీయ నేపథ్యం చూస్తూ పెరిగాం. అది గ్రాటిట్యూడ్. నన్ను ఇక్కడి ప్రజలు ఫ్రీగా చదివించారు. అమెరికాలో అయితే రూ.3కోట్లు అవుతాయి. ఎంత సంపాదించినా ఎవరైనా పైకి వెళ్లాల్సిందే. అదేదో మనకు ఉపయోగపడిన వాళ్ల మధ్యన వెళ్లిపోదామన్నదే నా ఆలోచన.

ఎవరినైనా భయపెట్టే వాతావరణం ఉన్న ఏపీలో ఎందుకీ రొచ్చు అని ఇంట్లో వాళ్లు, సన్నిహితులు అనలేదా?

అందరూ అన్నారు. కాకపోతే నా ఒక్క జీవితాన్ని త్యాగం చేసినందు వల్ల లక్షల మందికి ఉపయోగపడితే అదే చాలు. నేను గుంటూరు పార్లమెంట్‌లో తిరుగుతున్నాను. ఎదుటివారు పోటీ చేయాలంటే భయపడే స్థితికి తీసుకొచ్చా. ధనబలంతో కాదు. నా క్యారెక్టర్, సమస్యలపై మాట్లాడే విధానం. కేడర్‌తో కలిసే విధానం. సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తానో చెప్పడంలో ఉన్న నిజాయితీ. ఇవన్నీ నాకు జత కలిశాయి.

ఏపీలో ధనిక సీఎం ఇప్పటికే ఉన్నారు. ఇప్పుడు మీరు దేశంలోనే అత్యంత ధనిక ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు?

నేను ఈ స్థాయికి రావడానికి ఇంటర్మీడియట్ రోజుకు 15, 16 గంటలు చదివి ఎంసెట్‌లో 24వ ర్యాంకు తెచ్చుకొన్నాను. ఐదేళ్లు మెడిసిన్ చేసి, యూఎస్ఎంఎల్‌లో కష్టపడి పరీక్షలు రాసి మూడేళ్లు పీజీ చేసి 2001లో బిజినెస్ స్టార్ట్ చేస్తే ఇప్పుడు ఈ స్థాయికి వచ్చాను. మొత్తం 30 ఏళ్లు కష్టపడి 40శాతం పన్ను చెల్లించాను. జగన్ అలా కాదు. 2004లో ఆయన ఆస్తి రూ. కోటి. మొత్తం క్విడ్ ప్రో కో ద్వారా ఆస్తులు కూడబెట్టుకొన్నారు. నాతోనే కాదు, ఎవరైనా కష్టపడి పైకొచ్చే వారితో జగన్‌ని పోల్చడం అత్యంత అవమానకరం.

లోక్‌సభ సీటే పట్టుబట్టి కావాలని ఎందుకు కోరుకొన్నారు? రాజ్యసభ సీటు అయితే చొక్కా నలగకుండా ఆరేళ్లు ఉండొచ్చు.

నా స్టోరీ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. నేను ఏమి చేయబోతున్నాననేది నాకు ఒక్కడికే తెలుసు. వేరేవాళ్లు ఎన్ని చెప్పినా ఈ సమాజానికి ఏవి ి చేయగలనన్న విజన్ ఉంది. అది ఇప్పుడే బయటకు చెప్పలేను.

అమరావతి అభివృద్ధి చెందుతుందంటే వాళ్లకే మంచిది కదా? అక్కడ ఎందుకు ఓడించారు?

జగన్ ఇచ్చిన హామీలు చూసి ఆశపడ్డారు. మోసపోయారు. అందువల్ల ప్రజలు ఓట్లేశారు. ఇప్పుడు కాదు పొమ్మన్నారు. ప్రజలు బుద్ధి చెబుతారు. వైసీపీ వాళ్లు బయట కూడా తిరగలేని పరిస్థితి ఉంది. మంగళగిరిలో 40, 50 వేల మెజారిటీ, తాడికొండలో 30, 40 వేల మెజారిటీ వస్తుంది.

సర్వేలు చేసుకుంటున్నారా?

సర్వేలు నిరంతరం జరుగుతున్నాయి. జగన్‌కు భయపడి ప్రజలు పూర్తిగా చెప్పడం లేదు. అది కూడా కలుపుకుంటే మరో 2శాతం అదనంగా వస్తుంది. ఎన్నికల తరువాత జగన్‌రెడ్డికి షాక్ ట్రీట్‌మెంట్ వస్తుంది. మాకు 135- 140 సీట్లు గ్యారంటీగా వస్తాయి.

ప్రభుత్వంలో మీ పాత్ర ఉంటుందా?

చంద్రబాబు అడిగితే కచ్చితంగా చెబుతాను. చంద్రబాబు, లోకేశ్ రాష్ట్ర బాధ్యతలు చూసుకుంటారు. వారు కోరితే నేను తోడ్పడతాను.

చంద్రబాబును మీరు స్టడీ చేశారా? ఆయన గురించి మీకు తెలిసిందేంటి?

చంద్రబాబును నేను ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నన్నాళ్లు చూశా. బాబ్లీపై ఆయన పోరాటం, శ్రమదానం, రైతుబజార్లు, ఉస్మానియా సర్‌ప్రైజ్ విజిట్లు ఇవన్నీ దగ్గరుండి చూశా. ఆయనంటే ఒక అభిప్రాయం కలిగింది. నేడు తెలుగుజాతి ప్రపంచంలో ఎక్కడ ఉన్నా బెంజ్ కార్లలో తిరుగుతున్నారన్నా, ఇండియాలోనే రిచెస్ట్ పర్సన్‌గా అవుతున్నారన్నా ఆయనే కారణం. ఈ విషయంలో వివాదమే లేదు. ఆయనకుండే ఓర్పు, సహనం, కష్టపడే తత్వం నాకు స్ఫూర్తిదాయకం. ఆయనకు పర్సనల్ లైఫ్ లేదు. అది కొంత వరకూ బాధాకరం. ఆయన వ్యక్తిగత జీవితంపై మాట్లాడడం సరికాదనే భావిస్తున్నాను. 24గంటలు ప్రజల గురించే ఆలోచిస్తారు.



విశ్వజీత్ | పీహెచ్‌డీ రామక్రిష

నిఘా చీఫ్‌గా విశ్వజీత్

బెజవాడ సీపీగా పీహెచ్‌డీ రామక్రిష్ణ

- ఈసీ ఆదేశాలతో నియమించిన సీఎస్

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నిఘావిభాగం అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి కుమార్ విశ్వజీత్ నియమితులయ్యారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామక్రిష్ణను ఎన్నికల కమిషన్ ఎంపిక చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. వైసీపీ అరాచక పాలనలో ఏకపక్ష పోలీసింగ్ చేస్తూ అధికార పార్టీ అడుగులకు మడుగులు వత్తుతూ ఐపీసీ చట్టాన్ని పక్కన బెట్టి వైసీపీ చట్టాన్ని అమలు చేస్తోన్న ఐపీఎస్ అధికారులపై వరుసగా ఈసీకి ఫిర్యాదులు అందుతున్నాయి. జగన్‌కు కళ్లు, చెవులు, ముక్కు అన్నీ తానై పనిచేసిన ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులుపై వరుస ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఈసీ ఆయన బదిలీపై నిర్ణయం తీసుకుంది. అంతకుమించి స్వామి భక్తి ప్రదర్శిస్తూ ప్రతిపక్ష నేతపై రాళ్లు పడితే అవి పువ్వులని, ఎదుటి పార్టీ నేతల కళ్లు పొడిచేస్తే అది వీధిలో గొడవంటూ తేలిగ్గా తీసుకున్న విజయవాడ సీపీ కాంతిరాణా ఏకంగా వైసీపీ అధికార ప్రతినిధిగా మారిపోయారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో అధికార పార్టీ నేతలు ప్రెస్‌మీట్ పెట్టి చేసే వ్యాఖ్యలన్నీ జోడించి ఐపీఎస్ అధికారుల సంఘం తరపున అన్నీ తానై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు, పత్రికలపై ఫిర్యాదు చేశారు. అయితే నిజానిజాలు తెలుసుకున్న ఈసీ కాంతిరాణాను సాగనంపింది. ఈ ఇద్దరి పోస్టుల్లో సమర్థవంతులైన ముగ్గురు అధికారుల పేర్లు పంపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి 24గంటలు సమయం ఇచ్చింది. నిఘా అధిపతి పోస్టుకు రైల్వే ఏడీజీ కుమార విశ్వజీత్, ఏపీఎస్పీ ఏడీజీ అతుల్ సింగ్, సీఐడీ ఏడీజీ సంజయ్ పేర్లు ప్రభుత్వం పంపింది. వాటిని పరిశీలించిన ఈసీ గతంలోనూ ఎన్నికల సమయంలో నిఘా అధిపతిగా వ్యవహరించిన కుమార విశ్వజీత్‌ను ఎంపిక చేసింది. బెజవాడ సీపీ పోస్టుకు రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా, ఏసీబీ డైరెక్టర్ పీహెచ్‌డీ రామక్రిష్ణ, టెక్నికల్ సర్వీసెస్ ఐజీ ఎస్.హరికృష్ణ పేర్లు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. రాష్ట్ర పోలీసు శాఖలో ఎవరెవరు ఎక్కడ పని చేశారు.. వారి సామర్థ్యం ఏంటి.. వివాదాలకు దూరంగా ఉంటారా.. రాజకీయాలతో సంబంధం ఉందా....అనే వివరాలు సైతం పంపింది. పరిశీలించిన ఈసీ విజయవాడలో పనిచేయాలంటే ఫైర్ బ్రాండ్‌గా పేరుగాంచిన పీహెచ్‌డీ రామక్రిష్ణను సమర్థుడిగా గుర్తించి ఎంపిక చేసింది. ఎక్కడ పనిచేసినా అధికార పార్టీలకు తలొగ్గకుండా బదిలీ అయిన చరిత్ర ఆయనది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆయనను జిల్లా ఎస్పీగా ఎక్కడా ఏడాది కూడా పని చేయనివ్వలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సెబ్‌లో డీఐజీగా నియమిస్తే.... అక్రమంగా ఇసుక తరలించి, రాష్ట్రంలోకి పొరుగు మద్యం తెచ్చుకునే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు జగన్‌పై ఒత్తిడి తెచ్చి ఆయనను బదిలీ చేయించారు. నిజాయితీపరుడిగా పేరున్న రామక్రిష్ణ గత కొంత కాలంగా ఏసీబీలో పనిచేస్తున్నారు. ఆయనను పోలీసు కమిషనర్‌గా నియమించడంతో బెజవాడలో ప్రశాంత పోలింగ్‌కు అవకాశం కల్పించినట్లేనని పోలీసు, రాజకీయ వర్గాల్లో వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆదమరిస్తే అంతే!

- టైటిల్ చట్టంతో భూములకు ముప్పు
- సర్కారు మాట నమ్మితే గజమూ మిగలదు
- ఆ రికార్డులన్నీ తప్పుల మయం
- రైతుల ప్రమేయం లేకుండానే కొలతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మీ భూమికి మా హామీ.. మీ భూమికి జగనన్న రక్ష. జగన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష' జగన్ సర్కారు రైతులకు ఇస్తున్న హామీలివి. భూముల సమగ్ర సర్వే చేపట్టి, రికార్డులను తాజాపరిచి రైతులకు ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు (టైటిల్ చట్టం) ద్వారా శాశ్వత హక్కులు కల్పిస్తామని గత నాలుగున్నరేళ్లుగా చెబుతోంది. ఇవన్నీ పచ్చిమోసకారి మాటలే. రైతు వీటిని నమ్మి, తన భూమికి ఏం కాదని ఆదమరిస్తే అంతే సంగతులు. గజం భూమి కూడా మిగలదు. రాత్రికి రాత్రే ఓ రైతు భూమి మరొకరి పేరిట మారిపోతుంది. రాత్రికి రాత్రే నిషేధిత భూముల జాబితాలో కలిసిపోతుంది. ఎందుకంటే.. టైటిల్ చట్టం అమలు కోసం చేపట్టిన భూముల సర్వే, రికార్డుల తయారీ అంత ఘోరంగా, అధ్వానంగా ఉంటోంది. భూ యజమానుల ప్రమేయం లేకుండానే భూముల సర్వే సాగుతోంది. భూమి రికార్డుల తయారీలో అడ్డగోలు తప్పులొస్తున్నాయి. వాటిని చడీచప్పుడు లేకుండా ఆమోదిస్తూ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తున్నారు. ఆ రికార్డులనిండా జగన్ బొమ్మలే. ఆ రికార్డుల ఆధారంగానే రైతులకు టైటిల్ గ్యారెంటీ ఇస్తారు. ఈ ఘోరాలపై జగన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన, జగనన్నకు చెబుదాం, ఇంకా పలు వేదికల ద్వారా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయినా అంతా గప్‌చుప్. రీ సర్వే రిపోర్టుల్లో తప్పుల గురించి, పాస్‌పుస్తకాల్లో లోపాల గురించి ఎక్కడా మాట్లాడవద్దని ప్రభుత్వ పెద్దలు హుకుం జారీ చేశారు.

పైలెట్‌లోనే ఫెయిల్

భూముల సమగ్ర సర్వేకు జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష అనే పేరు పెట్టారు. సర్వే పూర్తయ్యాక రైతులకు శాశ్వత టైటిల్ (యాజమాన్య హక్కు) ఇస్తామంటూ ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చేందుకు 2019లో అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రం ఆమోదానికి పంపించారు. అది 2023 దాకా అమలు కాలేదు. అయితే ఈ టైటిల్ చట్టం అమలుకు ముందే రాష్ట్రంలో ఉన్న భూ వివాదాలన్నింటిని పరిష్కరిస్తామని, ఇందుకోసం సమగ్ర భూ సర్వే చేస్తామని సర్కారు చెప్పింది. సమగ్ర భూ సర్వేకు జగన్ పేరు పెట్టడం దగ్గరి నుంచి ఇతర కీలక పనులను హేతుబద్ధత లేకుండా చేపట్టారు. 2019 డిసెంబరులో భూముల సర్వేలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడులో పైలెట్ రీ సర్వే చేశారు. గ్రామ అడంగల్ ప్రకారం 150 సర్వే నెంబర్లలో 1539 ఎకరాల భూమి ఉంది. ఆధునిక టెక్నాలజీ జగనన్న రక్ష పేరిట రీ సర్వే చేసిన ప్రభుత్వం సర్వే నెంబర్లను 631కి పెంచింది. మొత్తం 1539 ఎకరాలుగా ఉన్న భూమిని 1533.36 ఎకరాలకు తీసుకొచ్చింది. అంటే.. ఉన్న భూమిలోనే 5.64 ఎకరాలు తగ్గించి చూపించింది. మరి ఆ భూమి ఎక్కడికి వెళ్లిందో తేల్చనే లేదు. పైలెట్ నివేదిక ప్రకారం సర్వేలో గరిష్ఠంగా 2.10 ఎకరాలపైనే తేడా వచ్చినట్లు గుర్తించారు. అడంగల్‌లో ఉన్న రికార్డు, రీ సర్వే రికార్డుకు పొంతన లేదు. 71 సర్వే నెంబర్లలో భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. పైలెట్ దశలోనే విఫలమైన ప్రభుత్వం రెగ్యులర్ సర్వే ఎలా చేస్తుందని మొదట్నుంచీ 'ఆంధ్రజ్యోతి' అనేక సందర్భాల్లో కథనాలు ప్రచురించింది.

మొక్కుబడిగా భూముల కొలతలు

పైలెట్ దశలోనే సరిగ్గా సర్వే నిర్వహించలేని సర్కారు... రాష్ట్రంలోని 17,583 గ్రామాల్లో భూముల సర్వే చేపట్టింది. సర్వే ఆఫ్ ఇండియాతో డ్రోన్ సర్వే కోసం ఒప్పందం చేసుకుంది. భూముల సర్వేను శరవేగంగా చేపట్టాలని, 2023 నాటికి పూర్తిచేయాలని షరతులు విధించింది. ఆ తర్వాత ఆ సంస్థ ఒప్పందం నుంచి తప్పుకొంది. సర్వేను మధ్యలో ఆపేస్తే పరువు పోతుందనే భయంతో.. గ్రామ సర్వేయర్లతోనే భూముల కొలతలు చేపట్టారు. సర్వేకు అనుసరించాల్సిన పద్ధతులను పాటించకుండా... హడావుడిగా ఈ ప్రక్రియను నడిపిస్తున్నారు. కొన్నిరోజులు డ్రోన్లతో సర్వే అన్నారు. ఆ తర్వాత విమానాలతో ఫొటోలు అన్నారు. చివరకు ఆర్థోరెక్టిఫైడ్ చిత్రాలను తీసి వాటి నుంచి భూముల చిత్రపటాలు తీశారు. రైతులను భాగస్వామ్యం చేయలేదు. నేరుగా భూమి చిత్రపటాలను గ్రామంలోకి తీసుకెళ్లి రైతులతో బలవంతపు సంతకాలు తీసుకున్నారు. ఆ నోటీసులు, చిత్రపటాల్లో ఏముందో రైతులకు తెలియనే లేదు. చివరకు పాస్‌పుస్తకాలు వచ్చేవరకు తమ భూమి సంగతేమిటో తెలుసుకోలేకపోయారు. డ్రోన్‌లు తీసిన ఫొటోల (ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజెస్) నుంచి గ్రామాల వారీగా భూమి పటాలు తీసి, వాటి ఆధారంగా రైతుల భూముల చిత్రపటాలను తయారు చేశారు. అవఅ సరైనవే అని రైతులతో సంతకాలు తీసుకున్నారు. రైతుల సమక్షంలో సర్వే చేసి రికార్డులు తయారు చేసిన సందర్భాలు చాలా చాలా తక్కువ. కేవలం ఆఫీసుల్లో కూర్చొనే సర్వే రికార్డులు, చిత్రపటాలు తయారు చేసి, 13 నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందు రైతుల నుంచి సంతకాలు తీసుకున్నారు.

రికార్డుల నిండా తప్పులే

దశలవారీగా రీ సర్వేను పూర్తి చేశామంటూ సర్కారు గొప్పలు చెబుతూ కొత్తగా పాస్‌పుస్తకాలు జారీ చేసింది. రైతుల భూమి విస్తీర్ణం, సర్వే నెంబర్ స్థానంలో కొత్తగా ఇచ్చిన ల్యాండ్‌పార్శిల్ నెంబర్‌లలో తప్పులు దొర్లాయి. ఉదాహరణకు తిరుపతి సమీపంలో ఓ రిటైర్డ్ ఇంజనీర్‌కు నాలుగు ఎకరాల భూమి ఉందనుకుందాం. ఆ పక్కనే మరో మహిళా రైతుకు 1.54 ఎకరాల భూమి ఉంది. రీ సర్వే తర్వాత ఆ మహిళా రైతు ఖాతాలో ఐదు ఎకరాల భూమిని చూపించారు. రిటైర్డ్ ఇంజనీర్‌కు ఉన్న భూమిలో కొంత తగ్గించారు. ఇదేమిటని ఆయన గగ్గోలు పెడితే ఇప్పుడేమీ చేయలేమని సర్వే అధికారులు చేతులెత్తేశారు. కేవలం ఇదొక ఉదాహరణ మాత్రమే. ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఇచ్చిన పాస్‌పుస్తకాల్లోనూ భూముల విస్తీర్ణంలో తప్పులు వచ్చాయి. ఇప్పుడు ఇలాంటి రికార్డుల ఆధారంగానే టైటిల్ కల్పిస్తామని సర్కారు చెబుతోంది. వాటిని నమ్మి రైతులు టైటిల్ తీసుకుంటే నిండా మునిగిపోయే ప్రమాదం ఉంది.

62,571 మంది వలంటీర్లు రాజీనామా

- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేసిన అనంతరం రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 22 వరకు 62,571 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారని కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) హైకోర్టుకు నివేదించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకుగాను 929 మందిని ఉద్యోగాల నుంచి తొలగించామని సీఈసీ తరపున సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలకు కారణాలు తెలియవని చెప్పారు. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను మాత్రమే ఎన్నికల విధులకు అనుమతిస్తున్నామన్నారు. పిటిషనర్ కోరిన విధంగా ఎన్నికలు ముగిసేవరకు వలంటీర్లు రాజీనామాలు ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి తాము ఆదేశాలివ్వలేమన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. ఎన్నికలు ముగిసేవరకు గ్రామ-వార్డు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా సీఎస్, పురపాలకశాఖ కమిషనర్, సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శికి సూచించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజనపార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సుమన్ వాదనలు వినిపించారు.

వలంటీర్లను ఏజెంట్లుగా అనుమతించొద్దు

- కేంద్ర ఎన్నికల సంఘానికి కనకమేడల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజీనామా చేసిన వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా అనుమతించొద్దని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. ఆ వలంటీర్లు పోలింగ్ ఏజెంట్లుగా ఉంటే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులైన పేద ప్రజలు అధికార వైసీపీకి ఓటు వేసేలా ప్రభావితం చేయవచ్చన్నారు. ఈమేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు కనకమేడల ఫిర్యాదు చేశారు. వలంటీర్ల వ్యవస్థ వైసీపీ రాజకీయ ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తోందన్నారు. మరోవైపు పెన్షన్ లబ్ధిదారులకు మే నెల పెన్షన్ ఇంటి వద్దే ఇచ్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఏర్పాట్లు చేసేలా ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాసిన లేఖను కనకమేడల ఈసీకి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను అడ్డుపెట్టుకొని పెన్షన్ దారులను జగన్ ప్రభుత్వం ఇబ్బందులు గురిచేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు ఇంటి వద్దకే వెళ్లి అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు లేఖ రాశారని తెలిపారు.

గాజుగ్లాసు జనసేనకే కేటాయించాలి!

- ఆ పార్టీ లేనిచోట స్వతంత్రులకు ఇవ్వొద్దు
- సీఈవోకు ఎన్డీయే కూటమి వినతి

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గాజుగ్లాసు గుర్తును జనసేన పార్టీకి మాత్రమే కేటాయించాలని, ఆ పార్టీ పోటీలో లేని స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు, ఏ ఇతర పార్టీల అభ్యర్థులకూ ఆ గుర్తును కేటాయించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాను ఎన్డీయే కూటమి కోరింది. బుధవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేశ్‌కుమార్ మీనాకు టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్, ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి తిరుగరి జ్యోత్స్న ఎన్డీయే కూటమి తరఫున వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ప్రజల్లో కన్ఫ్యూజన్ లేకుండా ఉండాలంటే గాజుగ్లాసు గుర్తు వేరే వాళ్లకు కేటాయించకూడదన్నారు. జనసేన పోటీ చేయని స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించవదని సీఈవోను కోరామని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా దీనిపై లేఖ పంపామని చెప్పారు. ఒక గుర్తు ఒకరికి కేటాయించిన తర్వాత కన్ఫ్యూజన్ లేకుండా ఉండాలంటే వేరే వారికి ఆ గుర్తు కేటాయించకూడదని గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆధారాలను సీఈవోకు ఇచ్చామని చెప్పారు. ఇంటెలిజెన్స్ డీజీ, విజయవాడ సీపీలను మార్చినందుకు సీఈవోకు కృతజ్ఞతలు చెప్పామని, సీఎస్, డీజీపీలను కూడా మార్చాలని కోరామని తెలిపారు.



దివ్యాంగుడికి సీటు కేటాయింపులో నిర్లక్ష్యం

- ఏపీఎస్ఆర్టీసీపై శాశ్వత లోక్ అదాలత్ ఆగ్రహం

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 24: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీటును వారికి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిన ఆర్టీసీ ఉద్యోగులపై శాశ్వత లోక్ అదాలత్ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నంద్యాలకు చెందిన ఫిర్యాది చిన్న నాగన్న కర్నూలు బస్టాండ్ నుంచి గతనెల 28న నంద్యాల వెళ్లడానికి ఆత్మకూరు బస్సు డిపోకు చెందిన బస్సు ఎక్కాడు. దివ్యాంగుడు కావడంతో బస్సులో తమకు ప్రత్యేకంగా కేటాయించిన సీటు కోసం వెతకగా.. ఆ సీటులో వేరే ప్రయాణికులు కూర్చున్నారు. దివ్యాంగుడనైన తనకు కేటాయించిన సీటులో కూర్చున్న వారిని ఖాళీ చేయించాలని కండక్టర్‌ను కోరగా అతను నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. డిపో మేనేజర్ కూడా సరిగ్గా స్పందించకపోవడంతో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. దీంతో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ ఏపీఎస్ఆర్టీసీపై ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులకు నోటీసులు పంపారు. ఆర్టీసీ కండక్టరుతో సహా అధికారులు బుధవారం శాశ్వత లోక్ అదాలత్‌కు హాజరై ఫిర్యాదికి జరిగిన సేవా లోపానికి బేషరతుగా క్షమాపణలు కోరారు. దీంతో చిన్న నాగన్న రాజీ అయి.. తన ఫిర్యాదును వెనక్కి తీసుకోవడానికి అంగీకరించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

- ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులకు బొప్పరాజు సూచన

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది ఎవ్వరూ తమ ఓటు హక్కును వృధా చేసుకోకుండా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి

జన చేతనం

ప్రజా అజెండా



కౌంట్ డౌన్ 18 రోజులు

నీటి నాటకం!



'కుప్పం నియోజకవర్గానికి నీళ్లిచ్చాం' అని చెప్పుకొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడిన గేటు నాటకమిది! ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఆయన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కుప్పం బ్రాంచి కాలువ గేటును బటన్ నొక్కి పైకెత్తారు. ఆ గేటును పూలతో చక్కగా అలంకరించి పూజలు చేశారు. కృష్ణమ్మకు పట్టువస్త్రాన్నీ సమర్పించారు. కానీ... అదంతా ఒట్టి నాటకం. 24 గంటల్లోనే ఆ గేటును అధికారులు జేసీబీతో ఎత్తి, లారీలో వేసుకుని తీసుకెళ్లిపోయారు. టీడీపీ హయాంలోనే దాదాపు 85 శాతం పూర్తయిన కెనాల్ ఇది! మిగిలిన 15 శాతం పనులను కూడా జగన్ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయింది. కానీ.. ఎన్నికల ముందు 'కుప్పానికి కృష్ణా జలాలు' పేరుతో భారీ హంగామా చేసింది. కానీ, ఆ కథ అడ్డం తిరిగింది! నాటకం బయటపడటంతో అభాసుపాలయ్యారు.





అట్లుంటది అన్నతోని..

జగన్ మాటల్లోనే ప్రేమ..

'నా ఎస్సీలు' అంటూ సీఎం జగన్ ప్రేమ ఒలకబోస్తారు. దళితులను ఉద్ధరిస్తున్నట్టు గొప్పలు చెబుతారు. కానీ ఆయన ఐదేళ్ల పాలనలో దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. ప్రశ్నిస్తే దాడులు, శిరోముండనం, హత్యలు. ఎదురొస్తే వైసీపీకి చెందినవారైనా సరే వదిలిపెట్టరు. అయినా నిందితులపై చర్యలు లేవు. పైగా పార్టీలో పెద్దపీట వేస్తారు. ఇదీ జగన్ మార్క్ రాజకీయం.



- దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత్ బాబును అన్నివిధాలా రక్షించారు.
- దళిత యువకులకు శిరోముండనం కేసులో శిక్షపడిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు.
- ఇసుక దోపిడీ చేస్తున్న వైసీపీ నేతలను ప్రశ్నించిన దళిత యువకుడికి పోలీస్ స్టేషన్లో అధికార నేతల ఒత్తిడితో శిరోముండనం చేయించారు. రాష్ట్రపతి స్వయంగా స్పందించినా బాధ్యులపై నేటికీ కనీస చర్యలు లేవు.



దళితులపై దాష్టీకం!

జగన్ పాలనలో దాడులు, హత్యలు.. ఎవరైనా ప్రశ్నిస్తే బతకలేని పరిస్థితి

దళిత మహిళ అన్న కనికరం లేదు. రోగుల ప్రాణాలు కాపాడే డాక్టరన్న గౌరవం లేదు. పేదలన్న జాలి, దయ లేవు. అన్యాయాలను, హక్కులను ప్రశ్నిస్తే సమాజంలో బతకలేని పరిస్థితి. ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలనలో దళితులపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. వారిపైనే అక్రమ కేసులు బనాయించారు. పోలీసులను ఉసిగొల్పి చిత్రహింసలు పెట్టించారు. దళిత కాలనీలపై మారణాయుధాలతో తెగబడ్డారు. కొందరిని భౌతికంగా లేకుండా చంపేశారు. అయినా జగన్ సర్కారు బాధితులకు అండగా నిలవకపోగా.. దౌర్జన్యాలకు పాల్పడిన సొంత పార్టీ నేతలు, కార్యకర్తలకే వత్తాసు పలికింది. సీఎం జగన్ సహా మంత్రులు హంతకుడిని బహిరంగంగా పక్కనపెట్టుకుని తిరిగిన సంఘటనలున్నాయి. జగన్ పాలనలో దళితులపై జరిగిన దాడులు మచ్చుకు కొన్ని..

- డాక్టర్ సుధాకర్‌కు నడిరోడ్డుపై చిత్రహింసలు
- ఏడాది తిరగకుండానే గుండెపోటుతో మృతి
- యువకుడికి స్టేషన్‌లోనే శిరోముండనం
- ట్రాక్టర్‌తో తొక్కించి అంగన్వాడీ హత్య
- జగన్‌ను దూషించినందుకు శవమై తేలిన సొంత పార్టీ కార్యకర్త
- గత ఐదేళ్లలో ఎన్నెన్నో దాడులు
- నిందితులకే వైసీపీ సర్కారు వత్తాసు



ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపేసి తన కారులోనే తరలించిన దృశ్యం

డాక్టర్ సుధాకర్‌పై ఘోరం



నడిరోడ్డుపై డాక్టర్ సుధాకర్ చేతులు వెనక్కివిరిచి, మెడపై లాఠీతో తొక్కిపెట్టిన పోలీసులు (ఫైల్)

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన దళిత డాక్టర్ కె.సుధాకర్ (52) ఘటనలో ఆ కుటుంబానికి ఇప్పటివరకూ న్యాయం జరగలేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో అనస్థీషియన్‌గా పనిచేసిన డాక్టర్ సుధాకర్.. కరోనా సమయంలో 2020లో రోగులకు చికిత్స చేసే వైద్యులకు కనీసం మాస్కులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించడంతో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. సాధారణంగా అయితే ప్రభుత్వం స్పందించి అన్ని ఆస్పత్రులకూ అవసరమైన గ్లౌజులు, మాస్కులు సరఫరా చేయాలి. కానీ డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. మాస్కులు అడగడం నేరమా? అని ఆయన ప్రశ్నించినందుకు వైసీపీ పెద్దలు వ్యక్తిగతంగా కక్షగట్టారు. గౌరవప్రదమైన డాక్టర్ వృత్తిలో ఉన్న వ్యక్తిని జాతీయ రహదారిపై దుస్తులు లేకుండా నిలబెట్టి పోలీసులతో లాఠీలతో కొట్టించారు. 'సైకో' ముద్రవేసి మానసిక వైద్యశాలలో పడేశారు. కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు ఊరట లభించింది. ఉద్యోగంలోకి తిరిగి తీసుకోకపోవడంతో మానసిక వేదనకు గురైన డాక్టర్ సుధాకర్ ఏడాది తిరగకుండానే గుండెపోటుతో మరణించారు.




చంపేసి... డోర్ డెలివరీ

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి అతడి ఇంటికే మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో సుబ్రహ్మణ్యంను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. డ్రైవర్ మృతదేహాన్ని అనంతబాబు తన కారులోనే అతడికి ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబీకులు నిలదీయడంతో 'డబ్బులు ఇస్తా నోరు తెరవొద్దు' అని బెదిరించారు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి పారిపోయారు. అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించిన పోలీసులు.. బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో హత్య కేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబు బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు జగన్ ప్రకటించినా.. ఆయన్ను పక్కన పెట్టుకుని వైసీపీ మంత్రులు, సీఎం బహిరంగ సభలకు హాజరవుతుండడం గమనార్హం.

యువకుడికి శిరోముండనం

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నారనే కారణంతో 2020 జూలై 20న ఇండుగుమిల్లి వరప్రసాద్ అనే యువకుడిని సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు గుండు గీశారు. ఈ కేసులో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నట్టు అప్పట్లో దళితులు ఉద్యమించారు. బాధితుడు ప్రసాద్ రాష్ట్రపతికి సైతం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో స్థానిక వైసీపీ నాయకుడితో పాటు ఆరుగురు నిందితులుగా ఉన్నారు. దళితుల ఆందోళనలతో ఎట్టకేలకు ఎస్ఐని సస్పెండ్ చేశారు.



నిందితుడికి టికెట్

దళితులకు శిరోముండనం కేసులో శిక్షపడిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు వైసీపీ మండపేట ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం తాజాగా దళితుల ఆగ్రహ కారణంగా మారింది.

దళిత యువకుడు బలి

తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో వైసీపీ వర్గపోరుకు బొంతా మహేంద్ర అనే యువకుడు బలైపోయారు. హోంమంత్రి తానేటి వనితకు సంబంధించిన ఫ్లెక్సీలో వనితతో పాటు కొందరి చిత్రాల తలల భాగాలు కత్తిరించి ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానితుడిగా మహేంద్రను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తనను అన్యాయంగా ఇందులో ఇరికించారని, దీనివల్ల తన పరువు పోయిందని తీవ్ర మానసిక క్షోభకు గురైన ఆ దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త హత్య



హనుమాయమ్మ

గత ఏడాది జూన్ 5న ప్రకాశం జిల్లా టంగుటూరు పంచాయతీ పరిధిలో రావివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సవలం హనుమాయమ్మ(ఎస్సీ)ను ప్రత్యర్థులు రాజకీయ కారణాలతో దారుణంగా చంపేశారు. ఇంటి పక్కన ఉండే వైసీపీకి చెందిన ఆమె బంధువులే పథకం ప్రకారం హత్య చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్న హనుమాయమ్మను సవలం కొండలరావు అనే యువకుడు ట్రాక్టర్‌తో ఢీకొట్టి తొక్కించాడు.

దళిత కాలనీపై దాష్టీకం

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని దళిత కాలనీపై 2022 జూన్‌లో అర్ధరాత్రి వైసీపీ నేత దాడికి తెగబడ్డారు. తన అనుచరులు 15మందితో కలిసి కర్రలు, రాడ్లు, కత్తులు, బీరు బాటిళ్లతో వెంకటేశ్వర కాలనీలో విరుచుకుపడ్డారు. గంజాయి, మద్యం తాగి బీభత్సం సృష్టించారు. దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన చేపట్టగా.. అప్పటి ఎస్ఐ సంపత్‌కుమార్ బాధితుల పైనే లాఠీ ఝుళిపించారు.

కోనసీమలో కులచిచ్చు



అమలాపురంలో దగ్ధమవుతున్న మంత్రి విశ్వరూప్ ఇల్లు

రెండేళ్ల కిందట కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టాలనే ప్రతిపాదనలు ప్రజల నుంచి పెద్దఎత్తున వచ్చాయి. అదే సమయంలో కోనసీమగానే పేరు పెట్టాలంటూ మరోవైపు డిమాండ్లు వచ్చాయి. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేసింది. ఈలోపు అటు దళితులు, ఇటు ఇతర సామాజికవర్గాల ఆందోళనలు తీవ్రస్థాయికి చేరాయి. అనంతరం ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరును ప్రకటించడంతో సున్నితమైన ఈ అంశం కులఘర్షణలకు దారితీసింది. 2022 మే 22న అమలాపురం కేంద్రంగా హింసాత్మక ఘటనలు జరిగాయి. ఈ ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జగన్ ప్రభుత్వంపై దళిత సంఘాలు ఇప్పటికీ గుర్రుగానే ఉన్నాయి.

కాళ్లూ చేతులు కట్టేసి..



ముల్లంగి వెంకటరమణ

గతేడాది ఆగస్టులో జరిగిన పుంగనూరు అల్లర్ల ఘటన కేసులో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. అప్పటి కల్లూరు సీఐ శ్రీనివాసులు హైదరాబాద్‌లో ఆయన్ను అరెస్టు చేసి.. కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కాళ్లూ చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి దారుణంగా కొట్టారు. సీఐ కొడుతున్నప్పుడు ఎవరో ఓ వైసీపీ నేతకు వీడియో కాల్ చేసి చూపించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మంత్రి పెద్దిరెడ్డిపై సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్న కారణంగా పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్రయత్నించినట్లు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

జగన్‌ను దూషించినందుకు..

2020 ఆగస్టు 25న చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన వైసీపీ దళిత కార్యకర్త ఓంప్రతాప్ మదనపల్లెలోని ఓ మద్యం దుకాణం వద్ద నాణ్యత లేని మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని సీఎం జగన్‌ను తీవ్రస్థాయిలో దూషించారు. ఈ వీడియో బాగా వైరల్ అయింది. మరుసటిరోజు ఓంప్రతాప్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వైసీపీ వాళ్లే హత్య చేశారని, రీపోస్టుమార్టం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

కౌలురైతు దంపతులపై దాడి

బాపట్ల జిల్లా చుండూరుపల్లి గ్రామంలో దళిత కౌలురైతు దంపతులపై వైసీపీ సానుభూతిపరులు దాడి చేసిన ఘటన గతేడాది జూన్‌లో జరిగింది. పొలం కౌలు విషయంలో జరిగిన గొడవలో దంపతులపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

పథకాలకు గండి.. దళితులకు దగా ప్రత్యేక కథనం రేపటి సంచికలో



చింటూ: అన్నియ్య జనంలోకి వస్తున్నాడు కదరా!
చిన్నూ: ఎన్నికలముందైనా దిగి రాకుంటే ఎట్టారా?!

చింటూ: మళ్లీ నెత్తిన చేతులు పెడుతున్నాడు చూశావా!
చిన్నూ: ఈ ఐదేళ్లు చేసిందీ అదేలేవోయ్!

చింటూ: మరి... ముద్దులు!
చిన్నూ: ముద్దుల తర్వాత గుద్దులే కదరా!

చింటూ: ఇన్నాళ్లూ ఈ ప్రేమంతా ఎక్కడ దాచుకున్నాడో!
చిన్నూ: ఎన్నికల ముందు ఒకేసారి మొత్తం ఒలకపోద్దామని దాచుకున్నాడులే!




ఆనాటి ముచ్చట

చరిత్రకెక్కిన నంద్యాల!

- రాష్ట్రపతిగా నీలం.. ప్రధానిగా పీవీ
- ఇక్కడి నుంచే లోక్‌సభకు వారి ఎన్నిక




నీలం సంజీవరెడ్డి



పీవీ నరసింహారావు

నంద్యాల లోక్‌సభ స్థానానికి రాజకీయ చరిత్రలో అరుదైన గుర్తింపు ఉంది. ఇద్దరు రాజకీయ ఉద్దండులు.. నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు ఇక్కడి నుంచే ఎన్నికై రెండు అత్యున్నత స్థాయి రాజ్యాంగ పదవులను చేపట్టారు. సంజీవరెడ్డి 1977 ఎన్నికల్లో నంద్యాల నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పెండేకంటి వెంకటసుబ్బయ్యపై దాదాపు 36 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇందిరా గాంధీ ప్రభంజనాన్ని తట్టుకుని.. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఏకైక కాంగ్రెస్ యేతర ఎంపీగా పార్లమెంటులో అడుగుపెట్టి రికార్డు సృష్టించారు. రాష్ట్రంలో మిగతా 41 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ (ఐ) చేజిక్కించుకోవడం గమనార్హం. అనంతరం ఆయన లోక్‌సభ స్పీకర్ అయ్యారు. తదనంతర పరిణామాల్లో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా ఆయన్ను రాష్ట్రపతిగా ఎన్నుకున్నాయి. ఇక పీవీ కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇక్కడ పోటీచేశారు. 1991 లోక్‌సభ ఎన్నికల సమయంలో తమిళనాట శ్రీపెరంబదూర్ ఎన్నికల సభలో పాల్గొన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని మానవబాంబు దాడితో ఎల్‌టీటీఈ పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో కాంగ్రెస్ పీవీని తొలుత ఏఐసీసీ అధ్యక్షుడిగా.. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధానిగా ఎన్నుకుంది. నాటికి ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాదు. 6 నెలల్లో ఎంపీగా ఎన్నిక కావలసిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నంద్యాల నుంచి పోటీ చేయాలని పీవీని కోరారు. ఇందుకు మార్గం సుగమం చేస్తూ సిటింగ్ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి రాజీనామా చేశారు. ఉప ఎన్నికలో నంద్యాల నుంచి పోటీ చేసిన పీవీ నరసింహారావు 5.80 లక్షల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి బంగారు లక్ష్మణ్‌పై గెలిచారు. తెలుగు తేజం పీవీపై గౌరవంతో ఎన్టీఆర్ టీడీపీ తరఫున అభ్యర్థిని దించలేదు. పీవీ తిరిగి 1996లో రెండోసారి కూడా ఇక్కడి నుంచే పోటీచేసి టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డిపై విజయం సాధించారు. అయితే నాడు ఒడిశాలోని బరంపురం నుంచి కూడా ఆయన గెలిచారు. నంద్యాల స్థానానికి రాజీనామా చేశారు.

-నంద్యాల టౌన్



అరాచకవాదాన్ని ప్రజాస్వామ్యం తీవ్రంగా పరిగణిస్తుంది.

- ఎడ్వర్డ్ అబే (అమెరికన్ రచయిత)

అమ్మలకు అబద్ధం..



ఇంట్లో చదువుకునే ఇద్దరు పిల్లలకు అమ్మఒడి వర్తిస్తుందని గత ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఈ లెక్కన 82 లక్షలమందికి ఇవ్వాలి. కానీ, 'పిల్లల' లెక్కను పక్కనపెట్టి, ఒక్కోతల్లికి రూ.15వేలు అంటూ ఈ పథకాన్ని 43 లక్షలమందికి పరిమితం చేశారు. అందులోనూ కోత పెట్టి రూ.13వేలకు కుదించారు.

డ్వాక్రాలకు ధోకా



డ్వాక్రా మహిళలకు జగన్ 'ఆసరా'లో ఆర్భాటం ఎక్కువ, అందించిన సాయం తక్కువ. సకాలంలో రుణాలు చెల్లించినవారిలో 25% మహిళలకు లబ్ధిని ఎగ్గొట్టారు. డ్వాక్రా గ్రూపునకు రూ.10 లక్షల వరకు సున్నావడ్డీ రాయితీ ఇస్తానన్న మాటనూ తప్పారు. దాన్ని రూ.3 లక్షలకు కుదించారు.

'పెన్షన్ మహిళల'కు మోసం



45 ఏళ్లు దాటిన ప్రతి మహిళకూ రూ.3 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పారు. అధికారంలోకి రాగానే పెన్షన్ ఇవ్వలేమని చేతులెత్తేశారు. 'చేయూత' కింద నాలుగేళ్లలో రూ.75వేలు మాత్రమే ఇస్తామని నాలుక మడతేశారు. అలా.... ఈ శ్రేణి మహిళలకు రూ.1.05 లక్షల మేర ఎగనామం పెట్టారు.

ఒంటరి మహిళలకు వంచన



చంద్రబాబు హయాంలో 30ఏళ్లు దాటిన ఒంటరి మహిళలకు సామాజిక పింఛను అందింది. అధికారంలోకి రాగానే జగన్ ఈ వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచేశారు. తద్వారా అప్పటివరకు టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందినవారిలో రెండు లక్షలమందికి కోత వేశారు.

అక్కచెల్లెమ్మలకు అన్యాయం



అక్కాచెల్లెమ్మలకు సంక్షేమం పేరిట అందింది అంతంతే.. కానీ, పన్నులు, చార్జీలు, కరెంటు బిల్లులు, పెంచిన మద్యం ధరల రూపంలో వారి నుంచి తిరిగి లాక్కుంది ఎంతెంతో! ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి లాంటి కీలక పదవులు ఇవ్వడమే వారి సాధికారత పట్ల తమకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని వైసీపీ నేతలు గొప్పలు చెప్పుకొంటున్నారు. అలాగే క్షేత్రస్థాయిలో 50 శాతం పదవుల్లో వారిని నియమించామని సీఎం జగన్ ప్రతి సభలో అంటుంటారు. కానీ, హోంమంత్రిగా కనీసం ఒక్క డీఎస్పీని అయినా స్వయంగా బదిలీ చేసుకునే అధికారం వారికి ఉందా? పదవులు వీరికి.. పెత్తనం వారికి అన్నట్టు వ్యవహారాలు నడిపిస్తున్నారు. చంద్రబాబు హయాంలో సొంతకాళ్లపై మహిళలు నిలబడేందుకు దోహదపడిన డ్వాక్రాలకు...ఇప్పుడు దిక్కులేని పరిస్థితి! జగన్ ప్రచార సభలకు 'తరలే' ప్రేక్షక సైన్యంగా వారిని దిగజార్చివేశారు.



- సంక్షేమం అంతంత..గుంజింది ఎంతెంతో..
- బాబు హయాంలో 30ఏళ్లు దాటితే పెన్షన్
- దాన్ని 50ఏళ్లు చేసి..2లక్షలమందికి కోత
- అమ్మఒడిపై నాడు కోతలు.. ఆపై ఎడాపెడా కొర్రీలు
- పేరుకే 50శాతం పదవులు.. పెత్తనం పెద్దలకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మహిళలకు రూ.రెండున్నర లక్షల కోట్లతో సంక్షేమం అందించామని జగన్ ఊరూవాడా డప్పు కొడుతుంటారు. 'నాఅక్కాచెల్లెమ్మలు...' అంటూ సభల్లో, తన పత్రిక, చానల్‌కు ఇచ్చే ప్రకటనల్లో ఊదరగొడుతుంటారు. కానీ, జగన్ అధికార పీఠం ఎక్కిన తర్వాత మహిళలకు ఇచ్చింది గోరంత.. అనేక రూపాల్లో గత ఐదేళ్లలో వారినుంచి పిండుకుంది కొండంత. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం మహిళల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పోలిస్తే జగన్ చేసింది మోసకారి సంక్షేమమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలయ్యేది. ప్రతిభా అవార్డుల కింద ఇంటర్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, రూ.20 వేలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో డే స్కాలర్స్‌కు రూ.20 వేలు, హాస్టల్ విద్యార్థులకు రూ.40 వేలు అందేవి. ఇవన్నీ జగన్ పాలనలో రద్దయిపోయాయి. ఒకటి నుంచి ఇంటరు వరకు అందరికీ 'అమ్మఒడి'యే మిగిలింది. అందులోనూ కొర్రీలు, ఇచ్చే నగదులో కోతలతో అమ్మలను వంచిస్తున్నారు. ఆనాడు చంద్రన్న పెళ్లికానుక పేరుతో బీసీ యువతకు రూ.35 వేలు, కాపులకు రూ.30 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 వేలు, కులాంతర వివాహాలకు రూ.75 వేలు అందించారు. ఆడపిల్లలకు పెళ్లి చేసి మెట్టినింటికి పంపడంలోని తల్లిదండ్రుల కష్టాన్ని కొంతైనా తగ్గించగలిగారు. జగన్ అధికారంలోకి వచ్చిన తొలి నాలుగేళ్లు ఈ పథకం కింద నిధులు ఇవ్వలేదు. చివరి ఏడాది అదీ ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ పెళ్లికానుక అమల్లోకి తెచ్చారు. షరామామూలుగానే ఈ పథకానికీ కొర్రీలు పెట్టారు. గతంలో లేని విద్యార్హతను ముందుకు తెచ్చి.. వధువు, వరుడు ఇద్దరు టెన్త్ పాస్ కావాలని నిబంధన పెట్టారు. తద్వారా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేశారు.

చంద్రబాబు ప్రభుత్వం 6 వేల ఎకరాల భూములు కొనుగోలు చేసి మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. వారిని గృహలక్ష్మిలను చేసింది. జగన్ ప్రభుత్వం తొలినుంచీ 'అక్కాచెల్లెమ్మ'లను పీక్కుతినడమే పనిగా పెట్టుకుంది. పేదలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని కట్టుకున్న ఇళ్లకు శాశ్వత పట్టాలు ఇస్తానంటూ 'ఓటీఎస్' విధానం తెచ్చింది. దీని ప్రకారం ఒక్కో కుటుంబం నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు బలవంతపు వసూళ్లు జరిపింది. ఇలా దాదాపు ఏడు లక్షలమంది నుంచి రూ. కోట్లు రాబట్టింది. డబ్బులు కట్టిన అందరికీ 'పట్టాలు' ఇవ్వలేదు.

చెల్లని పట్టాలు..

కానీ, ఇచ్చిన కొంతమందికైనా అవి 'చెల్లని పట్టాలు'గా మిగిలిపోయాయి. ఈ పట్టాలపై జగన్ ఫొటోలు, నవరత్నాల లోగో ఉండటంతో వాటిని తాకట్టు పెట్టుకుని రుణాలు ఇవ్వలేం అని బ్యాంకులు తేల్చేశాయి. దీంతో పేద మహిళలు అన్నివిధాలుగా మోసపోయారు. మరోవైపు అడగనివారికి, అవసరం లేనివారికి సైతం అమరావతి రాజధానిలో దాదాపు 50 వేల మందికి చెల్లని పట్టాలిచ్చి ప్రచారం చేసుకున్నారు. అంచలంచెలుగా మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. ఇప్పుడుచూస్తే, గ్రామాల్లో కూడా ఫైవ్‌స్టార్ హోటల్ మందురేట్లు పెట్టి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా పతనం చేశారు. కాంట్రాక్టు పనులు, సరఫరా కాంట్రాక్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జగన్ చేసిన చట్టాలు...ఎక్కడా అమలు కాలేదు. అదే విధంగా స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలన్న చట్టం కూడా నీరుగారిపోయింది.

జగన్ తెచ్చిన అన్ని పథకాల్లాగానే ఆసరా పథకం కూడా లోపభూయిష్టంగా మారింది. సుమారు 25 శాతం పైగా అసలైన లబ్ధిదారులకు ఆ ఫలాలు అందలేదు. 2019 ఏప్రిల్ నాటికి బ్యాంకుల్లో రుణాలు పొంది తిరిగి చెల్లించిన వారికి ఆసరా ప్రయోజనాలను అందిస్తామని జగన్ ప్రభుత్వం చెప్పింది. ఆ మేరకు నిబంధనలు రూపొందించింది. అయితే అప్పటికే డ్వాక్రా గ్రూపుల పరిస్థితి మారిన విషయం జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో చిక్కుముడులు పడ్డాయి. సభ్యుల మధ్య, లీడర్ల మధ్య అనైక్యత, వారు బ్యాంకులనుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో వచ్చిన వివాదాలతో డ్వాక్రా గ్రూపులు చిన్నాభిన్నమయ్యాయి. ఆయా డ్వాక్రా

అర్హులకు దక్కని ఆసరా

గ్రూపుల నుంచి బయటకు వెళ్లిన సభ్యుల స్థానంలో కొత్త సభ్యులను సెర్ప్ అధికారులు చేర్చారు. కొన్ని చోట్ల 60 ఏళ్లు దాటిన డ్వాక్రా సభ్యులను తొలగించి వారి స్థానంలో కొత్త సభ్యులను చేర్చారు. దీంతో డ్వాక్రా గ్రూపులన్నీ పాత, కొత్త గ్రూపు సభ్యులతో మిళితమయ్యాయి. 2019కు ముందు బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఆయా గ్రూపుల నుంచి బయటకు వెళ్లిన సభ్యులకు అప్పట్లోనే తీర్మానాలు రూపొందించి వారికి ఆసరా అందించాలని తీర్మానాలు చేశారు. ఆయా తీర్మానాలు బ్యాంకుల్లో కూడా ఇచ్చారు. అంటే అప్పట్లో రుణాలు పొందిన డ్వాక్రా సభ్యులకే ఆసరా నిధులు అందాలి. పలు డ్వాక్రా సంఘాల్లో పలు కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో కొత్త సభ్యులను చేరుస్తూ సెర్ప్ సిబ్బంది, వైసీపీ నేతలు పావులు కదిపారు. ఈ క్రమంలో కొత్త సభ్యులుగా తమ అనుయాయులను చేర్చుకున్నారు. పాత గ్రూపు సభ్యులకు ఇవ్వాల్సిన ఆసరా ప్రయోజనం కొత్త సభ్యులకు అందేలా పైరవీలు సాగించారు. బ్యాంకులకు మాత్రం పాత సభ్యులకే ఆసరా అందిస్తున్నట్లు తీర్మానాలు ఇచ్చి...ఆసరా నిధులను చాలాచోట్ల కొత్త సభ్యులకు అందించారు.

నోట్ దిస్ పాయింట్!

బాబోయ్ ఎన్ని పార్టీలో!



2019 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పోటీ చేసిన జాతీయ పార్టీలు 5 (బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్)

ఇతర రాష్ట్రాల్లో నమోదై ఇక్కడ పోటీ చేసిన రాష్ట్ర పార్టీలు 6 (ఫార్వర్డ్ బ్లాక్, ముస్లింలీగ్, జేడీ(ఎస్), ఆర్జేడీ, శివసేన, సమాజ్‌వాదీ)

పోటీ చేసిన రాష్ట్ర పార్టీలు 2 (టీడీపీ, వైసీపీ)

గుర్తింపులేని పార్టీలు 56

ది లీడర్



అసామాన్యుడు

జనహితం ఆదినారాయణరెడ్డి రాజకీయ జీవితం



ఉమ్మడి కడప జిల్లా రాజకీయాల్లో సుండుపల్లె మండలంతో ముడిపడిన పేరు యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి. పింఛా ప్రాజెక్టు, గంగనేరు ప్రాజెక్టు, కడపలో రేడియో స్టేషన్ ఏర్పాటు....ఇలా ప్రతి అభివృద్ధికీ ఆయనదే తొలి అడుగు. స్వాతంత్ర్య సమరయోధుడైన ఈ తొలితరం ఎమ్మెల్యే సామాన్యుడిగా ఉంటూనే అసామాన్యునిగా గుర్తింపు పొందారు. ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు ఏర్పాటు చేసిన పార్టీలో 1930ల్లో జనరల్ సెక్రటరీగా ఆదినారాయణ రెడ్డి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎడ్లబండిపై గ్రామ గ్రామానికి తిరుగుతూ స్వరాజ్య ఉద్యమ ప్రచారం సాగించేవారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టు అయి రాయవెల్లూరు జైలులో కొంతకాలం గడిపారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో రాయచోటి నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాతి ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా పనిచేశారు. గంజి కరువు నేపథ్యంలో 1952 అక్టోబరు 7న రాయచోటి సందర్శనకు వచ్చిన దేశ ప్రథమ ప్రధాని నెహ్రూను కలిశారు. కరువును పారదోలేందుకు తాత్కాలిక సహాయక చర్యలు తీసుకుంటూనే శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకోసం వెలిగల్లు ప్రాజెక్టు నిర్మించాలని వినతి పత్రం అందించారు. కడప వాసుల చిరకాల కోరిక అయిన పింఛా ప్రాజెక్టు, గంగనేరు ప్రాజెక్టులను సాకారం చేశారు. కడప జిల్లాలో రేడియో స్టేషన్ ఏర్పాటుకు కృషిచేశారు.

- సుండుపల్లె

ఓట్ల పండక్కి 43 లక్షల మంది దూరం!



- రాష్ట్రవ్యాప్తంగా ఓటు లేని అభాగ్యులు
- గుంటూరు జిల్లాలోనే 3.5 లక్షల మంది
- వారిలో సంచారజాతులు, నిరాశ్రయులు
- వలస కార్మికులు, భిక్షాటన చేసేవారు
- ఆధార్ కార్డు కూడా లేని పరిస్థితి

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

ఓటు హక్కు లేకుంటే జనాభా లెక్కల్లో లేనట్లేనని భావిస్తారు. ఓటు.. మనిషి అస్తిత్వానికి ప్రతీక. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి ఒక్కరికీ చదువు, ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఐదేళ్లకోసారి నేతల తలరాతను మార్చేది ఓటే. అలాంటిది.. రాష్ట్రంలో దాదాపు 43 లక్షల మందికి ఓటు హక్కు లేదట! వినడానికి ఇది ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే! 2021-22 గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఓటు హక్కు లేనివారి సంఖ్య 43 లక్షలుగా ఉందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. సంచార జాతులవారు, వలస కార్మికులు, భిక్షాటన చేసేవారు, నిరాశ్రయులు ఓట్ల పండుగకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. ఓ చోట స్థానికంగా నివాసం ఉండకపోవడం, వెనుకబాటుతనం, చైతన్యవంతుల్ని చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చూపడం.. కారణం ఏదైనా ఓటు హక్కుకు నోచుకోని అభాగ్యులు ఇప్పటికీ లక్షలాది మంది ఉండటం ఎంతో విచారకరం. రాష్ట్రంలో రానున్న ఎన్నికల రోజును ఓటర్లంతా ఓట్ల పండుగగా జరుపుకోవాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. ప్రజలను చైతన్యపరిచేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, ఇతరులు చేస్తున్న కృషి ఈ అభాగ్యులదాకా వెళ్లడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఎన్నికలకు దూరంగానే ఉంటున్నారు.

గుంటూరు జిల్లాలో 3.50 లక్షలు

2022-23 వలస కార్మికుల గణాంకాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షా 50 వేల మంది వరకు వలస వచ్చారు. వారి పిల్లలు దాదాపు 15,000 మంది బడికి వెళ్తుండగా, మరో 40,000 మంది బడికి దూరంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. వీరుకాకుండా సంచార జాతులవారు, భిక్షాటన చేసేవారు, నిరాశ్రయులు మరో 2 లక్షల మంది వరకు జిల్లాలో ఉన్నారు. వారికి ఆధార్ కార్డులు కూడా లేవని అధికారులు చెబుతున్నారు. ఆధార్ అనుసంధానం అయిన తరువాత వారంతా ఓటు హక్కుకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గుంటూరు నగరంతో పాటు మాచర్ల, మేడికొండూరు, గురజాలలో సంచార జాతుల ప్రజలు నివసిస్తుంటారు. సంఘం నాయకుల ద్వారా ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడంతో వారు ఓట్లకు దూరమయ్యారు. మరికొందరికి సరైన వివరాలు, ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేకపోవటంతో ఆధార్ కార్డు కూడా పొందలేకపోయారు.

● ఇంతవరకూ ఓటేయలేదు



నా జీవితంలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఓటు వేయలేకపోయా. ప్రకాశం జిల్లా నుంచి 40 సంవత్సరాల క్రితం గుంటూరు నగరానికి వచ్చాను. ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోలేకపోయాను. ఓటు కోసం కొంతమంది అధికారులను కలిసినా ఆధార్ కార్డు లేకపోవడంతో ఓటు హక్కు కల్పించడం వీలుకాదని చెప్పారు. దీంతో ఓటు వేయాలనే కోరిక కలగానే మిగిలిపోయింది.

- దానాపాల్

● ఒకసారి ఓటు వేసినట్టు గుర్తు



ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో పుట్టాను. 27 ఏళ్లు అక్కడే ఉన్నాను. ఆ తర్వాత పనిపై మాచర్ల, గురజాల ప్రాంతంలో కొంతకాలం నివాసం ఉన్నాను. ఇప్పుడు గుంటూరులోనే ఉంటున్నాను. ఊరు వదిలే ముందు ఒకసారి ఓటు వేసినట్టు గుర్తు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటును వినియోగించుకోలేకపోయాను. ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

- గుడిపాటి సుబ్బారావు

● ఓటు లేదని డబ్బులు ఇవ్వలేదు



మాది గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం కాటూరి గ్రామం. 30 ఏళ్ల కిందటే గుంటూరు వచ్చాను. ఆధార్ కార్డు రాకముందు, వచ్చిన తర్వాత కూడా ఓటు వేశాను. అయితే ఈ మధ్య ఆధార్ కార్డులో తేడా వచ్చిందని.. ఓటరు కార్డు ఇవ్వలేదు. మా గ్రామానికి చెందిన కొంత మంది ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఓటుకు డబ్బు ఇవ్వబోయి.. ఓటు లేదని తెలుసుకొని డబ్బులు ఇవ్వలేదు.

- కాటూరి గోవిందమ్మ



టీడీపీ సైకిల్.. ఆ సైకిల్‌పై అందంగా అమర్చిన తెలుగుదేశం జెండాలతో వెళ్తున్న ఇతడి పేరు శీర్వాటి వీరాంజనేయులు. టీడీపీ వీరాభిమానిగా ఉన్న వీరాంజనేయులు.. 20 ఏళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ ఇలాగే ప్రత్యక్షమవుతాడు. ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గంలో గౌరు చరిత రెడ్డి కోసం ఈయన జెండాల సైకిల్‌తో దూసుకుపోతున్నారు.

మందుబాబులకు ఎన్నికష్టాలో



అసలే ఎన్నికల రోజులు. ప్రచారానికి వెళ్లే జనం జేబుల్లో కాసిని డబ్బులు కనిపించే కాలం. అలాంటి రోజుల్లో చుక్క గొంతులో పడకపోతే ఎట్లా? ఇప్పుడు రాష్ట్రంలోని మందుబాబులకు ఈ సమస్యే వచ్చిపడింది. మద్యం షాపులకు కోటాను నిర్దేశించడంతో ఒకరికి ఒక్క సీసానే అమ్ముతున్నారు. ఆ సీసా కోసం భారీ క్యూలు ఉంటున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలోని మూడు మద్యం షాపుల వద్ద బుధవారం మందుబాబులు బారులుతీరారు. దీనికితోడు వైసీపీ అభ్యర్థి మేకపాటి నామినేషన్ వేస్తుండటంతో మందుబాబులు దుకాణాల వద్ద.. రోడ్డుపై వరకూ క్యూ కట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపే మూడు షాపులను మూసివేశారు. దీంతో మందుబాబులు నిరాశతో వెనుతిరిగారు.

- ఉదయగిరి రూరల్

ధరలు తగ్గాలంటే.. జగన్ పోవాలి!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు, పవన్ బుధవారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని సింగవరం, విజయనగరం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని తొలగించాలంటే అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ద్వారానే సాధ్యమని గుర్తించామని.. 2015లోనే దీని నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేసి శంకుస్థాపన కూడా చేశామని తెలిపారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా విమానాశ్రయ నిర్మాణాన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. 'పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న లక్ష్యంతోటే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని నేడు సంకల్పించాను. ఇందుకోసం టీడీపీ హయాంలో 2,700 ఎకరాలు భూసేకరణ చేశాం. కానీ జగన్ దీనిని వ్యతిరేకించారు. దాని పరిధిలో భూముల ధరలు పతనమయ్యేలా చేశారు. ఇదే సమయంలో జగన్, ఆయన అనుచరులు వందలాది ఎకరాల భూములు తక్కువ ధరలకే కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూములను దోచుకున్నారు. మళ్లీ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశారు. తాము కొన్న భూముల ధరలు పెంచుకునేలా వ్యూహం పన్నారు' అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

ఇలాంటివాడిని వదిలిపెడతారా?

నేను నెల్లిమర్ల రాగానే 2021లో రామతీర్థంలో రాముడి విగ్రహం తలనరికిన ఘటన జ్ఞాపకం వచ్చింది. అయోధ్యలో రామాలయం కడితే, సైకో జగన్ హయాంలో ఇక్కడి రాముడి తలతీసేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఇటువంటి వాడిని వదిలిపెడతారా? రానున్న ఎన్నికల్లో చిత్తు, చిత్తుగా ఓడించాలి. రాష్ట్రవ్యాప్తంగా 160 దేవాలయాలపై దాడులు చేశారు. అర్చకులపై కూడా దాడి చేశారు. ఆయన ఈ ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు తేలేదన్నారు. మేమొచ్చాక పరిశ్రమలను ఏర్పాటు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. పోలవరం ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేసి సాగునీటిని అందిస్తాం. పవన్ కళ్యాణ్ సినిమాల్లో నటిస్తే విలాసవంతంగా జీవించవచ్చు. కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, బీజేపీతో కలిసి నడుస్తున్నారు. జగన్ ప్రజల కోసం కాకుండా, తండ్రిని అడ్డుపెట్టుకుని వేలాది కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. 2014లో తండ్రి చనిపోయినప్పుడు.. 2019లో బాబాయిని హత్య చేయించి శవ రాజకీయాలు నడిపాడు.



విజయనగరంలో సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన పవన్



తాజాగా గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయి కన్పించలేదు గానీ.. తగిలిన గాయం మాత్రం ఎన్ని రోజులైనా తగ్గడం లేదు.. వచ్చే నెల 13 వరకూ ఈ డ్రామా కొనసాగిస్తాడు. ప్రజలు మాత్రం ఈ డ్రామాలను నమ్మొద్దు. శ్రీకాకుళం జిల్లాలో జగన్ మాట్లాడుతూ చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించడం శోచనీయం. ఐటీ పరిశ్రమలు, పట్టణాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మా వల్లే సాధ్యమైంది. జగన్ వైఫల్యాలకు కొదవేలేదు.

> హాయ్ ఏపీ.. బై బై జగన్ నినాదంతో.. వైసీపీని ఓటుతో తరిమికొట్టాలి. 'వై నాట్ పులివెందుల' అన్న నినాదంతో ముందుకు సాగుతున్నాం. పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి పులివెందులలో మరిన్ని బహిరంగ సభలు నిర్వహిస్తాం.
>
> 2014లో తండ్రి చనిపోయినప్పుడు.. 2019లో బాబాయిని హత్య చేయించి శవ రాజకీయాలు నడిపాడు. తాజాగా గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయి కన్పించలేదు గానీ.. తగిలిన గాయం మాత్రం తగ్గడం లేదు.. రోజురోజుకూ పెరుగుతోంది.
>
> \- చంద్రబాబు
>
> 5 కోట్ల ఆంధ్రులకు భరోసా ఇవ్వడానికి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా వస్తున్నాయి. 2014లో బలమైన కూటమిగా ఎలా ఏర్పడ్డామో ఇప్పుడూ అలాగే వస్తున్నాం. గోదావరి జిల్లాల్లో స్వీప్ చేయబోతున్నాం.
>
> \- పవన్ కల్యాణ్

తల్లి కుర్చీ లాక్కున్నాడు..

జగన్ తనస్వార్థం కోసం తల్లిని పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా కూర్చుండబెట్టాడు. ముఖ్యమంత్రి అయ్యాక ఆ కుర్చీ లాక్కున్నాడు. జైల్లో ఉన్న కాలంలో చెల్లెలితో ప్రచారం చేయించుకున్నాడు. చివరకు ఆస్తులు కూడగట్టుకుని చెల్లికి అప్పులు మిగిల్చాడు. ఆయన రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తాడా.?

ఇంటింటికీ పెన్షన్లపై చర్యలు తీసుకోండి: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మే 1న రాష్ట్రంలోని ఇంటింటికీ పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ప్రజాప్రయోజనాల దృష్టిలో పెట్టుకుని పెన్షన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. వలంటీర్లు లేని రాష్ట్రాల్లో కూడా ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ జరుగుతోందంటూ గతంలో హైకోర్టు వ్యాఖ్యానించిన విషయం గుర్తు చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పెన్షన్ అందించడం సాధ్యమవుతుందని సీఎస్ నిర్వహించిన సమావేశంలో కలెక్టర్లు ఇదివరకే తెలిపారన్నారు.

ఎన్నికల తర్వాత జగన్ జైలుకే!

ఎన్డీయేతోనే బంగారు భవిష్యత్: పవన్

జగన్ ఎన్నికల తర్వాత అరెస్టు కావడం ఖాయమని, ఇది ప్రధాని మోదీ గ్యారంటీ అని పవన్ అన్నారు. తప్పు చేసిన వారంతా శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాలని ఎన్నికల ప్రచారంలో ప్రధాని చెప్పారని.. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 30కి పైగా కేసుల్లో బెయిల్ మీద తిరుగుతున్నాడని.. ఎన్నికల తర్వాత కచ్చితంగా జైలుకు వెళ్తాడని స్పష్టం చేశారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని ముందు నుంచీ చెబుతున్నానన్నారు. అన్ని వర్గాలను వంచించిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపిచ్చారు. సింగవరం, విజయనగరం సభలతో పాటు బుధవారం ఉదయం ఆయన కాకినాడలో జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం గంజాయి కేపిటల్ అయిపోయిందని, 14-15 ఏళ్ల పిల్లలకు కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని ఆయా సందర్భాల్లో వాపోయారు. 'శాంతిభద్రతలు క్షీణించాయి. 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైపోయారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లేవు. కాపు రిజర్వేషన్లను జగన్ చీకొట్టారు. అలాంటి వైసీపీ తరపున కాకినాడ ఎంపీ అభ్యర్థిగా చలమశెట్టి సునీల్ నిలబడడం దారుణం. ఉత్తరాంధ్రలో వలసలు ఆగాలి.. వలసలు ఆగాలంటే.. పరిశ్రమలు రావాలి.. బలమైన ఆలోచన తీసుకుని ముందుకు వెళ్లాలి. నెల్లిమర్లకు సంబంధించి 10వేల మంది పనిచేసే జూట్ కర్మాగారం మూతపడింది. కూటమి గెలవగానే.. చంద్రబాబుతో ఆలోచన చేసి, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి ఈ జూట్ పరిశ్రమను తెరిపించేందుకు కృషి చేస్తా. ఎన్డీయే ఉమ్మడి లక్ష్యం ప్రతి చేనుకు నీరు.. ప్రతి వ్యక్తికీ పని కల్పించడం. ఎంతో ప్రాముఖ్యం ఉన్న రామతీర్థం రాముడి విగ్రహం తల నరకడం, దానిని పట్టుకుని పూజారి విలపించడం నన్ను ఎంతో కలిచివేసింది. జగన్ పాలన నవనందుల మాదిరిగా ఉంది. చాణక్య, చంద్రగుప్తుల కాలంలో నవనందులు తలతిక్క పనులు చేసేవారు. అందుచేత మనం చాణుక్యులం కావాలి' అని పిలుపిచ్చారు.

నేడు అన్నమయ్య జిల్లాకు బాబు, పవన్

రాయచోటి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ గురువారం అన్నమయ్య జిల్లాకు రానున్నారు. సాయంత్రం రాజంపేట, రైల్వేకోడూరుల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొంటారు.

'మౌత్ టాక్' మాయ!

▸▸ పార్టీల తరఫున రంగంలోకి దిగిన ఏజెన్సీలు





సినిమాలకు రివ్యూలు, పబ్లిసిటీ ఎలా ఉన్నా... 'మౌత్ టాక్' ముఖ్యం! ఇది రాజకీయాల్లోనూ పనిచేస్తుందనుకున్నారేమో... ఇప్పుడు 'మౌత్ టాక్' ఏజెన్సీలు వచ్చేశాయి. గుంటూరు నగరంలో ఉన్న ఒక ఏజెన్సీ గత కొన్ని నెలలుగా అధికార పార్టీ తరఫున ఈ ప్రచారం చేస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న కొందరు ఎంపీ అభ్యర్థులు వ్యక్తిగతంగా ఇటువంటి ఏజెన్సీలతో పని చేయించుకొంటున్నారు. తన తరఫున ఒక ఏజెన్సీ 300 మందితో 'మౌత్ టాక్' చేస్తోందని ఒక అభ్యర్థి తెలిపారు. వీళ్లలో నుంచే ఇద్దరు ముగ్గురు టీ దుకాణాలు, హోటళ్లు, నలుగురు చేరి ముచ్చట్లు పెట్టుకునే పార్కుల వంటి ప్రదేశాలకు వెళ్లి... ఒకరికి ఒకరు సంబంధం లేనట్టుగా ఆ ప్రాంతంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయంటూ తమలో తాము మాట్లాడుకుంటున్నట్లుగా చర్చ మొదలుపెడతారు. మెల్లగా తాము కాంట్రాక్టు తీసుకున్న అభ్యర్థి ప్రస్తావన తెస్తారు. ఆ అభ్యర్థి ఖాయంగా గెలుస్తాడని, ఎక్కడికి వెళ్లినా ఆయన గురించే మాట్లాడుకుంటున్నారని ఒకరు చెప్పడం, దానిని ఇంకొకరు సమర్థించడం! ఇలా సాగుతుందీ 'మౌత్ టాక్'! దీనిని రక్తి కట్టించేందుకు... తమలో తాము వాదనకు దిగడం, పందేలకు సిద్ధం కావడం వంటివీ జరుగుతాయి. 'పక్కవాళ్ల మాటలకు ప్రభావితమయ్యే లక్షణం చాలామందికి ఉంటుంది. ఆ బలహీనత పైనే ఈ వ్యాపారం జరుగుతుంది. తటస్థుల మాదిరిగా చెబితేనే ఆ ప్రభావం పడుతుంది. దీనికి అవసరమైన శిక్షణను మేం ఇచ్చి పంపుతాం' అని ఒక నిర్వాహకుడు చెప్పారు. ఇదంతా వినడానికి బాగానే ఉందని, ఫలితం ఎలా ఉంటుందో అంచనా వేయడం కష్టమని ఒక అభ్యర్థి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొందరు అభ్యర్థులు ఇటువంటి ఏజెన్సీల సేవలను వాడుకొన్నారు. అక్కడ ఫలితాలు చూస్తే... గ్రామీణ ప్రాంతమంతా కాంగ్రెస్ అభ్యర్థులు, హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. 'ఒక పార్టీకి అనుకూలంగా ప్రభంజనం వంటి వాతావరణం ఉంటే మేమేం చేయలేం' అని ఒక ఏజెన్సీ నిర్వాహకుడు పేర్కొన్నారు.

\- అమరావతి, ఆంధ్రజ్యోతి



విజయోత్సవ ర్యాలీ సభలో ప్రసంగిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. చిత్రంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్

అవినీతి వైసీపీ నాయకులు జైలుకే!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డాగా మారిందని ఆరోపించారు. బుధవారం విశాఖ గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన మేధావుల సమావేశంలోనూ, అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన విజయాభవ ర్యాలీలోనూ రాజ్‌నాథ్ మాట్లాడారు. విశాఖలో ల్యాండ్ మాఫియాపై, ఏపీలో ఇసుక మాఫియాపై కేంద్రం వద్ద పూర్తి సమాచారం ఉందని రాజ్‌నాథ్ చెప్పారు. కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఏపీలో వివిధ పథకాలకు కేంద్రం నిధులు ఇస్తుంటే వాటిని కూడా జగన్ ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని, అవన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఈ నిధులన్నీ చాలవన్నట్టు జగన్ ప్రభుత్వం రూ.13.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని వివరించారు. ఏపీలో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అధికారంలోకి రాగానే డ్రగ్స్, ల్యాండ్, ఇసుక మాఫియాలకు అడ్డుకట్ట వేస్తామని, శాంతి భద్రతలను కాపాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్(టీడీపీ), విశాఖ ఉత్తర అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ..

వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారిందని, ఏపీ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తున్నా ఇక్కడి పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. భూ దందాలు, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాకు వైసీపీ ప్రభుత్వం ప్రసిద్ధి చెందిందన్నారు. కేంద్ర పథకాలు అమలు చేస్తే ప్రధాని మోదీకి ఎక్కడ పేరు వచ్చేస్తుందోనని అవి లబ్ధిదారులకు చేరకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. గతంలో భారత్‌ను పొరుగు దేశాలు బెదిరించేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. ఎంతో శక్తిమంతమైన దేశంగా భారతదేశం తయారైందన్నారు. 2014కు ముందు రక్షణ శాఖకు కావాల్సిన ఆయుధాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారని ఇప్పుడు మనమే తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. రాజ్యసభలో సీఎం రమేశ్ ప్రసంగాలను గత పన్నెండేళ్లుగా ప్రత్యక్షంగా విన్నానని, ఎటువంటి సమస్యనైనా సమర్థంగా పరిష్కరించగలరని కొనియాడారు. సీఎం రమేశ్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

3, 4 తేదీల్లో రాష్ట్రానికి ప్రధాని మోదీ

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల మూడు, నాలుగు తేదీల్లో రాష్ట్రానికి వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. మోదీతో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహణకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం టీడీపీ, జనసేనతో కలిసి వేదికలు ఖరారు చేసే పనిలో పడింది. విజయవాడ, రాజంపేట ప్రాంతాల్లో మోదీ సభలు పెడితే కేడర్‌లో ఉత్సాహం వస్తుందనే భావనలో ఎన్డీఏ మిత్రపక్షాలు ఉన్నాయి. తెలంగాణతో పాటు ఏపీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ప్రధాన మంత్రిని రెండు రాష్ట్రాల నేతలు ఆహ్వానించగా ఢిల్లీ నుంచి బుధవారం సాయంత్రం ఏపీ బీజేపీ కార్యాలయానికి వర్తమానం అందింది. దీంతో రాష్ట్ర బీజేపీ ఇంచార్జి అరుణ్‌సింగ్, సహ ఇంచార్జి సిద్ధార్థనాథ్ సింగ్, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చర్చించారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన అధ్యక్షులతో సమావేశమై మోదీ సభల నిర్వహణపై ఏకాభిప్రాయానికి రానున్నారు. రోడ్ షోతోపాటు బహిరంగ సభ ఉండేలా చూసుకోనున్నారు.

మీ అందరూ నా కూతుళ్లే

▸▸ టీడీపీ మీ అందరికీ పుట్టిల్లు: చంద్రబాబు

▸▸ శ్రీకాకుళంలో మహిళలతో భేటీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'నాకు కూతురు లేదు. మీ అందరూ నా కుమార్తెలే. టీడీపీ మీ అందరికీ పుట్టిల్లు. ఆడబిడ్డలను మహాశక్తిమంతులుగా తీర్చిదిద్దుతా' అని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. బుధవారమిక్కడ 'ఆడబిడ్డలతో సమావేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. వారిని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. 'ఆడబిడ్డలను చదివించాలని, ఆడవారికి ఆస్తిలో హక్కు కల్పించేందుకు, స్థానిక సంస్థల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం పోరాడింది టీడీపీయే. డ్వాక్రా సంఘాలు పెట్టింది నేనే. ఇప్పుడు 30 ఏళ్లవుతోంది. మీరు రూపాయి పొదుపు చేస్తే నేను రూపాయి రివాల్వింగ్ ఫండ్ ఇచ్చాను. పసుపు కుంకుమ కింద సహాయం అందించాను. ఈ ఐదేళ్లలో మీరు చాలా నష్టపోయారు. మీ జీవితాలు తలకిందులయ్యాయి. మీ కష్టాలు.. మీ బాధలు వినేందుకే వచ్చాను. మీ జీవితాలతో చెలగాటమాడే ఈ జలగ జగన్ ఓ సైకో. ఆడవారిపై వైసీపీ అరాచకాలు భరించలేక కొవ్వూరు లక్ష్మి ఢిల్లీ వెళ్లి నిరసన చేశారు. వేలు పోయినా పర్వాలేదు.. రాష్ట్రంలో అమ్మాయిలను కాపాడాలని ఆమె కోరుతున్నారు. గజపతినగరంలో ఓ ఆడబిడ్డ ఆస్తిని ఎమ్మెల్యే కబ్జా చేశాడు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఒకప్పుడు బియ్యం రూ.40, ఇప్పుడు రూ.65.. కందిపప్పు రూ.87 ఉంటే ఇప్పుడు రూ.160.. చింతపండు రూ.200.. గ్యాస్ రూ.1100.. కరెంటు బిల్లు రూ.200 నుంచి రూ.వెయ్యి దాటిపోతోంది. మద్యపాన నిషేధం అని చెప్పి ధరలు పెంచారు. అప్పుడు రూ.60 క్వార్టర్ బాటిల్ సీసా అయితే.. ఇప్పుడు రూ.200 ఉంది. దీనికితోడు గంజాయి, డ్రగ్స్ వచ్చాయి. రాష్ట్రంలో దద్దమ్మ, అసమర్థ ప్రభుత్వం ఉంది. మోసాలు చెప్పి అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారు. మే 13న దిమ్మతిరిగే తీర్పు ఇవ్వాలి. ఆ దెబ్బతో జగన్ బంగాళాఖాతంలో కలసిపోవాలి' అని పిలుపిచ్చారు.



'ఆడబిడ్డలతో సమావేశం' కార్యక్రమానికి హాజరైన మహిళలు



వేదికపై ఓ చిన్నారికి పేరు పెడుతున్న చంద్రబాబు

చిన్నారికి పేరుపెట్టిన చంద్రబాబు

నెల వయసున్న చిన్నారిని తీసుకుని తల్లి, ఆ చిన్నారి అమ్మమ్మ చంద్రబాబు వద్దకు వచ్చారు. ఆ చిన్నారికి నామకరణం చేయాలని కోరారు. 'పునర్విక' అని ఆయన పేరుపెట్టారు.

జగన్ ఇచ్చిందే స్కీమట!

▸▸ నా మాదిరిగా ఎవరూ చేయలేరు.. నేను ఇవ్వనిదేన్నీ ఇవ్వలేరు

▸▸ పరాకాష్ఠకు చేరిన జగన్ స్వోత్కర్ష

▸▸ టెక్కలిలో ముగిసిన బస్సుయాత్ర



శ్రీకాకుళం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)/టెక్కలి : తాను ఇవ్వలేని ఏ స్కీమునూ ఎవరూ అందించలేరని సీఎం జగన్ గొప్పలు పోయారు. జగన్‌కు ఓటు వేస్తేనే ఇప్పుడున్న పథకాలు ఉంటాయని; చంద్రబాబుకు, ఆయన పొత్తు పెట్టుకున్న పార్టీల అభ్యర్థులకు ఓటువేస్తే అవన్నీ నిలిచిపోతాయంటూ సొంత డబ్బా మరోసారి కొట్టుకున్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ముగింపు సభలో జగన్ మాట్లాడారు. ఎప్పటిలాగే స్వోత్కర్ష, పర నిందలతో, కళ్లార్పకుండా చెప్పే అబద్ధాలతో సొంత పార్టీ శ్రేణులకే విసుగు తెప్పించేలా జగన్ ప్రసంగం సాగింది. ఇడుపులపాయ నుంచి మొదలెట్టిన సిద్ధం యాత్రను ఇచ్ఛాపురంలో ముగించామని జగన్ అనగా, సభికులు అవాక్కయ్యారు. సభ జరుగుతున్నది టెక్కలిలో కదా అంటూ జనం గొణుక్కోవడం కనిపించింది. అనంతరం.. వైసీపీ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ.. అభ్యర్థులందరూ సౌమ్యులూ.. మంచివారని జగన్ కొనియాడారు. .

నరకం చూపిన ట్రాఫిక్ ఆంక్షలు

టెక్కలి సిద్ధం సభకు వందల బస్సులను ఆర్టీసీ తరలించింది. పల్లె ప్రాంతాలు ఎక్కువగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో ఆర్టీసీ సర్వీసులే ప్రజలకు ప్రధాన రవాణా సాధనం. జగన్ కోసం దాదాపుగా బస్సులన్నీ ఈడ్చేయడంతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థ పడ్డారు. బుధవారం అక్కివలస నుంచి జగన్ బస్సుయాత్ర ప్రారంభమై.. జాతీయ రహదారి మీదుగా టెక్కలి వరకూ సాగింది. ఈ క్రమంలో ఆంక్షలు కారణంగా శ్రీకాకుళంలో హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నుంచి శ్రీకాకుళం కొత్త రోడ్డు వరకు సుమారు రెండున్నర గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యమంత్రి సాయంత్రం 4.10 గంటలకు జాతీయరహదారి పరశురాంపురం జంక్షన్‌కు బయలుదేరగానే.. పరశురాంపురం నుంచి కోటబొమ్మాళి వరకు లారీలు,బస్సులు, ఇతర వాహనాలను నిలిపివేశారు. అక్కవరం మొదలుకొని జగతిమెట్ట, ఆది ఆంధ్రావీధి, టెక్కలి శివారు ప్రాంతం నుంచి నందిగాం మండల పరిధి వరకు అన్నిరకాల వాహనాలు రెండువైపులా బారులుతీరాయి.

నేడు పులివెందులలో జగన్ నామినేషన్

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ గురువారం పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. జగన్ స్వయంగా పులివెందులలో ఉదయం 11.25 నుంచి 11.40 గంటల మధ్య రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తారు. అనంతరం భాకరాపురంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

పులివెందులలో ప్రజాస్వామ్య పరిరక్షణకు దేనికైనా సిద్ధం

▸▸ స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు సహకరిస్తా : బీటెక్ రవి



పులివెందుల, ఏప్రిల్ 24: పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేనికైనా సిద్ధమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) చెప్పారు. బుధవారం నామినేషన్ దాఖలు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కృషిచేస్తానని చెప్పారు. జగన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

కొడాలికి చేదు అనుభవం

▸▸ ఎన్నికల ప్రచారంలో అనుచరుల వీరంగం.. యువకులపై దాడి

▸▸ నా కొడుకును తెచ్చివ్వండని నానిని నిలదీసిన యువకుడి తల్లి

▸▸ అల్లరి కాకుండా రూ.50 వేలు చేతిలో పెట్టి వెనుదిరిగిన నాని

▸▸ గుడ్లవల్లేరు మండలం కూరాడలో ఘటన

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుడివాడ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి నానికి ఎన్నికల ప్రచారంలో చేదు అనుభవం ఎదురైంది. గుడ్లవల్లేరు మండలం కూరాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు మంగళవారం రాత్రి కొడాలి నాని వచ్చారు. గ్రామంలో ఓ ఆలయానికి సహాయం చేస్తానని గతంలో కొడాలి నాని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని గ్రామస్థులు నాని వద్ద ప్రస్తావించారు. అదే సమయంలో అక్కడే ఉన్న కొందరు యువకులు.. 'ఆయనేంటి చేసేది.. కోతలు తప్ప ఏ పనులూ చేయడం చేతకాదు' అంటూ మాట్లాడారు. దీంతో నాని వెంట ఉన్న పాలేటి చంటి, మరికొందరు అనుచరులు.. వారిపై దాడికి దిగారు. భయభ్రాంతులకు లోనైన యువకులు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత గ్రామంలో పర్యటిస్తున్న నాని వద్దకు బాధిత యువకుడి తల్లి వచ్చి.. 'నా కొడుకుపై నీ మనుషులు దాడి చేశారు. మీరు చంపేస్తారన్న భయంతో వాడు ఎక్కడికో వెళ్లిపోయాడు. నా కొడుకును తెచ్చి అప్పగించండి' అంటూ నిలదీసింది. ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక కొడాలి కాసేపు మౌనంగా ఉండి పోయారు. విషయం అల్లరవుతుందనే ఉద్దేశంతో.. 'మీ ఇంటికి వెళదాం పద' అంటూ ఆమె ఇంటికి వెళ్లారు. ఆమెను బుజ్జగించి రూ. 50 వేలు చేతిలో పెట్టి వెనుదిరిగారు.

సినీకవి జొన్నవిత్తుల నామినేషన్

విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. బుధవారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు ఆయన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. కాగా, జొన్నవిత్తుల ఇటీవలే జై తెలుగు పార్టీని స్థాపించారు.



స్వప్నిల్ దినకర్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న జొన్నవిత్తుల

పిఠాపురంలో ట్రాన్స్‌జెండర్ నామినేషన్

పిఠాపురం, ఏప్రిల్ 24: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ట్రాన్స్‌జెండర్, బిగ్‌బాస్ ఫేం తమన్నా సింహాద్రి ఎన్నికల బరిలోకి దిగారు. భారత చైతన్య యువ జన పార్టీ(బీసీవై) తరఫున ఆమె బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామం నుంచి ర్యాలీగా గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల మీదుగా ఆర్వో కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ట్రాన్స్ ఉమెన్‌గా 2018లో తాను రాజకీయాల్లోకి అడుగుపెట్టానని చెప్పారు. పవన్‌కల్యాణ్‌ను శ్రీరెడ్డి రోడ్డు మీదకు లాగుతున్న సమయంలో ఆయనకు, జనసేనకు అండగా నిలిచానని తెలిపారు. 'పవన్, జనసేనకు నా అవసరం లేదనుకుంటా, వారు నన్ను పట్టించుకోలేదు. బీసీవై అధినేత రాంచంద్రయాదవ్ నా సేవా కార్యక్రమాలను గుర్తించి నాకు పిఠాపురం టికెట్ ఇచ్చారు' అని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


జోగి రమేశ్ నామినేషన్ సందర్భంగా బందరు రోడ్డులో పెనమలూరు నుంచి విజయవాడ వైపు రెండు గంటల సేపు భారీగా నిలిచిన వాహనాలు



నగరంలో నరకం!

దేవినేని అవినాశ్ నామినేషన్ సందర్భంగా బెంజ్ సర్కిల్ నుంచి స్క్యూ బ్రిడ్జి వైపు భారీగా నిలిచిన వాహనాలు

జోగి రమేశ్, అవినాశ్ నామినేషన్ల సందర్భంగా ట్రాఫిక్ జామ్‌లతో నరకం చూసిన ప్రయాణికులు

బందరు రోడ్డులో భారీగా ట్రాఫిక్‌జామ్

బస్సులు, కార్లు, ఆటోల్లో ఉక్కపోతకు అల్లాడిపోయిన పిల్లలు, వృద్ధులు, మహిళలు

పెనమలూరు, ఏప్రిల్ 24: జోగి రమేష్ నామినేషన్ సందర్భంగా బుధవారం బందరు రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డుకు ఒక పక్కనే నడవాల్సిన జోగి వాహనాలు రెండు వైపులా రోడ్డును ఆక్రమించడం, డివైడర్లను బారికేడ్లతో మూసేయడంతో వాహనాలు ఎటూ కదల్లేదు. వందలాది వాహనాలు, అందులోని ప్రయాణికులు రెండు గంటల పాటు ఎండలోనే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. ఎండ వేడిమికి ట్రాఫిక్ జామ్ తోడవడంతో బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు నరకం చూశారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు. నిడమానూరు వైపు నుంచి బందరురోడ్డు పైకి వచ్చే వాహనాలు రాకుండా డివైడర్లు మూసేయడంతో వాహన దారులు నానా అవస్థలు పడ్డారు. పోరంకి సెంటరు నుంచి పది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని వైసీపీ నాయకులు ముందుగా ప్రకటించి అప్పటికప్పుడు వందడుగుల రోడ్డులోని గ్రౌండుకు మార్చారు. దీంతో ఈ ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. నామినేషన్ కార్యక్రమానికి స్థానికులు పెద్దగా ఆసక్తి చూపకపోయినప్పటికీ ఘైలవరం, పెడన నుంచి ప్రజలను తరలించారని బందరు రోడ్డు వెంట చెప్పుకున్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ఆరోగ్యం విషమించిన ఓ పేషెంట్‌ను తీసుకు వెళుతున్న 108 వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ మరికొంత మంది స్థానికులు, పోలీసుల సాయంతో ట్రాఫిక్ నుంచి ఆ వాహనాన్ని తప్పించి పంపారు.


జోగి రమేశ్ నామినేషన్ సందర్భంగా పోరంకి వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన 108 అంబులెన్స్

భారీగా నిలిచిన టిప్పర్లు, లారీలు

కంకిపాడు: గుడివాడ, మచిలీపట్నం వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన వాహనాలను ఉదయం 10 గంటల నుంచే కంకిపాడు పై ఓవర్ వద్ద నిలుపుదల చేశారు. దీంతో భారీగా లారీలు, టిప్పర్ల నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అవినాష్ నామినేషన్..అల్లాడిపోయిన ప్రజలు

పటమట: వైసీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాశ్ నామినేషన్ సందర్భంగా బుధవారం దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్ నుంచి డీమార్టు మీదుగా రామలింగేశ్వర్‌నగర్ వైపు ఓ రోడ్డు మొత్తం మూసేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు నరకం చూశారు. ర్యాలీ మొదలు పెట్టకముందే వైసీపీ శ్రేణులు భారీగా మందుగుండు సామాగ్రి, బాంబులను ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కాల్చడంతో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పటమట హైస్కూల్ రోడ్డు వరకు ట్రాఫిక్ గంటపాటు నిలిచిపోయింది. ఓ పక్క వేడిగాలులు, ఉక్కపోత తట్టుకోలేక గంటల తరబడి ట్రాఫిక్‌లో నిలబడలేక ద్విచక్ర వాహన దారులు అల్లాడిపోయారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు క్రేన్ల సాయంతో గజమాల వేయడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.


పటమట ఫిష్ మార్కెట్ నుంచి కరకట్ట వైపు వెళ్లే దారిలో నిలిచిన వాహనాలు


బారికేడ్లతో మూసేసిన అవనిగడ్డ కరకట్ట రోడ్డు


వాహనాలు నిలిపివేస్తున్న పోలీసులపై అసహనం వక్తం చేస్తున్న వాహనదారులు

వైసీపీ తొత్తులుగా పోలీసులు

- ప్రచారాలకు అనుమతి ఇవ్వకుండా ఆంక్షలు: బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 24: పోలీసు శాఖలోని కొంత మంది అధికారులు వైసీపీకి తొత్తులుగా పని చేస్తున్నారని టీడీపీ అభ్యర్థుల ప్రచారాలకు అనుమతి ఇవ్వడం లేదని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా ఆరోపించారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని పోలీసు శాఖను ఐదేళ్లుగా జగన్ వేళ్లపై ఆడిస్తూ ప్రతిపక్షాలను వేధిస్తున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నామినేషన్లు వేశాక కూడా పోలీసు శాఖ జగన్ ఆడమన్నట్టు ఆడుతోందన్నారు. తన ప్రత్యర్థి వెల్లంపల్లి శ్రీనివాస్ ఇష్టానుసారం ప్రచారం చేసుకుంటున్నారని తనకు అనుమతుల పేరుతో ప్రచారాలకు పోలీసులు నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల తన ప్రచారానికి అనుమతి కోసం దరఖాస్తు చేస్తే నార్త్‌జోన్ ఏసీపీ డీఎస్‌పి ప్రసాద్, నున్న సీఐ అనుమతి ఇవ్వలేదన్నారు. ఏసీపీ, సీఐలకు వెలంపల్లి పోస్టింగ్ ఇప్పించారని దానివల్లనే వారు స్వామిభక్తి చాటుతున్నారని ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇటువంటి నిబంధనలు ఎప్పుడూ చూడలేదన్నారు. తన ప్రచారంలో ఏ సమయంలో ఏ వీధిలో ఎక్కడ ఉంటానో చెప్పాలంటూ పోలీసు అధికారులు కోరడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఒకటో తేదీనే పింఛన్లు ఇవ్వాలి

మే నెల ఒకటో తేదీ నుంచే ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని అధికారులను బొండా ఉమా కోరారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని సచివాలయ సిబ్బంది సీవోలు, ఆర్పీల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. ఏప్రిల్‌లో మూడో తేదీ నుంచి పింఛన్లు అందించారని, వృద్ధులు ఎండ తీవ్రతకు చనిపోయిన ఘటనలు ఉన్నాయని ఇటువంటికి వైసీపీ అనుకూలంగా మార్చుకుంటోందని అన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి పింఛన్ల పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని ఆయన కోరారు.

కమాండ్ కంట్రోల్ రూం సందర్శన

వన్‌టౌన్, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలు, తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకురాలు(జనరల్ అబ్జర్వర్) మంజూరాజ్‌పాల్ బుధవారం కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించారు. సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలపాలను ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ఓటర్ హెల్ప్‌లైన్ 1950, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్, వాట్సాప్, కాల్ సెంటర్, కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సీఈవో మెయిల్స్, సీ-విజిల్స్ ద్వారా 1799 ఫిర్యాదులు రాగా 1766 పరిష్కారం పూర్తైందని అధికారులు వివరించారు. రోజువారీ నివేదికల నిర్వహణ విధానాన్ని ఆమె పరి శీలించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్(కమిటీ), సోషల్ మీడియా, సెల్ విభాగాల కార్యకలపాలను పరిశీలించారు. ఆమె వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ యు.సురేంద్రనాథ్, సభ్యుడు వెలగజోషి ఉన్నారు.

నేరుగా ఫిర్యాదులకు వీలు

జనరల్ అబ్జర్వర్ మంజూరాజ్‌పాల్‌ను నేరుగా కలిసి ఎన్నికల ఫిర్యాదులు, విజ్ఞాపనలు అందించవచ్చునని కమాండ్ కంట్రోల్ రూం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మునిసిపల్ గెస్టహౌస్ గ్రౌండ్‌ఫ్లోర్, లబ్బీపేటలోని బృందావనకాలనీ నందమూరి రోడ్డు చిరునామాలో ఆమె అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఫోన్ నెంబర్ 8121526777లో సంప్రదించవచ్చని సూచించారు.


కృష్ణానదిలో తెప్పపై ఊరేగుతున్న గంగ, పార్వతి, మల్లేశ్వరులు, ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న పండితులు



వైభవంగా తెప్పోత్సవం

దుర్గగుడిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వన్ టౌన్, ఏప్రిల్ 24: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా కృష్ణానదిలో బుధవారం గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల తెప్పోత్సవ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పుష్పతోరణాలు, విద్యుల్లతలతో అలంకరించిన తెప్పపై ఉత్సవమూర్తులను ఉంచి పూజలు చేసిన అనంతరం వేద నివేదన అనంతరం నదిలో ఊరేగించారు. దేవస్థానం ఈవో కేఎస్ రామారావు తెలిపారు. స్థానాచార్యుడు శివప్రసాద శర్మ, ఈఈ రమాదేవి, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ, వైదికకమిటీ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం వేదోక్త శాస్త్రోక్త విధానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. లోక శాంతి కలగాలంటూ పూర్ణాహుతిలో ఆహుతులు సమర్పించారు. వేడుకగా ధాన్యకోట్సోత్సవాన్ని, వసంతోత్సవాలను నిర్వహించారు. గంగా, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య కృష్ణానది వద్దకు తీసుకెళ్లి వైదిక కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవమూర్తులకు అవభృద స్నానం చేయించారు. కృష్ణానదిలో నిర్వహించిన అవభృద స్నానంలో ఈవో రామారావు దంపతులు, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు అవభృద స్నానం చేయిస్తున్న పండితులు

పోస్టల్ బ్యాలెట్‌పై దిశానిర్దేశం

- నూరు శాతం ఓటేసేలా ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగ సంఘాలు
- పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగానికి ప్రత్యేక బృందాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవడంపై విజయవాడ వేదికగా ఉద్యోగులకు ఉద్యోగ సంఘాలు విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి. ప్రధాన జేఏసీలకు నాయకత్వం వహిస్తున్న ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్‌ఎస్‌ఏ)లు సమావేశాలు పెట్టి ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తున్నాయి. సీపీఎస్ ఉద్యోగుల సంఘం కూడా తమ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తోంది. ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్ తరఫున కేవీ శివారెడ్డి, ఎ.విద్యాసాగర్, ఏపీఆర్ఎస్ఏ తరఫున బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావులు ఉద్యోగులను పోస్టల్ బ్యాలెట్ వేయడంపై కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సంఘ సభ్యులతో ఏపీఎన్జీవో ఓభవన్, ఏపీ రెవెన్యూ భవన్‌లో సమావేశాలు నిర్వహించి ఎన్నికల విధుల్లో పాలు పంచుకునే ఉద్యోగులంతా నూరుశాతం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే దిశగా కసరత్తులు చేస్తున్నాయి. "ఫాం-12డీలను రిటర్నింగ్ అధికారులకు ఇవ్వడంలో సాంకేతిక ఇబ్బందులు ఉంటే తక్షణం సంఘాల దృష్టికి తీసుకురావాలి. ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కొందరి ఉద్యోగులను నియమించాం. సమస్య తేలకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం. ఉద్యోగులకు గతంలో మాదిరిగా ముందస్తుగా ఈ దఫా పోస్టల్ బ్యాలెట్ ఇవ్వరు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రానికి వెళ్లినపుడు మాత్రమే ఇస్తారు." అని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.

సాంకేతిక ఇబ్బందులుంటే సంఘాన్ని సంప్రదించండి

ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఫాం-12 డీని జమ చేయటానికి ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉంది. ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నప్పటికీ ఎన్నికల విధులపై పనిచేస్తున్న నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే ఓటు వేసుకోవటానికి అవకాశం ఉంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్లు వేయడానికి వీలుగా ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గం, ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. మే 5న పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు హాజరవ్వటానికి స్పెషల్ క్యాజువల్ లీవును ప్రకటించాలి.

- ఎ.విద్యాసాగర్, ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నాయకుడు

విధులు నిర్వహిస్తున్న చోటే ఓటేయొచ్చు

ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులంతా వారి ఆర్వో పరిధిలో జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఫాం-12 డీ సమర్పిస్తే అదే చోట పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం ఉంది. ఉద్యోగులు ఎక్కడ ఓటు కలిగి ఉన్నా వారు పనిచేస్తున్న ప్రాంతంలోనే ఓటేయొచ్చు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులందరికీ తెలంగాణలో మాదిరిగా ఆరోజున స్పెషల్ క్యాజువల్ లీవును మంజూరు చేయాలని కోరుతున్నాం.

- బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీఆర్‌ఎస్‌ఏ ప్రధాన కార్యదర్శి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వల్లూరి భార్గవ్ నామినేషన్

విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ విజయవాడ ఎంపీ అభ్యర్థి వల్లూరి భార్గవ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంజీ రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఢిల్లీరావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట ఇండియా కూటమి అభ్యర్థులు ఉన్నారు.


ఢిల్లీరావుకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న వల్లూరి భార్గవ్

బెజవాడ సివిల్ సర్వీస్ అధికారికి బంగారు పతకం

- రాష్ట్రపతి ముర్ము నుంచి అందుకున్న అబ్దుల్ రవూఫ్


అబ్దుల్ రవూఫ్

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 24: నగరానికి చెందిన సివిల్స్ సర్వీస్ అధికారి ఎండీ అబ్దుల్ రవూఫ్ తన శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి బంగారు పతకాన్ని బుధవారం అందుకున్నారు. డెహ్రాడూన్‌లో ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్టు అకాడమీలో ఇండియన్ ఫారెస్టు సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఆఫీసర్స్ 2022 బ్యాచ్ కాన్వకేషన్ నిర్వహించా రు. గౌరవ అతిథిగా ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్‌సింగ్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన అబ్దుల్ వృత్తిపరమైన శిక్షణలో అత్యధిక మార్కులను సాధించి ఆల్‌రౌండ్ అత్యుత్తమ పనితీరు పతకాన్ని అందుకున్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, కో-కరిక్యు లర్ యాక్టివిటీస్, వర్కింగ్ ప్లాన్ ఎక్సర్‌సైజ్, ఎస్సే రైటింగ్‌ల్లో మొత్తం 7 పతకాలు అందుకున్నారు.

ఉచిత చెస్ శిబిరం ప్రారంభం

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 24: చదువుతోపాటు విద్యార్థులు ఆట లకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని ఇన్‌కమ్‌టాక్స్ అదనపు డైరెక్టర్ వినోద్ కన్నన్ పిలుపునిచ్చారు. మొగల్రాజపురంలో గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వ ర్యంలో ఉచితచెస్ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. చెస్ అభ్య సన వలన జ్ఞాపకశక్తి మెరుగువుతుందన్నారు. జాతీయ స్థాయి చెస్ క్రీడా కారులకు తమ వంతు సాయం అందిస్తామని గౌరవ అతిథి మోడల్ డైరీ డైరెక్టర్ పి. ఐశ్వర్య అన్నారు. నగరంలో మూడు చోట్ల శిబిరాలు నిర్వహి స్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు అకాడమీ డైరెక్టర్ ఎస్కే. ఖాశీం సూచించారు.

పశ్చిమ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

చిట్టినగర్, ఏప్రిల్ 24: పశ్చిమ నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని టీడీపీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), బీజేపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి హామీ ఇచ్చారు. పాలఫ్యాక్టరీ సమీపంలోని కల్యాణ మండపంలో నియోజకవర్గ అభివృద్ధిపై బుధవారం నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మాటామంతీలో పాల్గొన్న నాయకులు పలు సమస్యలను ప్రస్తావించారు. టూటౌన్- చిట్టినగర్ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఎర్రకట్టను అభివృద్ధి చేయాలని కోరారు. పంజా సెంటర్ నుంచి గాంధీనగర్ వరకు ఫ్లైఓవర్ ఏర్పాటుచేయాలని, వంద గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు షరతులు లేకుండా అనుమతులు ఇవ్వాలని, కొండప్రాంత నివాసులకు ఇళ్లకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, నగరాల ఆలయాలు ఆ సామాజికవర్గం నిర్వహణలో ఉండేలా చూడాలని, మౌలిక సదుపాయాల మెరుగుపర్చాలని కోరారు. గెలిచాక ప్రాధాన్య క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని చిన్ని, సుజనా హామీ ఇచ్చారు. కొణిజేటి రమేష్, ఆర్.శ్రీనివాస్, పిళ్లా శ్రీనివాస్, ఉమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాటామంతీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుజనాచౌదరి, పక్కన కేశినేని చిన్ని

అభయ వీరాంజనేయస్వామికి చలసాని, సుజనా పూజలు

వన్‌టౌన్: మిల్క్‌ప్రాజెక్ట్ సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలోని అభయ వీరాంజనేయస్వామిని బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిఅ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరి వేర్వేరుగా సందర్శించారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం భవిష్యత్తులో గొప్ప క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సుజనా అన్నారు. సుజనా వెంట బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు అడ్డూరి శ్రీనివాసరావు, పొట్నూరి గణేష్, ఆలయ ఆర్గనైజర్ రాంపిళ్ల ఓంకార్ పాల్గొన్నారు. చలసాని వెంట పాలఫ్యాక్టరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు ఉన్నారు. ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.


స్వామి చిత్రపటం అందుకుంటున్న చలసాని ఆంజనేయులు

టీడీపీ ఎన్నారై నేత పాకలపాటి సురేష్ కన్నుమూత


పాకలపాటి సురేష్(ఫైల్)

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 24: టీడీపీలో క్రియాశీల నేత, అమెరికాలోని డల్లాస్‌లో తెలుగు కమ్యూనిటీతో ఆత్మీయంగా మెలిగే నేతగా గుర్తింపు పొందిన ఎన్నారై పాకలపాటి సురేష్ ఇటీవల హఠాన్మరణానికి గురయ్యారు. కృష్ణా జిల్లా పొట్టిపాడు గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు పాకలపాటి సురేష్‌బాబు సుదీర్ఘకాలంగా అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన మృతి డల్లాస్‌లోని టీడీపీ అభిమానులను, ఆప్తమిత్రులను కలచివేసింది. సురేష్ బాబు తండ్రి పాకల పాటి కోటేశ్వరరావు (చంటిబాబు) గతంలో పొట్టిపాడు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. పాకలపాటి సురేష్ మృతికి టీడీపీ ఎన్నారై విభాగం కన్వీనర్ కోమటి జయరాం సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కోడూరు-అవనిగడ్డ రోడ్డుకు మరొకరు బలి

- రోడ్డు ప్రమాదంలో నున్న వాసి దుర్మరణం

కోడూరు, ఏప్రిల్ 24: వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి మరొకరు బలయ్యారు. అధ్వానంగా ఉన్న అవనిగడ్డ - కోడూరు రోడ్డు గోతుల్లో బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో బైక్‌పై వెళుతున్న విజయవాడ సమీపంలోని నున్న గ్రామానికి చెందిన లంకె చంద్రరావు(40) దుర్మరణం చెందాడు. విశ్వనాథపల్లిలో ఒక వివాహానికి హాజరైన అనంతరం తిరిగి నున్న వెళ్తుండగా వి.కొత్తపాలెం వద్ద రోడ్డు గోతుల కారణంగా బైక్ బోల్తా కొట్టింది. బైక్ నుంచి కిందపడిన చంద్రరావు తలమీదుగా వెనకనుంచి వచ్చిన లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై శిరీష ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మ్యాప్ మీరే గీసుకోండి

- కృష్ణా వర్సిటీ పరీక్షల్లో బీఏ విద్యార్థులకు వింత పరిస్థితి
- జవాబు పత్రాల్లో మ్యాప్‌ను చేతితో గీసుకోవాలన్న ఇన్విజిలేటర్లు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): కృష్ణా వర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బీఏ విద్యార్థులకు వరుసగా రెండు రోజులపాటు వింత పరిస్థితి ఎదురైంది. ప్రశ్నాపత్రంలో ఇచ్చిన మ్యాప్ పాయింటింగ్‌కు మ్యాప్‌ను ఇవ్వలేదు. విద్యార్థులు అడిగితే ఆ మ్యాప్‌ను జవాబుపత్రంలో గీసుకోవాలని ఇన్విజిలేటర్లు సమాధానం చెప్పారు. డిగ్రీ విద్యార్థుల రెండు, నాలుగు సెమిస్టర్ల పరీక్షలు జరుగుతున్నాయి. ఉదయం నాలుగో సెమిస్టర్, మధ్యాహ్నం రెండో సెమిస్టర్ నిర్వహిస్తున్నారు. బెంజ్‌సర్కిల్ వద్ద గౌతమ్ కళాశాలలో మంగళవారం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షాపత్రంలో ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను ఇచ్చారు. కొన్ని జిల్లాల పేర్లను ఇచ్చి వాటిని మ్యాప్‌లో గుర్తించాలని ప్రశ్న ఇచ్చారు. దీనికి విద్యార్థులు జవాబు రాయాలంటే మ్యాప్‌ను ఇవ్వాలి. మ్యాప్ ఇమ్మని విద్యార్థులు ఇన్విజిలేటర్‌ను అడిగారు. ఆయన పరీక్షా కేంద్రం పరిశీలకుడిని అడగ్గా రాష్ట్ర మ్యాప్‌ను జవాబుపత్రంపై గీసుకుని అందులో గుర్తించాలని సమాధానం ఇచ్చారు. బుధవారం ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ పరీక్షాపత్రంలో కొన్ని దేశాల పేర్లు ఇచ్చి వాటిని ప్రపంచపటంలో గుర్తించాలని ప్రశ్న ఇచ్చారు. దీనికీ మ్యాప్‌ను విద్యార్థులకు ఇవ్వలేదు. ఈ మ్యాప్‌పాయింటింగ్ ఒక్కోదానికి ఐదు మార్కులు ఉన్నాయి. వర్సిటీ మ్యాప్ ఇవ్వలేదని, దానికి తామేమీ చేయలేమని ప్రిన్సిపాల్ విద్యార్థులకు సమాధానం ఇచ్చారు. ప్రపంచపటాన్ని జవాబుపత్రం గీసుకుని ఇచ్చిన నగరాలను గుర్తించాలని సమాధానం చెప్పారు. వరుసగా రెండు రోజులపాటు అధికారులు చెప్పిన ఈ సమాధానాలకు విద్యార్థులు షాక్ అయ్యారు. ఈ రెండు ప్రశ్నలకు పది మార్కులు పోయినట్టేనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ బీ-ఫారాల పంపిణీ పూర్తి

» చివరి ముగ్గురు అభ్యర్థులకూ అందచేసిన చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థులందరికీ బీ-ఫారాల పంపిణీ పూర్తి చేసింది. చివరగా మిగిలిపోయిన ముగ్గురికి పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం బీ-ఫారాలు అందజేశారు. దీంతో పార్టీ తరఫున పోటీ చేస్తున్న మొత్తం 144 మంది అసెంబ్లీ అభ్యర్థులు, 17 మంది లోక్‌సభ అభ్యర్థులకు బీ-ఫారాల పంపిణీ పూర్తయిందని టీడీపీ వర్గాలు తెలిపాయి. దెందులూరు, నరసరావుపేట, తంబళ్లపల్లి అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జయచంద్రారెడ్డిని చంద్రబాబు బుధవారం శ్రీకాకుళానికి పిలిపించి బీ-ఫారాలు ఇచ్చారు. వీరిలో తంబళ్లపల్లి అభ్యర్థి జయచంద్రారెడ్డిని కొనసాగించాలా వద్దా అన్నదానిపై పార్టీలో కొంత తర్జనభర్జన జరిగింది. ఆయన ఇప్పటికే ప్రచారం కూ డా మొదలు పెట్టినందున, ఈ దశలో మార్పు సరి కాదన్న యోచనతో కొనసాగింపునకు నిర్ణయం తీసుకున్నారు. అనపర్తి సీటును బీజేపీకి ఇచ్చే విషయంలో కొంత సందిగ్ధత నెలకొనడంతో దెందులూరు టికెట్ ఆపారు. అనపర్తిలో స్పష్టత రాగానే దెందులూరు అభ్యర్థికి బీ-ఫారం ఇచ్చేశారు. నరసరావుపేట అభ్యర్థి విషయంలో కూడా కొంత ఊగిసలాట చోటు చేసుకున్నా చివరకు అరవింద్ బాబుకే ఖరారైంది. బీ-ఫారాల పంపిణీకి ముందు ఐదు ని యోజకవర్గాల్లో అభ్యర్థులను టీడీపీ మార్చింది. వీటిలో మాడుగుల, పాడేరు, వెంకటగిరి, మడకశిర, ఉండి ఉన్నాయి. ఈ ఐదు చోట్లా పాత అభ్యర్థులను మార్చి కొత్తవారికి ఇచ్చారు. రాష్ట్రంలో ఇక మార్పుచేర్పులు లేనట్లేనని, బీ-ఫారం పొందిన అభ్యర్థులే పోటీలో కొనసాగుతారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

గులకరాయి ఘటన అభూతకల్పన: రఘురామ



తిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు సీఎం కావాలని తిరుమల వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు నరసాపురం ఎంపీ, ఉండి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రఘురామరాజు తెలిపారు. బుధవారం ఉదయం అర్చన సేవలో ఆయన పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు రఘురామ మీడియాతో మాట్లాడుతూ... 'టీడీపీ నుంచి ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నామినేషన్ వేసిన అనంతరం స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చా. రాష్ట్ర ప్రజలు కష్టాల నుంచి బయటపడాలని స్వామిని కోరుకున్నా. ఇక సీఎం జగన్మోహన్‌రెడ్డిపై గులకరాయి దాడి నిజంగా జరిగివుంటే మంచి పరిణామం కాదు. అయితే అదో అభూత కల్పన మాత్రమే. దాని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

గూగుల్‌లో జగన్ కేసులు తప్ప ఏమీ లేవు: జ్యోత్స్న

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరస్తుడైన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని బాగు చేస్తానంటే ఎవరూ నమ్మరని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న అన్నారు. ఐదేళ్లలో యువతను గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు బానిసను చేసి, స్వయం ఉపాధిని అటకెక్కించిన జగన్ యువతను ఉద్ధరిస్తానంటే.. ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. జగన్ చెప్పే పిట్టకథలు, కట్టు కథలు వినడానికి జనం పిచ్చోళ్లు కాదన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియా సమావేశంలో ఒక అమ్మాయి తెలుగులో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక జగన్ తెల్లమొఖం వేశాడంటూ ఎద్దేవా చేశారు. సమాధానం చెప్పకుంటే పరువు పోతుందని జగన్ హిస్టరీ గూగుల్‌లో వెతుక్కోమని భార్గవ్‌రెడ్డి చెప్పారు. గూగుల్‌లో జగన్ గురించి వెతికితే.. సీబీఐ, ఈడీ చార్జిషీట్ల లిస్ట్ వచ్చింది. జగన్ పెట్టిన షెల్ కంపెనీల లిస్టు కూడా ఉందని అన్నారు.

జగన్ ఫ్యాన్ రెక్కలు విరిచేయడం ఖాయం: ఆచంట

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో పది సార్లు కరెంట్ చార్జీలు పెంచిన జగన్‌రెడ్డి ఫ్యాన్ రెక్కలు ఊడగొట్టడానికి మే 13న ఓటర్లంతా టీడీపీ కూటమి గుర్తులపై బటన్ నొక్కాలని తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత కోరారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో రూ.560 కోట్లు ఉన్న విద్యుత్ సర్‌చార్జీని రూ.1,500 కోట్ల కు పెంచిన జగన్‌రెడ్డి.. రూ.75 వేల కోట్ల భారం ప్రజలపై మోపాడు. ఐదేళ్ల క్రితం కరెంట్ బిల్లు 50 యూనిట్లకు రూ.60 వచ్చేది. ఇప్పుడు రూ.150 వ స్తోంది. గత ప్రభుత్వంలో 150 యూనిట్లు వాడితే రూ.400 బిల్లు వస్తే.. ఇప్పు డు రూ.900 వస్తోంది. అప్పుడు రూ.250 యూనిట్లకు రూ.1,114 వస్తే, ఇప్పుడు రూ.2,187 వస్తోంది. గతంలో 350 యూనిట్లకు రూ.1,950 వస్తే, ఇప్పుడు రూ.3,600 వస్తోంది. మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, వ్యాపారులు, వృద్ధులు, మహిళలు అల్లాడిపోతున్నారు. కరెంటు పట్టుకుంటే తగిలే షాక్ బిల్లులు పట్టుకుంటేనే తగులుతోందని ఆరోపించారు.

ఎన్డీఏతో దోస్తీకి జగన్ తహతహ


» మరోవైపు ఉక్కు కార్మికుల ఓట్ల కోసం సరికొత్త డ్రామా: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమితో దోస్తీ కోసం జగన్‌రెడ్డి తహతహలాడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. మరోవైపు ఈ సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉక్కు కార్మికుల ఓట్ల కోసం సరికొత్త డ్రామాకు తెరతీశారని విమర్శించారు. గత 1200 రోజులుగా విశాఖ ఉక్కు కోసం ఉద్యమం కొనసాగుతుంటే పట్టించుకోని జగన్‌కి.. ఇప్పుడు ఆ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికుల ఓట్లు కావాల్సి వచ్చాయా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందన్న విషయం తనకు తెలియదని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా జత కట్టి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుండగా.. ఎన్నికల అనంతరం కేంద్రంలో బీజేపీతోనే కాపురమంటూ జగన్ తన మనసులోని మర్మాన్ని ఇప్పటికే బయటపెట్టారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలలో ఏ పార్టీ గెలిచినా బీజేపీ పంచనే చేరడం ఖాయమని ప్రజలు గుర్తించాలని రామకృష్ణ కోరారు.

తెలుగుపై జగన్ పగ!

» ఇంగ్లీష్ మీడియంపైనే ఆది నుంచీ మోజు
» ప్రభుత్వ పాఠశాలల్లో బలవంతంగా అమలు
» ఫలితంగా తెలుగుకు తగ్గిన ఆదరణ
» టెన్త్ ఫలితాల్లో 71 శాతమే 'తెలుగు' ఉత్తీర్ణత
» అదే ఇంగ్లీష్ మీడియంలో 92.32%

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జగన్ ప్రభుత్వం తెలుగు భాషపై పగబట్టింది! అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తొలగించే కుట్రలు చేసింది!. ఆ తర్వాత న్యాయస్థానాల ఆదేశాలతో తెలుగు మీడియంను కొనసాగించినా.. ప్రభుత్వ చర్యలతో తెలుగుకు క్రమంగా ఆదరణ తగ్గిపోయింది. ఆ ప్రభావం ఇప్పుడు పదో తరగతి ఫలితాలపై పడింది. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లు 92.32శాతం మంది ఉత్తీర్ణులు కాగా, తెలుగు మీడియంలో కేవలం 71.02శాతం మందే ఉత్తీర్ణులవడం ఇందుకు నిదర్శనం!.

టెన్త్‌లో ఒకప్పుడు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఎక్కువ మంది ఉత్తీర్ణులైతే ఇప్పుడది భారీగా పడిపోయింది. తెలుగు మీడియంలో చదివితే పాస్ గ్యారెంటీ లేదనే సందేహం కలిగించేలా ఉత్తీర్ణత శాతం తగ్గిపోయింది. తాజాగా విడుదల చేసిన టెన్త్ ఫలితాల్లో ఇంగ్లీష్ మీడియంలో చదివిన విద్యార్థుల్లో 92.32శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. తెలుగు మీడియంలో మాత్రం 71.02శాతం మందే పాసయ్యారు. రెండు మీడియంల మధ్య ఉత్తీర్ణతలో 21.24శాతం వ్యత్యాసం వచ్చింది. అదే 2023లో చూస్తే తెలుగు మీడియం విద్యార్థులు 50శాతం మంది పాసైతే, ఇంగ్లీష్ మీడియంలో 80.82శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 30.82శాతం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎక్కువ ఉత్తీర్ణత నమోదు చేశారు. 2022లో తెలుగు మీడియం 43.97శాతం అయితే, ఇంగ్లీష్ మీడియంలో 77.55శాతం మంది పాసయ్యారు. ఆ సంవత్సరంలో 33.58శాతం వ్యత్యాసం కనిపించింది. అంతకముందు రెండేళ్లు కొవిడ్ కారణంగా అందరినీ పాస్ చేశారు. కానీ విచిత్రంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల మధ్య ఉత్తీర్ణతలో పెద్దగా తేడా లేదు. 2019లో 7.08శాతం, 2018లో 7.2శాతం, 2017లో 9.87శాతం, 2016లో 6.09శాతం, 2015లో 8.77శాతం మాత్రమే రెండు మీడియంల మధ్య తేడా వచ్చింది. అప్పట్లో ఇంగ్లీష్‌తోపాటు తెలుగు మీడియంలోనూ ఉత్తమ ఫలితాలు వచ్చేవి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తెలుగు మీడియం అంటే పాసవుతారా అనే సందేహం తలెత్తే పరిస్థితి ఏర్పడింది.

అధికారంలోకి రాగానే రద్దు

అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై బలవంతంగా ఇంగ్లీష్ మీడియంను రుద్దింది. తొలుత తెలుగు మీడియంను పూర్తిగా తొలగించింది. దానిపై అనేక మంది న్యాయస్థానాలను ఆశ్రయించడంతో రెండు మాధ్యమాల విధానం తెచ్చింది. పేరుకు తెలుగు మీడియం ఉందని చెబుతున్నా క్షేత్రస్థాయిలో బలవంతంగా ఇంగ్లీష్‌ను రుద్దుతున్నారు. దీనిని సమర్థించుకునేందుకు తల్లిదండ్రుల నుంచి మీడియంపై అభిప్రాయ సేకరణ చేశారు. అందులో ఎక్కువ మంది ఇంగ్లీష్ మీడియం మాత్రమే కావాలని అడుగుతున్నారని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. అయినా తెలుగు మీడియమే కావాలని పట్టుబట్టి కొందరు పిల్లల్ని తెలుగులో చేర్పించారు. అయితే ఎక్కువగా ఇంగ్లీష్ మీడియంకు మొగ్గు చూపిన ప్రభుత్వం తెలుగు మీడియంను నిర్లక్ష్యం చేసింది. కొన్నిచోట్ల ప్రభుత్వం మాటలు నమ్మి ఇంగ్లీష్ పెద్దగా రాకపోయినా పిల్లలను కొందరు తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియంలోకి మార్చారు. ఆ విద్యార్థులు ఎక్కువగా నష్టపోయారు. మాతృభాష లేక, ఇంగ్లీష్ అర్థంకాక మార్కులు వారికి మార్కులు తగ్గిపోయాయి. ఇలా రెండు వైపులా తెలుగు మాధ్యమం విద్యార్థులు, రాకపోయినా ఇంగ్లీష్ మీడియంలో చేరిన విద్యార్థులు నష్టపోయారు.

ఇప్పుడెందుకు టోఫెల్?

తెలుగును చంపేస్తున్నారని విమర్శించిన వారిపై జగన్ ప్రతిదాడి చేశారు. ప్రతిపక్షాలకు పేద పిల్లలు బాగుపడటం ఇష్టంలేదంటూ దుష్ప్రచారానికి దిగారు. ఎవరు ఏ మీడియం కోరుకుంటే ఆ మీడియంలో చదువు చెప్పాలని, అంతేగానీ ఇంగ్లీష్‌ను బలవంతంగా రుద్దొద్దని అడిగిన వారిని ఇంగ్లీష్ మీడియం వ్యతిరేకులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అది చాలదన్నట్టు ఈ ఏడాది పాఠశాల స్థాయిలో టోఫెల్ కోర్సును ప్రవేశపెట్టారు. కేవలం పాశ్చాత్య దేశాల యాస కోసం దీనిని తీసుకొచ్చారు. ఉన్నత విద్య అనంతరం విదేశాలకు వెళ్లేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. అయితే అసలు పునాది దశలో బోధన అర్థంకాకుండా చేసి, ఎప్పుడో ఉన్నతవిద్య అనంతరం అవసరమయ్యే టోఫెల్ ఇప్పుడెందుకు పెట్టారనే ప్రశ్నలు వచ్చినా సమాధానం చెప్పలేదు.

'ఉపాధి' కూలీలు విలవిల!



చట్టప్రకారం గ్రామీణ కూలీలకు ఉపాధి పనులు కల్పించడమే కాదు.. వేసవిలో అయితే పని ప్రదేశంలో మజ్జిగ ప్యాకెట్లు, ప్రతి ఉపాధి కార్మికుడికీ ప్రతి రోజూ తాగునీటి సదుపాయం లేదా అలవెన్సు.. ఎండ వేడిమి తట్టుకునేందుకు షేడ్స్.. అనుకోని ప్రమాదాలు జరిగితే మెడికల్ కిట్స్.. చిన్న పిల్లల కోసం ఆయాల ఏర్పాటు.. కూలీలకు పనిముట్ల కోసం వారానికి రూ.9లు చొప్పున అలవెన్సు అందజేత.. ఒకప్పుడు ఇవన్నీ ప్రభుత్వం కల్పించేది!. కానీ ఇప్పుడు ఆ సౌకర్యాలన్నీ ఆపేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత వాటిలో అలాంటి ప్రొవిజన్స్ లేకపోవడంతో వేతనాలతో వాటిని చెల్లించే వెసులుబాటు లేకుండా పోవడమే ఇందుకు కారణమైనప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఈ నిధులు ఖర్చు చేసి, కేంద్రం మెటీరియల్ నిధులు ఇచ్చిన తర్వాత వాడుకోవచ్చు!. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధులను ఇతర అవసరాలకు దారిమళ్లించేసి.. వీటికి వాడకపోవడంతో గ్రామాల్లో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో సదుపాయాల్లేక విలవిల్లాడుతున్నారు!.

» మండు వేసవిలోనూ తాగునీటి సరఫరా నిల్
» మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ సరేసరి
» పనిముట్లకు ఇవ్వాల్సిన అలవెన్సు నిలిపివేత
» పని ప్రదేశాల్లో 'నీడ'నివ్వని సర్కార్
» అందుబాటులో లేని ఫస్ట్ ఎయిడ్ కిట్స్
» చట్టబద్ధ పథకంలో సౌకర్యాలు నిల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక చట్టబద్ధమైన పథకం. ఈ పథకం ద్వారా చేపట్టే పనులన్నింటికీ చట్టబద్ధత ఉంది. ఈ పథకంలో పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, పని చేసే మహిళలకు ఐదేళ్ల లోపు పిల్లలుంటే వారిని చూసుకునేందుకు ఒక ఆయా, ప్రమాదం జరిగితే ప్రాథమిక చికిత్స చేసేందుకు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ఈ పథకం మాస్టర్ సర్క్యులర్ 2022-23లో చాప్టర్ 8.1లో స్పష్టంగా వివరించారు. పనిచేసే సమయంలో ఎవరైనా కూలీలు ప్రమాదానికి గురైతే వారికి వైద్యం చేయించడమే కాకుండా ఆ రోజు కనీసం సగం వేతనం తగ్గకుండా చెల్లించాలని చట్టంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రిలో చేర్పించడం, ట్రీట్‌మెంట్, మందులు ఉచితంగా ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన అందిస్తారు. పని ప్రదేశాల్లో కూలీల పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగినా రాష్ట్ర ప్రభుత్వమే వారికి వైద్యం చేయించాల్సి ఉంది. బీమా వంటివి మినహాయిస్తే.. రాష్ట్రంలో ఈ సర్కార్ వచ్చిన తర్వాత ఇవేమీ అమలు కావడం లేదు. ప్రస్తుతం ఉపాధి క్షేత్రాల్లో పనిచేసే కూలీలు ఎర్రటి ఎండలో తాగునీటి సౌకర్యాలు సైతం లేక విలవిలలాడుతున్నారు. వాస్తవానికి పనికి వెళ్లే ప్రతి కూలీకి పనిముట్లను అందించాలి. గడ్డపార, పార, మట్టిని మోసేందుకు తట్టలు ఈ పథకం ద్వారా అందించాలి. గడ్డపార పదును చేసుకునేందుకు ప్రతి వారం రూ.9లు అలవెన్సును గతంలో ఇచ్చేవారు. ఈ సర్కార్ వచ్చిన తర్వాత అలాంటి సౌకర్యాలేవీ ఇవ్వకుండా నిలిపేసింది. దీంతో కూలీలు తమ సొంత ఖర్చులతోనే పనిముట్లను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో వేసవి వచ్చే సరికి ప్రతి ఏటా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసేవారు. మజ్జిగ పంపిణీ చేయలేకపోతే అందుకు అవసరమైన అలవెన్సును వేతనంతో పాటు అందించేవారు. ఇప్పుడా అలవెన్సు నిలిచిపోయింది. ఏడాదిలో ఎప్పుడైనా ప్రతి రోజు కూలీలకు తాగునీటి కోసం రూ.5 అలవెన్స్ చెల్లించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పని ప్రదేశాల్లో చెట్లు కూడా లేని చోట ఎండ వేడిమి నుంచి రక్షణకు షేడ్స్ వేసి గతంలో నీడను కల్పించేవారు. ఈ సర్కార్ వచ్చిన తర్వాత షేడ్స్, పనిముట్లు, మెడికల్ ఎయిడ్ కిట్స్ కొనుగోలు టెండర్లు పిలవడం మానేసింది. గతంలో సరఫరా చేసిన షేడ్స్ సైతం చిరిగిపోయి ఎక్కడా అందుబాటులో లేకుండా పోయాయి. మెడికల్ ఎయిడ్ కిట్స్ లేకపోవడంతో ఏదైన ప్రమాదాలు జరిగితే హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రులకు వెళ్లే లోపు మరింత అనారోగ్యం పాలవుతున్నారు.

వేసవి అలవెన్సులు నిలిపివేత

గతంలో ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 20 శాతం నుంచి 30 శాతం వరకు కూలీలకు అదనంగా వేసవి అలవెన్సును అందించేవారు. వేసవిలో నేల గట్టిగా ఉండటం వల్ల 20 శాతం నుంచి 30 శాతం తక్కువ పనిచేసినా.. వారికి రోజువారీ వేతనం తగ్గకుండా అందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడా అలవెన్సులను నిలిపేశారు. గతంలో ప్రతి ఏటా జనవరిలో అలవెన్సును ప్రకటించేవారు. ఇప్పుడవన్నీ నిలిపేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అసౌకర్యాలు

ఉపాధి పథకం నిధులు దారిమళ్లించడంతోనే రాష్ట్రంలో ఈ దుస్థితి ఏర్పడింది. కూలీలకు సౌకర్యాల తో పాటు ఈ పథకంలో పనిచేసే సిబ్బందికి సైతం ప్రతి నెలా జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఆ శాఖ దిగజారిపోయింది. ఒకప్పుడు మెటీరియల్ నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో అన్నీ మౌలిక వసతులు కల్పనకు ఉపయోగపడిన ఉపాధి హామీ పథకం ఇప్పుడు కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించలేని దీనస్థితికి రాష్ట్రంలో చేరుకుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



మామిళ్లపల్లి వద్ద బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ.. స్టీరింగ్ పట్టేసింది

» బస్సు బోల్తా.. డ్రైవర్ సహా ఆరుగురికి గాయాలు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 24: నిర్వహణ లోపించిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు మరో ప్రమాదం బారిన పడింది. స్టీరింగ్ పట్టేయడంతో శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద హిందూపురం డిపో ఆర్టీసీ బస్సు బోల్తా పడి.. ఆరుగురు గాయపడ్డారు. బుధవారం అనంతపురం నుంచి హిందూపురానికి బయలుదేరిన బస్సు.. మామిళ్లపల్లి వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని, హైవే ఎక్కుతున్న సమయంలో బస్సు స్టీరింగ్ పనిచేయలేదు. దీంతో అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 33 మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్ ఇనాయతుల్లా సహా ఆరుగురు గాయపడ్డారు. బాధితులను 108 వాహనం ద్వారా అనంతపురం తరలించారు.



డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

తిరుమల ఘాట్‌లో మరో ప్రమాదం

» డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఆరుగురికి గాయాలు

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం మధ్యాహ్నం ముందు వెళుతున్న డీజిల్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆర్టీసీ డిపోకు డీజిల్ తీసుకుని ట్యాంకర్ తిరుపతి నుంచి బయలుదేరింది. మార్గ మధ్యంలోని లింక్ రోడ్డుకు సమీపంలో భక్తులతో వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ట్యాంకర్‌ను ఒక్కసారిగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ముందు కూర్చుని ఉన్న మహారాష్ట్ర, విజయవాడకు చెందిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించారు. లారీ ఒక్కసారిగా ఆగడంతో ఢీకొన్నట్టు ఆర్టీసీ డ్రైవర్ చెబుతుండగా, రన్నింగ్‌లో ఉన్న తన లారీని.. ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొందని లారీ డ్రైవర్ చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్యాన్ గుర్తుతో ఉన్న బెలూన్లు, పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ బొమ్మతో ఉన్న టీషర్టులు

వైసీపీ అభ్యర్థి టీషర్టుల పట్టివేత

» కేసు నమోదు చేయని పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థి బొమ్మతో ఉన్న 1525 టీషర్టులతో పాటు 500 ఫ్యాన్ గుర్తు ఉన్న బెలూన్లను బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ (స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీమ్స్)తో పాటు పోలీసులూ సంయుక్తంగా ఈ సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి చీరాల వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో వీటిని గుర్తించారు. వీటికి సంబంధించి రిసీవింగ్ రశీదు పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ పేరు మీద ఉన్నట్లు సమాచారం. వీటిని చందోలు పోలీస్ స్టేషన్‌కు తరలించగా జీఎస్‌టీ అధికారులు వచ్చి వాటి విలువను లెక్కగట్టారు. కాగా, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన మెటీరియల్ విలువ మొత్తం పదివేలు దాటితే సంబంధిత ఆర్వో కానీ, లేక సీఈవో అనుమతితోనే వాటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే కేసు నమోదు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. పోలీసులు పట్టుకున్న వాటి విలువ దాదాపు లక్ష రూపాయలకు పైనే ఉండొచ్చని తెలుస్తోంది. కానీ కేసు నమోదు లాంటిదేమీ లేకపోగా ఆ సామగ్రిని స్టేషన్‌లో ఉంచడంతో సరిపెట్టారు. డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్‌సెల్‌లో సరైన పత్రాలు చూపించి వాటిని తీసుకెళ్లొచ్చనేది పోలీసుల వాదనగా ఉంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ అవకాశం నేను ఇంతవరకూ ఇవ్వలేదు

"క్రాక్' సినిమా చేయడానికి ముందే 'శబరి' కథ విన్నా. నాకు బాగా నచ్చింది. వెంటనే ఓకే చేశా. కానీ షూటింగ్ మొదలు కావడానికి చాలా సమయం పట్టింది. నా మీద నమ్మకంతో ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రం చేయడానికి దర్శక నిర్మాతలు ముందుకు వచ్చారు. ఖర్చు విషయంలో నిర్మాత రాజీ పడలేదు. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఆమె నటించిన 'శబరి' చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో ముచ్చటించారు వరలక్ష్మి.



- ఈ సినిమా చేయడం రిస్క్ అనిపించలేదా అని అడిగితే 'లైఫే రిస్క్. హిట్టు, ఫ్లాపుల్ని ఎవరూ జడ్జ్ చేయలేరు. 'హను-మాన్' చిన్న సినిమా అనుకున్నారు. పెద్ద హిట్ అయింది. 'నాంది', 'కోట బొమ్మాళి' సినిమాలు హిట్ అవుతాయని ఊహించలేదు. 'శబరి' విషయానికి వస్తే.. ఒక డిఫరెంట్ ఫిల్మ్ చేశాం. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు వరలక్ష్మి.
- 'శబరి'లో తన పాత్ర గురించి వివరిస్తూ 'ఒక సాధారణ అమ్మాయి కథ. భర్తతో సమస్యల వల్ల అతనికి దూరం జరిగి కుమార్తెను ఒంటరిగా పెంచుతుంది. కూతుర్ని కాపాడుకోవడానికి ఆ తల్లి ఏం చేసిందనేది కథ. తల్లీ కూతుళ్ల అనుబంధం సినిమాలో హైలైట్‌గా ఉంటుంది.' అని తెలిపారు.
- హిట్టు, ఫ్లాపులు తన చేతిలో లేవని చెబుతూ 'ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. వాళ్లకు మంచి సినిమాలు ఇవ్వాలనీ, వారికి నచ్చే విధంగా నటించాలి అనే ప్రెజర్ మాత్రం నాకు ఎప్పుడూ ఉంటుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు నా నటన బాగోలేదని అనుకోకూడదనే నా తపన' అన్నారామె.
- తన కాబోయే భర్త నికోలయ్ గురించి చెబుతూ 'నా నటన బాగోక పోతే బాగోలేదని చెబుతారు. బాగుందంటే మెచ్చుకుంటారు. అయితే బాగోలేదని ఆయన చెప్పే అవకాశం నేను ఇంతవరకూ ఇవ్వలేదు' అన్నారు వరలక్ష్మి. తన వివాహం ఈ ఏడాదే ఉంటుందని తెలిపారు.

టైటిల్ సాంగ్‌తో పుష్పరాజ్

'పుష్ప' చిత్రంతో జాతీయ ఉత్తమనటుడి పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు అల్లు అర్జున్. ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2:ది రూల్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం నుంచి అప్డేట్ వచ్చింది. తొలి పాటను మే 1న విడుదల చేయబోతున్నట్లు బుధవారం చిత్రబృందం తెలిపింది. దీనికి సంబంధించిన 20 సెకన్ల ప్రోమోను విడుదల చేశారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీత సారథ్యంలో 'పుష్ప పుష్ప పుష్పరాజ్' అంటూ సాగే ఈ టైటిల్ సాంగ్ చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 15న 'పుష్ప 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. సినిమాటోగ్రఫీ: మిరోస్లా క్యూబా బ్రోజెక్.



కొత్త తేదీన లవ్ మీ



ఆశిష్, వైష్ణవి చైతన్య హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. అరుణ్ భీమవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి, హన్షిత నిర్మించారు. ఈ హారర్ థ్రిల్లర్‌ను మే 25న విడుదల చేస్తున్నట్లు తెలుపుతూ మేకర్స్ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ఓ యువకుడు, ఆత్మతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయనేది కథాంశంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమాటోగ్రాఫర్ పి.సి శ్రీరామ్, సంగీతం ఎం.ఎం. కీరవాణి.

కనులెందుకో తెలిపేందుకు



జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలకపాత్ర పోషించారు. సుమంత్ జి నాయుడు నిర్మాత. ఈ చిత్రం నుంచి 'కనులెందుకో' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. చైతన్ భరద్వాజ్ స్వరాలందించి నికితా శ్రీవల్లితో కలసి ఆలపించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

భావోద్వేగాలతో 'నాన్నా మళ్లీ రావా!'



శివాజీరాజా ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'నాన్నా మళ్లీ రావా!'. నిర్దేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. డాక్టర్ డి.ఉమామహేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ "భావోద్వేగాలు మిళితమైన ఇటువంటి సినిమాలో నటించడం సంతోషంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు నిర్దేశ్ మాట్లాడుతూ "నాన్న అంటే ప్రతి ఒక్కరికి చెప్పుకోలేనంత భావోద్వేగం ఉంటుంది. థియేటర్‌లో ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: డి.వై గిరి, సంగీతం: ఆర్మన్ మెరుగు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోసి రెడ్డి.

గ్రామీణ నేపథ్యంలో ప్రేమకథ



పృథ్వీ, రూపాలి, అంబిక హీరోహీరోయిన్లుగా నటించే చిత్రం షూటింగ్ బుధవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన సీనియర్ నటి ఆమని మాట్లాడుతూ 'ఇందులో నేను ముఖ్య పాత్ర పోషిస్తున్నా. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొనే ప్రేమకథ ఇది' అని చెప్పారు. నిర్మాతలు దుర్గం రాజేశ్, రావుల రమేశ్, టి.ఎస్.రాజు మాట్లాడుతూ 'తెలంగాణ నుంచి హీరో పృథ్వీని, బాలీవుడ్ నుంచి హీరోయిన్లను, మలయాళం నుంచి అనిరుధ్‌ని విలన్‌గా ఎంపిక చేసి ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నామని దర్శకుడు పాలిక్ శ్రీను తెలిపారు.

ఢిల్లీ ఫైల్స్ సెట్స్‌పైకి



ప్రముఖ టాలీవుడ్ నిర్మాణసంస్థ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి కలయికలో వచ్చిన 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రం సంచలన విజయం అందుకున్న విషయం తెలిసిందే. కొన్నాళ్ల క్రితమే ఈ కలయికలో 'ఢిల్లీ ఫైల్స్' చిత్రాన్ని ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్‌పై తాజా అప్డేట్‌ను దర్శక నిర్మాతలు వివేక్ అగ్నిహోత్రి, అభిషేక్ అగర్వాల్ తెలిపారు. త్వరలో 'ఢిల్లీ ఫైల్స్' షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది విడుదల చేస్తామని వారు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 25 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

సివిల్స్ పరీక్ష తీరుపై పూర్తి అవగాహన కలిగాక మెయిన్స్‌తో నా ప్రిపరేషన్ ఆరంభించాను. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ - మూడు దశల్లో రెండోది ఎంచుకున్నా. అదే అటు ప్రిలిమ్స్‌కు ఇటు ఇంటర్వ్యూకు సహకరిస్తుందని భావించడమే అందుకు కారణం. డిగ్రీ పూర్తయ్యేవరకు నా చదువంతా మేథ్స్, సైన్స్, ఇంజనీరింగ్ అంశాల చుట్టూ తిరిగింది. దాంతో సమాజాన్ని అర్థం చేసుకోవడం, ఒక అవగాహనకు రావడం కోసం ప్రత్యేకించి సోషియాలజీని ఆప్షనల్‌గా ఎంచుకుని ముందుకు కదిలాను. అధ్యయనం చేసే టాపిక్ ఏదైనప్పటికీ ప్రశ్న ఎటునుంచి మరెటు అడిగినా సమాధానం చెప్పగలిగే విధంగా చూసుకున్నా. సమాజం అంటేనే అంతరాలు, సంఘర్షణలకు ఆలవాలం. పలు సమస్యల సమాహారం. దీన్ని అర్థం చేసుకునేందుకు సోషియాలజీ అధ్యయనం, దాన్నే ఆప్షనల్‌గా ఎంచుకోవడం నాకు మేలే చేసింది.

మెయిన్స్‌తో మొదలుపెట్టా!

రెండు నెలల ముందు

సరిగ్గా రెండు నెలల ముందు మాత్రమే ప్రిలిమ్స్‌పై ఫోకస్ పెట్టాను. టెస్ట్ సిరీస్‌లు మొదలుపెట్టాను. తదుపరి మాక్ టెస్టులు రాశాను. అలా ప్రిలిమ్స్‌లో గట్టెక్కాను. అసలు విషయానికి వస్తే, కోచింగ్ సంస్థల రిఫరెన్స్ నోట్స్ కొంత, నా సీనియర్ల నుంచి మరి కొంత మెటీరియల్ తీసుకున్నాను. అంతేతప్ప నేరుగా కోచింగ్ సంస్థల్లో చేరలేదు. అలా మూడింటికి పనికొచ్చేలా నాదైన ప్రిపరేషన్ కొనసాగించాను. బిట్, ఎస్సే, ఇంటర్వ్యూ - ప్రశ్న ఏదైనా సమాధానం ఇవ్వగలిగేలా తయారయ్యాను. దేనికదిగా విభజించకుండా నేర్చుకున్నందున ప్రతి టాపిక్‌పై పట్టు సాధ్యమైంది. అదే నన్ను విజయతీరంవైపు నడిపింది. అవసరార్థం సెలవులు పెట్టడం తప్ప ఈ జర్నీలో క్వాల్కామ్‌లో నా ఉద్యోగాన్ని వదిలిపెట్టలేదు.

నా అభిప్రాయానికే విలువ

దినేష్ దాస బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. ఉద్యోగం చేస్తున్నందున జాబ్‌పై ప్రశ్నలతో ఆరంభించారు. భారత దేశ అభివృద్ధి, దేశంలోని సొంత కంపెనీలు - అమెరికా తదితర పాశ్చాత్య దేశాల కంపెనీలతో బేరీజు, అలా చూసినప్పుడు మనం ఎందుకు అభివృద్ధి చెందలేదు అని అడిగారు. మేధా వలసపై ప్రశ్నించారు. ప్రాంతీయ తత్వం పెరుగుదల - దాంతో కలిగే లాభనష్టాలపై కూడా అడిగారు. అర్థగంట సాగిన ఇంటర్వ్యూలో ఎక్కువ ప్రశ్నలు నా అభిప్రాయం ఏమిటి అన్న రీతిలోనే ఉన్నాయి.

చిన్నపాటి పరిశోధన

సివిల్స్ యాస్పిరెంట్స్‌కు ఒక్కటే నా సిన్సియర్ సలహా. సివిల్స్ రాయాలనుకునే అభ్యర్థులు మొదట ఆ పరీక్షపై చిన్న స్థాయిలో పరిశోధన చేయాలి. ఇందుకు ఒకటి రెండు నెలలు తీసుకోవాలి. సిలబస్, పాత ప్రశ్నపత్రాలను చూడాలి. ఏడెనిమిది మంది మెంటార్లతో మాట్లాడాలి. అన్నింటినీ కలిపి కూలంకషంగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలి. అసలా పరీక్ష రాసేందుకు అర్హులమేనా, అవసరమైన సమర్థత ఉందా లేదా, సరిపోను సమయాన్ని ప్రిపరేషన్‌కు ఇవ్వగలమా లేదా నుంచి అన్ని కోణాల్లో పరిశీలించాలి. అప్పుడు మనకు తగ్గ రీతిలో ఒక ప్రణాళికను రూపొందించుకోవాలి. దాన్ని పక్కాగా అమలు చేయాలి. స్పష్టమైన ప్రణాళిక, ఇంప్లిమెంటేషన్, సెల్ఫ్ మోటివేషన్ అన్నింటికన్నా ప్రధానం మనకు మనపై నమ్మకం ఉంటేనే ఈ పరీక్షలో నెగ్గుకురాగలమని గుర్తించాలి. ఈ నాలిగింటిలో ఏది లోపించినా మొదటికే మోసం వస్తుంది. అవసరమైన చోట సీనియర్ల సహాయం తీసుకోవాలి. ఎక్కువ మాక్‌టెస్టులు రాయాలి. స్వయంవిశ్లేషణ చేసుకోవాలి. ఇది తెలియదు లేదంటే రాదు అనుకున్నప్పుడు దాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సందేహాలు తలెత్తితే ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకూడదు. వెంటనే నివృత్తి చేసుకోవాలి. చిన్నపాటి లక్ష్యాలతో మొదలుపెట్టి, అంతిమంగా సివిల్స్‌లో విజయం సాధించాలి. ఇది నేను అనుసరించిన పద్ధతి. నన్ను ఎవర్ని అడిగినా ఇదే చెప్పగలను కూడా.

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్



నందల సాయి కిరణ్
ర్యాంక్: 27
(రెండో అటెంప్ట్)

స్వస్థలం: కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, వెలిచాల
తండ్రి: కాంతారావు (చేనేత కార్మికుడు)
తల్లి: లక్ష్మి(బీడీ కార్మికురాలు)
సోదరి: స్రవంతి
విద్యార్హత: బీటెక్(ఈసీఈ) - ఎన్ఐటీ, వరంగల్
ఉద్యోగం: క్వాల్కామ్‌లో అయిదున్నర సంవత్సరాల అనుభవం
ఆప్షనల్ సబ్జెక్ట్: సోషియాలజీ



మీకు తెలుసా?

- ఆర్కిటిక్ ఖండంలో ఉండే ఈ తెల్లని ఎలుగుబంటును 'ధృవపు ఎలుగుబంటు' అని పిలుస్తారు.
- నీళ్లలో ఈతకొడుతూ హంట్ చేస్తాయి. ముఖ్యంగా ఇవి చేపలను బతికి తింటాయి.
- సాధారణం ఎలుగుబంట్లు ఎనిమిది రకాలు మాత్రమే ఉన్నాయి. ఇక పోతే ధృవపు ఎలుగుబంటి విషయానికొస్తే ఇవి రష్యా, అమెరికా, కెనడా, గ్రీన్‌లాండ్, నార్వే దేశాల్లో ఇవి ఎక్కువగా ఉంటాయి.
- నీటిలో ముప్పయి మైళ్ల నుంచి 220 మైళ్ల వరకూ ఈదగలవు. గంటకు ఆరు కిలోమీటర్ల చొప్పున ఇవి ఈదగలవు. అందుకే వీటిని 'సముద్ర ఎలుగుబంటి' అంటారు.
- సీల్స్ అరమైలు దూరంగా ఉండగనే ఇవి ముక్కుతో వాసన చూసి కనిపెడతాయి.
- కొవ్వు పదార్థం ఎక్కువగా తినటం వల్ల ఇవి లావుగా ఉంటాయి. నాలుగు ఇంచులు జుట్టు వీటిపై ఉంటుంది. అందుకే ఇది చలిని తట్టుకోగలుగుతుంది.




- ప్రపంచంలోనే అతి పెద్ద ఎలుగుబంటి ఇది. వెనక కాళ్లలతో నిలబడితే దీని ఎత్తు దాదాపు పది అడుగులు.
- రెండు లక్షల ఏళ్ల క్రితం నుంచి ధృవపు ఎలుగు బంటుల జాడ ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- మంచు మీద దొర్లుతూ వాటి చర్మాన్ని శుభ్రం చేసుకుంటాయి. తర్వాత చన్నీళ్లలో మునుగుతాయి.
- ఇవి రోజుకు ఇరవై గంటలు నిద్రపోతాయి. తినటం కూడా వెంటనే ఆబగా తినవు. దొరికిన సీల్ చేపల ఆహారాన్ని నాలుగైదు రోజులు తింటాయి.
- మగ పోలార్ ఎలుగుబంటి 650 కిలోల బరువు ఉంటుంది. ఆడ జంతువు 250 కిలోల బరువు ఉంటుంది.

జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



ఆలిండియా ఆయుష్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'ఆలిండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఐఏపీజీఈటీ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఆయుష్ కాలేజీల్లో ఆయుర్వేదం, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్య విభాగాల్లో ఎండీ, ఎంఎస్ ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీఎస్ఎంఎస్/బీహెచ్ఎంఎస్/గ్రేడెడ్ బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఏడాది వ్యవధి గల రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉండాలి.

ఏఐఏపీజీఈటీ 2024 వివరాలు

ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 480. తప్పుగా గుర్తించిన సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. ఆయుర్వేదం పేపర్‌ను ఇంగ్లీష్, హిందీ; హోమియోపతి పేపర్‌ను ఇంగ్లీష్; సిద్ధ పేపర్‌ను ఇంగ్లీష్, తమిళం; యునానీ పేపర్‌ను ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2450; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 17 నుంచి 19 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి
- **ఏఐఏపీజీఈటీ 2024 తేదీ:** జూలై 6
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, మహబూబ్‌నగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/AIAPGET/

నిన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(నిన్)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్-సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. అప్లయిడ్ న్యూట్రిషన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. అప్లయిడ్ న్యూట్రిషన్‌లో 24 సీట్లు, స్పోర్ట్స్ న్యూట్రిషన్‌లో 18 సీట్లు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం ఉంది.


అర్హత వివరాలు

ఎంబీబీఎస్/బీడీఎస్ లేదా బీఎస్సీ(అప్లయిడ్ న్యూట్రిషన్/అప్లయిడ్ న్యూట్రిషన్ అండ్ పబ్లిక్ హెల్త్/క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్/ఫిజియాలజీ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ సైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్/హోమ్ సైన్స్/హ్యూమన్ న్యూట్రిషన్/న్యూట్రిషన్/న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్/నర్సింగ్/స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్/స్పోర్ట్స్ న్యూట్రిషన్/స్పోర్ట్స్ సైన్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి.

ఎన్-సెట్ 2024 వివరాలు

పరీక్షని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. న్యూట్రిషన్ సబ్జెక్టు నుంచి 50, బయోకెమిస్ట్రీ నుంచి 20, ఫిజియాలజీ నుంచి 20, జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ మొదటి వారం నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై
- **ఎన్-సెట్ 2024 తేదీ:** జూన్ 23న
- **వెబ్‌సైట్:** www.nin.res.in



ఐఐఎఫ్‌టీలో ఎంఏ ఎకనామిక్స్


న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎంఏ ఎకనామిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధాన స్పెషలైజేషన్ 'ట్రేడ్ అండ్ ఫైనాన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. క్యాంపస్‌కు 100 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఆప్టిట్యూడ్ టెస్ట్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎకనామెట్రిక్స్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. కార్పొరేట్ లెక్చర్స్, స్పెషల్ సెమినార్లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇది ఏఐ ప్రొక్టోరింగ్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే అడుగుతారు. బేసిక్ మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, ఇంటర్నేషనల్ ఎకనామిక్స్, పబ్లిక్ ఫైనాన్స్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. డిగ్రీ స్థాయిలో ఎకనామిక్స్ సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** మే 29న
- **వెబ్‌సైట్:** iift.ac.in

యూజీసీ నెట్ జూన్ 2024



యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)... నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) జూన్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో అర్హతకు, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. జూన్ 16న మొత్తం 83 సబ్జెక్టులకు ఈ పరీక్షను యూజీసీ నిర్వహించనుంది.

పరీక్ష పేరు: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్(యూజీసీ నెట్) 2024

సబ్జెక్టులు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్, క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోం సైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మ్యూజిక్, సైకాలజీ, లా, తదితరాలు.

అర్హత: 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 మార్కులు ఉంటే చాలు.

వయోపరిమితి: జేఆర్ఎఫ్‌కు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు, 100 మార్కులు; పేపర్-2లో 100 ప్రశ్నలు, 200 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 3 గంటలు.

దరఖాస్తు రుసుము: జనరల్/అన్‌రిజర్వ్‌డ్‌కు రూ.1150; జనరల్-ఈడబ్ల్యూఎస్/ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్‌కు రూ.325.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జనగామ, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, అమరావతి, అనంతపురం, చిత్తూరు, ఏలూరు, కాకినాడ, కర్నూలు, మచిలీపట్నం, మంగళగిరి, నంద్యాల, నరసరావుపేట, నెల్లూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, సూరంపాలెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 10
పరీక్ష రుసుం చెల్లింపు చివరి తేదీ: మే 12
దరఖాస్తు సవరణ తేదీలు: మే 13 నుంచి 15
పరీక్ష తేదీ: జూన్ 16
వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in/

జవహర్ నవోదయ విద్యాలయాల్లో టీచర్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 500

నవోదయ విద్యాలయ సమితి, భోపాల్ ప్రాంతీయ కార్యాలయం... ఒప్పంద ప్రాతిపదికన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 అకడమిక్ సెషన్‌కు సంబంధించి టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ): 238 పోస్టులు

సబ్జెక్టులు: హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఒరియా, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, ఆర్ట్, ఒకేషనల్, లైబ్రేరియన్.
అర్హత: సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.

2. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ): 217 పోస్టులు

సబ్జెక్టులు: హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్
అర్హత: సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు పీజీటీలకు రూ.42,250; టీజీటీలకు రూ.40,625. **వయోపరిమితి:** 2024 జూలై 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, అచీవ్‌మెంట్స్/అవార్డులు, పని అనుభవం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24
ఇంటర్వ్యూ తేదీ: మే 16
వెబ్‌సైట్: https://navodaya.gov.in/

జాబ్ కార్నర్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

ఐకార్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్, రీజనల్ స్టేషన్, కోయంబత్తూర్, తమిళనాడు...తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: యంగ్ ప్రొఫెషనల్-2
అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.42,000
ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 30
ప్రదేశం: ఐకార్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్, రీజనల్ స్టేషన్, మారుతమలై రోడ్, కోయంబత్తూర్, తమిళనాడు.
వెబ్‌సైట్: cicr.org.in

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీ..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: అసిస్టెంట్ మేనేజర్
ఖాళీలు: 6
అర్హత: డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 30 సంవత్సరాలు మించరాదు.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
దరఖాస్తుకు చివరి తేదీ: మే 10
వెబ్‌సైట్: https://www.ircon.org/

డైలీ సుడోకు - 290

	7	2	9		3			5
				2	5		3	
			6					
9		8				1		
7				3				4
		4				2		8
					6			
	5		1	8				
4			2		9	3	1	

సుడోకు - 289 సమాధానం

6	2	7	3	9	5	1	4	8
3	8	1	2	4	7	5	9	6
9	4	5	6	1	8	7	2	3
4	5	9	8	7	3	6	1	2
1	7	3	9	6	2	8	5	4
2	6	8	4	5	1	9	3	7
5	1	6	7	2	4	3	8	9
8	9	4	1	3	6	2	7	5
7	3	2	5	8	9	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.